

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI


నాదిర్ గోద్రెజ్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం చంద్రబాబు

సీఎం చంద్రబాబుతో నాదిర్ గోద్రెజ్ భేటీ

రాష్ట్రంలో 2,800 కోట్ల పెట్టుబడులపై చర్చ

12

శుక్రవారం | 23-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 129 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: చవితి ఉ. 10.39 తదుపరి పంచమి; నక్షత్రం: రేవతి రా. 7.54 తదుపరి అశ్విని; వర్జ్యం: ఉ. 8.59-10.26; దుర్ముహూర్తం: ఉ. 8.33-9.22, మ. 12.42-1.32; అమృతఘడియలు: సా. 5.43-7.10; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.03; సూర్యాస్తమయం: 6.31 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

'పొత్తు' లాభం

ఏపీకి దక్కిన రూ. 2,500 కోట్లు

హైదరాబాద్ ప్రాజెక్టులపై అసలు, వడ్డీ చెల్లిస్తున్న ఏపీ

42 శాతం ఇవ్వాల్సిన తెలంగాణ రాష్ట్రం

నాడు సహకరించని కేసీఆర్, పట్టించుకోని జగన్

సమస్యల పరిష్కారంపై చంద్రబాబు చొరవ

కేంద్ర ఆర్థిక శాఖ సూచనతో స్పందించిన టీ-సర్కారు

ఏపీ ఖాతాకు నిధులు బదిలీ



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అవి... హైదరాబాద్‌లో ఇన్నర్ రింగ్ రోడ్డు, హుస్సేన్ సాగర్ ప్రాజెక్టుల కోసం తీసుకున్న విదేశీ రుణాలు! వాటి చెల్లింపులు పూర్తి కాకముందే రాష్ట్ర విభజన జరిగింది. 'ఆంధ్రప్రదేశ్' పేరుతో ఉన్న ఖాతాలు నవ్యాంధ్రకు రావడంతో సదరు రుణాలకు సంబంధించిన వడ్డీ, అసలును ఏపీ ప్రభుత్వమే కడుతోంది! ఏటా అందులో 42 శాతాన్ని తెలంగాణ సర్కారు ఏపీకి చెల్లించాలి. అలా కట్టేలా కేంద్ర ప్రభుత్వం చూడాలి! కానీ... పదేళ్లు కేసీఆర్ సర్కారు కట్టలేదు! కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. జగన్‌కు ఈ విషయం అసలు పట్టనేలేదు. ఇప్పుడు... 'పొత్తు' లాభం ఫలించింది! పదేళ్లకు

మిగతా 2వ పేజీలో...



పేలుడు సంభవించిన ఎసెన్షియా కర్మాగారాన్ని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు



ఆస్పత్రిలో క్షతగాత్రులకు సీఎం పరామర్శ

ప్రమాదంపై మోదీ దిగ్భ్రాంతి

మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, క్షతగాత్రులకు రూ. 50 వేల సాయం

ఏడాదికిందటే హెచ్చరించినా..

ఎసెన్షియాలో అనేక భద్రతా లోపాలు

సెక్యూరిటీ ఆడిట్‌లో వెల్లడైన డొల్లతనం

పట్టించుకోని యాజమాన్యం 11

ఆదుకుంటాం!

మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం

తీవ్రంగా గాయపడ్డవారికి 50 లక్షలు.. స్వల్పంగా గాయాలైన వారికి 25 లక్షలు

బాధితులకు పరిహారం కంపెనీయే చెల్లిస్తుంది

ఎంత ఖర్చయినా క్షతగాత్రులకు వైద్యం అందిస్తాం

ఎసెన్షియా కంపెనీ రెడ్ కేటగిరీ జాబితాలో ఉంది

భద్రతా చర్యల్లో యాజమాన్యం పూర్తిగా విఫలం

ప్రమాదంపై ఉన్నత స్థాయి కమిటీతో విచారణ

పరిశ్రమల్లో భద్రతా చర్యలు పటిష్ఠం చేస్తాం

సెజ్‌ల వద్ద బర్న్స్ ఆస్పత్రుల ఏర్పాటుకు యోచన

గత ఐదేళ్లలో పాలనా వ్యవస్థలు నిర్వీర్యం: సీఎం

తడి ఆరని కన్నులు

ఒక్కొక్కరిది ఒక్కో కన్నీటి కథ

మృతుల కుటుంబాలకు సీఎం ఓదార్పు

ఆస్పత్రుల్లో క్షతగాత్రులకు పరామర్శ

అనకాపల్లి/రాంబిల్లి/విశాఖపట్నం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ ఫార్మా కంపెనీ రెడ్ కేటగిరీ జాబితాలో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. గురువారం మధ్యాహ్నం ఆయన ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. అంతకుముందు

మిగతా 11వ పేజీలో...

ఊపిరి తీసిన

'ఆవిరి'!

విస్ఫోటానికి అదే కారణం

సాల్వెంట్ లీకేజీని ముందే గుర్తించిన సిబ్బంది

ఈలోపే ప్యానల్‌పై పడి రసాయన చర్య

కర్మాగారం మూసివేత

పంచాయతీలకు జవసత్వాలు

నేడు 13,326 గ్రామాల్లో గ్రామ సభలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కుప్పకూలిన పంచాయతీరాజ్ వ్యవస్థకు జవసత్వాలు నింపేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గ్రామ పంచాయతీలకు అత్యంత కీలకమైన గ్రామ సభ నిర్వహణపై మొట్టమొదట దృష్టి సారించింది. గ్రామాల్లో స్థానిక పాలన సక్రమంగా జరగాలంటే గ్రామస్థుల సమష్టి నిర్ణయం ఉండాలి. దానికి మూలం గ్రామ సభలు. అవి మొక్కుబడిగా కాకుండా వాస్తవంగా ప్రజల భాగస్వామ్యంతో

మిగతా 12వ పేజీలో...





మన గ్రామాలను మనమే పరిపాలించుకుందాం

గ్రామ సభల్లో యువత, మహిళలు పాల్గొనాలి

పారదర్శక, జవాబుదారీ పాలనకు ఇదే నిదర్శనం

ఉపాధి, జల్ జీవన్ మిషన్ అవకతవకలపై దృష్టి

సామాజిక తనిఖీ విభాగానికి పోలీస్ అధికారిని హెడ్‌గా పెడతాం 12

గ్రామాల్లో నీటి పరిస్థితిపై 16 అంశాలతో సర్వేలు జరుగుతున్నాయి: పవన్ కల్యాణ్



విచారణలో రమేశ్‌తో పొన్నవోలు

జోగిని ప్రశ్నిస్తుంటే..

పొన్నవోలు జవాబులు

రమేశ్ దర్యాప్తునకు సహకరించడం లేదు 12

అప్పుడు అధికారాన్ని, ఇప్పుడు కోర్టు ఉత్తర్వులను దుర్వినియోగం చేస్తున్నారు

తక్షణం మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేయండి

హైకోర్టులో సీనియర్ న్యాయవాది వాదనలు

విచారణ నేటికి వాయిదా

ఇంటర్ ప్రక్షాళన

ఇకపై అన్ని పరీక్షలకూ కామన్ సిలబస్

యూనిట్ నుంచి ప్రీ ఫైనల్ వరకూ ఒకటే

ఇప్పటి వరకూ కాలేజీల వారీగా నిర్వహణ

ఇకపై ఒకే సిలబస్, ఒకే తేదీల్లో పరీక్షలు

నేరుగా బోర్డు నుంచే ప్రశ్నపత్రాలు

డ్యాష్‌బోర్డులోకి విద్యార్థుల మార్కులు

వాటి ఆధారంగా ఫైనల్ పరీక్షలకు సన్నద్ధత

నేడు కామన్ టైమ్ టేబుల్ విడుదల



అమరావతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌లో పరీక్షల విధానం మొత్తాన్ని ప్రక్షాళన చేసే దిశగా ఇంటర్ విద్యామండలి చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకూ ఎవరికివారే అన్నట్టుగా కాలేజీల స్థాయిలో అంతర్గత పరీక్షలు జరుగుతున్నాయి. ఆయా కాలేజీలు నిర్దేశించుకున్న

మిగతా 12వ పేజీలో...

బినామీ వాసు.. కోట్లకు కోట్లు

బెజవాడలో భారీ విల్లాలు.. అనతికాలంలోనే భారీగా ఆస్తులు

అధికారులు, నేతలతో సంబంధాలు.. కొందరు ఐపీఎస్‌లకు బినామీ

పరారీలో ఉన్న వాసు కోసం రెండు జిల్లాల పోలీసుల వేట 12

క్రైమ్ సీన్‌నే మార్చేశారు!

ఆత్మహత్య అంటూ తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించారు 2

సుప్రీంకోర్టుకు సమర్పించిన స్టేటస్ రిపోర్టులో సీబీఐ

ఎఫ్ఐఆర్ లేకుండా పోస్టుమార్టమా? కేసు నమోదులో జాప్యమా?.. ఇంత నిర్లక్ష్యాన్ని 30 ఏళ్లలో చూడలేదు: సుప్రీం

15 రోజుల్లో శిక్ష పడేలా చట్టాలు.. మోదీకి మమత లేఖ

ముంబైలో బాలికపై

అత్యాచారం


సోషల్‌మీడియాలో పరిచయమైన యువకుడి దురాగతం

ప్రజాగ్రహంతో కానీ కేసు నమోదు చేయరా?

బద్లాపూర్ ఘటనపై బాంబే హైకోర్టు ఆగ్రహం

మంత్రి పదవి నుంచి తొలగిస్తే సంతోషిస్తా!

- సినిమా లేకపోతే బతకలేను.. 22 సినిమాలకు అంగీకరించా
- మలయాళ నటుడు, కేంద్రమంత్రి సురేష్ గోపి



కొచ్చి, ఆగస్టు 22: సినిమాల్లో నటిస్తున్నందుకుగాను తనను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగిస్తే సంతోషిస్తానని, రక్షింపబడినట్లుగా భావిస్తానని మలయాళ సినీ నటుడు, కేంద్ర పెట్రోలియం, పర్యాటకశాఖల సహాయమంత్రి సురేష్ గోపి తెలిపారు. సినిమా తన శ్వాస అని, అది లేకపోతే బతకలేనని పేర్కొన్నారు. ప్రస్తుతం 22 సినిమాలకు తాను ఆమోదం తెలిపానని, వాటిల్లో నటించేందుకు అనుమతి కోసం తమ పార్టీ సీనియర్ నేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిస్తే.. ఆయన తన విజ్ఞాపనపత్రాన్ని పక్కనపెట్టారని, అయినప్పటికీ అనుమతి ఇస్తామని చెప్పారని పేర్కొన్నారు. కేరళ చలనచిత్ర వాణిజ్య మండలి ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ సురేష్ గోపి ఈ వివరాలు వెల్లడించారు.

బిట్స్ పిలానీలో సీనియర్ ఫ్యాకల్టీగా డీఆర్‌డీవో మాజీ చైర్మన్ జి.సతీష్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) మాజీ చైర్మన్ డా.జి.సతీష్‌రెడ్డి ప్రముఖ శాస్త్ర సాంకేతిక విద్యా సంస్థ బిట్స్ పిలానీ (బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్)లో సీనియర్ ఫ్యాకల్టీగా చేరారు. జాతీయ భద్రతా రంగానికి సంబంధించి పరిశోధనలు, అన్వేషణలకు ఆయన సేవలందిస్తారని బిట్స్ పిలానీ ఓ ప్రకటనలో తెలిపింది. డీఆర్‌డీవోలో చేపట్టిన అత్యంత ప్రభావశీల ప్రాజెక్టుల్లో సతీష్ రెడ్డి కీలక భూమిక పోషించిన విషయం తెలిసిందే.

టెక్సా‌స్‌లో 90 అడుగల హనుమాన్ విగ్రహం

- చిన జియర్ నేతృత్వంలో ఘనంగా ప్రాణ ప్రతిష్ఠ

హ్యూస్టన్, ఆగస్టు 22: అమెరికా సాంస్కృతిక, ఆధ్యాత్మిక చరిత్రలో మరో నూతన అధ్యాయం ఆవిష్కృతమయింది. టెక్సా‌స్‌లో 90 అడుగుల ఎత్తైన హనుమాన్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎన్నో మైళ్ల దూరం నుంచే కనిపించే ఈ విగ్రహం ఆవిష్కరణ ఓ మైలురాయిలా నిలిచిపోతుంది. 'స్టాచ్యూ ఆఫ్ యూనియన్'గా పేరు పెట్టిన ఈ హనుమాన్ విగ్రహానికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. భారతదేశం వెలుపల నిర్మితమయిన హనుమాన్ విగ్రహాల్లోకెల్లా ఇదే అత్యంత ఎత్తైన విగ్రహం. టెక్సా‌స్‌లో దీనిని మించినది లేదు. యూఎస్‌లో ఇది అతి ఎత్తైన మూడవ విగ్రహం. 151 అడుగుల ఎత్తుతో న్యూయార్క్‌లోని స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ మొదటి స్థానంలో ఉండగా, ఫ్లోరిడాలోని 110 అడుగుల పెగాసస్, డ్రాగన్ విగ్రహం రెండవ స్థానంలో నిలిచిందని నిర్వాహకులు చెప్పారు. షుగర్ లాండ్‌లోని శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో ఆవిష్కరించిన 'ది స్టాచ్యూ ఆఫ్ యూనియన్' హనుమాన్ విగ్రహం ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం ఆగస్టు 15 నుంచి 18 వరకూ ఘనంగా జరిగింది.

రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కారాల ప్రదానం

న్యూఢిల్లీ, ఆగస్టు 22: మొట్టమొదటి రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. గురువారం రాష్ట్రపతిభవన్‌లోని గణతంత్ర మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్(బెంగళూరు) మాజీ డైరెక్టర్, బయోకెమిస్ట్ గోవింద్‌రాజన్ పద్మనాభన్‌ను దేశ అత్యున్నత సైన్స్ అవార్డుతో సత్కరించారు. అలాగే, 13 మందికి విజ్ఞాన్‌శ్రీ పురస్కారాలు, 18 మందికి విజ్ఞాన్ యువ శాంతి స్వరూప్ భట్నాగర్ బహుమతులు ప్రదానం చేశారు. దీంతోపాటు చంద్రయాన్-3 మిషన్‌లో పనిచేసిన శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు విజ్ఞాన్ టీమ్ అవార్డు అందజేశారు. ఈ అవార్డును చంద్రయాన్-3 మిషన్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.వీరముత్తువేల్ స్వీకరించారు. అవార్డు గ్రహీతలందరికీ ఒక మెడల్‌తోపాటు సంబంధిత రంగాల్లో వారు కనబరిచిన ప్రతిభను తెలియజేస్తూ ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

బంగ్లాలో హిందూ టీచర్ల బలవంతపు రాజీనామా

న్యూఢిల్లీ, ఆగస్టు 22: తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడి రెండు వారాలు దాటినా బంగ్లాదేశ్‌లో ఇంకా పరిస్థితులు సాధారణస్థితికి రాలేదు. జర్నలిస్టులపై నిర్బంధం కొనసాగుతోంది. హిందూ ఉపాధ్యాయులతో బలవంతంగా రాజీనామా చేయిస్తున్నారు. వివిధ పాఠశాలలు, కాలేజీలలో పనిచేస్తున్న సుమారు 70 మంది హిందూ ఉపాధ్యాయులు బలవంతంగా రాజీనామా చేయాల్సి వచ్చింది. వీరిలో అజీమ్‌పూర్ గవర్నమెంట్ గర్ల్స్ స్కూల్ అండ్ కాలేజ్ ప్రిన్సిపాల్ గీతాంజలి బారు వ కూడా ఉన్నారు. ఈమెను విద్యార్థులు చెట్టుకు కట్టేయగా, ఆర్మీ జోక్యం చేసుకొని విడిపించింది. అలాగే, హోలీ రెడ్ క్రిసెంట్ నర్సింగ్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సోనాలి రాణీ దాస్ కూడా బలవంతంగా రాజీనామా చేయాల్సి వచ్చింది.

షేక్ హసీనా డిప్లొమాటిక్ పాసుపోర్టు రద్దు!

ఢాకా, ఆగస్టు 22: పదవీచ్యుతికి గురయిన బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా డిప్లొమాటిక్ పాసుపోర్టును రద్దు చేసేందుకు మహమ్మద్ యూనస్ ఆధ్వర్యంలోని తాత్కాలిక ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ఆమెతో కలిసి పనిచేసిన మంత్రులు, పార్లమెంటు సభ్యులు, కాంట్రాక్టులు రద్దయిన అధికారుల డిప్లొమాటిక్ పాసుపోర్టులను కూడా రద్దు చేయనుంది.

మధుసూదన్ రెడ్డి సస్పెన్షన్‌పై స్టే

- క్యాట్‌ను ఆశ్రయించిన ఫైబర్‌నెట్ మాజీ ఎండీ

హైదరాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఫైబర్‌నెట్ (ఏపీఎస్ఎఫ్ఎల్) మాజీ ఎండీ, ఐఆర్ఎస్ అధికారి మధుసూదన్ రెడ్డి సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. ఏపీ ప్రభుత్వం ఈనెల 19న జారీ చేసిన తన సస్పెన్షన్ ఉత్తర్వులను కొట్టేయాలని.. డిప్యుటేషన్ ముగియడానికి నాలుగురోజుల ముందు సస్పెండ్ చేయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఏపీ తరఫున న్యాయవాది పాండురంగారెడ్డి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ వల్ల ప్రభుత్వానికి భారీ రెవెన్యూ నష్టం ఏర్పడినట్లు దర్యాప్తులో తేలడం వల్లే తక్షణ చర్యగా సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. వాదనలు విన్న క్యాట్ మధుసూదన్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు ఆదేశిస్తూ విచారణను ఈనెల 27కు వాయిదా వేసింది.

'పొత్తు' లాభం!

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించిన రూ.2500 కోట్లు ఇప్పుడు తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు అందాయి. కేంద్ర ఆర్థిక శాఖ సూచన/ఆదేశాల మేరకు టీ-సర్కారు ఈ నిధులను 'అంతర్ రాష్ట్ర నిధుల బదిలీ' (ఐజీటీ) ద్వారా ఏపీ ఖాతాకు జమ చేసింది. ఇది న్యాయంగా ఏపీకి దక్కాల్సిన సొమ్మే. ఎవరికీ ఏమీ అభ్యంతరాలు లేవు. కానీ, పదేళ్ల పాటు ఈ సమస్యకు పరిష్కారం దొరకలేదు. 2014లో రాష్ట్ర విభజన జరిగిన అనంతరం... తెలంగాణలో కేసీఆర్, ఏపీలో చంద్రబాబు ముఖ్యమంత్రులు అయ్యారు. విభజన సమస్యల పరిష్కారంపై కేసీఆర్ పెద్దగా దృష్టి సారించలేదు. ఇక... చెల్లింపుల సంగతి సరేసరి. అప్పట్లో ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్న నేపథ్యంలో కేంద్రం వద్ద ఈ సమస్యల పరిష్కారానికి చంద్రబాబు కృషి చేస్తూ వచ్చారు. అంతా కొలిక్కి వచ్చే సమయానికి... ఎన్డీయేతో కటీఫ్ చెప్పాల్సి వచ్చింది. దీంతో విషయం మళ్లీ మొదటికి వచ్చింది. 2019లో జగన్ సీఎం అయ్యారు. విభజన సమస్యల గురించి పట్టించుకోనేలేదు. జగన్‌కు అటు కేంద్రంలో మోదీతో, తెలంగాణలో కేసీఆర్‌తో సత్సంబంధాలున్నప్పటికీ... అవి రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉపయోగపడ లేదు.

కలిసి వచ్చిన కాలం... నవ్యాంధ్రకు రెండోసారి ముఖ్యమంత్రి కాగానే విభజన సమస్యలపై చంద్రబాబు దృష్టి సారించారు. దీనికి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా సహకరించారు. పైగా... ఎన్డీయే సర్కారులో టీడీపీది కీలక పాత్ర కావడంతో కేంద్రం కూడా సహకరించింది. హైదరాబాద్‌లో ఇద్దరు ముఖ్యమంత్రులు, ఇతర మంత్రులు, ఉన్నతాధికారుల సమక్షంలో సమావేశాలు జరిగాయి. ఢిల్లీ పెద్దలతో కూడా ఈ అంశాలపై చర్చించి ప్రతి వారం ఈ చర్చల పురోగతిని పర్యవేక్షిస్తున్నారు. ఇదే క్రమంలో హైదరాబాద్‌లో ఇన్నర్ రింగ్ రోడ్డు, హుస్సేన్ సాగర్ ప్రాజెక్టుల కోసం ఉమ్మడి రాష్ట్రంలో తీసుకున్న ఈఏపీ (విదేశీ ఆర్థిక సంస్థల సహాయంతో చేపట్టే ప్రాజెక్టులు) రుణాల అసలు, వడ్డీ మొత్తాన్ని ఏపీ సర్కారే చెల్లిస్తున్న అంశం తెరపైకి వచ్చింది. ఇందులో 58 శాతం ఏపీ, 42 శాతం తెలంగాణ చెల్లించాలి. కానీ... పదేళ్లుగా తెలంగాణ నుంచి చెల్లింపులే జరగలేదు. ఇప్పుడు, ఇన్నేళ్లకు దీనికి సంబంధించిన రూ.2500 కోట్లు ఏపీకి దక్కాయి. కేంద్ర ఆర్థిక శాఖ సూచనతో తెలంగాణ ప్రభుత్వం ఈ నిధులను రాష్ట్రానికి జమ చేసింది. పొత్తు లాభాలను స్వప్రయోజనాలకు కాకుండా.. రాష్ట్ర ప్రయోజనాలకు ఉపయోగిస్తే ఇలాంటి ఫలితాలే వస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రజాగ్రహంతో కానీ కేసు నమోదు చేయరా?

బద్లాపూర్ ఘటనపై బాంబే హైకోర్టు ఆగ్రహం

ముంబై, ఆగస్టు 22: మూడు, నాలుగేళ్ల వయసున్న ఇద్దరు బాలికలపై పాఠశాలలో స్వీపర్ లైంగిక దాడికి పాల్పడిన ఘటన మహారాష్ట్రలో కలకలం సృష్టిస్తోంది. ఈ కేసును గురువారం సుమోటోగా విచారణ చేపట్టిన బాంబే హైకోర్టు.. పోలీసుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజల నిరసన పెల్లుబికితే కానీ కేసు నమోదు చేయరా అని నిలదీసింది. బాధిత బాలికల తల్లిదండ్రులు గంటలకొద్దీ పోలీసుస్టేషన్‌లో పడిగాపులు పడాలా అని ప్రశ్నించింది. ఈ నేరాన్ని రిపోర్టు చేయనందుకు పాఠశాల బాధ్యులపైనా 'పోక్సో' చట్టం కింద చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. పిల్లలకు పాఠశాలలే సురక్షితమైన ప్రదేశాలు కాకపోతే ఇక విద్యాహక్కు గురించి మాట్లాడటంలో ఎలాంటి అర్థం లేదని వ్యాఖ్యానించింది. మహారాష్ట్రలోని థానే జిల్లా బద్లాపూర్‌లో ఇద్దరు బాలికలపై పాఠశాల టాయిలెట్‌లో అక్షయ్ షిండే అనే స్వీపర్ ఈ నెల 13న లైంగిక దాడికి పాల్పడ్డాడు. పోలీసులు శనివారం నిందితుడిని అరెస్టు చేశారు. అతడికి ఉరిశిక్ష విధించాలన్న డిమాండ్‌తో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల యాజమాన్యం, పోలీసులపైనా కఠిన చర్యలు తీసుకోవాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు వేలాది మంది మంగళవారం బద్లాపూర్ పెద్దఎత్తున ఆందోళన చేశారు. ఆ పాఠశాల ఆస్తులను ధ్వంసం చేయడంతో పాటు బద్లాపూర్‌లో ఎనిమిది గంటల పాటు రైలు పట్టాలపై బైఠాయించారు. ఈ నేపథ్యంలో బాంబే హైకోర్టు పోలీసులపై ఘాటు వ్యాఖ్యలు చేసింది.

ముంబైలో బాలికపై అత్యాచారం

- సోషల్‌మీడియాలో పరిచయమైన యువకుడి దురాగతం

ముంబై, ఆగస్టు 22: మహారాష్ట్రలో బద్లాపూర్ ఘటనపై నిరసనలు కొనసాగుతుండగానే.. ముంబైలో మరో బాలికపై అత్యాచార ఘటన వెలుగులోకి వచ్చింది. సోషల్‌మీడియాలో పరిచయమైన 13 ఏళ్ల బాలికకు మాయమాటలు చెప్పి బయటకు తీసుకెళ్లిన ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక, ఆమె కుటుంబసభ్యుల ఫిర్యాదుతో నిందితుడిని అరెస్టు చేసి, అతడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు వకోలా పోలీసులు వెల్లడించారు. 21 ఏళ్ల నిందితుడు ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడని.. బాధితురాలు అతడికి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఒకసారి కలవాలని నిర్ణయించుకుని.. ఈనెల 15న వారిద్దరూ బయటికెళ్లారని చెప్పారు. ముందుగా అంధేరిలోని ఓ హోటల్‌కు తీసుకెళ్లి బాలికపై అత్యాచారం చేసిన నిందితుడు.. తర్వాత తన సొంతూరికని చెప్పి గుజరాత్‌కు తీసుకెళ్లి అక్కడ పలుమార్లు అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు వివరించారు. ఆ తర్వాత ఇంటికి చేరిన బాధితురాలు.. కుటుంబ సభ్యులకు తనపై జరిగిన ఘోరాన్ని తెలిపిందన్నారు. బాధితురాలితో కలసి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయగా.. నిందితుడిని గుర్తించి గోరేగావ్‌లో అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు.

క్రైమ్ సీన్‌నే మార్చేశారు!

ఆత్మహత్య అంటూ తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించారు.. అంత్యక్రియలు జరిగాక ఎఫ్ఐఆర్ నమోదు దిగ్భ్రాంతికరం

- సుప్రీంకోర్టుకు సమర్పించిన స్టేటస్ రిపోర్టులో సీబీఐ
- కోల్‌కతా పోలీసుల తీరు అత్యంత లోపభూయిష్టం: సుప్రీం కన్నెర్ర

న్యూఢిల్లీ, ఆగస్టు 22: యావద్దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతిలోకి నెట్టిన కోల్‌కతా వైద్యవిద్యార్థిని హత్యాచార ఘటనకు సంబంధించి ఆర్జీకర్ ఆస్పత్రిలో క్రైమ్ సీన్‌ను మార్చేశారని సీబీఐ సంచలన వ్యాఖ్యలు చేసింది. ఉదయం అత్యాచారం, హత్య జరిగితే పోస్టుమార్టం నిర్వహించి.. అంత్యక్రియలు ముగిశాక దాదాపు అర్ధరాత్రి 11:45 గంటలకు కోల్‌కతా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని.. "ఇది అత్యంత దిగ్భ్రాంతికరమైన వాస్తవం" అని సుప్రీంకోర్టు దృష్టికి తెచ్చింది. పైగా.. వైద్య విద్యార్థిని ఆత్మహత్య చేసుకుందంటూ పోలీసులే తల్లిదండ్రులకు సమాచారమిచ్చి కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని.. ఆ తర్వాతే హత్య అని చెప్పారని సీబీఐ తీవ్రంగా ఆక్షేపించింది. కేసులో వాస్తవాలను తొక్కిపెడుతున్నారనే అనుమానంతో హతురాలి సహచర వైద్యులు వీడియోగ్రఫీకి పట్టుబట్టడంతోనే పోస్టుమార్టం ప్రక్రియను వీడియో తీశారని నివేదికలో పేర్కొంది. కేసులో ఒక్క నిందితుడి ప్రమేయం ఉందనే బెంగాల్ పోలీసులు తేల్చారని పేర్కొంది. ఈ మేరకు సీబీఐ గురువారం తన స్టేటస్ రిపోర్టును సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ఆధ్వర్యంలోని త్రిసభ్య ధర్మాసనం ముందు ఉంచింది. ఆర్జీకర్ ఆస్పత్రిలో క్రైమ్‌సీన్‌ను మార్చేశారంటూ సీబీఐ తమ రిపోర్టులో స్పష్టం చేయడంతో బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వ తీరును దేశ అత్యున్నత న్యాయస్థానం తీవ్ర స్థాయిలో ఎండగట్టింది. బెంగాల్ పోలీసులు వ్యవహరించిన తీరు నిర్లక్ష్యపూరితంగా ఉందని.. హత్యాచార ఘటన తర్వాత నిర్వహించాల్సిన ప్రక్రియను ఏమాత్రం అనుసరించలేదని మండిపడింది. "ఈ హత్యాచార కేసు ప్రక్రియలో మీ ప్రభుత్వం వ్యవహరించిన విధానాన్ని నా 30 ఏళ్ల వృత్తిపరమైన జీవితంలో ఎన్నడూ చూడలేదు" అని బెంగాల్ ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన న్యాయ బృందాన్ని ఉద్దేశించి ధర్మాసనంలోని సభ్యుడైన న్యాయమూర్తి జస్టిస్ పార్దివాలా వ్యాఖ్యానించారు.

ఎఫ్ఐఆర్ లేకుండా పోస్టుమార్టమా?



హత్యాచారం కేసును సుమోటోగా స్వీకరించిన ధర్మాసనం గురువారం విచారణ కొనసాగించింది. సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, బెంగాల్ ప్రభుత్వం తరఫున సీనియర్ అడ్వొకేట్ కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. హత్యాచార కేసులో పోలీసులు అనుసరించిన ప్రక్రియపై ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది. ఓ అసహజ మరణంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే పోస్టుమార్టం నిర్వహించడంపై ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా.. కేసు నమోదులో బెంగాల్ పోలీసులు తీవ్ర జాప్యం చేయడమనేది 'అత్యంత కలవరపాటుకు గురిచేసే అంశం' అని న్యాయమూర్తి జస్టిస్ మనోజ్ మిశ్రా వ్యాఖ్యానించారు. "జరిగింది అసహజ మరణం.. అదీ ఉదయం పూట. మరి.. పోస్టుమార్టం చేసిన తర్వాత ఎప్పుడో రాత్రి క్రైమ్‌సీన్‌ను అధీనంలోకి తెచ్చుకున్నారు. క్రైమ్‌సీన్‌ను సీజ్ చేయడంలో పోలీసులు ఎందుకింత ఆలస్యం చేశారు" అని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ప్రశ్నించారు. హత్యాచార ఘటన, వైద్యుల భద్రతపై ఆందోళన చేస్తున్న వైద్యసిబ్బంది వెంటనే విధుల్లో చేరాలని కోరుతూ వారిపై ఎలాంటి చర్యలూ ఉండబోవని తాము భరోసా ఇస్తున్నామని పేర్కొన్నారు. కాగా వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నిరసనగా ఢిల్లీ ఎయిమ్స్ వైద్యులు తమ ఆందోళనను విరమించారు. అయితే బెంగాల్‌లోని వైద్యులు మాత్రం ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాగా, త్యాచార దోషులకు కఠిన శిక్షలు పడేలా కేంద్ర చట్టాలను మరింత బలోపేతం చేయాలని బెంగాల్ సీఎం మమత డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆమె ప్రధాని మోదీకి లేఖ రాశారు.

ముందురోజే కన్నేశాడా?

హతురాలైన జూనియర్ వైద్యురాలిపై ఘటనకు ముందురోజే నిందితుడు సంజయ్ రాయ్ కన్నేశాడా? సీబీఐలోని ఓ అధికారి మాటలు ఇదే సూచిస్తున్నాయి. ఘటనకు ముందు రోజు అంటే.. ఆగస్టు 8న ఉదయం 11 గంటలకు ఆర్జీకర్‌లోని ఛాతీ విభాగం వద్ద జూనియర్ వైద్యురాలు తన నలుగురు సహచరులతో మాట్లాడుతుండగా.. అక్కడ సంజయ్ రాయ్ తచ్చాడినట్లు సీసీ ఫుటేజీ ద్వారా సీబీఐ తేల్చింది. సీబీఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆ రోజు ఆస్పత్రిలో ఛాతీ విభాగం వద్ద జూనియర్ వైద్యురాలు, ఆమె స్నేహితులవైపు రాయ్ కొద్దిసేపు తదేకంగా చూసి.. అక్కడి నుంచి వెళ్లాడు. ఆరోజు రాత్రి కొందరు జూనియర్ వైద్యులతో కలిసి సంజయ్ రాయ్ డిన్నర్‌కు వెళ్లి.. అర్ధరాత్రి ఒంటి గంటకు థర్డ్ ఫ్లోర్‌లోని కాన్ఫరెన్స్ హాల్లోకి ప్రవేశించాడు. అక్కడికి 2:30 గంటలకు జూనియర్ వైద్యురాలొచ్చి, అతడితో ఏదో మాట్లాడి వెళ్లింది. రాయ్ మళ్లీ.. ఆస్పత్రిలోకి 9వ తేదీ తెల్లవారుజామున 4గంటలకు ప్రవేశించాడు. నేరుగా జూ నియర్ వైద్యురాలు నిద్రిస్తున్న కాన్ఫరెన్స్ హాల్లోకి వెళ్లాడు.



వేణూ శారదం

భర్త సీఎస్‌గా రిటైరయిన వెంటనే భార్యకు ఆ స్థానం

- కేరళలో అరుదైన సందర్భం

తిరువనంతపురం, ఆగస్టు 22: కేరళ అధికార వర్గాల్లో ఇప్పుడు ఒకటే చర్చ. చరిత్రలో ఆసక్తికరమైన సందర్భం ఆసన్నమవుతోందని చెప్పుకొంటున్నారు. అత్యంత కీలకమైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) పదవిని భార్యాభర్తలు నిర్వహించనుండడమే ఇందుకు కారణం. ప్రస్తుత సీఎస్ డాక్టర్ వి. వేణు ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్నారు. ఆ మరుసటి రోజునే ఆయన భార్య, స్థానిక స్వపరిపాలన శాఖ అదనపు చీఫ్ సెక్రటరీ శారదా మురళీధరన్ సీఎస్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. మధ్యలో ఎలాంటి విరామం లేకుండానే ఇద్దరి పాలన కొనసాగనుంది. ఇద్దరూ 1990 బ్యాచ్ ఐఏఎస్ అధికారులే. పేదరిక నిర్మూలన కార్యక్రమాల అమలులో దిట్టగా శారదకు పేరుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకగా చేపట్టిన 'కుటుంబశ్రీ' మిషన్‌ను ఆమె సమర్థంగా అమలు చేశారు. 2013లో కేంద్రంలో డిప్యుటేషన్‌లో ఉన్నప్పుడు కూడా నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా, పంచాయతీరాజ్ శాఖ జాయింట్ సెక్రటరీగా పనిచేశారు. డాక్టర్ వేణు జన్మస్థలం కేరళలోని కొజికోడ్. అక్కడి కేంద్రీయ విద్యాలయ్‌లో పాఠశాల విద్య, మలబార్ క్రిస్టియన్ కాలేజీలో ఎంబీబీఎస్ చదివారు.



కశ్మీరీలతో నాది రక్తసంబంధం

- రాష్ట్ర హోదా పునరుద్ధరణే 'ఇండియా' ప్రాధాన్యం: రాహుల్ గాంధీ
- ఖర్గేతో కలిసి ఎన్సీ చీఫ్ ఫరూక్‌తో భేటీ

న్యూఢిల్లీ, ఆగస్టు 22: జమ్మూకశ్మీర్ ప్రజలతో తనది రక్తసంబంధమని, జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా కల్పించడమే ఇండియా కూటమి ప్రాధాన్యమని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ అన్నారు. మరోపక్క, అసెంబ్లీ ఎన్నికల వేళ జమ్మూకశ్మీర్‌లో కీలక రాజకీయ పరిణామం చోటు చేసుకుంది. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ) పార్టీల మధ్య పొత్తు కుదిరింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో కలిసి శ్రీనగర్‌లో గురువారం పర్యటించిన రాహుల్ గాంధీ.. ఎన్సీ పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లాతో సమావేశమయ్యారు. అంతకుముందు కాంగ్రెస్ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికల కన్నా ముందే రాష్ట్ర హోదా పునరుద్ధరణ జరుగుతుందని ఆశించామన్నారు. కానీ, ఎన్నికల ప్రకటన వెలువడిందని, రాష్ట్ర హోదా కూడా అలానే తిరిగి వస్తుందని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఓ రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. కాగా, ఈ భేటీ అనంతరం ఖర్గేతో కలిసి ఫరూక్ అబ్దుల్లా నివాసానికి వెళ్లిన రాహుల్ గాంధీ అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుపై చర్చించారు. అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్, ఎన్సీ పార్టీల మధ్య పొత్తు కుదిరిందని ఎన్సీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా ఈ సమావేశం అనంతరం ప్రకటించారు. అలాగే, సీపీఐ(ఎం) నేత ఎంఎస్ తరిగామి కూడా తమతోనే ఉన్నారని తెలిపారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం ఇండియా కూటమితో కలిసి నడుస్తామని చెప్పారు. కాగా, 90 స్థానాలున్న జమ్మూకశ్మీర్ శాసన సభకు మూడు దశల్లో ఎన్నికలు జరుగనున్నాయి. సెప్టెంబరు 18, 25, అక్టోబరు 1 తేదీల్లో పోలింగ్ జరగనుండగా అక్టోబరు 4న ఓట్ల లెక్కింపు జరగనుంది.

ఫాస్టాగ్‌లోకి ఆటోమేటిగ్గా సొమ్ము

ముంబై, ఆగస్టు 22: ఫాస్టాగ్, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డు (ఎన్‌సీఎంసీ)లోకి ఆటోమేటిగ్గా సొమ్ము భర్తీ చేయడానికి ఆర్బీఐ అనుమతిచ్చింది. ఇందుకు గాను ఈ-మాండేట్ ఫ్రేమ్‌వర్క్‌ను సవరించింది. ప్రస్తుతం ఈ-మాండేట్ ఫ్రేమ్‌వర్క్ ప్రకారం కస్టమర్ ఖాతా నుంచి సొమ్ము బదిలీ చేసేందుకు వినియోగదారుకు కనీసం 24 గంటల ముందు ప్రీ డెబిట్ సమాచారం అందించాల్సి ఉంది. సవరించిన నిబంధనల ప్రకారం ఫాస్టాగ్, ఎన్‌సీఎంసీ ఖాతాల్లో కస్టమర్ నిర్దేశించుకున్న పరిమితి కంటే నిల్వ తగ్గితే ఖాతాలోకి సొమ్ము ఆటోమేటిగ్గా భర్తీ అవుతుంది.

సమస్యలకు యుద్ధం పరిష్కారం కాదు

ఉక్రెయిన్, పశ్చిమాసియా సంక్షోభాలు ప్రపంచానికి చేటు.. చర్చలతో శాంతి పునరుద్ధరణకు మా మద్దతు

- సవాళ్లకు ఐక్యరాజ్య సమితిలో సంస్కరణలే సమాధానం
- పోలండ్‌తో సామాజిక భద్రతా ఒప్పందం: ప్రధాని మోదీ
- నేడు ఉక్రెయిన్ పర్యటనకు.. తొలి భారత ప్రధానిగా రికార్డు



పోలండ్ ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో మోదీ కరచాలనం

వార్సా, కీవ్, ఆగస్టు 22: సమస్యలకు యుద్ధ భూమిలో పరిష్కారం లభించదని ప్రధాని మోదీ అన్నారు. ఉక్రెయిన్, పశ్చిమాసియా సంక్షోభాలు యావత్ ప్రపంచానికి చేటు అని పేర్కొన్నారు. చర్చలతో శాంతి పునరుద్ధరణకు భారత్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. పోలండ్ పర్యటనలో భాగంగా గురువారం మోదీ ఆ దేశ ప్రధాని డొనాల్డ్ టస్క్‌తో భేటీ అయ్యారు. ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యం సహా పలు అంశాలపై ఆయనతో విస్తృతంగా చర్చించారు. పోలండ్‌తో సామాజిక భద్రతా ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించారు. తద్వారా శుద్ధ ఇంధనం, కొత్త టెక్నాలజీ రంగాల్లో బంధం బలోపేతం అవుతుందని తెలిపారు. టస్క్‌తో చర్చల అనంతరం ఇద్దరూ కలిసి మీడియాతో మాట్లాడారు. సంక్షోభాల కారణంగా అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం మానవత్వానికే సవాల్‌గా మోదీ అభివర్ణించారు. సాధ్యమైనంత త్వరగా శాంతి స్థిరత్వం స్థాపనకు తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. ఈ దిశగా మిత్ర దేశాలతో కలిసి వీలైనంత సాయం చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. కాగా, బుధవారం రాత్రి పోలండ్ రాజధాని వార్సా చేరుకున్న మోదీ.. 45 ఏళ్ల తర్వాత ఆ దేశంలో పర్యటించిన తొలి భారత ప్రధానిగా రికార్డు సృష్టించారు. చివరగా 1978లో మొరార్జీ దేశాయ్ పోలండ్ వెళ్లారు. ఇదే విషయాన్ని ప్రస్తావించిన మోదీ ఇరు దేశాల సంబంధాల్లో ప్రత్యేక సందర్భమని పేర్కొన్నారు. భౌగోళిక, రాజకీయ సవాళ్లకు ఐక్యరాజ్య సమితి విస్తరణే పరిష్కారం అని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో సహా భారత్-పోలండ్ ప్రతి అంతర్జాతీయ వేదికపై పరస్పరం సహకరించుకుంటున్న సంగతిని గుర్తుచేశారు. ప్రపంచ సంస్థలు ప్రతిదాంట్లోనూ సంస్కరణ అవసరమని అన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైన రోజుల్లో పోలండ్ మీదుగా భారత విద్యార్థుల తరలింపునకు అనుమతి ఇచ్చినందుకు టస్క్‌కు మోదీ ధన్యవాదాలు తెలిపారు. కాగా, మోదీ ప్రత్యేక రైలులో పది గంటలు ప్రయాణించి శుక్రవారం ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు వెళ్లనున్నారు. 1991లో సోవియట్ యూనియన్ నుంచి విడిపోయి ఉక్రెయిన్ ఏర్పడ్డాక ఆ దేశంలో పర్యటిస్తున్న తొలి భారత ప్రధాని మోదీనే. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఆయన సమావేశమవుతారు.

బాంబు దాడులు.. భూ భాగాల ఆక్రమణలు

మాస్కో, ఆగస్టు 22: రష్యా ఉక్రెయిన్ దేశాల మధ్య పరస్పర బాంబు దాడులు, భూ భాగాల ఆక్రమణలు కొనసాగుతునే ఉన్నాయి. సరిహద్దుల్లో ఉన్న ఓ రష్యా గ్రామాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకున్నామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. మరోవైపు తూర్పు ఉక్రెయిన్‌లోని ఓ గ్రామాన్ని తమ దళాలు ఆక్రమించాయని రష్యా తెలిపింది. రష్యా భూభాగంలోకి మరింతగా చొచ్చుకొని పోయేందుకు ఉక్రెయిన్ ప్రయత్నాలు చేస్తుండగా, వాటిని అడ్డుకుంటున్నామని రష్యా పేర్కొంది.

జాబిల్లిపై మట్టిని తెచ్చేద్దాం..!

- చంద్రయాన్-4 మిషన్ లక్ష్యం అదే
- జపాన్‌తో కలిసి చంద్రయాన్-5 ప్రాజెక్టు
- ఇస్రో తదుపరి మూన్ మిషన్లపై ఆసక్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 22: చంద్రయాన్-3 ఘన విజయం తర్వాత భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తన తదుపరి మూన్ మిషన్లు చంద్రయాన్-4, 5పై దృష్టిపెట్టింది. ఈ రెండు మిషన్లకు సంబంధించిన డిజైన్లు పూర్తయ్యాయని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ తాజాగా ప్రకటించారు. ఈ మిషన్లు అంతరిక్ష అన్వేషణలో వేగంగా విస్తరిస్తున్న భారతదేశ పాత్రను తెలియజేయనున్నాయి. ఈ నేపథ్యంలో చంద్రయాన్-4, 5 లక్ష్యాలు ఏమిటి..? అంతరిక్ష పరిశోధనల్లో అవి ఎలాంటి పాత్రను పోషించనున్నాయి..? అనే అంశాలు ఆసక్తిగా మారాయి.

చంద్రయాన్-4: ఇస్రో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల్లో చంద్రయాన్ కీలకమైనది. గత ఏడాది చేపట్టిన చంద్రయాన్-3 విజయవంతం కావడంతో భారత్ చరిత్ర సృష్టించింది. దానికి కొనసాగింపుగా చేపడుతున్న ప్రాజెక్టు చంద్రయాన్-4. ఈ ప్రయోగాన్ని 2028లో నిర్వహించాలనేది ఇస్రో లక్ష్యం. జాబిల్లి ఉపరితలంపై నుంచి శిలలు, మట్టి నమూనాలను సేకరించి సమగ్ర విశ్లేషణ కోసం వాటిని భూమికి తీసుకురావడం ఈ మిషన్ ప్రధాన లక్ష్యం. చంద్రయాన్-4లో ల్యాండర్, అసెండర్, ట్రాన్స్‌ఫర్ మాడ్యూల్, రీ ఎంట్రీ మాడ్యూల్ వంటి కీలక భాగాలు ఉంటాయి.

ల్యాండర్: చంద్రుడి ఉపరితలాన్ని తాకేలా రూపొందించిన ల్యాండర్‌లో రోబోటిక్ చేయి ఉంటుంది. ఇది చంద్రుడి ఉపరితలంపై నుంచి నమూనాలను సేకరిస్తుంది.

అసెండర్: జాబిల్లి ఉపరితలంపై సేకరించిన నమూనాలను చంద్రుడి కక్ష్యలోకి తీసుకెళ్లే బాధ్యతను అసెండర్ తీసుకుంటుంది.

ట్రాన్స్‌ఫర్ మాడ్యూల్: అసెండర్ తీసుకొచ్చిన నమూనాలను ఈ ట్రాన్స్‌ఫర్ మాడ్యూల్ రీ ఎంట్రీ మాడ్యూల్‌కు తరలిస్తుంది.

రీ ఎంట్రీ మాడ్యూల్: చంద్రుడిపై సేకరించిన శాంపిళ్లను భూమిపైకి చేరుస్తుంది.

చంద్రయాన్-5: జపాన్ స్పేస్ ఏజెన్సీ (జాక్సా)తో కలిసి ఇస్రో చేపట్టే మూన్ మిషన్ చంద్రయాన్-5. దీనిద్వారా జాబిల్లిపై శాశ్వత నీడ ఉండే మంచు ప్రాంతాలను అన్వేషించనున్నారు. ఈ మిషన్‌లో ఇస్రో రూపొందించిన ల్యాండర్‌తో పాటు జపాన్ అభివృద్ధి చేసిన 350 కిలోల రోవర్ కీలక పాత్ర పోషిస్తాయి. చంద్రుడి పై సవాళ్లతో కూడిన ప్రాంతాలను అన్వేషించడానికి వీలుగా వీటిని ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తున్నారు.

24న అల్పపీడనం

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒక వైపు ఎండలు కొనసాగుతుండగా మరోవైపు వానలు కురుస్తున్నాయి. కొద్దిరోజులుగా ఎండ తీవ్రత, ఉక్కపోతతో వాతావరణ అనిశ్చితి నెలకొంది. దీంతో గురువారం ఉత్తరకోస్తాలో ఎక్కువచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు, కోస్తాలో ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. గురువారం దేశంలో అత్యధికంగా కడపలో 38.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. కాగా ఈనెల 24వ తేదీన ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనావేసింది.

వచ్చే రెండు వారాలు కోస్తాలో సాధారణ వర్షాలు

ఆగస్టులో ఎక్కువ ప్రాంతాల్లో వర్షాభావం కొనసాగింది. ఎండలు, ఉక్కపోతతో పంటల సాగుపై ప్రభావం చూపింది. అయితే గురువారం నుంచి ఈనెల 29 వరకు కోస్తాలో సాధారణ వర్షపాతం నమోదవుతుందని వాతావరణశాఖ తెలిపింది. అదే సమయంలో రాయలసీమలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఈనెల 29నుంచి వచ్చే నెల 5తేదీ వరకు కోస్తాలో ఎక్కువగా, రాయలసీమలో సాధారణ వర్షపాతం నమోదవుతుందని పేర్కొంది.



మంత్రాలయంలో మహారథోత్సవానికి అశేషంగా తరలివచ్చిన భక్తులు

వైభవంగా రాఘవేంద్రుడి మహారథోత్సవం

భక్తులతో కిక్కిరిసిన మంత్రాలయం శ్రీమఠం

మంత్రాలయం, ఆగస్టు 22: జగద్గురు మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353వ సప్తరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం మహా రథోత్సవం వైభవంగా సాగింది. శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు ఉదయం సుప్రభాత సేవతో ఉత్తరాధన వేడుకలను నిర్వహించారు. బంగారు ఆభరణాలతో అలంకృతుడైన ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను సంస్కృత పాఠశాల వరకు ఊరేగించి తిరిగి శ్రీమఠానికి తీసుకువచ్చారు. అనంతరం ఉత్సవమూర్తికి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు పూజలు చేసి మహామంగళహారతులు ఇచ్చారు. ఉత్సవమూర్తిని రథంపైకి అధిష్టిస్తుండగా.. లక్షలాది మంది భక్తులు జయహో గురు రాఘవేంద్ర.. విజయహో అంటూ జయ జయ ధ్వానాలు పలికారు. శ్రీమఠానికి చేరుకున్న మహారథం నుంచి ఉత్సవమూర్తిని బృందావనం ముందు ఉంచి పూజలు చేశారు. రాఘవేంద్ర స్వామి మహారథోత్సవ వేడుకల్లో కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ రామచంద్ర ఉదార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైసూరు మహారాజు యదువీర్ కృష్ణదత్త చామరాజ వడియార్‌కు రాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి-2024 అవార్డును పీఠాధిపతి ప్రదానం చేశారు.

నేటి ప్రజా వేదిక కార్యక్రమం రద్దు

అమరావతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు జరగనున్న నేపథ్యంలో శుక్రవారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరగాల్సిన ప్రజా వేదిక కార్యక్రమం రద్దు అయినట్లు ఎమ్మెల్సీ అశోక్‌బాబు తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక దర్శనాలు రద్దు

తిరుమల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారి ఆర్జిత సేవలు, బ్రేక్ దర్శనాలు, వివిధ రకాల ప్రత్యేక దర్శనాలను అక్టోబరు 3 నుంచి 13వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్టు టీటీడీ గురువారం ప్రకటించింది. బ్రహ్మోత్సవాలను వీక్షించేందుకు సామాన్య భక్తులు అధికంగా వస్తారని, వారికి సంతృప్తికర దర్శనం కల్పించేందుకు బ్రహ్మోత్సవాల్లో బ్రేక్ దర్శనాలు, వివిధ రకాల ప్రత్యేక దర్శనాలను రద్దు చేస్తున్నట్టు టీటీడీ వివరించింది. అక్టోబరు 3వ తేదీన అంకురార్పణ నుంచి 12వ తేదీ వరకు వయోవృద్ధులు, దివ్యాంగులు, ఏడాదిలోపు చిన్నపిల్లల తల్లిదండ్రులకు దర్శనాలను రద్దు చేసింది. అలాగే వీఐపీ బ్రేక్ దర్శనాలను కేవలం ప్రొటోకాల్‌కు మాత్రమే పరిమితం చేసింది.

శ్రీవారి సేవలో మెగాస్టార్ చిరంజీవి



శ్రీవారి ఆలయ మహద్వారం వద్ద చిరంజీవి దంపతులు

తిరుమల, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): తన పుట్టినరోజు సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి కుటుంబ సమేతంగా గురువారం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. సతీమణి సురేఖ, తల్లి అంజనాదేవి, మనవరాళ్లతో కలిసి బుధవారం రాత్రి తిరుమలకు చేరుకున్న ఆయన గురువారం వేకువజామున సుప్రభాత సేవలో పాల్గొన్నారు. శ్రీవారి దర్శనానంతరం రంగనాయకమండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వదించారు. ఆలయం వద్ద అభిమానులు చిరంజీవితో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు.

టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళం



టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి చెక్ అందజేస్తున్న దాత

తిరుమల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.కోటి విరాళంగా అందింది. కాకినాడకు చెందిన ప్రసన్న కోటవిరూపా పవర్ ప్రాజెక్ట్స్ సంస్థ తరపున ఈ విరాళాన్ని బుధవారం రాత్రి తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

పత్తి, మొక్కజొన్నలో పురుగులను నిర్మూలించాలి

» వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

అమరావతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పత్తిలో గులాబీరంగు పురుగు, మొక్కజొన్నలో కత్తెర పురుగు నిర్మూలనకు రైతులు శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావు కోరారు. గురువారం మంగళగిరిలోని వ్యవసాయశాఖ కార్యాలయం నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ "పత్తిలో దిగుబడులు పెంచి బీటీ సాంకేతిక పరిజ్ఞానం తర్వాత ఇప్పటి వరకు గులాబీ పురుగు అదుపు చేయడానికి కొత్త ఆవిష్కరణలు జరగలేదు. గులాబీ పురుగు రెక్కల పురుగులుగా మారకుండానే నిర్మూలించాలి. ఎకరానికి 20 లింగాకర్షక బుట్టలు పెట్టాలి. మూడు తీతల తర్వాత పొలాల్లో పత్తి పంట అవశేషాలు లేకుండా చూసుకోవాలి. అలాగే మొక్కజొన్నలో కత్తెర పురుగు నిర్మూలనకు విత్తే సమయాన్ని మార్చడం, వేపగింజల కషాయాన్ని ఆకు సుడుల వద్ద పిచికారి చేయడం, విషపు ఎరలు పెట్టి, నన్నపురుగుల సముదాయాలను తొలగించాలి" అని సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రధాన కీటక శాస్త్రవేత్త ప్రసాదరావు గులాబీ, కత్తెర పురుగుల నిర్మూలనకు సూచనలిచ్చారు.

దోపిడీ దొంగల బీభత్సం

» బంగారం వ్యాపారులపై తుపాకితో కాల్పులు

» ఒకరి చేతిలోకి దూసుకెళ్లిన బుల్లెట్

» కంట్లో కారం చల్లి, ఇనుపరాడ్లతో దాడి

» నగదు, సెల్‌ఫోన్లు తీసుకుని పరారీ



హుస్సేన్ మాలిక్

గరివిడి/రాజాం రూరల్, ఆగస్టు 22: విజయనగరం జిల్లా అప్పన్నవలస సెంటర్‌లో బుధవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. రాత్రి 11 గంటల సమయంలో విజయనగరం నుంచి బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యాపారులను అడ్డుకుని తుపాకితో కాల్పులు జరిపారు. కంట్లో కారం చల్లి, ఇనుపరాడ్లతో దాడి చేశారు. వారి దగ్గరున్న నగదు, సెల్‌ఫోన్లను తీసుకుని పరారయ్యారు. దుండగుల దాడిలో వ్యాపారులకు గాయాలయ్యాయి. పోలీసులు, బాధితుల కథనం మేరకు.. రాజాం పట్టణానికి చెందిన బంగారం వ్యాపారులు కిల్వర్ హుస్సేన్ మాలిక్, షేక్ నజీమ్ 50 గ్రాముల బంగారాన్ని విజయనగరం తీసుకువెళ్లి అక్కడి మార్కెట్‌లో మెరుగులు దిద్దించి బైక్‌పై రాత్రి 9 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. చీపురుపల్లి దాటి అప్పన్నవలస సెంటర్‌కు వచ్చేసరికి ముసుగులు ధరించిన ఇద్దరు వ్యక్తులు వీరి బైక్‌ను అడ్డుకున్నారు. వారిని గమనించిన ఆ వ్యాపారులు రహదారి పక్కన ఉన్న పొదల్లోకి బంగారు ఆభరణాల్ని విసిరేశారు. దీన్ని గమనించని దొంగలు విలువైన వస్తువులు, డబ్బులు, సెల్‌ఫోన్ ఇచ్చేయాలని బెదిరించారు. వినకపోవడంతో ఇద్దరిపైనా నాటు తుపాకీతో కాల్పులకు దిగారు. ఇద్దరి కళ్లల్లో కారం చల్లి, ఇనుపరాడ్డులతో దాడి చేశారు. వారి దగ్గరున్న నగదు, సెల్‌ఫోన్లను తీసుకుని బైక్‌పై పరారయ్యారు. ఈ ఘటనలో హుస్సేన్ మాలిక్ చేతిలోకి బుల్లెట్ దూసుకెళ్లింది. షేక్ నజీమ్ చేతికి స్వల్ప గాయమైంది. బాధితులు రాజాంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యులు హుస్సేన్ మాలిక్ చేతిలోని బుల్లెట్‌ను తొలగించారు. గరివిడి ఎస్‌ఐ ఎల్.దామోదరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ పాస్‌పోర్టులతో కల్యాణోత్సవ టికెట్లు

» తమిళనాడు వాసులపై కేసు నమోదు

తిరుమల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నకిలీ పాస్‌పోర్టులతో తిరుమల శ్రీవారి కల్యాణోత్సవ టికెట్లు పొందిన ఘటన గురువారం వెలుగు చూసింది. టీటీడీ విజిలెన్స్ అధికారుల కథనం మేరకు.. బుధవారం ఉదయం 10 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవంలో పాల్గొనేందుకు తమిళనాడుకు చెందిన మురళీధరన్, తెన్మొజీ, మురుగేషన్, రాణి తిరుమలకు వచ్చారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో విజిలెన్స్ అధికారులు అనుమానంతో వీరిని అదుపులోకి తీసుకుని విచారించారు. తాము ఆన్‌లైన్ ద్వారా కల్యాణోత్సవ టికెట్లను పొందామని భక్తులు తెలిపారు. ఈ క్రమంలో పాస్‌పోర్టు నంబర్ల ద్వారా టికెట్లను బుక్ చేసినట్టు గమనించిన విజిలెన్స్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించగా మార్ఫింగ్ చేసినట్టు తేలింది. దీంతో వారిని గట్టిగా ప్రశ్నించగా తమిళనాడులోని వేలూరు జిల్లా, తిరుపత్తూరుకు చెందిన అన్నాదొరై అనే వ్యక్తి తమకు ఈ టికెట్లు ఇచ్చారని తెలిపారు. అధికారులు విచారణలో నెట్ సెంటర్ నిర్వహించే అన్నాదొరై పాస్‌పోర్టులోని చివరి నంబర్లను మార్చి ఆన్‌లైన్ ద్వారా కల్యాణోత్సవ టికెట్లు పొందినట్టు తేలింది. వీటిని అధిక ధరకు భక్తులకు విక్రయించినట్టు సమాచారం. అన్నాదొరై గతేడాది నుంచి ఇదే విధంగా ఆధార్, పాస్‌పోర్టుల్లో నంబర్లను మార్చి టికెట్లను పొందుతున్నట్టు తేలింది. తిరుమల టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హిందూపురం ఆస్పత్రిలో ఇద్దరు గర్భస్థ శిశువులు మృతి

» వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆరోపణ



హిందూపురంలోని మాతా శిశు సంక్షేమ ఆస్పత్రి

హిందూపురం, ఆగస్టు 22: ప్రసవం కోసం ఆసుపత్రికి వచ్చిన గర్భిణుల పట్ల వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో ఇద్దరు శిశువులు గర్భంలోనే మృతి చెందారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. బాధితుల కథనం మేరకు, పరిగి మండలం చిన్నపల్లి గ్రామానికి చెందిన ప్రీతికి నెలలు నిండి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆమెను బుధవారం ఉదయం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. అయితే ఆమెను వెంటనే అడ్మిట్ చేసుకోకుండా డ్యూటీలో ఉన్న డాక్టర్ నీరజ ఇతర రోగులను పరీక్షించి వచ్చిన తర్వాత మధ్యాహ్నం అడ్మిట్ చేసుకున్నారు. నొప్పులతో బాధపడుతున్నా.. ప్రసవం ఆలస్యమవుతుందని చెప్పారు. గురువారం తెల్లవారుజామున నొప్పులు ఎక్కువ కావడంతో నర్సులు డాక్టర్ నీరజకు సమాచారం అందించారు. ఆమె ఆస్పత్రికి రాకపోగా, అనంతపురానికి తీసుకెళ్లాలని సూచించారు. కానీ ఇక్కడే ప్రసవం అయ్యేలా ఉందని నర్సు చెప్పడంతో ఫోన్‌లో నర్సుకి సూచనలు చేశారు. ఎట్టకేలకు ప్రీతికి సాధారణ ప్రసవమే జరిగినా శిశువు మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యమే తన బిడ్డ మృతికి కారణమని ప్రీతి భర్త రవికుమార్ ఆరోపించారు. మరో ఘటనలో లేపాక్షి మండలం కల్లూరుకి చెందిన ఆశను ప్రసవం కోసం బుధవారం మధ్యాహ్నం తీసుకువచ్చారు. వైద్యులు స్కానింగ్ చేయించుకుని రావాలని సూచించగా చేయించారు. రిపోర్టు చూసిన డాక్టర్ నీరజ గర్భంలో శిశువు మృతి చెందిందని తెలిపారు. వెంటనే అనంతపురానికి వెళ్లాలని సూచించారు. కానీ గర్భిణిని కుటుంబ సభ్యులు అక్కడే ఉంచారు. ఆమెకు గురువారం ఉదయం సాధారణ ప్రసవం జరిగి మృత శిశువు జన్మించింది. మృత శిశువు గర్భంలో 24 గంటలు ఉంటే తల్లి ప్రాణాలకు ముప్పు ఉంటుదని తెలిసినా వైద్యులు సాధారణ ప్రసవం అయ్యేదాకా వేచి చూశారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. మరోవైపు.. డాక్టర్ నీరజ గురువారం సెలవుపెట్టి వెళ్లిపోయారు. వివరణ కోసం ఫోన్‌లో ప్రయత్నించగా స్విచ్ ఆఫ్ వచ్చింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్‌ను వివరణ కోరగా, జరిగిన ఘటనల్లో వైద్యుల తప్పిదం లేదని అన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'లంక' ఎటువైపు?

బంగ్లాదేశ్ పరిణామాల తరువాత, మాల్దీవులూ మారిపోయాక, శ్రీలంక అయినా అక్కడి ఎన్నికల అనంతరం మనవైపు ఉంటుందా? వచ్చేనెల 21న అక్కడ జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో విజేతను బట్టి ఆ దేశం తన రెండు బలమైన పొరుగుదేశాలైన ఇండియా, చైనాల్లో ఎటువైపు మొగ్గుతుందో తేలిపోతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. దౌత్యసంబంధాలమీద ఆ కుర్చీలో కూర్చోబోయేవారి ప్రభావం కాదనలేనిది. తీవ్ర ఆర్థికసంక్షోభంతో దేశం కుప్పకూలిపోయి, జనం ఆగ్రహావేశాలతో వీధుల్లోకి వచ్చి, అధ్యక్షభవనంలోకి చొచ్చి, పెత్తనం చెలాయిస్తున్న రాజపక్సలను పలాయనం చిత్తగించేట్టు చేసిన దృశ్యాలను ఎప్పటికీ మరిచిపోలేనివి. ఇప్పుడు అధ్యక్షపదవికి పోటీపడుతున్న 39మందిలో, ప్రముఖంగా చెప్పుకోవాల్సిన పేర్లలో రాజపక్స వారసుడు, మహీంద రాజపక్స కుమారుడు నమల్ కూడా ఒకరు. తమిళపులులను ఊచకోతకోసి, తమిళులపై అఘాయిత్యాలు చేయించి, యుద్ధకాలం నాటి వీరుడిగా పేరొందిన మహీంద రాజపక్స మీద ప్రజల్లో ఇంకా ఎంతో గౌరవం, మోజు ఉన్నందున నమల్ తప్పక నెగ్గుతాడని ఆయన పార్టీ శ్రీలంక పీపుల్స్ ఫ్రంట్ నమ్ముతోంది. ప్రస్తుత అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే యునైటెడ్ నేషనల్ పార్టీ (యుఎన్‌పి) తరఫున కాకుండా స్వతంత్ర అభ్యర్థిగా పోటీపడుతున్నారు. ప్రేమదాస, దిస్సనాయకే వారసులు కూడా బరిలో ఉన్నందున సమధికోత్సాహానికి లోటేమీ లేదు.

రెండేళ్ళక్రితం దివాలాతీసి, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ఇచ్చిన భారీ అప్పుతో గాడినపడుతున్న దేశాన్ని కొత్తపాలకుడు దిశానిర్దేశం చేయాల్సి ఉంది. దానితోపాటు, ఎవరితో ఎక్కువ సాన్నిహిత్యాన్ని నెరపాలో కూడా నిర్ణయించుకోవాలి. రణిల్ బాధ్యతలు స్వీకరించిన సందర్భం వేరు కనుక, అందరితోనూ చక్కగా ఉంటూ కష్టాల్లో ఉన్న దేశాన్ని కాస్తంత ఒడ్డునపడేశారు. ఆయన భారతదేశానికి సన్నిహితుడని అక్కడివారు నమ్ముతారు. భారతదేశంతో కరెన్సీ ఒప్పంద ఆలోచనలు, అప్పులు, పెట్టుబడులు సాధించడంతో పాటు, నిబంధనలకు అతీతంగా అదానీకి మేలుచేశారన్న విమర్శలను కూడా అక్కడి విపక్షంనుంచి ఆయన ఎదుర్కొన్నారు. అదానీకి అడ్డుతోవలో వివిధ ప్రాజెక్టులు అప్పగించారన్న ఆరోపణలను ప్రధానంగా చేసిన సజిత్ ప్రేమదాస కూడా ఇప్పుడు అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్నారు. ఎవరు అధికారంలోకి వచ్చినప్పటికీ, భారత్, చైనాల్లో దేనినీ కాదనగలిగే స్థితిలో శ్రీలంక లేదన్నమాట వాస్తవం. రుణభారం మోయలేక, చెల్లింపులు చేయలేక చైనా నిర్మిత హంబన్‌టోటా ఓడరేవును ఆదేశానికే 99సంవత్సరాల లీజుకు 2017లో ఇచ్చేసినప్పుడు ప్రధాని స్థానంలో ఉన్నది విక్రమసింఘే. రణిల్ తిరిగి అధ్యక్షుడైతే భారత్‌కు కొత్త సమస్యలేమీ ఉండకపోవచ్చు కానీ, భారత వ్యతిరేకి, చైనా పూర్తి అనుకూల ఎన్‌పీపీ నేత అనుర కుమార దిస్సనాయకే పోటీపడటంతో పాటు మంచి ఊపుమీద ఉన్నట్టుగా వార్తలు వస్తున్నాయి.

స్థానిక సంస్థల ఎన్నికలు ఏడాదిన్నరగా జరపకుండా రణిల్ విక్రమసింఘే చట్టవ్యతిరేకంగా వ్యవహరించారంటూ శ్రీలంక సుప్రీంకోర్టు గురువారం తీవ్రంగా తప్పుబట్టింది. కేవలం డబ్బులేదన్న కారణంతో ఎన్నికలు వాయిదావేయడమేమిటని ఐదుగురు సభ్యుల ధర్మాసనం విమర్శించినప్పటికీ, ఎన్నికలు జరపనందుకు తాను ఏమాత్రం చింతించడం లేదని ఆయన చెప్పుకున్నారు. చేతిలో చిల్లిగవ్వలేక, ఆహారం, చమురు, విద్యుత్ ఇత్యాదివి కరువై దేశం అల్లాడిపోతున్న స్థితిలో ఓటుహక్కు కంటే జీవించే హక్కుకు తాను అప్పట్లో ప్రాధాన్యం ఇచ్చానని ఆయన ఓ బహిరంగసభలో సమర్థించుకున్నారు. సర్వశక్తిమంతులమని అనుకున్న రాజపక్స కుటుంబీకులను రెండేళ్ళక్రితం సింహళులు, తమిళులు, ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు చేయీచేయీ కలిపి దేశంనుంచి తరిమికొట్టిన విషయం తెలిసిందే. మతాలు, మూలాలతో సంబంధం లేకుండా దేశప్రజలంతా ఒక్కటైన సందర్భం అది. దీనికి సరిగ్గా మూడేళ్ళ ముందు ఈస్టర్ సందర్భంగా అక్కడ జరిగిన పేలుళ్ళలో 250మంది మరణించడం ప్రజల మనసులమీద పనిచేసి, రాజపక్స సోదరుల మాటలు నమ్మి వారిని అందలం ఎక్కించారు. కానీ, దొరికినచోటల్లా అప్పుతెచ్చిన సొమ్మును దుర్వినియోగం చేయడం, చేసిన అప్పులు తీర్చకపోవడం, ఉన్నపళంగా ఆర్గానిక్ వ్యవసాయం వైపు దేశాన్ని మళ్ళించడం వంటి అనేకానేక తప్పుడు నిర్ణయాలతో ఈ సోదరులు దేశాన్ని ముంచేశారు. తిండిగింజలు కూడా లేని ఆ దశనుంచి దేశం క్రమంగా తేరుకుంటున్న స్థితిలో ఇప్పుడు వారి వారసుడు మళ్ళీ అధ్యక్షస్థానం కోసం పోటీపడుతున్నాడు. పాలకులమీద తిరుగుబాటుతో తమ జీవించేహక్కును పరిరక్షించుకున్న శ్రీలంకవాసులు ఇప్పుడు తమ ఓటుహక్కును ఎంత తెలివిగా వినియోగించుకుంటారో చూడాలి.

చింతనాత్మక రాజకీయాలు యేవీ?

వికసిత్ భారత్! ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోని ప్రధాన అంశాన్ని, స్వాతంత్ర్య శతాబ్ది (1947) భారత్ గురించిన ఆయన దార్శనికతను ఆ ఒక్కమాటలో సంక్షేపించి చెప్పవచ్చు. 'అభివృద్ధి చెందిన దేశంగా భారత్'.. ఇది బాగా అరిగిపోయిన మాట కాదూ? 1950 దశకం రాజకీయ వాగ్ధరిలోని ఆ భావన అప్పటి నుంచి ఇప్పటికీ రాజకీయవేత్తల, ముఖ్యంగా ప్రభుత్వాధినేతల నోట పదే పదే పునరుక్తమవుతూనే ఉంది. వినీ వినీ శ్రోతలు విసిగి వేసారిపోతున్నారు. అయినా రాజకీయవేత్తలు ఆ మంత్రాన్ని జపిస్తూనే ఉన్నారు! దీన్ని ఎలా అర్థం చేసుకోవాలి? అది కేవలం ఒక వాక్యూరుని మేధో పరిమితి మాత్రమే కాదు; సమస్త రాజకీయవేత్తల అహేతుక ఆలోచనా ధోరణి– కృశించిన లేదా క్షీణించిన రాజకీయ ఆలోచనాశక్తిని ప్రతిబింబిస్తోంది. వాస్తవమేమిటంటే అధికార పక్షాల నాయకులు మాత్రమే కాదు, భావజాలాలకు అతీతంగా ప్రతి ఒక్క రాజకీయుడికి 'అభివృద్ధి' అనేది ఒక ఊతపదమైపోయింది. పైగా ఆ లక్ష్య సాధనకు తమ నిబద్ధతను పదే పదే ఏకరువు పెడుతూ ప్రజలను వారు నిత్యం సతాయిస్తూనే ఉన్నారు.

రెండు దశాబ్దాల క్రితం సంస్కృత భాష గురించి విఖ్యాత సంస్కృత విద్వాంసుడు Sheldon Pollock ఇప్పటికీ తరచు ఉదహరింపబడుతున్న ఒక వ్యాసాన్ని రాశారు అది: 'The Death of Sanskrit in 18th century India'. సంస్కృతం మృత భాష అయిపోయిందని చెప్పడం ఆయన ఉద్దేశం ఎంత మాత్రం కాదు. ఆ పురాతన భారతీయ భాష తన ఉనికిని కొనసాగిస్తూనే ఉన్నది. ఇండియాలో యూరోపియన్ల వలస పాలన ప్రారంభమైన తరువాత భారతీయ నాగరికత మేధో వ్యాసంగాల, సాంస్కృతిక భావాల వ్యక్తీకరణకు సంస్కృతం ప్రధాన మాధ్యమంగా ఉండడం నిలిచిపోయిందని చెప్పడమే ఆ పాశ్చాత్య విద్వాంసుని అభిమతం. ఆ అభిప్రాయానికి సుదీప్త కవిరాజ్ ప్రతిస్పందిస్తూ 'The Sudden Death of Sanskrit knowledge'. అనే వ్యాసాన్ని రాశారు. ఒక విశిష్ట చింతనా ధోరణి సంబంధమైన భావనాత్మక విశ్వం ఆకస్మికంగా అంతరించిపోయిందని కవిరాజ్ విశదీకరించారు.

సరిగ్గా అటువంటి విపరిణామమే మహోన్నత ఆధునిక భారత రాజకీయ చింతనా సంప్రదాయానికి కూడా సంభవించింది. వలసపాలనా కాలంలోనూ, స్వాతంత్ర్య సాధన అనంతరమూ దేశ రాజకీయాలను సమున్నత విలువలతో తీర్చిదిద్దిన, అభివృద్ధిపరిచిన మహా ప్రశస్త రాజకీయ చింతనే ఆ సంప్రదాయమని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. సరే, ఇప్పుడు నైతిక రాజకీయాలు క్షీణించిపోవడాన్ని అందరూ గుర్తించారు, విమర్శిస్తున్నారు, వేదన చెందుతున్నారు. అయితే అంతకంటే శోచనీయమైన ఒక వాస్తవాన్ని మనం అర్థం చేసుకోవడం లేదు: మన రాజకీయ దార్శనికత శుష్కించి పోయింది, రాజకీయ సంవాదాలు సంకుచితమవడమే కాదు, వికృతమూ అవుతున్నాయి. మన రాజకీయ వివేకం నిస్సారమైపోయింది, రాజకీయ నిర్ణయాలలో భావ దారిద్ర్యం, రాజకీయ కార్యాచరణలో మందకొడితనం, సాహసోపేత క్రియాశీలత కొరవడడం... నిజంగా ఇదొక విషాద వాస్తవం. భారత పునరుజ్జీవన, జాతీయోద్యమ యుగ రాజకీయాలను తీర్చిదిద్దిన, సమున్నతపరిచిన భావాల వాహిని ఎండిపోయింది. ఈ పరిణామాన్ని ఆధునిక భారత రాజకీయ చింతన హఠాన్మరణమని మీరు భావించవచ్చు.

భావాల ప్రపంచంలో సంభవించిన అన్ని ఉద్యమాల విషయంలో మాదిరిగానే ఈ 'మరణం' ఎప్పుడు చోటు చేసుకున్నదో ఒక తేదీని కచ్చితంగా చెప్పలేము. అయితే వలసపాలనానంతర, అంటే స్వతంత్ర భారతావని మొదటి పాతికేళ్ల (1947–72)లోనే సంభవించిందని నిశ్చితంగా చెప్పవచ్చు. స్వాతంత్ర్య ఉషోదయంలో క్రియాశీలంగా ఉన్న మన రాజకీయ చింతకులను, వారి భావ విస్తృతి, ప్రభావ శీలతను గుర్తుచేసుకోండి. కేవలం గాంధీ, నెహ్రూ, అంబేడ్కర్‌లు మాత్రమే కాదు ఇంకా ఎంతో మంది ఉన్నారు. మన ఆలోచనలను విశాలం చేసిన తేజోమూర్తులు వారు. వారు విశ్వసించిన, ప్రతిపాదించిన భావజాలం ఏదైనా జాతి అభ్యుదయాన్ని మాత్రమే ఆ సమున్నతులు తమ దృష్టిలో ఉంచుకున్నారు. నవ్యమానవవాదాన్ని ప్రతిపాదించిన మానవేంద్రనాథ్ రాయ్, హిందూ చింతన, సంస్కృతిని మహోన్నత స్థాయికి తీసుకువెళ్లిన జాతీయవాద ప్రవక్త శ్రీ అరబిందో అప్పటికి క్రియాశీల రాజకీయాల నుంచి వైదొలిగారు. రాజకీయాలలో క్రియాశీలంగా ఉన్నవారిలో కాంగ్రెస్ నాయకుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్; సోషలిస్టు భావుకులు, పోరాటయోధులు ఆచార్య నరేంద్ర దేవ, జయప్రకాష్ నారాయణ్, రామ్ మనోహర్ లోహియా; కమ్యూనిస్టు నాయక దిగ్గజాలు ఎస్ఏ డాంగే, పిసి జోషి; సామాజిక న్యాయపోరాటయోధుడు పెరియార్ రామస్వామి నాయకర్; స్వేచ్ఛా వాణిజ్య విధానాలను ప్రవచించిన సి. రాజగోపాలాచారి; హిందూ మతానికి ప్రాధాన్యమిచ్చిన వినాయక్ దామోదర్ సావర్కార్; ముస్లింల పక్షాన మాట్లాడిన మౌలానా మౌదూది ఆ తేజోమూర్తులలో కొందరు మాత్రమే.



మన రాజకీయాలలోని ప్రస్తుత దుస్థితికి చైతన్యశీల రాజకీయ చింతన క్షీణించిపోవడమే ప్రధాన కారణం. భారత రాజ్యాంగ నిర్మాతలు నెలకొల్పిన మన సమున్నత ప్రజాస్వామిక గణతంత్రరాజ్యాన్ని మళ్లీ సాధించుకుని, సంరక్షించుకునేందుకు 'మరణించిన' ఆధునిక భారత రాజకీయ చింతనా సంప్రదాయాన్ని పునరుద్ధరించుకుని పునశ్శక్తిమంతం చేసుకోవడమనేది చాలా చాలా అవసరం.



■ యోగేంద్ర యాదవ్

ఆ ఉదాత్తుల భావాలు, ఆలోచనలతో మీరు అంగీకరించినా లేక విభేదించినా వారు ఉత్కృష్ట రాజకీయ తాత్వికులు అనే వాస్తవాన్ని మీరు నిరాకరించలేరు. అవును, వారు రాజకీయ క్రియాశీలురు. అయితే వారి రాజకీయ కార్యాచరణ భావి భారతీయ సమాజ నిర్మాణం గురించిన విశాల దార్శనికతతో ప్రేరణ పొందింది. సమున్నత లక్ష్యాలకు పరిపూర్ణంగా నిబద్ధమైన రాజకీయ కార్యాచరణ అది. దైనందిన రాజకీయాలలో పాల్గొంటూనే సర్వసాధారణమైన పాక్షికతలు, పక్షపాతాలకు అతీతంగా ఆలోచించారు, సమాజంతో సంభాషించారు, ప్రజలకు విపులంగా వివరించేందుకు తమ భావాలకు స్ఫూర్తిదాయకమైన అక్షర రూపమిచ్చారు. భారతదేశం, భారతీయుల బాగోగులే వారి ఉచ్ఛ్వాసనిశ్వాసాలు. అయితే ప్రపంచవ్యాప్తంగా ఎల్లెడలా జరుగుతున్న సంఘటనలు, వాటి పూర్వాపరాలను సమగ్రంగా తెలుసుకునే వారు. చదవడం, రాయడం ఆంగ్లంలోనే అయినప్పటికీ భారతీయ భాషల మహోన్నత సాంస్కృతిక వారసత్వం, సాహిత్య వైభవం వారి మేధో కృషికి, సమాజ సేవా కార్యకలాపాలకు ఒక స్ఫూర్తిగా, ఆలంబనగా ఉండేవి. ఆధునికత, సంప్రదాయంపై వారు విశాల దృక్పథంతో భిన్న రీతుల్లో వివేచించారు. అయితే పూర్తిగా దేశీయ అంటే విలక్షణమైన భారతీయ ఆధునికత రూపుదిద్దుకోవడానికి సమష్టిగా దోహదం చేశారు ఆ దేశభక్తులు, మానవతావాదులు విశిష్టమైన రాజకీయ ఆలోచనల సంచయాన్ని సృష్టించారు. ఆ భావాల సంచయమే మన రాజ్యాంగాన్ని విశిష్టంగా రూపొందించింది. భిన్న భావజాలాలు ప్రభవించి వర్ధిల్లడానికి, వివిధ రాజకీయ కార్యాచరణలకు ఆస్కారమిచ్చింది.

స్వతంత్ర భారతావని తొలి పాతికేళ్లలో ఈ మహోదాత్త రాజకీయ చింతనా సంప్రదాయం ఆకస్మికంగా అంతరించి పోయింది. 1970 దశకం తొలినాళ్లకు ప్రస్తావిత చింతకులు చాలా మంది కీర్తిశేషులయ్యారు. రాజకీయ చింతనలో రాజకీయ నాయకుల ప్రాబల్యం కొనసాగుతున్నప్పటికీ వారి ఆలోచనలు 1947లో ప్రజలకు మార్గదర్శకంగా ఉన్న రాజకీయ భావాలతో ఎంత మాత్రం పోల్చదగ్గవి కావు. వ్యక్తులుగా కూడా ఆ నేతలకు పాతతరం ఉదాత్తులకు మధ్య చాలా తేడా ఉన్నది. ఆ నాటికి సోషలిస్టు భావుకతలో ఇంకా మినుకు మినుకుమంటూ మిగిలి వున్నది లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ 'సంపూర్ణ విప్లవ' భావన మాత్రమే. చారు మజుందార్ సిద్ధాంతాలు మార్క్సిజంకు తుది సృజనాత్మక భాష్యాలు. వినోబా భావే చింతన ఏకపక్షమైనదే అయినప్పటికీ గాంధేయవాదులలో ఆయన ప్రముఖుడు. ఎమ్ఎస్ గోళ్వాల్కర్ 'హిందుత్వ' వాదాలను ప్రచారం చేస్తూనే ఉన్నారు గ్రామీణ భారతదేశ అభ్యున్నతికి ఒక విశిష్ట కార్యక్రమాన్ని ప్రతిపాదించిన దార్శనికుడు చౌదరి చరణ్ సింగ్. ఈ జాబితా అసంపూర్ణమైనది. అయితే ప్రస్తావితులు అందరూ దేశ ప్రజలను ప్రభావితం చేసినవారనడంలో సందేహం లేదు.

ఇరవయో శతాబ్ది తుది సంవత్సరాలకు వచ్చేసరికి రాజకీయ క్రియాశీల–చింతకులు కూడా చాలవరకు శాశ్వతంగా నిష్క్రమించారు. మిగిలి ఉన్న కిషెన్ పట్నాయక్, సచ్చిదానంద సిన్హా, రామ్‌దయాళ్ ముండా, ధరమ్‌పాల్, బిడి శర్మ ప్రధాన స్రవంతి రాజకీయాలకు వెలుపలే ఉండిపోయారు అప్పటి నుంచి రాజకీయ కార్యాచరణలపై వివేచించిన, వాటిని ప్రభావితం చేసిన అర్థవంతమైన రాజకీయ చింతన ఏదీ మనకు లేకుండా పోయింది.

రాజకీయ ఆలోచనాశక్తి క్షీణించిపోవడం, మరింత ధైర్యంగా, స్పష్టంగా ఆధునిక భారత రాజకీయ చింతన 'మరణం' గురించి మాట్లాడడమంటే రాజకీయ వ్యవహారాల గురించి నిశిత వివేచన చేసే ప్రశస్త మేధావులు, ఆలోచనాపరులు, రచయితలు మనకు ఇంకెంతమాత్రం లేరు అని చెప్తున్నట్టుగా భావించనవసరం లేదు. అటువంటి చింతకులు, భావుకులు ఉన్నారు. బహుశా ఇంతకు ముందు కంటే ఎక్కువ మందే ఉన్నారు. అయితే రాజకీయాలు, కనీసం వాటి సంకుచితార్థంలో సైతం వారి చింతనకు కేంద్రంగా లేవు. మన యెఱుక, అనుభవంలోకి వస్తున్న వర్తమాన రాజకీయ చింతనలోని ఏ స్రవంతిలోనూ మేధో కృషిని రాజకీయ కార్యాచరణలతో సంధాయకం చేసే ఒక సుసంగత సంభాషణ, ఒక శక్తిమంతమైన వాదన, ఒక అర్థవంతమైన చర్చ లేవు. అయితే ఇందుకు గౌరవప్రదమైన మినహాయింపులు లేకపోలేదు. అభివృద్ధి నమూనాపై నిశిత విమర్శలు, బహుళ ప్రత్యామ్నాయాల అన్వేషణ, స్త్రీవాద, అంబేడ్కరైట్ శ్రేణులలో సందర్భానుసారమైన చర్చలు, వాదోపవాదాలు రాజకీయ చింతనా సంప్రదాయాన్ని సజీవంగా ఉంచుతున్నాయి.

మొత్తం మీద రాజకీయ చింతన క్రమంగా విశ్వవిద్యాలయాలకు పరిమితమయింది. రజనీ కొఠారి, డీఎల్ సేథ్, ఆశీస్ నంది, పార్థా చటర్జీ, సుదీప్త కవిరాజ్, రాజీవ్ భార్గవ మొదలైన ప్రశస్త రాజకీయ సైద్ధాంతికవేత్తలను మన విశ్వవిద్యాలయాలు సృష్టించాయి. అయితే వారి భావాలు రాజకీయ కార్యాచరణలను ప్రగాఢంగా ప్రభావితం చేస్తున్నాయని చెప్పేందుకు ఆస్కారం లేనే లేదు. రాజకీయ చింతనను విశ్వవిద్యాలయాల రాజనీతిశాస్త్ర విశారదులు స్వీకరించి స్వాధీనం చేసుకోవడమనేది ఒక మేధోపరమైన విపత్తు మాత్రమేకాకుండా ఒక రాజకీయ అనర్థం కూడా.

మన రాజకీయాలలోని ప్రస్తుత దుస్థితి, శోచనీయ పరిస్థితులకు చైతన్యశీల రాజకీయ చింతన క్షీణించిపోవడమే ప్రధాన కారణం. భారత రాజ్యాంగ నిర్మాతలు నెలకొల్పిన మన సమున్నత ప్రజాస్వామిక గణతంత్రరాజ్యాన్ని మళ్లీ సాధించుకుని, సంరక్షించుకునేందుకు ఆధునిక భారత రాజకీయ చింతనా సంప్రదాయాన్ని పునరుద్ధరించుకుని పునశ్శక్తిమంతం చేసుకోవడమనేది చాలా చాలా అవసరం.


(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

ఆకాశ వీధుల్లో ఇస్రో జైత్రయాత్ర

భూమి, చంద్రుల సామీప్యతను గణించిన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) జూలై నెలను చంద్రయాన్–3కు అనుకూలం అని ఎంచుకున్నది. 2023 జూలై 14న శ్రీహరికోట సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఎల్‌వీఎంఎం–4 వాహకనౌక ద్వారా చంద్రయాన్–3ని ప్రయోగించారు. చంద్రయాన్–3లో ప్రొపల్షన్ మాడ్యూల్, ల్యాండర్ రోవర్ అనే ముఖ్యమైన మూడు భాగాలున్నాయి. ఇందులో ప్రొపల్షన్ మాడ్యూల్.. ల్యాండర్, రోవర్‌లను 100 కి.మీ చంద్ర కక్ష్య వరకు తీసుకువెళ్లింది. చంద్రయాన్–3లోని ల్యాండర్ విక్రమ్ చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీపంలో 2023 ఆగస్టు 23న సురక్షితంగా, మృదువుగా దిగింది. ఇది దిగిన ప్రదేశానికి 'శివశక్తి' అని నామకరణం చేశారు. ఇంతటి ఘనవిజయం సాధించిన ఆగస్టు 23ను ప్రతి సంవత్సరం జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకోవాలని భారత ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. ఈ విజయం అంతరిక్ష పరిశోధనలలో ఒక పెద్ద ముందడుగు. సైన్స్ టెక్నాలజీ రంగంలో భారతదేశం సాధించిన అద్భుతమైన పురోగతికి నిదర్శనం. ఇది ఒక చరిత్రాత్మక విజయం.

1957 అక్టోబరు 4న స్పుత్నిక్–1 అనే తొలి మానవ నిర్మిత ఉపగ్రహ ప్రయోగంతో అంతరిక్ష యాత్రలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి మానవులు అంతరిక్షాన్ని అన్వేషిస్తూనే ఉన్నారు. ఇది సామాజిక ప్రయోజనాల నిరంతర ప్రవాహాన్ని సృష్టించింది. అంతరిక్ష యాత్రలు, పరిశోధనలు భూమిలోని అనేక రంగాలకు ప్రయోజనం చేకూరుస్తున్నాయి. 1969లో ఇస్రో స్థాపనతో భారత అంతరిక్ష యాత్రలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు ఉపగ్రహాల ప్రయోగంలో ఇస్రో గణనీయమైన పురోగతి సాధించింది. చంద్రుడు, అంగారక గ్రహాన్వేషణ కార్యక్రమాలలో కూడా ప్రయోగాలు నిర్వహిస్తోంది. 2008 అక్టోబర్ 22న భారత్ చంద్రయాన్–1 ప్రయోగించింది. దీని ఫలితంగా ప్రపంచానికి తొలిసారిగా చంద్రునిపై నీటి జాడలు గుర్తించినట్లు భారతీయ అంతరిక్ష శాస్త్రవేత్తలు ప్రకటించారు. 'మంగళ్‌యాన్'ను 2019 నవంబర్ 5న పిఎస్ఎల్‌విసి–25 ద్వారా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. పిఎస్ఎల్‌విసి–37 ద్వారా నింగిలోకి ఒకేసారి 104 ఉపగ్రహాలను ప్రవేశపెట్టడంతో భారత్ ప్రపంచ రికార్డు సృష్టించింది.

చంద్రుని దక్షిణ ధ్రువం సమీపంలోని ఉపరితలంలో సల్ఫర్ ఉనికి గురించి ముందే తెలిసినా, అది అక్కడ ఉన్నదని చంద్రయాన్–3లో జరిపిన పరిశోధనలలో వెల్లడయింది. సల్ఫర్‌తో పాటు అల్యూమినియం, కాల్షియం, ఇనుము, క్రోమియం, టైటానియం, మాంగనీసు, సిలికాన్, ఆక్సిజన్ వంటి మూలకాలు కూడా ఉన్నట్లు గుర్తించారు. 2023 సెప్టెంబర్ 3న చంద్రుని ఉపరితలంపై ల్యాండర్ విక్రమ్ ఒక గంతు వేసింది. దాని ఇంజన్లను మండించి 30 సెంటీమీటర్లు ఎత్తుకు ఎగిరించి అంతే దూరం దూకించారు. భవిష్యత్‌లో జరిపే వెనక్కి తిరిగివచ్చే యాత్రల్లో ఉపయోగించాల్సిన సామర్థ్యాలను ఈ పరీక్ష ప్రదర్శించింది. చంద్రయాన్–3 విజయంతో చంద్రునిపై ల్యాండింగ్ సాధించిన నాల్గవ దేశంగా భారత్ గుర్తింపు పొందింది. అంతేకాక దక్షిణ ధ్రువం సమీపంలో చంద్ర ఉపరితలంపై దిగిన మొదటి దేశంగా చరిత్రలో స్థానం సంపాదించుకుంది.



జాతీయ అంతరిక్ష దినోత్సవం అంతరిక్ష పరిశోధనలలో భారతదేశం సాధించిన విజయాల వేడుక. ఇస్రో శాస్త్రవేత్తల, ఇంజనీర్ల కృషి, అంకితభావాన్ని ఈ శుభదినం గుర్తుచేస్తుంది.

ఉపగ్రహాలను భారతదేశం స్వయంగా ప్రయోగించే లక్ష్యంతో ఇస్రో మొదట ఎస్ఎల్‌వి (ఉపగ్రహ ప్రయోగ వాహనం) తరువాత పిఎస్ఎల్‌వి, ఆ తరువాత జిఎస్ఎల్‌విలను నిర్మించి అభివృద్ధిపరిచారు. ఇందులో ఎస్ఎల్‌వి తరగతికి చెందిన వాహకనౌక భూ నిమ్న కక్ష్యలో 40 కిలోల బరువు ఉన్న ఉపగ్రహాలను మాత్రమే అంతరిక్ష కక్ష్యలో ప్రవేశపెట్టగలదు. పిఎస్ఎల్‌వి రెండు వేల కిలోల బరువున్న ఉపగ్రహాలను భూనిమ్న కక్ష్యలో ప్రవేశపెట్టగలదు.

పిఎస్ఎల్‌వి వాహకనౌక ద్వారా పలు దేశీయ, విదేశీయ ఉపగ్రహాలను ఇస్రో విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. అంతకుముందు ఇన్సాట్ వంటి దేశీయ ఉపగ్రహాలను భూస్థిర, భూఅనువర్తిత కక్ష్యకు పంపేందుకు ఇస్రో విదేశాలపై ఆధారపడేది. ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టడాన్ని సొంత గడ్డ మీద నుంచే సాధించాలనే లక్ష్యంతో జిఎస్ఎల్‌వి శ్రేణి వాహకనౌకలను రూపకల్పన చేసి, అభివృద్ధిపరచి నిర్మించారు. వీటి నిర్మాణానికి ఇస్రో 1990లో శ్రీకారం చుట్టింది. 2001 నుంచి 2015 ఆగస్టు 27 వరకు ఇస్రో తొమ్మిది జిఎస్ఎల్‌వి వాహకనౌకలను ప్రయోగించగా, క్రయోజనిక్ స్థాయిలో లోపం వల్ల మూడు ప్రయోగాలు విఫలమయ్యాయి. 1991లో రష్యా–భారత ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందాలలో రష్యన్ కంపెనీ గ్లావ్ కాస్మోస్ 5 క్రయోజనిక్ ఇంజన్లు, సంబంధిత సాంకేతిక పరిజ్ఞానం ఇవ్వాల్సి ఉంది. కాని 1992లో ఇండియాపై అమెరికా విధించిన ఆంక్షల వల్ల రష్యా ఆ ఒప్పందం నుంచి వెనక్కి తగ్గి, కేవలం క్రయోజనిక్ ఇంజన్లు మాత్రమే సరఫరా చేసింది. 1994లో భారత్ సొంతంగా స్వదేశీ పరిజ్ఞానంతో క్రయోజనిక్ ఇంజన్‌ని అభివృద్ధిపరచడం ఆరంభించింది. 2014 నుంచి వైఫల్యాల తరువాత ప్రయోగాలు సఫలమైనాయి.

ఆగస్టు 23న జరుపుకునే జాతీయ అంతరిక్ష దినోత్సవం అంతరిక్ష పరిశోధనలనలో భారతదేశం సాధించిన విజయాల వేడుకగా దర్శనం ఇస్తుంది. ఇస్రో శాస్త్రవేత్తల, ఇంజనీర్ల కృషి, అంకితభావాన్ని గుర్తుచేస్తుంది. దేశవ్యాప్తంగా ఈ రోజున అంతరిక్ష కార్యక్రమాలకు మన దేశం సాధించిన విజయాల పరంపరలను ప్రదర్శించి, వర్క్‌షాపులు, సెమినార్లు నిర్వహిస్తారు. అంతరిక్ష అన్వేషణ ఫలితంగా పొందిన జ్ఞానంతో సుస్థిర అభివృద్ధి కోసం ఎలాంటి విధానాలు అమలు చేయవచ్చుననే విషయంపై చర్చా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తారు. సైన్స్ అండ్ టెక్నాలజీల్లో కెరీర్‌లు కొనసాగించడానికి యువతరానికి స్ఫూర్తిని కలిగించే ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేయాలి.

సమీప భవిష్యత్‌లో ఇస్రో కొన్ని అద్భుతమైన మిషన్లు ప్లాన్ చేస్తోంది. అవి– భారతీయ వ్యోమగాములను పరిశోధన కోసం అంతరిక్షంలోకి పంపడమే లక్ష్యంగా గగన్‌యాన్ ప్రాజెక్టు. సౌర కరోనాను అధ్యయనం చేయడానికి ఆదిత్య ఎల్–1 మిషన్. చంద్రయాన్–3కి కొనసాగింపుగా చంద్రుడి ఉపరితలాన్ని మరింత అన్వేషించడానికి చంద్రయాన్–4 ప్రాజెక్టును లక్ష్యంగా పెట్టుకుంది. శుక్రగ్రహాన్ని అధ్యయనం చేయడానికి శుక్రయాన్–1 ప్లాన్ చేస్తున్నారు. అంగారక గ్రహాన్ని మరింత లోతుగా అన్వేషించే లక్ష్యంతో మంగళయాన్–2ని రూపొందిస్తున్నారు. నాసా–ఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్ (నిసార్) సంయుక్తంగా భూమి, భూమిపై మంచు ఉపరితలాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయనున్నది. అంతరిక్ష పరిశోధనలు, శాస్త్రీయ పరిశోధనలను ముందుకు తీసుకువెళ్లాలన్న ఇస్రో నిబద్ధతను ఈ మిషన్లు ప్రతిబింబిస్తున్నాయి.

● సివి సర్వేశ్వర శర్మ
ప్రెసిడెంట్, కోనసీమ సైన్స్ పరిషత్

(నేడు జాతీయ అంతరిక్ష దినోత్సవం)

అవగాహన లేకనే శాంతిదూత ప్రస్తావన!

అంతర్జాతీయంగా మత ఉగ్రవాదానికి మూలపురుషుడు అయిన యాసర్ అరాఫత్‌ని ఆంధ్రజ్యోతి జూలై 30సంచికలో శాంతిదూతగా వర్ణించిన సాహసి కిన్నెర. చరిత్ర పట్ల అవగాహన లేకుండా ఇజ్రాయిల్‌పై అక్కసు వెళ్ళగక్కారు. యూదు మతం ఇస్లాం కన్నా ముందున్నది. ఇజ్రాయెల్ వారి పవిత్ర భూమి. వారిపై ముస్లింలు దాడి చేసి యూదులను తరిమికొట్టగా, వారు ప్రపంచం నలుమూలలా తల దాచుకున్నారు. యూదుల దశాబ్దాల కల ఐక్యరాజ్యసమితి తీర్మానంతో 1948లో ఇజ్రాయిల్ పుట్టింది. ఎవరు కాదనుకున్నా అది చరిత్ర. అది ఐరోపా శక్తులు కుయుక్తితో చేసినది అనవచ్చు. మరి పాకిస్థాన్ ఎలా పుట్టింది. బ్రిటిష్ వాడి కుయుక్తితో కాదా? భారత్ చీలికకు ఏ మాత్రం బాధపడని కిన్నెర భావజాలం పాలస్తీనా కోసం ఏడుస్తోంది. భారత భూభాగం 1962 నుండి చైనా ఆక్రమణలో ఉంది. కానీ ఒక్కసారి కూడా చైనా దురాక్రమణను ఖండించే గొంతుక కాదు కిన్నెర భావజాలకులది. కానీ ఇజ్రాయిల్ ఆక్రమిత పాలస్తీనా కోసం తీర్మానాలు, నిరసనలు చెయ్యగలరు. అరాఫత్ అనుచరులు చంపిన వారి సంఖ్య లెక్క తీస్తే ఆయన ఎంత శాంతిదూతో తెలుస్తుంది. ఇజ్రాయెల్ ప్రపంచ పటంలో ఉండటానికి అంగీకరించం అన్న మూర్ఖ అరేబియా దేశాల వల్లనే పాలస్తీనా సమస్య పరిష్కారం కాలేదు, కాదు కూడా. ఎవరి భూమి వారిది అని అంగీకరిస్తే, హింసకు పాల్పడం అని ముస్లింలు హామీ ఇస్తే అంతా సర్దుబాటు అవుతుంది. ప్రస్తుత అశాంతి, హింస కూడా హమాస్ అనే ఇస్లాం ఉగ్రవాద సంస్థ మొదలుపెట్టినదే. కిన్నెరది అంతా వక్రీకరణ వ్యవహారం. వారు చైనా ఆక్రమణ గురించి కూడా ఇంతలా బాధపడతారని ఆశిస్తున్నా.

–దుగ్గరాజు శ్రీనివాసరావు, విజయవాడ

ఆ జీవో పాక్షిక అమలు మరింత గందరగోళమే!

2017లో తెలుగుదేశం ప్రభుత్వంలో తెచ్చిన జీవో 29, దాని సవరణ జీవో 42లను ఎందుకు విద్యావేత్తలు, విద్యారంగ సంఘాలు ఆహ్వానించాయో, వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన 84, 85, 117 జీవోలపై విద్యావేత్తల నుంచి జనసామాన్యం వరకు ఎందుకు వ్యతిరేకత వచ్చిందో విద్యాశాఖమంత్రి నారా లోకేష్ స్వయంగా తెలుసుకోవాలి. అంతేకాని అధికారులపై ఆధారపడి అదే ఒరవడిలో పాఠశాల విద్యను కొనసాగించకూడదు.



పాఠశాల విద్యకు సంబంధించి గత ప్రభుత్వం ఇచ్చిన జీవో 117 ఒక పెద్ద సమస్య దానిని రద్దు చేస్తామని ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్ ఎన్నికల ప్రచార సభల్లో హామీ ఇచ్చారు. ఇప్పుడు దానిని పూర్తిగా రద్దు చేయాలా లేక పాక్షికంగా కొనసాగించాలా అని ఆలోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అది అలా ఉంచితే ఈ విషయమై సంఘాలతో, మేధావులతో సమగ్రంగా చర్చించమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విద్యాశాఖ సమీక్షలో చెప్పడం ఆశాజనకం. ఈ సందర్భంగా ఈ జీవో పూర్వాపరాలను పరిశీలించాలి.

జీవో 117 ఇవ్వడానికి ఆరు మాసాల ముందు డిసెంబర్ 2021లో ఆనాటి ప్రభుత్వం 84, 85 సంఖ్యలు గల జీవోలు ఇచ్చింది. వాటి కొనసాగింపే 2022 జూన్‌లో ఇచ్చిన 117 జీవో. ప్రభుత్వ పాఠశాలల పునర్వ్యవస్థీకరణ జీవో 84. ఇది ప్రాథమిక పాఠశాలలను ముక్కలు చేసి 3, 4, 5 తరగతులను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు తరలించడానికి అవకాశం కల్పించింది. కాగా 3, 4, 5 తరగతుల విద్య అందుబాటు సామీప్యత పరిమితిని ఒక కిలోమీటరు నుంచి మూడు కిలోమీటర్లకు జీవో 85 పెంచింది. ఇది విద్యాహక్కు చట్టం మౌలిక లక్ష్యానికే వ్యతిరేకం. ఫలితంగా ఎనిమిది, తొమ్మిది, పది సంవత్సరాల బాలబాలికలు ఎటువంటి వాహన సదుపాయం లేకుండా రానుపోనూ ఆరు కిలోమీటర్ల దూరం పుస్తకాలను మోసుకుంటూ పాఠశాలకు వెళ్ళవలసి వచ్చింది. అనేక కుటుంబాలు అప్పులుచేసి తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపగా, కొందరు బాలబాలికలు మొత్తంగా చదువు మానివేశారు. అయినా జగన్ ప్రభుత్వం తన తప్పిదాన్ని సరిదిద్దుకోలేక పోయింది.

గత తెలుగుదేశం ప్రభుత్వంలో తెచ్చిన జీవో 29 (మే 2017), దాని సవరణ జీవో 42 (జూన్ 2017)లను ఎందుకు విద్యావేత్తలు ఆహ్వానించారో, విద్యారంగ సంఘాలు ఆహ్వానించాయో, వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన 84, 85, 117 జీవోలపై విద్యావేత్తల నుంచి జనసామాన్యం వరకు ఎందుకు వ్యతిరేకత వచ్చిందో మంత్రి లోకేష్ స్వయంగా తెలుసుకోవాలి. అంతేకాని అధికారులపై ఆధారపడి అదే ఒరవడిలో పాఠశాల విద్యను కొనసాగిస్తే ప్రభుత్వ పాఠశాల విద్య విధ్వంసం కావటానికి ఐదు సంవత్సరాలు కూడా అవసరం లేదు.

ముందుగా చెప్పుకున్నట్లు జగన్ ప్రభుత్వం అనుసరించిన విధానాలు ప్రాథమిక పాఠశాలలను రెండు ముక్కలు చేశాయి. 3, 4, 5 తరగతులను సొంత వాడల్లో, ఉప గ్రామాల్లో, గ్రామాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలల నుంచి తొలగించి మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశాయి. దీనితో ప్రాథమిక పాఠశాలలు విధ్వంసం అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఐదువేల గ్రామాల ప్రజలు వ్యతిరేకించారు, వందలాది గ్రామాల్లో ప్రజలు రోడ్డు మీదకు వచ్చారు. కాని ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇక రెండవ వైపు చూస్తే ఉన్నత పాఠశాలల్లో చిన్న బాలలు చేరడం వల్ల, తగినంత స్థలం, అవసరమైనంత మంది ఉపాధ్యాయులు లేక అవి గందరగోళానికి గురయ్యాయి. 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో చేర్చి 3వ తరగతి నుంచే సబ్జెక్టు వారీ విద్య అని ప్రచారం చేసుకున్న గత ప్రభుత్వం, 8వ తరగతి వరకు బోధించే అత్యధిక ప్రాథమికోన్నత పాఠశాలలకు సబ్జెక్టు టీచర్లు లేకుండా ఎస్టీటీలను మాత్రమే కేటాయించింది. వందలాది ఉన్నత పాఠశాలలకు పీఈటీ, హెచ్ఎం పోస్టులను రద్దు చేసింది. ఉన్నత పాఠశాలల్లో తరగతి గదిలో విద్యార్థుల గరిష్ట పరిమితిని, ఒక వారంలో ఉపాధ్యాయుల బోధనా పీరియడ్ల పరిమితిని అహేతుకంగా పెంచివేసింది. 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలలకు కలపాలనే పొరపాటు నిర్ణయాన్ని తీసుకుని దానిని అమలు చేయడానికి అనేక విధ్వంసాలు సృష్టించింది. ఇంగ్లీషుకు సమాంతరంగా ఉన్న తెలుగు, ఉర్దూ, ఇతర మాధ్యమాలను ఆచరణలో రద్దు చేసింది. ఇదంతా టీచర్ పోస్టులను మిగుల్చుకోవడం అనే లక్ష్యం చుట్టూ తిరిగింది. ఇప్పుడు ఉద్యమ సంఘాల వేదిక ఫ్యాప్టోయే కాక, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం కూడా ఈ 84, 85, 117 జీవోలను రద్దు చేయాలని కొత్త విద్యాశాఖా మంత్రిని కోరుతున్నాయి.

'జాతీయ విద్యావిధానం–2020' 3, 4, 5 తరగతులను ఒక కరిక్యులర్ యూనిట్‌గా వ్యవహరించమని చెప్పిందే కాని, వాటిని ప్రాథమిక పాఠశాలల నుంచి విడగొట్టి ఉన్నత పాఠశాలల్లో పెట్టమని చెప్పలేదు (జాతీయ విద్యావిధానం 4.3). గత రాష్ట్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం అమలు చేయడంలో భాగంగా తాము జీవో 117 తీసుకువచ్చామని చెప్పడం హాస్యాస్పదం. ఈ విషయం ఆనాడే ప్రభుత్వానికి చెప్పాం. ఇంకా, ఉమ్మడి రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం 2011లో 'బాలల ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం–2009' అమలు విషయమై ఇచ్చిన నిబంధనల జీవో 20 (మార్చి 2011)ని కూడా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

2017లో తెలుగుదేశం ప్రభుత్వం ప్రసన్నకుమార్ (రిటైర్డ్ ఐఏఎస్) ఛైర్మన్‌గా ప్రభుత్వ అధికారులతో పాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులతోనూ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలతో ఒక కమిటీ వేసి ఆ నివేదికను చాలావరకు అమలు చేసింది. ఆ క్రమంలోనే జీవో 29 (మే 2017) వచ్చింది. బడుల మూసివేత మీద వ్యతిరేకత వస్తే జీవో 29కి సవరణగా, జీవో 42 వచ్చింది. ఆ ప్రభుత్వ ఆదేశాలు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యలకు మంచి స్టాఫ్ పాటర్న్ ఇచ్చాయి. అయితే సుమారు నాలుగువేల ప్రాథమిక పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా ప్రకటించడం తప్ప, ముప్పైవేల ప్రాథమిక పాఠశాలలకు పెద్దగా ప్రయోజనం చేకూర్చలేదు. ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కేటాయింపు విషయమై విద్యాహక్కు చట్టం పరిమితులకు మించి ఒక్క పోస్టు కూడా ఇవ్వడానికి ముందుకు రాకపోవడం వల్ల ప్రాథమిక విద్య దుస్థితి ఆనాటి నుంచి ఈనాటి వరకు అలాగే కొనసాగింది.


6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అమ్మాయిలతో పాటు, అబ్బాయిలకు కూడా సైకిళ్ళు ఇవ్వడం చాలా అవసరం. పాఠశాల విద్యలో ఏ సంస్కరణ అయినా 2021/22 నాటి 84, 85, 117 జీవోల రద్దుతో, 2017 నాటి 29, 42జీవోల పునరుద్ధరణతో ప్రారంభం కావాలి. 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు తరలించకుండా ప్రాథమిక పాఠశాలల్లో నమోదు తక్కువ ఉందన్న పేరున వాటిని మూసివేస్తే అది మరింత విధ్వంసంగా ఉంటుంది. 16,347 ఉపాధ్యాయ పోస్టుల కొరకు ఇప్పటికే టెట్ క్వాలిఫై చేసిన విద్యార్థులకు డీఎస్సీ నిర్వహించడంతోపాటు, ముందు వెనుకలుగానైనా మెగా డీఎస్సీ వేసి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయాలి.

ఇక బోధనా మాధ్యమం విషయానికి వస్తే ఆంగ్లం అవసరమే. అయితే ఆంగ్ల మాధ్యమం ద్వారా ఆంగ్లం రాదు, ఇన్నాళ్ళుగా రాలేదు. విద్యార్థుల నమోదు 40 దాటిన ప్రాథమిక పాఠశాలల్లో 'బాలల విద్యాహక్కు చట్టం–2009'కి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం ఆంగ్ల భాషా బోధనకు ఒక పోస్టు ఇవ్వాలి. అందుకై ప్రత్యేక అర్హతలు, శిక్షణ గల ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలి. బాలలకు ఆంగ్లం నేర్పించడానికి అదొక్కటే మార్గం. ఒకటవ తరగతి నుంచి ఆంగ్లాన్ని ఒక సబ్జెక్టుగా బోధిస్తూ విద్యాహక్కు చట్టంలో నిర్దేశించినట్లు కనీసం 8వ తరగతి వరకైనా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మాతృభాషా మాధ్యమంలో బోధన జరిగేలా నిబంధనలు రూపొందించి అమలు చేయాలి.

గత ప్రభుత్వం ప్రతి సంవత్సరం 8వ తరగతికి చేరిన బాలబాలికలకు ట్యాబ్స్ ఇచ్చింది. అయితే వీటి దురుపయోగమే ఎక్కువ జరిగింది. ఇక సీబీఎస్ఈ సిలబస్ చాలా పెద్ద సమస్య. నాలుగు సంవత్సరాల క్రితం వరకు మన రాష్ట్ర సిలబస్సే అత్యధిక ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో అమలయింది. అది బాగా ఉండింది కూడా. అది 2011 రాష్ట్ర పాఠ్య ప్రణాళిక చట్రంపై ఆధారపడి రూపొందించిన సిలబస్. దానిని ఎటువంటి చర్చ లేకుండా 2020–21 విద్యా సంవత్సరం నుంచి మార్చడం ప్రారంభించారు. సీబీఎస్ఈ సిలబస్‌ను ప్రవేశపెట్టడమే కాక, ప్రతి విషయాన్ని గుడ్డిగా అనుసరించారు. సీబీఎస్ఈ ఈ మధ్య కాలంలో చరిత్రను పురాణంగా, పురాణాలను చరిత్రగా మారుస్తున్నది. దానికి తోడు సీబీఎస్ఈ సిలబస్‌లో సైన్స్, గణితం బలహీనంగా ఉంటాయి. దీనిని అనుసరించి రాష్ట్ర పాఠ్య పుస్తకాలను దిగజార్చారు. ప్రైవేటు పాఠశాలల్లో ఐఐటీ ఓరియెంటేషన్ పేరుతో అదనపు సిలబస్ ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లో అది సాధ్యం కాదు. మొత్తంగా ఫలితం ఏమంటే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే దళిత, బహుజన, మైనారిటీ బాలబాలికలకు ఐఐటీ సీట్లు రావడం ఇక కల్ల. ఐఐటీ సీట్లు రావడం పాఠశాల విద్యకు పరమావధి కాకూడదు. కాని ఏది పరమావధి అనే విషయం నిర్ణయించేది విద్యావ్యాపారం. పాఠశాల విద్యలో విద్యావ్యాపారాన్ని రద్దుచేసి కొఠారి కమిషన్ చెప్పిన ఉమ్మడి బడి విధానాన్ని ప్రవేశపెట్టి శాస్త్రీయ, లౌకిక, ప్రజాతంత్ర విద్యావిధానం అమలుచేయడం అన్ని సమస్యలకు పరిష్కారం.

■ డి. రమేష్ పట్నాయక్
కన్వీనర్, ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ





బిగుస్తున్న ఉచ్చు

ఉమ్మడి కృష్ణాజిల్లా వైసీపీ నేతల చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. అధికారం చేతిలో ఉందన్న అంధకారంతో ఇష్టానుసారంగా వ్యవహరించిన నాటి నాయకుల పని పట్టేందుకు టీడీపీ ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఇప్పటికే అగ్రిగోల్డ్ భూముల కబ్జా కేసులో మాజీమంత్రి జోగి రమేశ్ తనయుడు రాజీవ్‌ను అరెస్టు చేయగా, చంద్రబాబు నివాసంపై దాడికి యత్నించిన ఘటనలో జోగి రమేశ్‌కు నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నారు. టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి కేసులోనే దేవినేని అవినాశ్‌కు బుధవారం పోలీసులు నోటీసులు జారీ చేయగా, మాజీమంత్రి, గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని కూడా లిస్టులో చేరారు. కేసినోకు వ్యతిరేకంగా నిజనిర్ధారణకు వచ్చిన టీడీపీ బృందంపై హత్యాయత్నానికి పాల్పడిన కొడాలి నాని, ఆయన అనుచరులపై కేసును తిరగదోడుతున్నారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, పట్టాభి ఇంటిపై దాడితో పాటు చెన్నుపాటి గాంధీ కన్ను పోడిచేసిన వైసీపీ నాయకుల చిట్టా కూడా లాగుతున్నారు. - (విజయవాడ-ఆంధ్రజ్యోతి)



మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి కేసులో దేవినేని అవినాశ్‌కు నోటీసులు (ఇన్‌సెట్‌లో) చంద్రబాబు ఇంటిపై దాడి సమయంలో పోలీసులతో జోగి వాగ్వాదం (ఫైల్)

వైసీపీ నాయకులకు వరుస నోటీసులు

అధికారం ఉందన్న అహంకారంతో నాడు ఎన్నో పాపాలు..

నేడు తిరగబడుతున్న కేసులు..

- ఇప్పటికే మాజీమంత్రి జోగి రమేశ్ కుమారుడు అరెస్టు
- నేడో రేపో జోగి రమేశ్ కూడా.., అవినాశ్‌కు నోటీసులు
- కొడాలి నాని కొంపముంచుతున్న కేసినో వ్యవహారం
- టీడీపీ నిజనిర్ధారణ కమిటీపై దాడి కేసు రీ ఓపెన్
- గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడిలో వంశీనే కీలకం
- ముందస్తు బెయిల్ కోసం పాట్లు

జోగి కుటుంబంలో వణుకు

2021, సెప్టెంబరులో చంద్రబాబు ఇంటిపై అప్పటి వైసీపీ ఎమ్మెల్యే జోగి రమేశ్, ఆయన అనుచరులు దాడి చేసేందుకు యత్నించారు. ఎన్‌ఎస్‌జీ భద్రతలో ఉన్న చంద్రబాబు ఇంటిపై దాడి చేయడాన్ని అప్పట్లోనే తీవ్రంగా పరిగణించారు. కానీ, అప్పటి వైసీపీ ప్రభుత్వం ఒత్తిళ్లతో ఈ కేసు నీరుగారి పోయింది. తాజాగా ఈ కేసుపై పోలీసులు దృష్టి సారించారు. జోగి రమేశ్‌కు నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నారు. విచారణకు జోగి సహకరించడం లేదని పోలీసులు చెబుతున్నారు. ఇదే కొనసాగితే ఆయన్ను అరెస్టు చేసే అవకాశం లేకపోలేదు. ఈ దాడి ఘటనలో జోగి రమేశ్ బినామీగా ప్రచారంలో ఉన్న బంటుమిల్లి మండల జెడ్పీటీసీ సభ్యురాలి భర్త మల్లిశెట్టి రాజబాబు ప్రధాన పాత్రధారి. ఈయన ప్రస్తుతం బంటుమిల్లి మండల వైసీపీ కన్వీనర్‌గా ఉన్నారు. ఈయన తన అనుచరులతో కలిసి పెద్ద ఎత్తున చంద్రబాబు ఇంటి వద్దకు కార్లలో వెళ్లి హడావిడి చేశారు. జోగి రమేశ్ మరో ముఖ్య అనుచరుడు మట్టా నాగబాబు కూడా చంద్రబాబు ఇంటిపై దాడిలో కీలకంగా వ్యవహరించారు. వీరిద్దరినీ కూడా పోలీసులు విచారణ చేసే అవకాశాలు ఉన్నాయి.

దేవినేని అవినాశ్‌కు నోటీసులు

టీడీపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి ఘటనలో దేవినేని అవినాశ్‌కు పోలీసులు నోటీసులు ఇచ్చారు. టీడీపీ నాయకుడు పట్టాభి ఇంటిపై దాడి ఘటనలోనూ అవినాశ్ ఆయన అనుచరులను విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతు న్నారు. టీడీపీ నగర నాయకుడు చెన్నుపాటి గాంధీపై దాడి ఘటనలో గద్దె కల్యాణ్, ఈశ్వరప్రసాద్ తదితరులను పోలీసులు అరెస్టు చేశారు.



గుడివాడలో టీడీపీ కార్యాలయంపై దాడికి యత్నిస్తున్న వైసీపీ నాయకులు (ఫైల్)

కొడాలి నానిని వెంటాడుతున్న కేసినో

గుడివాడలో 2022, జనవరిలో సంక్రాంతి సందర్భంగా భారీ ఎత్తున కేసినో నిర్వహించిన అప్పటి వైసీపీ ఎమ్మెల్యే కొడాలి నాని ఆ తర్వాత కేసినోపై నిజనిర్ధారణ చేసేందుకు వచ్చిన టీడీపీ నాయకులపై దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో కొడాలి నాని ప్రధాన సూత్రధారి కాగా, ఆయన అనుచరులు దుక్కిపాటి శశిభూషణ్, మెరుగుమాల కాళీ, మట్టా జాన్‌విక్టర్ తదితరులు కీలకంగా వ్యవహరించారు. టీడీపీ నిజనిర్ధారణ బృందంపై దాడి చేయాలన్న పక్కా ప్రణాళికతో వీరంతా కలిసి సుమారు 2 వేల మంది వైసీపీ కార్యకర్తలను కె కన్వెన్షన్‌లో సమావేశపరిచారు. ఈ దాడి ఘటనకు సంబంధించిన కేసును పోలీసులు పునర్విచారణ చేపడుతున్నారు. టీడీపీ నాయకుడు రావి వెంకటేశ్వరరావును చంపేస్తానని బెదిరించడమే కాకుండా, ఆ పార్టీ కార్యాలయం పైకి కత్తులు, కర్రలతో దూసుకెళ్లి, పెట్రోల్ ప్యాకెట్లు విసిరిన వైసీపీ నాయకుడు మెరుగుమాల కాళీ తదితరులపై హత్యాయత్నం సెక్షన్లు కాకుండా బెయిల్‌కు వీలైనట్టుగా కేసు పెట్టారు. ఈ కేసును తిరగదోడి కాళీపై హత్యాయత్నం కేసు నమోదు చేసేందుకు సిద్ధమయ్యారు.



గన్నవరంలో టీడీపీ ఆఫీసుపై దాడిలో వంశీనే పాత్రధారి

వల్లభనేని వంశీకి కేసుల భయం

గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీని కేసుల భయం వెంటాడుతోంది. ఆయన ప్రధాన అనుచరులు ఓలుపల్లి మోహనరంగా, భీమవరపు యేతేంద్ర రామకృష్ణ, ముల్పూరి ప్రభుకాంత్‌తో పాటు వంశీ పేరును కూడా పోలీసులు ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. వీరిలో ఇప్పటికే పలువురిని అరెస్టు చేసి జైలుకు పంపగా, మిగిలినవారు పరారీలో ఉన్నారు. వంశీ ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ దాడిలో వంశీ కీలకపాత్రధారిగా పోలీసులు చెబుతున్నారు. ఈ కేసుతో పాటు గన్నవరానికి చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసర్నేని రంగబాబుపై దాడి కేసును కూడా పోలీసులు పునర్విచారణ చేసేందుకు సిద్ధమవుతున్నారు. వాస్తవానికి ఈ కేసులో వంశీ కీలక పాత్రధారి అయినా అప్పట్లో పోలీసులపై ఒత్తిళ్లు తెచ్చి ముగ్గిరాల చిరంజీవి అనే దళితుడిని నిందితుడిగా చూపి తప్పించుకున్నారు.

విజయవాడ కార్పొరేషన్‌లో వైసీపీ ఆధిపత్యానికి గండి పడుతోంది. ఐదేళ్లుగా కార్పొరేషన్‌ను తమ గుప్పెట పట్టిన వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు వైఖరితో విసిగిపోయిన పలువురు కార్పొరేటర్లు కూటమి పార్టీల వైపు మొగ్గు చూపుతున్నారు. ఎంపీ కేశినేని చిన్ని ఆధ్వర్యంలో గురువారం ముగ్గురు కార్పొరేటర్లు టీడీపీ తీర్థం పుచ్చుకోగా, త్వరలో మరికొందరు వైసీపీకి గుడ్‌బై చెప్పడానికి సిద్ధమవుతున్నారు.

'కూ'టమివైపు..

విజయవాడ కార్పొరేషన్‌లో వైసీపీకి షాక్

- టీడీపీ కండువా కప్పుకొన్న ముగ్గురు కార్పొరేటర్లు
- త్వరలో జనసేనలోకి మరో ముగ్గురు.. బీజేపీవైపు ఇంకొకరు..
- మరో 12 మంది కార్పొరేటర్లు కూడా పక్కచూపులు
- కార్పొరేషన్‌లో ఇంకా వెలంపల్లి, మల్లాది ఆధిపత్యమే
- స్టాండింగ్ కమిటీ సమావేశాలపై వారిదే నిర్ణయం
- పదవులు పోయినా పెత్తనమేమిటంటూ కార్పొరేటర్ల ఆగ్రహం

టీడీపీలో చేరిన కార్పొరేటర్లతో ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బొండా ఉమా తదితరులు



(విజయవాడ-ఆంధ్రజ్యోతి/చిట్టినగర్) : వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు ఇంకా అధికారంలో ఉన్నామన్న దర్పాన్ని ప్రదర్శిస్తున్నారని సొంత పార్టీ నాయకులు, కార్పొరేటర్లు విమర్శిస్తున్నారు. దీనికి ప్రత్యక్ష నిదర్శనం గురువారం జరగాల్సిన స్టాండింగ్ కమిటీ సమావేశమే. ఈ మాజీల ఆదేశంతో స్టాండింగ్ కమిటీ సమావేశం అర్ధంతరంగా ఆగిపోయింది. ప్రజాసమస్యలపై సిద్ధం చేసిన అజెండా పక్కకు పోయింది. దీనంతటికీ ఆ ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలే కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం నుంచి బీజేపీ, విజయవాడ సెంట్రల్, తూర్పు నుంచి టీడీపీ గెలిచాయి. వీఎంసీలో మాత్రం అధికారపక్షంగా వైసీపీ ఉంది. నాడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇష్టానుసారంగా వ్యవహరించిన వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు వీఎంసీని అడ్డం పెట్టుకుని బాగానే సంపాదించారని, తమకు కనీస గౌరవం ఇవ్వలేదని అప్పట్లోనే వైసీపీ కార్పొరేటర్లు బహిరంగంగా విమర్శించారు.

ఆ ఇద్దరి పద్ధతితో విసిగిపోయి..

వైసీపీ హయాంలో కార్పొరేటర్లు నామమాత్రంగా విగిలారు. కౌన్సిల్ సమావేశాలతో పాటు స్టాండింగ్ కమిటీ ఎప్పుడు నిర్వహించాలో, అజెండాలో ఏ అంశాలను ఆమోదించాలో కూడా వెలంపల్లి, మల్లాదే నిర్ణయించేవారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు అధికారంలో లేకపోయినప్పటికీ ఆ ఇద్దరు మాజీలు వీఎంసీపై ఆధిపత్యం చెలాయిస్తూనే ఉన్నారు. నగరంలో ఎటువంటి అభివృద్ధి పనులు జరిగినా, ఏ టెండర్ పిలిచినా తమతో మాట్లాడిన తర్వాతే ఆమోదించాలని వైసీపీ స్టాండింగ్ కమిటీ సభ్యులతో పాటు మేయర్‌కు వీరు ఆదేశాలిచ్చినట్లు సమాచారం. తమకు తెలియకుండా అంశాలను అప్పటికప్పుడు అజెండాలో పెట్టి ఓకే.. చేస్తే కుదరదని గట్టిగా చెప్పినట్లు తెలుస్తోంది. విజయవాడ పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాల్లో ఎటువంటి అభివృద్ధి పనులు జరిగినా వాటికి సంబంధించిన ఫైల్ తమకు చేరాల్సిందేనని, తాము ఓకే.. అన్నాకే ఫైల్ ముందుకు పంపించాలని కొంతమంది ఇంజనీరింగ్ అధికారులకు కార్పొరేటర్లతో కబురు పంపించినట్లు సమాచారం. ఈ తీరుపై స్టాండింగ్ కమిటీలో సభ్యులుగా ఉన్న కార్పొరేటర్లు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. తమతో కలిసొచ్చే కార్పొరేటర్లను కలుపుకొని కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు.

ఇప్పటికే 8 మంది రెడీ.. త్వరలో మరో 12 మంది..

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 64 మంది కార్పొరేటర్లు ఉండగా, వారిలో వైసీపీకి చెందినవారు 49 మంది. టీడీపీకి 14, సీపీఎంకు ఒకరు ఉన్నారు. టీడీపీకి చెందిన మైలవరపు మాధురి లావణ్య గెలిచిన వెంటనే వైసీపీ పంచన చేరారు. మరో టీడీపీ కార్పొరేటర్ కేశినేని శ్వేత రాజీనామా చేశారు. తాజాగా మాధురి లావణ్య సొంతగూటికి తిరిగి వచ్చారు. ఆమెతో పాటు మైలవరపు రత్నకుమారి, అబ్దుల్ అర్షద్ గురువారం టీడీపీ కండువా కప్పుకొన్నారు. ఆగస్టు మొదటి వారంలో సుమారు 8 మంది కార్పొరేటర్లు విజయవాడ పశ్చిమ బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరిని కలిశారు. వారిలో ముగ్గురు గురువారం టీడీపీ పంచన చేరగా, మరో ఐదుగురు జనసేన, బీజేపీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. గతంలో సుజనాను కలిసిన మహదేవు అప్పాజీ, అత్తులూరి ఆదిలక్ష్మి, మరుపిళ్ల రాజేశ్ జనసేనలో చేరనున్నారు. గుడివాడ నరేంద్ర రాఘవ బీజేపీలో చేరనున్నారు. వీరుకాకుండా మరో 12 మంది వైసీపీ నుంచి కూటమి పార్టీల్లో చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. దీంతో వీఎంసీలో వైసీపీ బలం 20కు పడిపోనుంది. కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ బలం 32కు చేరనుంది.

అయితే, మేయర్ సీటును కూటమి దక్కించుకోవాలంటే ప్రస్తుత వైసీపీ మేయర్ రాయన భాగ్యలక్ష్మిపై అవిశ్వాసం పెట్టాల్సి ఉంటుంది. అది 2025 మార్చి తర్వాతే సాధ్యమవుతుంది



జోరువాన

మండుటెండ, ఉక్కపోతతో అల్లాడిపోతున్న నగరవాసులకు ఉపశమనం కలిగిస్తూ గురువారం రాత్రి జోరువాన కురిసింది. కొద్దిసేపే అయినా భారీగా వర్షం కురవడంతో ప్రధాన రహదారులు జలమయమయ్యాయి.

ప్రాణం తీసిన సెల్ఫీ

పాతపాడు చెరువులో ఒకరు మృతి.. మరొకరు గల్లంతు

- మద్యం మత్తులో దిగిన ఐదుగురు
- ముగ్గురు క్షేమంగా బయటకు..
- చెరువులో క్యాట్ ఫిష్ పెంపకం
- సహాయక చర్యలకు విఘాతం

విజయవాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఒకేచోట పనిచేయడంతో వారి మధ్య స్నేహబంధం ఏర్పడింది. మందు, విందు చేసుకునే స్థాయికి వెళ్లింది. ఆ మద్యం మత్తులో చేసిన చేష్టలు ఇద్దరిని నీట ముంచేశాయి. విజయవాడ రూరల్ మండలం పాతపాడు గ్రామంలోని చేపల చెరువులో పడి గురువారం రాత్రి ఒకరు మృతిచెందగా, మరొకరు గల్లంతయ్యారు. రాజీవ్‌నగర్‌కు చెందిన పెరుగు నాగార్జున, పెరుగు నవీన్, షేక్ లాల్‌బాషా, పిల్లి శివరాజు (23), రాణిగారితోటకు చెందిన రవికుమార్ (21) నగరంలోని ఓ ఎలక్ట్రానిక్స్ షోరూంలో పనిచేస్తున్నారు. ఈ ఐదుగురు కలిసి గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విజయవాడ రూరల్ మండలం కండ్రికలో మందు పార్టీ చేసుకున్నారు. అక్కడి నుంచి పాతపాడు-మంగళాపురం గ్రామాల మధ్యలో ఉన్న చెరువు వద్దకు వెళ్లారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న వాచ్‌మెన్ పౌల్‌తో కలిసి మళ్లీ మద్యం తాగారు. తర్వాత చికెన్ వండుకుని తిన్నారు. ఐదారు ఎకరాల్లో ఉండే ఈ చెరువులో ఓ ప్రైవేట్ వ్యక్తి క్యాట్ ఫిష్‌ను పెంచుతున్నాడు. వాటికి మేత వేయడానికి చిన్న ఇనుప పడవ చెరువు గట్టు వద్ద ఉంచారు. మద్యం మత్తులో ఉన్న ఈ ఐదుగురు యువకులు పడవలో చెరువు మధ్యకు వెళ్లి సెల్ఫీ తీసుకోవాలనుకున్నారు. పడవ ఎక్కి కొంతదూరం వెళ్లేసరికి అటూఇటూ ఊగడంతో అంతా ఒకవైపునకు వచ్చారు. దీంతో పడవ బోల్తా పడింది. నాగార్జున, నవీన్, లాల్‌బాషా ఈదుకుని ఒడ్డుకు చేరుకున్నారు. శివరాజు, రవికుమార్ మాత్రం నీళ్లలో మునిగిపోయారు. మిగతా 6వ పేజీలో...

నేడే గ్రామ సభలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం జిల్లావ్యాప్తంగా శుక్రవారం గ్రామసభలు జరగనున్నాయి. ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై నిర్వహించే ఈ సభలకు సర్వం సిద్ధం చేశారు. గ్రామాల్లో మంచినీటి కుళాయిలు, మరుగుదొడ్లు, మంచినీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచటం, డ్రెయినేజీ వ్యవస్థ, అంతర్గత రహదారులు, ఇతర గ్రామాలకు, పట్టణాలకు అనుసంధాన రహదారులు, వ్యర్థాల నిర్వహణ తదితరాలపై స్థానికులతో, అధికారులతో చర్చించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సిందిగా కలెక్టర్ సృజన స్పెషల్ ఆఫీసర్లకు నిర్దేశించారు. అలాగే, ఉపాధి హామీ పథకం కింద ఏమేం పనులు చేయవచ్చో నిర్ణయించాలన్నారు.

బలవంతపు బదిలీలు

- రిజిస్ట్రేషన్స్ శాఖలో ఉన్నతాధికారుల నుంచి మెసేజ్‌లు
- రెండు జిల్లాల్లోని సబ్ రిజిస్ట్రార్లకు బదిలీ రిక్వెస్టు ఫాంలు
- అన్ని వివరాలు పూర్తిచేసి పంపాలని హుకుం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రిజిస్ట్రేషన్ శాఖలో బలవంతపు బదిలీల వ్యవహారం వివాదాస్పదమవుతోంది. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలకు భిన్నంగా కొందరు ఇంటి దొంగలు ఈ స్కెచ్ వేశారు. ఉద్యోగులకు వెసులుబాటు కల్పించేలా ప్రభుత్వం బదిలీలకు ఆదేశాలిస్తే, ఉన్నతాధికారులు మాత్రం బలవంతంగా రిక్వెస్ట్ ఫాంలను తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లందరికీ బుధవారం బలవంతపు బదిలీలకు సంబంధించిన రిక్వెస్టుల మెసేజ్‌లు వచ్చాయి. తాము చేస్తున్నది తప్పుడు పని కాబట్టి దొరికిపోకుండా ఉండేందుకు వీలుగా ప్రైవేట్ వేదికలను ఏర్పాటు చేశారు. ఈ ఆదేశాలను కూడా ఫలానా అధికారి ఇస్తున్నట్టుగా లేకుండా జాగ్రత్తపడ్డారు. ప్రైవేటుగా మెసేజ్‌లు పంపుతూ రిక్వెస్ట్ ఫాంలను జిల్లావ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్లు అందరికీ పంపారు. అయితే, సబ్ రిజిస్ట్రార్లకు పంపిన రిక్వెస్ట్ ఫాంలో సబ్ మిటెడ్ టు అనే దగ్గర డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, గుంటూరు/బాపట్ల/పల్నాడు అని ఉంది. అంటే.. ఈ ప్రైవేట్ రిక్వెస్ట్ ఫాంను అక్కడ రూపొందించారని అర్థమవుతోంది. అదే ఫాంను జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్లకు కూడా పంపారు. ఈ ఫాంలో ఉద్యోగి పేరు, హోదా, ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతం, పనిచేస్తున్న చోట ఎంతకాలం సర్వీసు పూర్తిచేసుకున్నారు.. వంటి వివరాలతో పాటు ఐదో అంశంగా ప్రిఫరెన్షియల్ కేటగిరీ పేరుతో ఆరు ఆప్షన్లలో ఏదైనా ఉంటే మెన్షన్ చేయాలని సూచించారు. అలాగే, బదిలీ ఎక్కడికి కోరుకుంటున్నారో మూడు ఆప్షన్లు ఇవ్వాల్సిందిగా నిర్దేశించారు. గురువారం మధ్యాహ్నం 11 గంటలకల్లా ఫాం పంపించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆదేశాలు పాటించకుండా..

ప్రభుత్వ ఆదేశాలను పాటించకుండా బలవంతపు రిక్వెస్టులు పంపడాన్ని సబ్ రిజిస్ట్రార్లు వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ఒకేచోట ఐదేళ్లు పూర్తి చేసుకుని ఉంటే బదిలీ చేయాలి, రిక్వెస్టు బదిలీలు పెట్టుకునే వారికి అవకాశం కల్పించాలి. ఈ అంశాలను పాటించాల్సిన ఉన్నతాధికారులు అందరితో బలవంతంగా రిక్వెస్టులు తీసుకోవటం ఏమిటనే ప్రశ్నలు వస్తున్నాయి. అలాగే, ఆప్షన్-5లో ఆరు అంశాలు చేర్చారు. వినికిడిలోపం, మానసిక వైకల్యం కలిగిన పిల్లలు, గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లు పనిచేశారా?, ఉద్యోగులు 40 శాతం వైకల్యం కలిగి ఉన్నారా? మెడికల్ గ్రౌండ్స్‌లో బదిలీలను కోరుకుంటున్నారా? కారుణ్య నియామకాల్లో వితంతు మహిళలు ఉన్నారా? అనే ఆప్షన్లు కోరారు. అసోసియేషన్‌లో ఆఫీసు బేరర్‌గా ఉంటే.. ప్రూఫ్ కాపీ జత పరచాలన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. బలవంతపు రిక్వెస్టులు ఎందుకు పెట్టిస్తున్నారో అర్థం కాని ప్రశ్నగా మారింది.

నేటి నుంచే.. ఇసుక ప్రత్యేక కేంద్రాలు

- ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బుకింగ్ సౌకర్యం
- ఇన్వాయిస్ లేని వాహనాలకు స్టాక్ పాయింట్ల వద్ద అనుమతి లేదు
- కలెక్టర్ సృజన వెల్లడి

దళిత మహిళా ఎమ్మెల్యేపై మీమ్స్

- అట్రాసిటీ కేసు నమోదు చేసిన పోలీసులు

6లో..



ఇబ్రహీంపట్నం లే అవుట్‌ను పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే వసంత

అర్హులైన పేదలందరికీ పక్కా గృహాలు

» మంత్రి పార్థసారథి

ఇబ్రహీంపట్నం/జి.కొండూరు, ఆగస్టు 22 : 2029 నాటికి రాష్ట్రంలో ఇల్లు లేని పేదవాడు ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు పోతున్నదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా గృహాలు మంజూరు చేసి నిర్మిస్తామని ఏపీ గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్‌తో కలిసి ఆయన ఇబ్రహీంపట్నం, కొండపల్లి, జి.కొండూరు, మైలవరం పూరగుట్ట లే అవుట్‌లను గురువారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వచ్చే ఏడాది మార్చి నాటికి 1.25 లక్షల పక్కా గృహాల నిర్మాణమే ప్రధాన లక్ష్యమన్నారు. మౌలిక వసతుల కల్పనకు అమృత్, ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్, జె.జె.ఎం పథకాలను అమలు చేస్తామన్నారు. గత ప్రభుత్వం చేసిన అవకతవకల వల్ల ఆర్థిక క్రమశిక్షణ ఉల్లంఘన కారణంగా గృహ నిర్మాణశాఖలో పురోగతి కుంటుపడిందన్నారు. వచ్చే ఏడాది పూర్తి నాటికి ఏడు లక్షల గృహాల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, పూరగుట్టలో బోర్లు, రహదారుల అభివృద్ధి, జంగిల్ క్లీయరెన్స్ తదితర మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. పక్కా గృహాలు మంజూరైన వారు మార్చి లోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలన్నారు. లేకుంటే వారికి భవిష్యత్‌లో పక్కా గృహాలు మంజూరు కావన్నారు. స్థానిక సమస్యలపై స్పందించిన మంత్రి పార్థసారథికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో జంపాల సీతారామయ్య, అక్కల రామ్మోహన్‌రావు (గాంధీ), ఉయ్యూరు వెంకట నరసింహారావు, పంటాపంచల నరసింహారావు, పజ్జూరు రవికుమార్, నెల్లూరు శ్రీనివాసరావు, పాటిబండ్ల మధుసూదనరావు, నూతక్కి అపర్ణ, నూతక్కి రాజరావు, సుకవాసి శ్రీహరి, మన్నం వెంకట్రావ్, ఈమని మురళీకృష్ణ, చల్లగుండ్ల అజయ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుల నగదు కొట్టేసిన ఐదుగురు పోలీసులపై వేటు

నందిగామ/నందిగామరూరల్ ఆగస్టు 22 : రైతుల నుంచి నగదు చోరీ చేసిన వ్యక్తి నుంచి ఆ సొమ్ము కొట్టేసిన ఐదుగురు పోలీసులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఏసీపీ రవికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన కొందరు రైతులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మిర్చి విక్రయించి రూ. 25 లక్షల నగదుతో ఇంటికి వస్తున్నారు. మిర్చి బస్తాలు తీసుకువెళ్లిన లారీలోనే తిరిగి వస్తుండగా క్లీనర్ పల్లెపోగు కోటేశ్వరరావు డబ్బుతో పరారయ్యాడు. సొమ్ముతో ఆటోలో నందిగామ వైపు వస్తుండగా, బుధవారం రాత్రి చెక్‌పోస్టు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడితో సహా రూ.18.95 లక్షల సొమ్మును స్టేషన్‌లో అప్పగించారు. సమాచారం తెలుసుకున్న బాధిత రైతులు స్టేషన్‌కు చేరుకొని తమ నుంచి నిందితుడు రూ.25 లక్షలు చోరీ చేశాడని ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ లచ్చునాయుడు, ఎస్‌ఐ పండుదొరలు విచారణ జరపగా, రూ. 6లక్షలు పోలీసు సిబ్బంది కొట్టేసినట్టు నిర్ధారణకు వచ్చారు. దీంతో ఉన్నతాధికారులు బాధ్యులైన ఏఎస్‌ఐ బి.రుద్రరాజు, హెడ్ కానిస్టేబుల్ కె.నాగరాజు, కానిస్టేబుల్ కె.నాగబాబు, సివిల్ పోలీసులు శివ, సృజన్‌ను సస్పెండ్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఏసీపీ రవి కుమార్ తెలిపారు.



నిందితులు షేక్ కరీముల్లా, సాహిలను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

దళిత మహిళా ఎమ్మెల్యేపై మీమ్స్

» ఎన్నికలకు ముందు ఓసారి.. ఇటీవల మళ్లీ సోషల్ మీడియాలో ట్రోల్

» అట్రాసిటీ కేసు నమోదు చేసిన పోలీసులు

నందిగామ, ఆగస్టు 22 : వైసీపీ నాయకులు అవమానకరమైన మీమ్ తనపై ప్రదర్శించి తనను అవమానించి మానసిక వేదనకు గురి చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య స్థానిక పోలీసులను కోరారు. శుక్రవారం ఆమె తన ఫిర్యాదును తన సోదరుడి ద్వారా నందిగామ స్టేషన్‌లో అందజేశారు. ఈ ఏడాది జనవరి నెలలో జగనన్న వాక్‌వే ప్రారంభం సందర్భంగా పట్టణానికి చెందిన వైసీపీ నాయకులు షేక్ కరీముల్లా(దుబాయ్), ఆయన కుమారుడు షేక్ సాహిలు తనపై అవమానకర మీమ్స్ ప్రదర్శించారని ఆరోపించారు. పెద్దఎత్తున ప్రజలు, మంత్రులు, శాసన సభ్యుల సమక్షంలో తనను పిచ్చిదానిగా అభివర్ణిస్తూ మీమ్స్‌ను పెద్ద స్క్రీన్‌లపై ప్రదర్శించారని పేర్కొన్నారు. సదరు మీమ్స్‌ను తప్పుడు ఫేస్‌బుక్ అకౌంట్‌ల నుంచి ప్రసారం చేసి తనను అవమానించారని పేర్కొన్నారు. దళిత మహిళనైన తనపట్ల అసభ్య, అభ్యంతరకర పోస్టులు పెట్టి వేధించారని తెలిపారు. సదరు మీమ్స్ వల్ల తీవ్ర మనోవేదన చెందానని ఫిర్యాదులో పేర్కొన్నారు. తిరిగి మరలా వారం రోజుల నుంచి అదే మీమ్స్‌ను సోషల్ మీడియా ద్వారా ప్రసారం చేస్తూ తనను, తన సోదరిని అవమానిస్తున్నారని తెలిపారు. తాము మానసిక క్షోభను అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మనస్థాపం చెందిన తన సోదరుడు వారిని నిలదీయగా, కులం పేరుతో దూషిస్తూ అవమానించినట్టు చెప్పారు. దళిత కుటుంబానికి చెందిన మా పట్ల కరీముల్లా, అతని కుమారుడు వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరంగా ఉందన్నారు. వారిపైనా, వారికి సహకరిస్తున్న వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను అనారోగ్యంతో బాధపడుతున్నందున ఫిర్యాదును సోదరుడు తంగిరాల శ్రావణ్ ద్వారా పంపుతున్నట్టు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు కరీముల్లా, అతని కుమారుడిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు సీఐ లచ్చునాయుడు తెలిపారు.



చిరంజీవి జన్మదిన వేడుక సభలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని

నా విజయంలో 'మెగా' అభిమానులూ కీలకమే

» ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

విద్యాధరపురం, ఆగస్టు 22 : ఇటీవల జరిగిన ఎన్నికల్లో తన విజయానికి మెగా స్టార్ చిరంజీవి అభిమానులు కీలక పాత్ర పోషించారని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. కుమ్మరిపాలెం సెంటర్‌లో గురువారం మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిరంజీవి యువత ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. కేక్ కట్ చేసిన అనంతరం ఎంపీ మాట్లాడుతూ, చిరంజీవి నుంచి, నేర్చుకోవాల్సింది ఎంతో ఉందన్నారు. ఆయనకు తెలుగు రాష్ట్రాలలో వీరాభిమానులున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ నాయకత్వంలో అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. జనసేన నేత అమ్మిశెట్టి వాసు, టీడీపీ నేత బొమ్మసాని సుబ్బారావులకు ధన్యవాదాలు తెలిపారు. చిరంజీవి యువత నాయకుడు రేలంగి బుజ్జి, అఖిలభారత చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు కృష్ణ ప్రసాద్, శ్యాంప్రసాద్, కె.శివశర్మ పైడి శ్రీను బొమ్మసాని సుబ్బారావు పాల్గొన్నారు.

పాత పంచదార పంపిణీకి ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పాత పంచదారను పేదలకు పంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. 'పంచదార పంచుతారా' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనంపై ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. తూకంలో తేడాలుండటంతో ఆ పంచదార పంపిణీని నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ జరపమని తూనికల కొలతల శాఖకు గతంలోనే ఆదేశించారు. తేడాలున్న విషయాన్ని గుర్తించిన ఆ శాఖ ప్రభుత్వానికి నివేదిక కూడా అందించింది. ఈ క్రమంలో ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో ప్రభుత్వం స్పందించింది. పాత పంచదార పాడవకుండా కార్డుదారులకు అందించాలని గురువారం ఆదేశాలిచ్చింది.

మంచంపట్టిన పల్లెలు!

» గ్రామాల్లో పెరుగుతోన్న జ్వర పీడితులు

» కీళ్లనొప్పులు, రక్త కణాల తగ్గుదలతో బాధితుల్లో భయాందోళన

» గ్రామాల్లో అధ్వానంగా పారిశుధ్యం

» ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలంటున్న ప్రజలు



మైలవరం, పొందుగలలో జ్వర బాధితులు, చంద్రగూడెంలో రోడ్డుపైనే మురుగునీరు

మైలవరంరూరల్, ఆగస్టు 22 : మండలంలోని పలు గ్రామాలు మంచాన పడ్డాయి. వర్షాకాలం, వాతావరణంలో మార్పులు కారణంగా అంతుచిక్కని వైరస్‌తో జ్వరాల బారినపడుతున్న



పొందుగలలో మురుగునీటి చెంతనే.. తాగునీరు

వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. గత వారంరోజుల నుంచి మండలంలో పరిస్థితి దారుణంగా తయారైంది. ప్రజలు జ్వరం బారినపడి మంచం దిగలేని స్థితిలో ఉంటున్నారు. మండలంలోని పుల్లూరు, మొర్సుమిల్లి, గణపవరం, పోరాట నగర్ తండా, కీర్తిరాయునిగూడెం, చంద్రాల, చంద్రగూడెం, పొందుగల, అనంతవరం తదితర గ్రామాల్లో జ్వర బాధితులు అధికంగా ఉన్నట్టు సమాచారం. కుటుంబంలో ఒకరికి జ్వరం వస్తే చాలు రెండు మూడు రోజులకే కుటుంబం మొత్తాన్ని చుట్టేస్తున్నది. జ్వరం సోకిన వారిలో కీళ్లనొప్పులు, రక్తకణాలు తగ్గిపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి.

నిమ్మకు నీరెత్తిన వైద్య, ఆరోగ్యశాఖ

మైలవరం మండలంలో జ్వరాలు ప్రబలి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభం అయినప్పటి నుంచి గ్రామాల్లో దోమల నివారణకు అధికారుల చర్యలు శూన్యం. రెండు నెలల నుంచి కేవలం ఒక్కసారి మాత్రమే డ్రెయినేజీలో పూడికతీత, బ్లీచింగ్ చల్లడం, మలాథీన్ స్ప్రే వంటి పనులు చేశారు. జ్వరాల తీవ్రతను బట్టి వారానికోసారి పారిశుధ్య



పొందుగల ప్రభుత్వ పాలకేంద్రం వద్ద దోమలతో కూడిన మురుగునీరు

చర్యలు చేపట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా గ్రామాల్లో జ్వరపీడితులను గుర్తించేందుకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఇంటింటి సర్వే చేయడంతో పాటు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారు. కేవలం రెండు మూడు గ్రామాల్లో మాత్రమే శిబిరాలు ఏర్పాటు చేసి మమ అనిపించారు. జ్వరపీడితులు ప్రైవేట్ వైద్యశాలలకు క్యూ కడుతున్నారనే సమాచారం ఉన్న అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి జ్వరపీడితులు మైలవరంలోని ఆర్ఎంపీ వైద్యుల వద్ద బారులుతీరుతున్నారు. జ్వరాలతో ఇబ్బందులు పడుతున్న వారిలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారే అధికంగా ఉండటంతో వైద్య ఖర్చులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీజనల్ వ్యాధులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా అంతుచిక్కని వైరస్‌తో జ్వరం బారినపడి నానా పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా విషజ్వరాలపై సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలతో పాటు గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించాలని జ్వరపీడితులు కోరుతున్నారు.

మరో ఉద్ధానంలా

ఎన్టీఆర్ జిల్లా మండలాలు

» సీపీఎం నేతలు బాబూరావు, డీవీ కృష్ణ

గవర్నర్‌పేట, ఆగస్టు 22 : ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు, గంపలగూడెం, తిరువూరు, విసన్నపేట, మైలవరం తదితర మండలాల పరిధిలోని చాలా గ్రామాల్లో కిడ్నీ వ్యాధితో వందల మంది పిట్టల్లా రాలిపోతూ మరో ఉద్ధానంలా తయారైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ముఖ్యమంత్రి అఖిలపక్ష కమిటీ సమావేశం ఏర్పాటు చేసి, సమగ్రంగా చర్చించి, శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం శ్రీశ్రీ భవన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, ఇతర నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శుద్ధి చేసిన కృష్ణా నీటిని కుళాయిల ద్వారా ఇంటింటికీ అందించాలని, కిడ్నీ బాధితులకు ప్రతి నెలా రూ. 5 వేలు పెన్షన్ ఇవ్వాలని, కిడ్నీ ఆసుపత్రిని వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 24న మండల కేంద్రమైన ఎ.కొండూరులో ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎ.కొండూరు, గంపలగూడెం మండల పరిధిలోని అనేక గ్రామాల్లో ప్రజారోగ్యం క్షీణిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్ధానం తరువాత అత్యధిక మంది కిడ్నీ వ్యాధితో మృతి చెందిన వారు ఎ.కొండూరు మండలంలోనే ఉన్నారని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ మాట్లాడుతూ, తమ బృందాలు ఆయా ప్రాంతాల్లో గత వారంరోజుల పాటు పర్యటించి తాజా పరిస్థితులపై అధ్యయనం చేయడం జరిగిందని తెలిపారు. కిడ్నీ బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ప్రాణం తీసిన సెల్ఫీ

(5వ పేజీ తరువాయి)



కొంతసేపటికి రవికుమార్ మృతదేహం కనిపించింది. శివరాజు ఆచూకీ మాత్రం లభించలేదు. సమాచారం తెలిసిన వెంటనే నున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. డీసీపీ హరికృష్ణ, ఏసీపీ రాజారావు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. చీకటి పడటంతో గాలింపు చర్యలకు అంతరాయం కలిగింది. నీటిలో క్యాట్ ఫిష్ ఉండటంతో సహాయక చర్యలకు విఘాతం ఏర్పడింది. మునిగిన వారిని ఎలాగైనా పైకి తీసుకురావడానికి గాలింపును కొనసాగిస్తున్నారు. పంచాయతీ సిబ్బందితో మాట్లాడి లైట్లు ఏర్పాటు చేయించారు. జక్కంపూడి కాలనీకి చెందిన ఐదుగురు మత్స్యకారులను చెరువులోకి దింపడానికి ఏర్పాట్లు చేశారు. రాత్రి కావడంతో వారిని నీళ్ల లోతుకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక, ఆగస్టు 22 : జిల్లా పరిధిలోని వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జేసీ నిధి మీనాతో కలిసి జాతీయ రహదారులు రైల్వేలకు సంబంధించి వివిధ ప్రాజెక్టులకు భూ సేకరణ ప్రక్రియపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎన్‌హెచ్-165



జీ-గ్రీన్‌ఫీల్డ్ అలైన్‌మెంట్, ఎన్‌హెచ్ఏఐ-216 హెచ్(పెడన-విసన్నపేట), ఎన్‌హెచ్-16 (బెంజిసర్కిల్ సర్వీసురోడ్డు), ఎన్‌హెచ్-65 (నందిగామ-కంచికచర్ల బైపాస్), ఎన్‌హెచ్-221 (విజయవాడ-భద్రాచలం), ఎన్‌హెచ్-65 (విజయవాడ-హైదరాబాద్ సెక్షన్)లకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియపై ఆమె చర్చించారు. భూ సేకరణ విస్తీర్ణం, అవార్డు పాస్ వివరాలతో పాటు ప్రస్తుతం ప్రక్రియ ఏ దశలో వుందనే వివరాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల ఆర్డీవోలు, తహసీల్దార్లతో చర్చించారు. గడువులోగా ప్రక్రియను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా రైల్వేలో బిజీ లైన్లు, ఆర్ఓబీలు, డబ్లింగ్ పనులు తదితరాలకు సంబంధించి భూ సేకరణకు ఇప్పటివరకు వచ్చిన అభ్యర్థనలు, రావాల్సిన వాటిపైనా సమావేశంలో చర్చించారు. సేకరణ ప్రక్రియను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవోలు బీహెచ్ భవానీశంకర్, ఎ.రవీంద్రరావు, కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్, ఎన్‌హెచ్ఏఐ, రైల్వే అధికారులు, సంబంధిత తహసీల్దార్లు తదితరులు హాజరయ్యారు.

అమ్మకు గుర్తుగా.. ఒక మొక్క

» 'ఏక్ పెడ్ మా కే నామ్' నినాదంతో పర్యావరణాన్ని రక్షిద్దాం

కృష్ణలంక, ఆగస్టు 22 : మానవాళి మనుగడకు పర్యావరణ పరిరక్షణ ఏకైక మార్గమని తల్లిపై వున్న ప్రేమ, గౌరవానికి స్ఫూర్తిగా 'ఏక్ పెడ్ మా కే నామ్' నినాదంతో ప్రతి ఒక్కరూ మొక్కను నాటి సంరక్షించడం ద్వారా కాలుష్య రహిత భవిష్యత్తుకు దోహదపడిన వారవుతామని కలెక్టర్ జి.సృజన అన్నారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా కేంద్రం అధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఏక్ పెడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టర్ సృజన ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి మొక్కను నాటారు. 2025 మార్చి నాటికి దేశవ్యాప్తంగా 140 కోట్ల మొక్కలను నాటాలనే లక్ష్యంతో దేశ ప్రధాని సూచన మేరకు కేంద్ర ప్రభుత్వం 'ప్లాంట్ ఫర్ మదర్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ వారి తల్లిపై వున్న ప్రేమ ఆప్యాయత అనురాగానికి గుర్తుగా ఒక మొక్కను నాటడం ద్వారా తల్లిని గౌరవించుకోవాలన్నారు. 'ప్లాంట్ ఫర్ మదర్' కార్యక్రమం ద్వారా జిల్లావ్యాప్తంగా విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు.

జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జె.సునీత మాట్లాడుతూ, ఉపాధి పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటి సంరక్షిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కొబ్బరి, మామిడి, జామ, నిమ్మ, సపోట, నారింజ,



మొక్క నాటే కార్యక్రమంలో కలెక్టర్ సృజన

సీతాఫలం, నేరేడు వంటి ఫల మొక్కలతో పాటు మల్లె, గులాబి, మందారం తదితర పూలమొక్కలను నాటి విద్యార్థులను పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములను చేస్తున్నట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో రామకృష్ణ నాయక్, గ్రామ సర్పంచ్ బి.కవిత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.సుధారాణి, జిల్లా నీటి యాజమాన్యం సంస్థ ప్లాంట్ మేనేజర్ కె.ఉషా, ఏపీవో ఎం.ప్రమీల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రముఖ ఇంజనీరు సీతారామయ్య మృతి



ఆటోనగర్, ఆగస్టు 22 : ఏపీ విద్యుత్ సంస్థ విశ్రాంత చీఫ్ ఇంజనీర్ సూరపనేని సీతారామయ్య(86) గురువారం మృతిచెందారు. కంకిపాడు మండలం మారేడుమాకలో రైతు కుటుంబంలో కేశవనారాయణ, సరస్వతమ్మ దంపతులకు ఆయన 1939లో జన్మించారు. బెంగళూరులో బీఈ ఎలక్ట్రికల్ పూర్తి చేసి 1960 నుంచి 1996 వరకు వివిధ హోదాల్లో పనిచేసి కన్‌స్ట్రక్షన్ కింగ్ నార్ల తాతారావు వంటి దిగ్గజాలతో అనేక ప్రశంసలు అందుకున్నారు. విజయవాడ విద్యుత్ థర్మల్ కేంద్రం 4, 5 యూనిట్లను రికార్డు స్థాయిలో 18నెలల తక్కువ కాలంలోనే పూర్తి చేసి నాటి స్పీకరు బాలయోగి చేతుల మీదుగా యోగ్యతా పత్రాన్ని పొందారు. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు సుమారు రూ.250 కోట్లు ఆదా అయింది. రిటైరైన తర్వాత కూడా నిర్మాణ దక్షతతో అనేక కంపెనీలలో పని చేశారు. కొండపల్లి లాంకో పవర్‌స్టేషన్, కేంద్రమంత్రి గడ్కరీకి చెందిన పవర్‌ప్లాంటు, రాజస్థాన్‌లోని సూరత్‌గఢ్ ప్లాంటు, పానిపట్ పవర్‌ప్లాంట్లు ఈయన ఆధ్వర్యంలోనే పూర్తవడం విశేషం. ఈ ఏడాది మారేడుమాకలో 33కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సోదరుడు, ప్రముఖ డయాబెటాలజిస్ట్ డాక్టర్ రామబ్రహ్మంతో కలిసి భూమిని దానం చేశారు. సీతారామయ్యకు భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు.



నేటి నుంచే.. ఇసుక ప్రత్యేక కేంద్రాలు

» ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బుకింగ్ సౌకర్యం

» ఇన్వాయిస్ లేని వాహనాలకు స్టాక్ పాయింట్ల వద్ద అనుమతి లేదు

» 1800-599-4599, 1800-425-6029 టోల్ ఫ్రీ నెంబర్లు

» అక్రమంగా నిల్వ ఉంచినా, రవాణా చేసినా చట్టపర చర్యలు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

విజయవాడ లీగల్, ఆగస్టు 22 : త్వరలో కొత్త ఇసుక విధానం రానున్నదని, ఈలోగా ప్రస్తుత ఉచిత ఇసుక విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా పటిష్ఠ చర్యలు తీసుకోవడం జరిగిందని, ఈనెల 23 శుక్రవారం నుంచి ప్రత్యేకంగా ఇసుక బుకింగ్‌కు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన వెల్లడించారు. ఉచిత ఇసుక విధానం నూతన మార్గదర్శకాలపై జాయింట్ కలెక్టర్ నిధి మీనా, డీసీపీ కేఎం మహేశ్వరరాజు, ఏసీపీ రవికిరణ్‌తో కలిసి గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు ప్రత్యేకంగా బుకింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

కీసర స్టాక్ పాయింట్ (కంచికచర్ల మండలం)కు కంచికచర్ల-3 గ్రామ సచివాలయంలోను, మొగులూరు స్టాక్ పాయింట్ (కంచికచర్ల మండలం)కు చెవిటికల్లు గ్రామ సచివాలయంలోనూ, అనుమంచిపల్లి స్టాక్ పాయింట్ (జగ్గయ్యపేట మండలం)కు షేర్ మొహమ్మద్‌పేట పంచాయతీ కార్యాలయంలో, పోలంపల్లి స్టాక్ పాయింట్ (వత్సవాయి మండలం)కు పోలంపల్లి గ్రామ సచివాలయంలోను ఇసుక బుకింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. రెవెన్యూ, పోలీస్, మైన్స్ శాఖల అధికారులు ఇప్పటివరకు చోటుచేసుకొన్న పరిణామాలను విశ్లేషించి, ఈ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. జిల్లాలో జూలైలో ఎనిమిది స్టాక్ పాయింట్లతో ఉచిత ఇసుక విధానం ప్రారంభం కాగా, ప్రస్తుతం నాలుగు స్టాక్ పాయింట్లలో ఇసుక అందుబాటులో వుందని తెలిపారు. బుకింగ్ కేంద్రాలు ఉదయం 6 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పని చేస్తాయన్నారు. ఏపీ.మైన్స్‌జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ అయిన వాహనాలకు మాత్రమే బుకింగ్ చేయడం జరుగుతుందని, అదేవిధంగా ఇన్‌వాయిస్ లేని వాహనాలను స్టాక్ పాయింట్‌ల వరకు అనుమతించడం జరగదన్నారు. బుకింగ్ సమయంలోనే స్లాట్ కేటాయించడం జరుగుతుందని, ఆవ్యవధిలోనే స్టాక్ పాయింట్‌కు వాహనాలు వెళ్లాల్సి వుంటుందన్నారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ) నిర్ధారించిన రవాణా చార్జీలను బుకింగ్ కేంద్రాల వద్ద ప్రదర్శించడం జరుగుతుందని, వినియోగదారునికి రోజుకు 20 మెట్రిక్ టన్నుల వరకు మాత్రమే అందించడం జరుగుతుందన్నారు. కార్యకలాపాలు సజావుగా సాగేందుకు, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.

నోడల్ అధికారిగా జేసీ

ఉచిత ఇసుక విధానం అమలు పర్యవేక్షణకు సంబంధించి జాయింట్ కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని కలెక్టర్ సృజన తెలిపారు. ఏవైనా ఫిర్యాదులు చేయాల్సి వస్తే 1800-599-4599 (రాష్ట్ర), 1800-425-6029 (జిల్లా) టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు.

డీఎంగాంట్‌శాండ్‌కంప్లైట్స్‌ఎట్‌దిరేట్‌ఆఫ్‌యాహూ.కామ్ మెయిల్‌కు కూడా ఫిర్యాదులు పంపొచ్చన్నారు. ఫిర్యాదులను సత్వరం పరిష్కరించేందుకు ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ (పీఎంయూ) ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ సృజన తెలిపారు.

పకడ్బందీగా చెక్‌పోస్టులు : డీసీపీ

డీసీపీ (రూరల్) కెఎం మహేశ్వరరాజు మాట్లాడుతూ, ఉచిత ఇసుక విధానం పటిష్ఠ అమలుకు చర్యలు తీసుకోవడం జరిగిందని, అదనపు చెక్‌పోస్టులతో నిఘాను పెంచామని తెలిపారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు, రవాణా జరిపినా, నిల్వ ఉంచినా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించారు. ఇప్పటివరకు 22 కేసులు నమోదు చేశామని, అదేవిధంగా 28 వాహనాలను సీజ్ చేసినట్టు తెలిపారు. వివిధ శాఖల అధికారుల సమన్వయంతో, మీడియా సహకారంతో ఉచిత ఇసుక విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ఏసీపీ రవికిరణ్ పాల్గొన్నారు.

కృష్ణా జిల్లా స్టాక్ పాయింట్లలో అందుబాటులో లేదు

» ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ



మచిలీపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ అనుమతులను అనుసరించి ప్రస్తుతం కృష్ణాజిల్లాలోని ఇసుకరేవులనుంచి స్టాక్ పాయింట్ల వరకు ఇసుకను తెచ్చేందుకు అవకాశం లేదని, దీంతో జిల్లాలోని స్టాక్‌పాయింట్ల వద్ద ప్రస్తుతం ఇసుక అందుబాటులో లేదని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు. ఉచిత ఇసుక విధానం అమలుపై ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను వివరించే అంశంపై ఎస్పీ ఆర్.గంగాధరరరావుతో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో గురువారం ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కృష్ణాజిల్లాలోని స్టాక్‌యార్డ్‌ల్లో ప్రస్తుతం ఇసుక అందుబాటులో లేదన్నారు. ఇసుక కావాల్సిన వారు ఎన్టీఆర్ జిల్లాలోని కంచికచర్ల, చెవిటికల్లు, షేర్‌మహ్మద్‌పేట పంచాయతీ కార్యాలయం, పోలంపల్లిలోని స్టాక్‌పాయింట్ల నుంచి ఇసుకను తెచ్చుకోవాల్సి ఉందన్నారు. బుకింగ్ సెంటరుకు వెళ్లి, ఎంతమేర ఇసుక కావాలి, ఎక్కడివరకు రవాణాచేయాలి అనే వివరాలు తెలియజేసి రవాణాచార్జీలు, లోడింగ్ చార్జీలు చెల్లించాల్సి ఉందన్నారు. ట్రాక్టరుకు 10కిలోమీటర్లలోపు రూ.800లు, ఆరు టైర్లలారీకి రూ.1540లు, 10టైర్లలారీకి రూ.1976లు, 12టైర్ల లారీకి రూ.2500లు రవాణా చార్జీలుగా వసూలు చేయడం జరుగుందన్నారు. ఇసుక ఎంతమేర అందుబాటులో ఉందనే విషయంపై ఎన్టీఆర్ జిల్లా వెబ్‌సైట్‌లో వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఇసుక సకాలంలో ఇవ్వకున్నా, రవాణాచార్జీలు అధికంగా వసూలు చేస్తున్నా, ఇతరత్రా ఏమైనా ఇబ్బందులు ఉన్నా తెలియజేసేందుకు కృష్ణా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లో 18004256026టోల్ ఫ్రీ నెంబరును ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రస్థాయిలో 18005994599 నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చని ఆమె తెలిపారు. ఫిర్యాదులపై ప్రతిరోజు ఉదయం 5గంటలకు సమీక్ష చేయనున్నట్టు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ, ఇసుక బుకింగ్ చేసిన సమయంలో స్టాక్ పాయింట్ సిబ్బంది ఇచ్చిన టైమ్‌స్లాట్ ప్రకారం ఇసుకస్టాక్ పాయింట్లకు వాహనాలతో వెళ్లాలన్నారు. ఇసుక అక్రమరవాణా జరుగుతున్నట్లుగా రుజువైతే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విజయవాడ
● తూర్పు ● సెంట్రల్ ● పశ్చిమ

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	116, 125, 136
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

వయనాడ్ బాధితులకు లయోలా విద్యార్థుల విరాళం

భారతీనగర్, ఆగస్టు 22: వయనాడ్ బాధితుల సహాయార్థం ప్రారంభించిన విరాళాల సేకరణ గురువారంతో ముగిసిందని ఆంధ్ర లయోలా కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ పి.కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌జే ప్రోగ్రామ్స్ సమన్వయ కర్త వివరాల ప్రకారం గత కొద్ది రోజుల నుంచి కళాశాల విద్యార్థులు నగరంలో పలు ప్రధాన సెంటర్లలో దాతల నుంచి సేకరించిన విరాళాలు రూ.201482 వచ్చాయని, కళాశాల యాజమాన్యం నుంచి సేకరించిన విరాళాలు రూ.198518తో కలిపి మొత్తం రూ.4లక్షలను కేరళలోని గిరిజనుల కోసం పనిచేస్తున్న జెసూట్ సంస్థ అయిన ట్రైబల్ యూనిటీ ఫర్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్స్‌కు అందజేస్తామని తెలిపారు. సహకరించిన కళాశాల సిబ్బందికి, విద్యార్థులకు, దాతలకు, అధికారులకు అభినందనలు తెలిపారు.

వైద్య విద్యార్థిని హత్యాచార ఘటనపై

సమగ్ర విచారణ జరపాలి

● ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ



ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఏలూరు రోడ్డులో ర్యాలీ

గుణదల, ఆగస్టు 22: వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి దోనేపూడి రమాదేవి డిమాండ్ చేశారు. హత్యాచార ఘటనను నిరసిస్తూ గురువారం ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మాచవరంలోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల నుంచి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల వద్ద సభ జరిగింది. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమౌతున్నాయని అన్నారు. కఠినమైన చట్టాలు రూపొందించడంతో పాటు వాటి అమలుకు సమగ్ర యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఏ. అశోక్ మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు జరగకుండా కఠినమైన చట్టాలు తేవాలని డిమాండ్ చేశారు. సభలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ చందన, ఐద్వా జిల్లా కార్యదర్శి శ్రీదేవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు, నేతలు అరుణ, కుమారస్వామి, జ్వలిత, చిన్నారి, భార్గవ్, అవినాష్, మధు, పృథ్వీ, షకీల, ఆశ తదితరులు ప్రసంగించారు.

వైద్య విద్యార్థిని ఆత్మకు శాంతి కలగాలి

గవర్నర్‌పేట: కోల్‌కతా ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యాచారానికి గురై మృతి చెందిన వైద్య విద్యార్థిని ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ గురువారం లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డి నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో మహిళా భక్తులు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. సాయిబాబా సచ్చరిత పారాయణం చేశారు.

●అచ్యుతాపురం ఫార్మా కంపెనీ ఘటనలో మృత్యువాత పడిన కార్మికుల కుటుంబాలకు న్యాయం జరగాలని, మృతుల ఆత్మలకు శాంతి కలగాలని మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. మృతులకు నివాళులర్పించారు.



సాయిబాబా మందిరంలో కొవ్వొత్తులు వెలిగించిన మహిళా భక్తులు

రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా చర్యలు

కమిషనర్ ధ్యానచంద్ర

వన్‌టౌన్, ఆగస్టు 22: రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం రాత్రి వర్షం పడుతున్న సమయంలో ఆయన వన్‌టౌన్, కెనాల్‌రోడ్డు తదితర ప్రాంతాలను పరిశీలించారు. రోడ్లపై నీరు నిల్వకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు సైడ్ డ్రెయిన్లలో చెత్తా చెదారాన్ని తొలగించి పూడికి తీయించాలన్నారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, ఇన్‌ఛార్జి చీఫ్ ఇంజనీర్ శ్రీరామచంద్రమూర్తి, ఈఈ ఏఎస్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.



వర్షంలో రోడ్డుపై నీటి ప్రవాహాలను పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

తాగునీటి కుళాయి' సర్వేను పూర్తి చేయాలి

చిట్టినగర్: ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఒక ప్రకటనలో అధికారులను ఆదేశించారు. వీఎంసీ పరిధిలో ఉన్న అన్ని అసెస్మెంట్ల సర్వేను సత్వరమే పూర్తి చేసి నివేదిక ఇవ్వాలన్నారు. సర్వేలో ఎటువంటి తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. నగర పరిధిలో 233131 అసెస్మెంట్లకు సంబంధించి గురువారం నాటికి 189987 అసెస్మెంట్ల సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. దాదాపు 82శాతం సర్వే పూర్తయ్యిందని, మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి 100 శాతం సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి సర్కిల్లో సర్వేను జోనల్ కమిషనర్లు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వేగవంతంగా పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు.

ప్రమాదకర బ్లాక్ స్పాట్‌లు గుర్తింపు



వన్‌టౌన్, ఆగస్టు 22: జాతీయ రహదారికి అనుసంధానంగా ఉన్న స్క్యూ బ్రిడ్జి, నేతాజీ బ్రిడ్జి, గీతానగర్ కట్ట, వారధి చెక్‌పోస్ట్ పాయింట్ల వద్ద గురువారం ట్రాఫిక్ పోలీసులు, జాతీయ రహదారుల విభాగం అధికారులు సంయుక్తంగా ప్రమాదకర బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున వాటి నివారణ కోసం యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాలను గుర్తించి తగిన చర్యలు తీసుకునే క్రమంలో అధికారులు రహదారులను పరిశీలించారు. ఐదో నెంబర్ ట్రాఫిక్ విభాగం సీఐ బి. బాలమురళీ కృష్ణ, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.



కుమ్మరిపాలెం సెంటర్ బీఆర్ అంబేడ్కర్ రోడ్డులో మోకాల లోతు నీరు

వన్‌టౌన్‌లో జలమయమైన రోడ్లు

● డ్రెయినేజీలు అస్తవ్యస్తం...ప్రజలకు ఇబ్బందులు

వన్‌టౌన్, ఆగస్టు 22: గురువారం రాత్రి కురిసిన వర్షానికి వన్‌టౌన్‌లోని పలు రోడ్లు జలమయమయ్యాయి. డ్రెయినేజీల అస్తవ్యస్తంతో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి, అటు వర్షపునీరు ఇటు డ్రెయినేజీలు పొంగి మురుగు నీరు రోడ్లపై పారడంతో మురికి కూపాలుగా మారాయి. వాహనదారులు పాదచారులు అనేక ఇబ్బందులు పడ్డారు.

హెచ్‌బీ కాలనీ, వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. ఇళ్ల ముందు, షాపుల ముందు మురుగు నీరు వచ్చి చేరడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. వర్షం వచ్చినపుడల్లా ఇదే పరిస్థితి ఉంటున్నా ఇందుకు శాశ్వత పరిష్కారం మాత్రం రావడం లేదన్న విమర్శలు వచ్చాయి. మరో వైపు జనాలలో కూడా మార్పు రావడం లేదని, కాల్వల్లోనే చెత్తా చెదారాలు వేస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

మెడికల్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోండి

● కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్

చిట్టినగర్, ఆగస్టు 22: పశ్చిమ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో ప్రజలను కోరారు. ఈ క్యాంపులో అన్ని ఆరోగ్య విభాగాలకు సంబంధించిన ప్రముఖ వైద్యులందరూ తమ సేవలను అందిస్తారని తెలిపారు. పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయం భవానీపురంలో శుక్రవారం వరకు, సెప్టెంబరు 9 నుంచి 15 వరకు, చిట్టినగర్ కలరా హాస్పటల్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం నుంచి సెప్టెంబరు 8 వరకు హెల్త్ క్యాంపు జరుగుతుందని తెలిపారు.

గత పాలకులు నిధుల మంజూరు నిలిపేశారు: ఎమ్మెల్యే గద్దె

గుణదల, ఆగస్టు 22: గత పాలకులు అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో తూర్పు పరిధిలో సుమారు రూ. 12 కోట్లు నిధులు మంజూరు కాకుండా నిలిపివేశారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 2వ డివిజన్‌లోని కార్మికనగర్ వాటర్ ట్యాంక్ సమీపంలో రూ. 12 లక్షలతో నిర్మించనున్న భూగర్భ డ్రెయినేజీ పనులకు గురువారం ఆయన కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికనగర్ ప్రాంతంలో గతంలో ఏర్పాటు చేసిన డ్రెయినేజీ పైపులు ధ్వంసం కావడంతో ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2వ డివిజన్ పరిధిలో కమ్యూనిటీ హాలు విస్తరించి అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఎంపీ నిధులతో పాటుగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో డివిజన్లలో ఉన్న కమ్యూనిటీ హాలు మూడు అంతస్తులు నిర్మాణం చేస్తామని అన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు ఏ పనులు చేసినా ప్రజల కోసమే అన్నారు. 2వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు దాసరి గాబ్రియేలు, నేతలు సుగసాని కృష్ణప్రసాద్, ముత్యాల కృష్ణ, గూటాల జేమ్స్, గద్దె రమేష్, బండారుపల్లి అనిల్, గొల్లపల్లి వెంకటేశ్వరరావు, ఎలిశల సురేష్, నాగేశు, పాల రవి, బి. అప్పారావు, గుత్తికొండ కృష్ణమోహన్, పడాల గంగాధర్, తాడి బాబూరావు, కొండా పాల్గొన్నారు.



డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్

ఆల్ ఇండియా కరాటేలో నితీష్‌కు ప్రథమ స్థానం



మొగల్రాజపురం, ఆగస్టు 22: స్థానిక శారదా కళాశాల విద్యార్థి పి. నితీష్ నాగరాయి (జూనియర్ ఇంటర్, ఎంపీసీ)ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్ -2024 పోటీల్లో ప్రథమ స్థానం సాధించాడు. కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ వై. రమేష్ బాబు, మేనేజింగ్ డైరెక్టర్ వై. శారదా దేవి అభినందించారు. కళాశాల సలహాదారులు ఈఎస్ఆర్‌కే ప్రసాద్, జీఎం జీఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో జాతీయ అంతరిక్ష దినోత్సవం



మొగల్రాజపురం, ఆగస్టు 22: స్థానిక వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో గురువారం జాతీయ అంతరిక్ష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా లయోలా కళాశాల భౌతిక శాస్త్ర ఉపన్యాసకుడు తుమ్మల శ్రీకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యభట్ట రాకెట్ అంతరిక్షంలోకి వెళ్లిన నాటి నుంచి మన జీవన విధానంలో సైన్స్ పరంగా చాలా మార్పులు వచ్చాయన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో విద్యార్థి దశలోనే చాలా మంది సెల్‌ఫోన్‌కు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సైన్సు విభాగాధిపతి జి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గవర్నర్‌పేట, ఆగస్టు 22: మొగల్రాజపురం సెక్షన్ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు, మెయింటెనెన్స్ నిమిత్తం శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీఎంసీ స్టేడియం ఏరియా, వెటర్నరీ ఆసుపత్రి ప్రాంతం, బందరు రోడ్డు, ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



మహిళకు చీర పంపిణీ చేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, వాసు తదితరులు

చిట్టినగర్, ఆగస్టు 22: పశ్చిమ నియోజకవర్గ చిరంజీవి యువత అధ్యక్షులు షేక్ మధు మస్తాన్ ఆధ్వర్యంలో గురువారం చిట్టినగర్ జంక్షన్‌లో సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొని జనసేన రాష్ట్ర నాయకుడు అమ్మిశెట్టి వాసుతో కలిసి కేక్ కట్ చేసి అభిమానులందరి తరుపున జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పలువురు చిరంజీవి అభిమానులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కండ్రికలో నేత్ర, దంత వైద్య శిబిరం

వన్‌టౌన్: సినీ నటుడు చిరంజీవి పుట్టిన రోజు వేడుక సందర్భంగా గురువారం గరుడ కంటి ,దంత వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరైన సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. చిరంజీవికి శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధులకు ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేశారు. 64వ డివిజన్ జనసేన అధ్యక్షుడు షేక్ రహీం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కే.రవికుమార్, కే. వరలక్ష్మి, సురవరపు నాగరాజు, పలగాని శివ, కోమరి రాజేష్, శివపార్వతి, ఝాన్సీ పాల్గొన్నారు.

విద్యార్థిని కళాశాల ఫీజుకు ఆర్థికసాయం

భారతీనగర్, ఆగస్టు 22: అశోక్‌నగర్‌లోని తూర్పు టీడీపీ కార్యాలయంలో గురువారం మూడవ డివిజన్ గుణదలకు చెందిన వడ్లపాటి శిరిషకు ఆమె కుమార్తె కళాశాల ఫీజు నిమిత్తం రూ.15వేలు ఆర్థిక సహాయాన్ని గద్దె క్రాంతి కుమార్ తన సొంత నిధుల నుంచి అందజేశారు.

డెంగీ దోమపై అవగాహన

వన్‌టౌన్, ఆగస్టు 22: స్థానిక 52వ డివిజన్‌లో కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు గురువారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో డెంగీ దోమపై అవగాహన కల్పించారు. బయాలజిస్ట్ సూర్యనాయక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పూల కుండీల్లో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు ఉత్పత్తి అవుతాయని చెప్పారు. దోమల మందు కొట్టించారు.

మిక్‌కు బెస్ట్ పెర్ఫార్మింగ్ పురస్కారం

కంచికచర్ల, ఆగస్టు 22: మిక్ ఇంజనీరింగ్ కళాశాలకు 'బెస్ట్ పెర్ఫార్మింగ్ ఇన్‌స్టిట్యూట్' పురస్కారం లభించింది. జేఎన్‌టీయూ కాకినాడ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 20న యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.రామ్మోహనరావు పురస్కారాన్ని కళాశాల సీఈవో డి.పాండురంగారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ టి. వంశీ కిరణ్‌కు అందజేశారు. విద్యార్థులకు కావల్సిన అన్ని మౌలిక సదుపాయాలు సమకూర్చి, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కళాశాల ప్లానింగ్ డైరెక్టర్ ఎం. శ్రీనివాసరావు, మేనేజ్‌మెంట్ మెంబర్ ఎం. సుహాస్ ఆనందం వ్యక్తంచేశారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

జగ్గయ్యపేట రూరల్, ఆగస్టు 22: అన్నవరం గ్రామం నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్పెషల్ బ్రాంచ్ అధికారులు స్వాధీనం చేసుకుని చిల్లకల్లు పోలీసులకు అప్పగించారు. ఆళ్లూరుపాడుకు చెందిన ఆవుల విఘ్నేష్, ముళ్లపాడుకు చెందిన లక్ష్మణరావుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సైన్స్‌ను సామాన్యులకు చేరువ చేసేందుకు జేవీవీ కృషి

తిరువూరు, ఆగస్టు 22: సైన్స్ పరిశోధనలకు పాలకవర్గాలు ప్రోత్సాహం అందించడం లేదని, సైన్స్ ఫలాలు సామాన్యులకు సక్రమంగా అందటం లేదని జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం జనవిజ్ఞాన వేదిక వార్షిక సమావేశం నిర్వహించారు. సమాజంలో మూఢనమ్మకాలు, మూఢ విశ్వాసాలకు జేవీవీ వ్యతిరేకంగా పోరాటం సాగించడంతో పాటుగా, ప్రజలకు సైన్స్‌పై అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.హరికృష్ణ, రాంప్రదీప్, పాపారావు, సుదర్శన్ సుధాకర్ పాల్గొన్నారు.

బాలుడు ఆత్మహత్య

విద్యాధరపురం, ఆగస్టు 22: కుమ్మరిపాలెం సెంటర్‌లో తల్లితో ఉంటున్న బాలుడు బుధవారం రాత్రి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భవానీపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజేష్ నగరంలోని వస్త్రలతలో ఒక షాపులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. వినాయక చవితి కార్యక్రమాలు నిర్వహించేందుకు గత 15 రోజులుగా షాపునకు వెళ్లకుండా చందాల కోసం స్నేహితులతో కలిసి తిరుగుతున్నాడు. తల్లి తిరుపతమ్మ, సోదరి, తాతలు బ్యాంక్ సెంటర్ వద్ద కార్యక్రమానికి బుధవారం సాయంత్రం వెళ్లారు. ఆ తరువాత రాజేష్‌ను భోజనానికి రమ్మనేందుకు సోదరి ఫోన్ చేసింది. రాజేష్ ఫోన్ ఎత్తలేదు. దీంతో తాత, తిరుపతమ్మ మరిదిలు ఇంటికి వచ్చి చూడగా రాజేష్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. బాలుడి మృతికి కారణాలు తెలియరాలేదు.



బర్త్‌డే సర్‌ప్రైజ్!

మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా 'విశ్వంభర' చిత్రంలోని ఆయన లుక్ పోస్టర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఒక రాతిపై కూర్చుని ప్రత్యేక శక్తులు కలిగిన త్రిశూలాన్ని పట్టుకుని ఉన్న మెగాస్టార్ పవర్‌ఫుల్‌గా అనిపించారు. ఆయన పుట్టినరోజున టీజర్ విడుదల ఉండదని దర్శకుడు వశిష్ట ముందే స్పష్టం చేయడంతో కొంత నిరాశ చెందిన మెగా అభిమానులను ఈ లుక్ సర్‌ప్రైజ్ చేసింది. 'చీకటి, చెడు ఈ ప్రపంచాన్ని ఆక్రమించినప్పుడు ఒక అద్భుతమైన తార పోరాడడానికి ప్రకాశిస్తుంది' అని చిత్రం టీమ్ ఈ పోస్టర్‌లో పేర్కొంది. 'విశ్వంభర' చిత్రం కోసం ఓ ఫాంటసీ ప్రపంచాన్ని సృష్టించారు. అద్భుతమైన డ్రామా, ఎమోషన్స్‌తో ఈ సినిమా విజువల్ వండర్‌గా ఉంటుందని నిర్మాతలు విక్రమ్, వంశీ, ప్రమోద్ చెప్పారు. అలాగే పుట్టినరోజు సందర్భంగా తండ్రితో దిగిన ప్రత్యేక ఫొటోను రామ్‌చరణ్ విడుదల చేశారు.

నచ్చితే ఎక్కడికైనా వెళతా..

"మనకు నచ్చిన వారి కోసం మనం తప్పకుండా నిలబడాలి. నాకు నచ్చినవారి కోసం ఎక్కడికైనా.. ఎంతదూరమైనా వెళతా.. ఏమైనా చేస్తా. ఈ మూవీ ఫంక్షన్ కోసం తబిత సుకుమార్ నన్ను పిలిచారు. అందుకే 'పుష్ప 2' క్లైమాక్స్ షూటింగ్‌లో ఉండి కూడా.. ఇక్కడికి వచ్చాను. 'మారుతీనగర్ సుబ్రమణ్యం' లాంటి సినిమాలు హిట్టవ్వాలి. ఇలాంటి మంచి కథలు ఉన్న చిత్రాలు మరిన్ని రావాలి అని కోరుకుంటున్నాను" అని అల్లు అర్జున్ అన్నారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రావురమేశ్, అంకిత్ కొయ్య, ఇంద్రజ, రమ్య పసుపులేటి ప్రధాన పాత్రల్లో నటించారు. దర్శకుడు సుకుమార్ భార్య తబిత సుకుమార్ చిత్రాన్ని సమర్పించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్లు అర్జున్, సుకుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. సుకుమార్ మాట్లాడుతూ "ఈ సినిమాను చూశాను. చాలా బాగుంది" అని చెప్పారు. "సినిమా అనుకున్నదానికంటే బాగా వచ్చింది. ఇది టీమ్ ఎఫర్ట్" అని దర్శకుడు లక్ష్మణ్ కార్య అన్నారు.





హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ రహస్య గోరఖ్ ఒకటయ్యారు. కర్ణాటకలోని కూర్గ్‌లో బంధు విత్రుల సమక్షంలో వీరి డెస్టినేషన్ వెడ్డింగ్ జరిగింది. వీరిద్దరికీ తొలి చిత్రం అయిన 'రాజావారు రాణీగారు'లో నటించే సమయంలో ప్రేమలో పడ్డారు. మార్చి 13న వీరి నిశ్చితార్థం జరిగింది.

ఐటమ్ సాంగ్ చేస్తుందా?



నటి శోభితా ధూళిపాళకు ఇటీవలే నాగచైతన్యతో నిశ్చితార్థం జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ అమ్మడును ఓ క్రేజీ ఆఫర్ వచ్చి తలుపు తట్టింది. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్, కియారా అద్వానీ జంటగా తెరకెక్కనున్న 'డాన్ 3'లో ఓ ప్రత్యేక గీతంలో నటించడానికి శోభితను మేకర్స్ సంప్రదించారట. దానికి శోభిత సమ్మతించారని కొందరు, అదేంకాదు ఇంకా చర్చల్లోనే ఉందని మరికొందరు అంటున్నారు. మరి శోభిత నిజంగానే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారా.. లేదా అనేది తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే. ఆమె నిర్ణయం కోసం ఆ చిత్ర దర్శక నిర్మాతలే కాదు, అక్కినేని అభిమానులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

కొత్త ఇంట్లో నరేశ్



సీనియర్ నటుడు నరేశ్ ఓ ఇంటి వాడయ్యారు. చిలుకూరి బాలాజీ ఆలయానికి సమీపంలో ఆయనకు ఓ వ్యవసాయ క్షేత్రం ఉంది. అందులో ఓ పెద్ద ఇల్లుని అత్యాధునిక వసతులతో నిర్మించి ఇటీవలే గృహ ప్రవేశం చేశారు. ఈ భవంతికి విజయకృష్ణ మందిరం అని పేరు పెట్టారు. ఇక్కడే హీరో కృష్ణ, ఇందిరా దేవి విగ్రహాలతో ఏర్పాటు చేసిన ఇందిరా దేవి స్ఫూర్తి వనాన్ని కూడా ఆ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా విచ్చేసిన చిత్ర ప్రముఖులకు నరేశ్, పవిత్ర స్వాగతం పలికారు. నరేశ్ కొత్త ఇంటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

ఇన్ ప్రోగ్రెస్

చిన్నా ఇది వింత లోకం!



నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్ కీలక పాత్రలు పోషించిన '35 చిన్న కథ కాదు' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. రానా దగ్గుబాటి సమర్పణలో సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి ఈ సినిమా తీస్తున్నారు. నందకిశోర్ ఈమని దర్శకుడు. ఈ చిత్రం నుంచి భరద్వాజ్ గాలి రాసిన 'చిన్నా.. ఇది వింత లోకం' పాటను విడుదల చేశారు. స్కూల్ ఎపిసోడ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచే ఈ చిత్రం క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకనిర్మాతలు చెప్పారు.

గరుడ పురాణం ఏం చెబుతోంది?



రిషి, ప్రియాంక కుమార్ జంటగా నటిస్తున్న తెలుగు, కన్నడ ద్విభాషా చిత్రం 'రుద్ర గరుడ పురాణం'. కే.ఎస్.నందీశ్ దర్శకత్వంలో విజయ్‌లోహిత్ నిర్మిస్తున్నారు. ఇటీవలే సినిమా టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నందీశ్ మాట్లాడుతూ "ఈ సినిమా అందరికీ నచ్చుతుంది. ఇదో వైవిధ్యభరితమైన సినిమా" అని అన్నారు. "మంచి కథతో తెరకెక్కుతోన్న ఈ సినిమా అందరికీ మంచి ఫీల్ గుడ్ మూవీ చూశామనే అనుభూతిని ఇస్తుంది" అని నిర్మాత విజయ్‌లోహిత్ చెప్పారు.

బయట ప్రపంచం చాలా చెత్తగా ఉంది



'ఏ మహిళ అయినా ఎవరితోనూ తన ఇబ్బందిని చెప్పుకొనే ధైర్యం చేయలేదని అనిపిస్తేనే ఆమెను మరింత ఇబ్బందులకు గురి చేయడానికి ప్రయత్నిస్తారు. అలాంటి వారికి నో చెప్పడం నేర్చుకోవాలి' అన్నారు మంచు లక్ష్మి. చిత్ర పరిశ్రమలో మహిళా ఆర్టిస్టులను వెంటాడి వేధిస్తున్నారని జస్టిస్ హేమ కమిటీ నివేదిక వెల్లడించిన నేపథ్యంలో మంచు లక్ష్మి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆమె ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'అన్యాయం జరిగిన వెంటనే బయటకు వచ్చి మాట్లాడాల్సిన అవసరం ఉంది. అలాగే ఆర్టిస్టులు తెలివిగా నో చెప్పడం నేర్చుకోవాలి. కెరీర్ మొదలు పెట్టిన సమయంలో నన్నూ కొందరు ఇబ్బంది పెట్టారు. వారిపై గట్టిగా అరిచి నాకు వచ్చిన చాన్స్ పోగొట్టుకున్నా. కానీ తర్వాత అలాంటి విషయాల్లో తెలివిగా వ్యవహరించడం నేర్చుకున్నా. అప్పటికీ అవతలి వారు విసిగిస్తుంటే మనం వారికి బుద్ధి చెప్పక తప్పదు. ఎందుకంటే బయటి ప్రపంచం చాలా చెత్తగా ఉంది' అన్నారామె.

FARNAZ

సహజయోగ

శ్రీకృష్ణ పరమాత్మ గురించి తెలుసుకోవాలంటే ఆయన తత్వాన్ని తెలుసుకోవాలి. శ్రీమన్నారాయణుడు కొత్త అవతారాన్ని ధరించినప్పుడు... అంతకు ముందు అవతారంలో తాను ప్రబోధించిన విషయాలను అవగాహనా లోపంతో సరిగ్గా అర్థం చేసుకోకుండా, మితిమీరిన, విపరీతమైన వైఖరులను అనుసరిస్తున్న ప్రజలను సంస్కరించడానికి ఆ కొత్త అవతారంలో ప్రయత్నిస్తాడు. ఈ కారణం వల్లనే భగవంతుడు మళ్ళీ మళ్ళీ అవతరిస్తూ ఉంటాడు. రామావతారంలో అత్యంత ఆదర్శవంతంగా ఆయన జీవించాడు. 'శ్రీరాముడిలా మనం కూడా బంధరహితులుగా ఉందాం' అనుకున్న ప్రజలు వివిధ అపోహలతో కఠినమైన జీవితాన్ని గడిపారు. వారిని మునులు, యోగులు ఎంతో క్రమశిక్షణలో పెట్టేవారు. క్రమశిక్షణను ఉల్లంఘించేవారికి కఠిన ప్రాయశ్చిత్తాలు ఉండేవి. దీనితో ప్రజలు గంభీరమైన జీవితానికి అలవాటు పడిపోయారు. ఆ తరువాత... ఈ చరాచర సృష్టి అంతా ఒక లీల అని, ఆనందమయమని నిరూపించడానికి శ్రీకృష్ణావతారం వచ్చింది. ప్రజలు ఎల్లప్పుడూ సంతోషంగా, ఉల్లాసంగా, ఆడుతూ పాడుతూ, ఎలాంటి అరమరికలు, కఠిన నియమ నిబంధనలు లేకుండా ఎలా ఉండాలో ఆయన తన జీవితం ద్వారా ప్రత్యక్షంగా చూపించాడు.

శరణాగతితో ఆత్మసాక్షాత్కారం

26న శ్రీకృష్ణాష్టమి

శ్రీకృష్ణుడు యోగీశ్వరుడు. శ్రీకృష్ణునికి మనం సంపూర్ణంగా శరణాగతులైతే... మనలోని యోగ స్థితిని స్థిరపరచుకోవచ్చు. భగవంతుడి శక్తితో మన అంతర్గత శక్తి కలయికే యోగం. అది ఆత్మసాక్షాత్కారం ద్వారా సాధ్యమవుతుంది. శ్రీకృష్ణుడు విరాట్ పురుషుడు. కదనరంగంలోకి స్వయంగా దూకకుండానే... సమస్త దుష్ట శక్తులతో పోరాటం సాగించాడు. ఆయన జీవితం ఎంతో మనోహరంగా, సృజనాత్మకంగా, ప్రేమతత్వంతో నిండి ఉంటుంది. కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడు దుఃఖితుడై ఉన్నప్పుడు గీతా బోధతో కర్తవ్యం బోధించాడు. స్థితప్రజ్ఞత గురించి, ఆధ్యాత్మికత గురించి, సంపూర్ణ బంధరాహిత్యం గురించి చాలా వివరంగా చెప్పాడు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా... మన అంతరంగంలోనూ, బాహ్యంగానూ ఉన్న దుష్ట శక్తులతో పోరు సాగించాలని ఉపదేశించాడు.




మనకు ఉన్న ఆధ్యాత్మిక మార్గాల్లో భక్తి ఒకటి. అది మన అంతర్గత సూక్ష్మ శరీర వ్యవస్థలో ఎడమ పార్శ్వానికి సంబంధించినది. భక్తి అంటే భగవంతుణ్ణి కీర్తించడం, అర్పణ భావంతో ఉండడం, మంచి కర్మలు నిర్వర్తించడం. ఆ విధంగా భగవంతుడికి మనం దగ్గరవుతాం. ఇది ఋషులు, మతాలు ఆమోదించిన పద్ధతి. అయితే దీన్ని మనం ఎలా ఆచరిస్తున్నాం? దైవంతో అనుసంధానం కాకపోతే... దైవం పట్ల సంపూర్ణ సమర్పణ భావాన్ని ఎలా కలిగి ఉండగలం? అనన్య భక్తి మన అంతరంగంలో ఉంటే దైవంతో ఐక్యత సాధించగలం. మరొకటి కర్మ సిద్ధాంతం. అంటే మనం మన కార్యాలను బంధరాహిత్యంతో నిర్వహించడం. ఇది అంత సులభం కాదు. మనల్ని మనం నిర్మలంగా మార్చుకోవడం కోసం... ఆధ్యాత్మికంగా ఉన్నతి పొందిన మహర్షులను దర్శిస్తున్నాం, ప్రార్థనలు చేస్తున్నాం, పుణ్యక్షేత్రాలను దర్శిస్తున్నం. అన్ని రకాల కర్మ కాండలను ఆచరిస్తున్నాం. ఇది కర్మయోగం. సహజయోగ ప్రకారం... ఇది మన శరీరంలోని కుడి పార్శ్వానికి సంబంధించినది. కానీ మనం ఏ కర్మలు చేసినా వాటి ఫలాలు ఎలా ఉంటాయో చెప్పలేమనీ, కాబట్టి భగవంతుడి ఆశీస్సులు లభించడానికి ఫలానా కర్మలే చెయ్యాలని చెప్పడానికి వీలు లేదనీ అన్నాడు శ్రీకృష్ణుడు. "కర్మలు చెయ్యడం నీ పని. వాటి ఫలితాలను ఆశించకూడదు" అని చెప్పాడు. ఆత్మసాక్షాత్కారం పొందినవారిని, ధర్మమార్గం అనుసరించేవారిని, ధర్మబద్ధమైన కర్మలను ఆచరించేవారిని శ్రీకృష్ణుడు ఎల్లప్పుడూ ఆశీర్వదిస్తాడు.

మూడోది విచక్షణ. దీన్నే మనం జ్ఞానమార్గం అంటాం. ఇది మధ్యేమార్గం. దీనిద్వారా మనం పరిణామం పొందుతాం. లౌకిక విషయాలకు అతీతమైన శక్తిని పొందినప్పుడు... సంపూర్ణ, నిర్మల, సూక్ష్మ జ్ఞానాలు లభిస్తాయి. ప్రతి ఒక్కరూ జ్ఞానమార్గంలోకి వెళ్ళలేరని, దానికి ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వం, స్థితి ఉండాలని చాలామంది చెబుతారు. కానీ అది సరి కాదు. అందరూ జ్ఞానమార్గాన్ని అనుసరించవచ్చు. దానికి దోహదపడే సూక్ష్మ శరీర వ్యవస్థ అంతర్గతంగా మనలోనే నిర్మాణమై ఉంది. మనకు పుత్రధర్మం, పితృధర్మం, పతిధర్మం, పత్నీధర్మం, దేశధర్మం... ఇలా అనేక ధర్మాలు ఉన్నాయి. 'సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ... అన్ని ధర్మాలను వదిలిపెట్టు. నన్ను శరణాగతి వేడు" అన్నాడు శ్రీకృష్ణుడు. ధర్మాలన్నిటినీ ఆయనకు సమర్పిస్తే... అవి ఒక సమ స్థితికి వస్తాయి. ఆత్మసాక్షాత్కారం పొందిన తరువాత... ఉత్తమ ధర్మాలను మనలో ఆయన స్థిరపరుస్తాడు. మనలో శ్రీకృష్ణుడి గుణగణాలు జాగృతి చెందడం చాలా ముఖ్యం. ఆయన పద్ధతి తేనెలా ఎంతో మధురంగా ఉంటుంది. అందుకే ఆయన ఆశీస్సులు పొందాలనుకొనే ప్రజలు 'మాధవ' అని సంబోధించారు. అయితే దుర్మార్గులకు ఆయన అతి భయంకరుడు. శ్రీకృష్ణుడు సామూహికతకు ప్రాధాన్యత ఇస్తాడు. సామూహికంగా మనకున్న సంబంధాలను ఉపయోగించుకుంటూ... సత్యం, ప్రేమ, కరుణ, ఆత్మసాక్షాత్కారాలను సాకారం చేసుకోవాలి. కుండలినీ ఉత్థానం ద్వారా ఆత్మసాక్షాత్కారం పొంది, సహజయోగ సాధనతో స్థితప్రజ్ఞ స్థితిని సాధించవచ్చునని శ్రీమాతాజీ నిర్మలాదేవి నిరూపించారు. మన అంతర్గత సూక్ష్మ శరీర నాడీ వ్యవస్థలో ఏడు చక్రాలు ఉంటాయి. వాటిలో విశుద్ధ చక్రంలో... అధిష్ఠాన దేవతగా శ్రీకృష్ణుడు ఆసీనుడై ఉంటాడు. ఆయన చెప్పిన ధర్మ సూత్రాలను, అనుసరించిన ధర్మ మార్గాలను మనం అనుసరిస్తే ఆయన అనుగ్రహానికి పాత్రులం అవుతాం.



డాక్టర్ పి. రాకేష్ 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్',
తెలంగాణ



తనికెళ్ళ భరణి... నాటక, సినీ రచయిత, నటుడు, దర్శకుడే కాదు... 'ఆటగదరా నీకు' అంటూ పరమశివుణ్ణి నిందాస్తుతి చేసిన తాత్విక కవి. "నిన్ను నువ్వు ప్రేమించుకున్నట్టే ఎదుటివారినీ ప్రేమించు. ఇదే సర్వ ధర్మాల సారం. అదే ఆధ్యాత్మికత" అంటున్న ఆయన 'నివేదన'తో ప్రత్యేకంగా సంభాషించారు.

మనకు కావలసింది గాఢభక్తి

"నేను 'ఆటగదరా శివా' అంటూ పద్యాలు రాశాను. వాటిని మళ్ళీ మళ్ళీ చదువుతున్నప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది... 'ఇది రాసింది నేనేనా?' అని. 'ఏదో ఒక శక్తి నాలో ప్రేరణ కలిగించి నాతో అవి రాయించింది. నేను నిమిత్తమాత్రుణ్ణి' అని గట్టిగా నమ్ముతాను. నాకు పరిజ్ఞానం ఉండవచ్చు. కానీ నాలో సంకల్పం కలగడం, శ్రద్ధగా రాయగలగడం, దానికి నా పరిజ్ఞానం అక్కరకు రావడం, రాసినవి అద్భుతంగా కుదరడం, అవి జనరంజకం కావడం... వీటి వెనుక మానవ ప్రయత్నం ఉన్నా... ఏదో అతీతమైన శక్తి దానికి బలం చేకూర్చి, నాతో ఆ పని చేయించిందని భావిస్తున్నాను."

"నా జీవితంలో అనుకోకుండా అద్భుతాలు కొన్ని జరిగాయి. అవే నన్ను భగవంతుడికి అతుక్కుపోయేలా చేశాయి. నేను గొప్ప ప్రతిభావంతుణ్ణి కాదు. ప్రజ్ఞావంతుణ్ణి కాదు. నేను పెద్ద పెద్ద చదువులు చదవలేదు. చాలా సామాన్యుణ్ణి. నేను ఇంత జనాదరణ పొందడానికి, ఇంతటి కీర్తి ప్రతిష్టలు రావడానికి, సమాజం నుంచి ప్రేమాభిమానాలు పొందడానికి కారణం కేవలం 'నా ప్రతిభ' అని అనుకుంటే అది అవివేకం. దేవుడి మీద నిర్వివాదమైన భక్తి ఉన్నప్పుడు... 'పవి పుష్పంబగు, నగ్ని మంచగు... శివ నీ నామము సర్వవశ్యకరమౌ' అని 'శ్రీకాళహస్తీశ్వర శతకం'లో ధూర్జటి చెప్పినట్టు... మనకు ఇబ్బందులు ఎదురైనా కొద్ది కాలంలోనే అవి చెల్లాచెదురైపోతాయి. నాకు ఎదురైన అలాంటి సంఘటన ఒకటి చెబుతాను.

ఏదీ దొరకని చోట...

నా కుటుంబంతో, సన్నిహితులతో కలిసి ఒకసారి తమిళనాడులో యాత్ర చేస్తున్నాను. అప్పట్లో నేను శివ దీక్షలో ఉన్నాను. కుంభకోణం దగ్గరకు వచ్చిన తరువాత... "ఈ రోజు మనం టిఫిన్లు చెయ్యొద్దు. చిదంబరం వెళ్ళేసరికి సరిగ్గా ఒంటిగంట అవుతుంది. అక్కడ మంచి ప్రసాదం తిందాం" అని చెప్పాను. తీరా చిదంబరం వచ్చేసరికి... కావేరీ నీటి వివాదం కారణంగా అక్కడ సమ్మె జరుగుతోంది. గుడితో పాటు దుకాణాలన్నీ మూతపడి ఉన్నాయి. మేము పొద్దున్న టిఫిన్ కూడా చెయ్యకుండా వచ్చాం. ఏం చెయ్యాలో తెలియడం లేదు. ఒక పక్క ఆగాం. నన్ను అక్కడ ఉంచి... తినడానికి ఏదైనా దొరుకుతుందేమో వెతకడానికి మా వాళ్ళు వెళ్ళారు. నాకు ఎదురుగా షట్టర్ వేసేసిన ఒక హోటల్ ఉంది. ఆ హోటల్ వాచ్‌మేన్ నన్ను చూశాడు. "తినడానికి ఏదైనా ఉంటుందా?" అని సైగ చేశాను. అతను లేదని సైగ చేశాడు. 'నా ఖర్మ' అన్నట్టు నుదుటి మీద బొటన వేలితో అడ్డంగా రాశాను. అతను ఏమనుకున్నాడో ఏమో? లోపలికి వెళ్ళి, మళ్ళీ బయటకు వచ్చి ఎంతమంది ఉన్నారని సైగ చేశాడు. మేం ఆరుగురం ఉన్నామని వేళ్ళు చూపించాను. 'అమ్మ బాబోయ్' అన్నట్టు గుండె మీద చెయ్యి వేసుకొని, లోపలకు వెళ్ళిపోయాడు. ఈలోగా మా వాళ్ళు వచ్చారు. "ఏవీ లేవు. ఇవాళ మనం ఉపవాసమే" అన్నారు. 'ఉపవాసం ఉందాం' అనుకొని ఉండడం వేరు, తిండి దొరక్క బలవంతంగా ఉపవాసం ఉండడం వేరు. ఒక్కొక్కరినీ ఆకలి దహించేస్తోంది. ఇంతలో ఆ వాచ్‌మేన్ బయటికొచ్చాడు. 'ఒక్కొక్కరూ లోపలికి రండి' అంటూ సైగ చేశాడు. అందరం వెళ్ళాం. అప్పుడు హోటల్లో ఉన్న వాళ్ళు "ఈ రోజు హోటళ్ళు బంద్. కాకపోతే మేం తినాలి కాబట్టి మాకోసం సాంబారు, కూర, పచ్చడి లాంటివి చేసుకుంటున్నాం. మీకు అభ్యంతరం లేకపోతే అవే మీకు పెడతాం" అన్నారు. "చద్దన్నం పెట్టినా చాలు" అని కూర్చున్నాం. ఇంతలో... మేడ మీద నుంచి ఒక వ్యక్తి కిందకు వచ్చి, నన్ను చూసి ఆశ్చర్యపోయాడు. "మీరేంటండీ... ఇక్కడున్నారు?" అన్నాడు. అతను చీఫ్ చెఫ్. అతనిది శ్రీకాకుళం. విషయం చెప్పాం. "భలేవారే! మీకేం కావాలో చెప్పండి. అరగంట టైమివ్వండి" అన్నాడు. తరువాత అతను ఎంతో ప్రేమతో వంకాయ కూర, సాంబారు, పప్పు, పచ్చడి, పెరుగు, స్వీటు... ఇలా షడ్రుచులతో భోజనం పెట్టి పంపించాడు. అప్పుడు నా భార్య "మీకు అడవిలోకి వెళ్ళినా అన్నం దొరుకుతుంది" అంది. "మా శివయ్య భార్య అన్నపూర్ణ కదా. అమ్మ ఆకలితో ఉండనిస్తుందా?" అన్నాను ఇది చాలా యాదృచ్ఛికంగా జరిగిందే. కానీ ఆ క్షణానికి మాత్రం అది అద్భుతం.

> **దేవుణ్ణి ఏం కోరుకోవాలంటే...**
> బాల్యం నుంచీ నాకు దైవ భక్తి మెండుగానే ఉంది. మా ఇంట్లో శివారాధన ఉంది, విష్ణ్వారాధనా ఉంది. అందుకే 'ఆటగదరా శివా... ఆటగదరా కేశవా' అని నా పద్యాన్ని ప్రారంభించాను. శివకేశవులు ఒకే నాణేనికి రెండు పార్శ్వాలు. విష్ణు పురాణంలో 'మద్భక్త శ్శంకరః ద్వేషీ, మద్వేషీ శంకరప్రియః, యౌ ఖౌ నరకంయాన్తి, యావశ్చంద్ర దివాకరౌ...' అన్నారు. "నన్ను ప్రేమించి శంకరుణ్ణి ద్వేషించేవాడు, శంకరుణ్ణి ప్రేమిస్తూ నన్ను ద్వేషించేవాడు... వాళ్ళిద్దరికీ నరకం తప్ప స్వర్గం రాదు" అని కటువుగా చెప్పాడు మహావిష్ణువు. ఒక దేవుడికి మొక్కుకుంటాం. అనుకున్నది అవుతుంది. ఇక ఆ దేవుణ్ణే నమ్ముకుంటాం. మన బలహీనతలన్నీ దేవుడికి ఆపాదిస్తాం. మనం ఎంత బలహీనులమో... దేవుళ్ళని కూడా అంతే బలహీనులుగా భావిస్తూ ఉంటాం. వాస్తవానికి భగవంతుడు మనకు ఎవరిమీదా ఆధారపడని స్థితి ఇచ్చాడు. దేవుణ్ణి మనం కోరుకోవలసింది, తీసుకోవలసింది కేవలం ఆత్మ విశ్వాసం, ఆత్మబలం. "నువ్వు మాకు ఉన్నావు. ఆ ధైర్యంతో మా పని మేం చేసుకుంటాం" అనుకోవాలి. అన్నీ దేవుడే చేసేటట్టయితే... కృష్ణుడే యుద్ధం చేసేవాడు కదా! అలా చెయ్యలేదు. "నువ్వు చెయ్యి. నీ వెనకాల ఉంటాను. లేదా నీ ముందు ఉంటాను" అన్నాడు. అన్నీ మనమే చేసుకోవాలి. మనకోసం ఎవ్వరూ చెయ్యరు. ఆ దేవుడు కూడా ఏదీ చెయ్యడు.

ఏ మతమైనా చెబుతున్నది అదే...

'దైవం మానుష రూపేణ' అనేది నేను బలంగా నమ్ముతాను. అలాగే ప్రకృతే దైవం. చిన్నప్పుడు 'పుట్టకు దండం పెట్టు, గుట్టకు దండం పెట్టు, పిట్టకు దండం పెట్టు' అని పెద్దవాళ్ళు చెప్పినప్పుడు... మేము పెట్టేస్తూ ఉండేవాళ్ళం. కాస్త జ్ఞానం వచ్చాక... వేరేవాళ్ళు వేళాకోళం చేస్తూ ఉండేవాళ్ళు, వానరాలకు, వరాహాలకు, చెట్లకు, పుట్టలకు, రాళ్ళకు నమస్కారం చెయ్యడమేమిటని. నాక్కూడా ఒక్కోసారి 'వాళ్ళ మాటలు నిజమేనేమో? నేను చేసేది అసంబద్ధమేనేమో?' అనిపించింది. కానీ మన చుట్టూ ఉన్న ప్రకృతిని, చరాలను, అచరాలను కాపాడుకోవాలనే గొప్ప ఆలోచన దానిలో ఇమిడి ఉన్నదని అర్థమయింది. ఆ ఆలోచనను విస్మరించడం వల్ల కలిగే పర్యవసానాలను ఇప్పుడు మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం. ఈ భూమి మన అబ్బసొమ్మేం కాదు. ఇక్కడ బతకడానికి మనకెంత హక్కుందో, చీమకు, దోమకు, ఈగకు కూడా అంతే హక్కు ఉంది. ముప్పు మనవరకూ వస్తే ఎలా ఉంటుందో కరోనా సమయంలో బాగా తెలిసివచ్చింది. జంతువులు, పక్షులు స్వేచ్ఛగా తిరుగుతూ ఉంటే... మనం బందీలుగా ఉండిపోయాం. కాబట్టి అన్నిటిలోనూ మనల్ని మనం చూసుకోవాలి. 'అన్నిటిలోనూ ఉండేది ఒకే ఆత్మ' అనేది మన తాత్వికత. అందుకే 'నాలోన శివుడు కలడు' అని రాశాను. నాలోన శివుడు ఉంటే నీలోనూ శివుడు ఉంటాడు. నిన్ను నువ్వు ప్రేమించినట్టు ఎదుటివాణ్ణి కూడా ప్రేమించు. ఏ మతమైనా అదే చెబుతోంది.

భక్తిలో 'అతి' కూడదు...

అయితే భక్తిలో కొన్ని అవాంఛితమైన ధోరణులను కూడా మనం చూస్తున్నాం. ఉదాహరణకు వినాయక చవితిని తీసుకుంటే... మన భారతీయుల శక్తిని బ్రిటిష్ వారికి చూపించాలన్న ఆలోచనతో... సామూహికంగా ఉత్సవాలు మొదలుపెట్టాలని లోకమాన్య బాలగంగాధర తిలక్ నిర్ణయించారు. ఇప్పుడు అది సంప్రదాయం అయిపోయింది. వినాయకచవితితో పాటు వేరే పండగలకు కూడా ఇది పాకింది. ప్రతి పండగకూ వీధుల్లోకి రావడం, రోడ్లు మూసేయడం, ఇతరుల పనులకు ఆటంకం కలిగించడం, కొన్నిసార్లు బెదిరించి కూడా చందాలు వసూలు చేయడం... ఇదంతా 'అతి'. ఆలయాల విషయానికి వస్తే... అభిషేకాన్ని నీళ్ళతో చేసేవారు. ఆ తరువాత పంచామృతాలు అన్నారు. పంచామృతాలైనా భక్తితో ఒక ఉద్ధరిణితో అభిషేకిస్తే చాలు. 'నేను వంద కిలోల పెరుగుతో చేస్తాను, వంద కిలోల పంచదారతో చేస్తాను' అంటూ తమ స్థాయిని భక్తిద్వారా దేవుడికి కాకుండా... లౌకికమైన వాటి ద్వారా ప్రపంచానికి ప్రదర్శించుకోవాలనే ఆరాటం పెరిగిపోయింది. అందుకే...

'చెంబెడు నీళ్ళపోస్తె ఖుష్...
చిటికెడు బూడ్దె పూస్తె బస్...
వాటి పుణ్యానికి మోక్షమిస్తావు గదా
శబ్బాష్‌రా... శంకరా' అని రాశాను.
'నీలకంఠుని శిరసుపై నీళ్ళు చల్లి
పత్రినిసుమంత యెవ్వడు పారవైచు
గామధేనువు వానింట గాడి పసరము
అల్ల సురశాఖి వానింటి మల్లెచెట్టు' అన్నాడు

'రాజశేఖర చరిత్ర'లో మాదయ్యగారి మల్లన. శివుడి మీద నీళ్ళు కాస్తంత చిలకరించినా, విసిరినా, పారేసినా కూడా నిన్ను కరుణిస్తాడని అర్థం. అలా కాకుండా కిలోలకి కిలోలతో అభిషేకాలు చేయడం వల్ల మన దేశంలో ఎన్నో శివలింగాలుపాడైపోయాయి, అరిగిపోయాయి. కొన్నేళ్ళ కిందట మన వాళ్ళు కళ్ళు తెరిచి వాటికి వెండి తొడుగో, బంగారు తొడుగో అమర్చి... నేరుగా అభిషేకం చెయ్యడానికి వీల్లేదని చెబుతున్నారు. అలా చెయ్యకపోతే కొన్నాళ్ళకు ఆ శివలింగాలు మాయమైపోతాయి. విభక్తము కానిది భక్తి. కానీ అతి చెయ్యకూడదు. అతి భక్తినే 'మూఢభక్తి' అంటారు. నిజానికి అంతరాంతరాల్లో ఉండే భక్తి... గాఢభక్తి. కన్నప్పకు ఉన్నది గాఢభక్తి. మనలో చాలామందికి ఉన్నది మూఢభక్తి.

అది మన ఒక్కరికోసం కాదు...

భక్తి తత్పరుడికి ఉండవలసిన ప్రధాన లక్షణం... తను పదిమందికి సాయం చేస్తూ జీవించాలి. పరోపకారాయ పుణ్యాయ, పాపాయ పరపీడనం... ఆ పరోపకారం అనేది భక్తివల్ల సాధ్యమవుతుంది. అలాగే సాటి మనుషుల పట్ల, జంతువుల పట్ల, సమస్త జీవుల పట్ల దయాగుణం కలిగి ఉండాలి అనేది నా ప్రధాన ప్రతిపాదన. అప్పుడు మనం చేసే ప్రతి పనిలోనూ మంచి ప్రతిబింబిస్తూ ఉంటుంది. నా పద్యాల్లో సామాజిక పరిస్థితుల మీద ఆవేదన, వ్యంగ్యం, నిరసన, కోపం ప్రదర్శించడానికి, చీదరించుకోవడం, చిరాకుపడడం లాంటివి చెయ్యడానికి కారణం... మనిషిలో, సమాజంలో నైతికమైన మార్పు రావాలనే ఆకాంక్షే. భారత, భాగవత, రామాయణాలన్నీ నీతి పాఠాలే చెప్పాయి. "ఇలా బతకండి, బాగా బతకండి, సమాజానికి ఉపయోగపడేలా బతకండి. దుర్మార్గాన్ని ఖండించండి" అని బోధించాయి. మనం మన ఒక్కరి కోసం కాదు. మనం నూరుశాతం సమాజంలో భాగం. కాబట్టి సమాజం పట్ల మనకు గౌరవం, భక్తి ఉండాలి, ప్రేమ ఉండాలి. అదే ఆధ్యాత్మికత. సమాజానికి ఉపయోగపడని ఆధ్యాత్మికత వ్యర్థం."

సంభాషణ: **కృష్ణశర్మ**

స్థితప్రజ్ఞత

గీతాసారం



మనం ఒక పరిస్థితిని, ఒక వ్యక్తిని లేదా ఒక పని తాలూకు ఫలితాన్ని మంచి లేదా చెడుగా విభజిస్తాం. అయితే ఏ అభిప్రాయాన్ని వ్యక్తం చెయ్యని మూడవ స్థితి కూడా సంభవమే. శ్రీకృష్ణుడు ఆ మూడవ స్థితి గురించి ప్రస్తావిస్తూ "దేనిపట్లా మమతాసక్తులు లేనివాడు, అనుకూల పరిస్థితుల్లో సంతోషం, ప్రతికూల పరిస్థితుల్లో ద్వేషం లాంటి మనోవికారాలకు లోనుకానివాడు అయిన వ్యక్తిని 'స్థితప్రజ్ఞుడు' అంటారు" అని చెప్పాడు. స్థిత ప్రజ్ఞుడు తన సొంత అభిప్రాయాలను వదిలేసి, వాస్తవాలను వాస్తవాలుగా తీసుకుంటాడని ఇది సూచిస్తోంది. ఎందుకంటే 'మంచి-చెడు" అనే విభజన 'సుఖదుఃఖాలు' అనే ద్వంద్వాలకు జన్మస్థలం. పరిస్థితులను, వాస్తవాలను తక్షణమే మంచి లేదా చెడు అని వర్గీకరించే మన ధోరణికి విరుద్ధంగా ఈ బోధ నడుస్తుంది. కాబట్టి ఇది కఠినంగా కనిపిస్తుంది. చెడుగా అనిపించే పరిస్థితిని లేదా వ్యక్తిని ఎదుర్కొన్నప్పుడు వెనువెంటనే అయిష్టత, విరక్తి, ద్వేషం అనేవి వాటంతట అవే కలుగుతాయి. కానీ స్థితప్రజ్ఞుడు ఏ పరిస్థితి గురించి అభిప్రాయాన్ని ఏర్పరచుకోడు కాబట్టి అతనిలో ద్వేషం పుట్టడానికి అవకాశమే లేదు. అదే విధంగా మంచి విషయాలకు స్థితప్రజ్ఞుడు పొంగిపోడు.

ఉదాహరణకు మన అందరిలో అందం, ఆకర్షణ కాలక్రమేణా సహజంగా తగ్గిపోతాయి. వృద్ధాప్యం అనే దశకు చేరుకుంటాం. ఇవి కేవలం ప్రాకృతిక వాస్తవాలు. కానీ మనం వాటిని అప్రియంగా లేదా చెడ్డవిగా భావిస్తే... అవి దుఃఖాన్ని తెస్తాయి. గాయం లేదా అనారోగ్యం లాంటి విషయాలలో సరైన చికిత్స వైపు దృష్టి పెట్టకుండా... ప్రస్తుత పరిస్థితులను చెడుగా భావించడమే దుఃఖం. ఒక శస్త్రవైద్యుడు (సర్జన్) వివిధ పరీక్షల ద్వారా వెల్లడయిన ఫలితాల ఆధారంగా రోగికి శస్త్రచికిత్స చేస్తాడు. స్థితప్రజ్ఞుడు కూడా వాస్తవిక దృష్టితో పరిస్థితులను ఎదుర్కొంటాడు. ఒక సూపర్ కండక్టర్ ఎలాగైతే మొత్తం విద్యుత్తును ఎలాంటి ఆసక్తి లేకుండా... స్వేచ్ఛగా తనలోంచి ప్రవహింపజేస్తుందో... స్థితప్రజ్ఞుడు కూడా అదే విధంగా ఆసక్తి లేకుండా జీవిస్తాడు. మనం పరిస్థితుల పట్ల, వ్యక్తులపట్ల, పనులపట్ల ఇష్టంతో కాని, అయిష్టంతో కాని ఉంటాం. ఇష్టం అంటే ఆ అంశాలతో ఏర్పడే అనుబంధం అని అర్థం చేసుకోవడం చాలా సులభం. కానీ అయిష్టం కూడా ఒక రకమైన అనుబంధమే. కాకపోతే అది ద్వేషంతో ముడిపడిన బంధం. స్థితప్రజ్ఞుడికి మమతాసక్తులు లేవన్నాడు శ్రీకృష్ణుడు. అంటే వారు ఇష్టాలు, అయిష్టాలు... ఈ రెండిటినీ వదిలేస్తారని అర్థం.



కె. శివప్రసాద్
ఐఎఎస్

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/YMGxEDలో చదవండి.

సరళ జీవనమే ధ్యాన సోపానం

ధ్యానానికి, జీవనశైలికి అవినాభావ సంబంధం ఉంది. జీవితంలో సరళత తెచ్చుకుంటే... ధ్యానస్థితి దానంతట అదే అనుభవంలోకి వస్తుంది. ఆలోచనల ప్రవాహం నెమ్మదించడానికి, మానసిక ఒత్తిడి కొంత తగ్గడానికి రోజూ కొంత సమయంపాటు ధ్యానసాధన మంచిదే. అయితే, జీవితంలో ప్రశాంతత, ధ్యానస్థితి నిరంతరం ఉండాలంటే... అందుకు అనువైన వాతావరణం కల్పించడం మరింత ముఖ్యం. దీనికి మౌలికమైన పునాది సరళ జీవనం అనేది నిస్సందేహం. ప్రస్తుత హడావిడి జీవితంలో ఏ మార్పూ లేకుండా, కోరికలు, ప్రాపంచిక వ్యాపకాలు యథావిధిగా కొనసాగిస్తున్నవారికి ధ్యానం పేరుతో కాసేపు కళ్ళు మూసుకుని కూర్చోవడం వల్ల ఫలితం శూన్యం. వాహన వేగం తగ్గించాలంటే ఉన్నపళంగా బ్రేక్ వేయలేం. ముందు వేగవర్ధకం (యాక్సిలరేటర్) మీద ఒత్తిడి తీసేయాలి. అలాగే జీవితాన్ని సరళతరం చేసుకోవాలి. అదే నిజమైన ధ్యాన సాధన.



పరిమిత వినియోగం

సరళ జీవనం అంటే ఏమిటి? అవసరం మేరకే వనరులు ఉపయోగించటడం, ప్రాపంచిక విషయాల్లో చిక్కుకుపోకుండా ఉండడం. ఆకలి తీర్చుకోవడానికి ఆహారం అనే రోజులు పోయాయి. నేడు జిహ్వ చాపల్యం కోసం, కాలక్షేపం కోసమే తింటున్నామంటే అతిశయోక్తి కాదు. సౌకర్యాల స్థాయి దాటి విలాసాలకు చిరునామా అయ్యాయి మన నివాసాలు. ఇవన్నీ ఒక ఎత్తయితే... ఈ వినిమయ సంస్కృతినే అభివృద్ధిగా చూడడం, వాడెయ్-పారెయ్ ధోరణి వెర్రితలలు వేయడం మరో విషాదం. వేడుకల పేరుతో జరుగుతున్న అనవసర ఆర్భాటం ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది.

నిజమైన ప్రేమ

ఇక కుటుంబ బంధాల్లో సరళత అత్యంత ముఖ్యం. పిల్లల పాలన-పోషణ, విద్యాబుద్ధులతో పాటు, వారితో తగిన సమయం గడపడం, వాళ్ళ అభిరుచులను గౌరవించాలి. వాళ్ళు స్వేచ్ఛగా, స్వతంత్ర వ్యక్తులుగా ఎదిగేలా తల్లిదండ్రులు సహకరించాలి. ఇవీ వారిపై నిజమైన ప్రేమకు నిదర్శనాలు. కానీ వాస్తవంలో చూస్తే... పిల్లలను తమ ఆస్తిపాస్తులు కాపాడే వారసులుగా, తమ కలలను, ఆశలను నెరవేర్చిపెట్టే సాధనాలుగా భావించటం, తమకన్నా విలాసవంతంగా బతకాలి అని కోరుకోవడం నేటి తల్లిదండ్రుల్లో ఎక్కువైపోయిందన్నది వాస్తవం. ఆలోచిస్తే ఇది పిల్లలపై ప్రేమ కాదు సరి కదా కేవలం స్వార్థపరత్వం. ఇక ఉద్యోగంలో తమను తాము నిరూపించుకోవడానికి ఒత్తిడి పెంచుకోవడం, సహోద్యోగులతో నిరంతర పోటీవైఖరి, పదోన్నతులు, జీతం పెంపుల కోసం యాతన పడడం, ఇలా ఉద్యోగమే జీవితం అయిపోయిన వాళ్ళు ఎందరో ఉన్నారు.

గృహస్థుగా ఉంటూనే...

ఇలాంటి హైటెక్, హైస్పీడ్ జీవితాల వేగం ఇలాగే కొనసాగిస్తూ 'రోజూ కాసేపు ధ్యానం' అంటూ సాధన చేయడం వృథా. ఇది జబ్బును పెంచి పోషిస్తూ ఉత్తుత్తి మాత్రలు మింగడం లాంటిది. వాహన వేగం పెంచుకుంటూ పోతూ బ్రేక్ పడాలని ప్రార్థించడం లాంటిది. సరళ జీవనం అంటే అందరూ ఋషులూ, సన్యాసులూ అయిపోవాలని కాదు. ఆ అవసరమూ లేదు. గృహస్థుగా ఉంటూనే... మితాహారం, వస్తు-సౌకర్యాలను పొదుపుగా వాడడం, ప్రకృతికి దగ్గరగా జీవించడం, ఏదో ఒక సృజనాత్మక వ్యాపకం పెంపొందించుకోవడం, భవిష్యత్తుపై అతిభయాన్ని తగ్గించుకోవడం, వర్తమానాన్ని పూర్తిగా ఆస్వాదించడం... ఇలాంటి మార్గాల ద్వారా జీవితాన్ని సరళతరం చేసుకుంటే ధ్యానం దానంతటదే కలిగే అనుభవం అవుతుంది. జీవితమే ధ్యానాత్మకమై వెలుగులీనుతుంది.

• ఈదర రవికిరణ్

సిద్ధి పొందాలంటే...

చింతన

సిద్ధ సంప్రదాయం గురించి తెలుసుకోవాలంటే 'సిద్ధి' అనే పదానికి అర్థం తెలుసుకోవాలి. అందుకోసం సాధన చేయాలి. గురువు నుంచి ఉపదేశ దీక్ష, మార్గదర్శకత్వం పొంది, యోగ మార్గంలో తీవ్ర సాధన చేసి... సాధకుడు తనలోని అరిషడ్వర్గాలను జయించాలి. ఆత్మసాక్షాత్కారం పొందాలి. అదే 'సిద్ధ స్థితి' లేదా 'సిద్ధ అవస్థ',

యోగికి ఆత్మసాక్షాత్కారం కలిగినప్పుడు... పూర్వకర్మలు, వాటి ప్రతిఫలాలు, అహం, ఆత్మ, జ్ఞానం, మాయ, సర్వేంద్రియాలు, ఇంద్రియ శక్తులు, మనస్సు తదితరాలన్నీ అతనిలోనే అంతర్గతంగా ఉన్న బ్రహ్మతత్వంలో లీనమవుతాయి. ఆ విధంగా సిద్ధావస్థకు చేరుకున్న యోగి బాహ్య స్పృహ కోల్పోతాడు. పరమాత్మలో లీనమవుతాడు. నిర్మల, నిర్గుణ, నిరామయ, నిత్య వర్తమాన స్థితిలో ప్రకాశిస్తూ ఉంటాడు. సృష్టిలోని జీవ పరిణామ క్రమంలో 84 లక్షల జీవరాశుల మీదుగా (తరు, శిల జన్మలు మొదలుకొని గోవు, మానవ జన్మల వరకూ) సాగే ప్రయాణంలో సర్వోన్నతమైన మానవ జన్మ నుంచి ఆత్మ సాక్షాత్కారం ద్వారా పరమేశ్వరునిలో లీనం కావడం అనేది సృష్టి తాలూకు నియమిత గమ్యం. సిద్ధపరంపరకు ఆది పురుషుడు పరమశివుడు. ఆ తరువాత కార్తికేయుడు, అగస్త్యముని మొదలుగా సిద్ధ సంప్రదాయంలో లోక కల్యాణార్థం ఎందరో మహాత్ములు తేజోమయ స్థితిలో విరాజిల్లుతున్నారు. దత్త తత్వంలో శివతత్వం అంతర్భాగం కాబట్టి ఆదిగురువైన పరంజ్యోతి దత్తప్రభువు... సిద్ధ సంప్రదాయానికి పరమావధి.

సిద్ధ స్థితిలో ఉన్న వ్యక్తిలో స్వతఃసంకల్పం, వ్యక్తిత్వం అనేవి శూన్యమవుతాయి. అతడు జీవన్ముక్తావస్థలో నిలిచి ఉంటాడు. పరమేశ్వరుడి సంకల్పం, దివ్య లీల లోక కల్యాణార్థం ఆ సిద్ధుని ద్వారా ప్రకటితమవుతాయి. యోగ మార్గంలో తపిస్తున్న యోగ్యులైన సాధకులకు పరమేశ్వర సంకల్పానుసారం సిద్ధ యోగులు భావతరంగాల మాధ్యమంలో సంకేత, సంబోధనల ద్వారా... కొన్ని సమయాల్లో స్వప్న సాక్షాత్కారం, సూక్ష్మ శరీర మాధ్యమం ద్వారా ప్రత్యక్ష, పరోక్ష మార్గదర్శకత్వాన్ని ప్రసాదిస్తూ ఉంటారు. దత్త ప్రభువుల లీలా విలాసంలో భాగంగా... 60 వేలమంది సిద్ధ యోగులు నిరంతరం ఈ విశాల విశ్వంలో కొలువై ఉంటారు. వారిద్వారా దత్తప్రభువు ఈ సృష్టిని పరిపాలిస్తూ ఉంటాడు. సమున్నత హిమాలయ ప్రాంతాల్లో... మామూలు కళ్ళకు కనిపించని నిగూఢమైన, అవాఙ్మానస గోచరమైన దివ్య సిద్ధ ఆశ్రమాలలో వందలాది, వేలాది సంవత్సరాలకు పైబడిన సిద్ధులు ఎందరో నివసిస్తున్నారు. వారి సంకల్పం, అనుగ్రహం ఉన్న సాధకులకు, జిజ్ఞాసులకు, అన్వేషకులకు సిద్ధాశ్రమ దర్శనానికి, ప్రవేశానికి అవకాశం కలుగుతుంది. తద్వారా ఆధ్యాత్మిక పరిణతి, పురోగతి సాధ్యమవుతుంది.



వివిధ కాలమాన పరిస్థితులలో మానవాళికి సంక్లిష్ట పరిస్థితులు ఏర్పడినప్పుడు... దత్త సంకల్పం ద్వారా కొంతమంది సిద్ధ పురుషులు మానవ జన్మ (కారణ జన్మ) ద్వారా... మానవాళికి ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం చేస్తారు. యోగమార్గాన్ని సరళం చేసి... కొన్ని తరాలవారికి జీవన అభ్యున్నతిని, ఆధ్యాత్మిక శక్తిని ప్రసాదిస్తారు. అనంతరం తమ కారణ జన్మలను చాలించి సిద్ధాశ్రమానికి మరలి వెళ్తారు. రామకృష్ణ పరమహంస, వివేకానంద, యోగానంద లాంటి సిద్ధ పురుషులు ఇందుకు ఉదాహరణలు.

• దేవరకొండ శ్రీకాంత్

స్పోర్ట్స్

హైదరాబాద్ ● శుక్రవారం 23 ఆగస్టు 2024

రేస్ వాకర్ భావనపై వేటు

న్యూఢిల్లీ: డోపింగ్ నిబంధనలను ఉల్లంఘించిన భారత రేస్ వాకర్ భావనా జాట్‌పై 16 నెలల నిషేధం విధించారు. నిరుడు ఆగస్టులో ఆమె.. తాను ఎక్కడున్నాననే సమాచారాన్ని జాతీయ డోపింగ్ నిరోధక కమిటీకి తెలియజేయడంలో నిర్లక్ష్యం వహించింది. దాంతో ఆమెపై వేటు వేశారు.

బంగ్లా బోర్డు కొత్త అధ్యక్షుడు ఫరూఖ్

ఢాకా: బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) కొత్త అధ్యక్షుడిగా మాజీ క్రికెటర్, చీఫ్ సెలెక్టర్ ఫరూఖ్ అహ్మద్ ఎన్నికయ్యాడు. బంగ్లాలో నెలకొన్న రాజకీయ సంక్షోభంతో నజ్ముల్ హసన్ దేశం విడిచి పారిపోవడంతో అతడిస్థానంలో అహ్మద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

జపాన్ ఓపెన్‌లో సతీష్ ఓటమి

యోకోహామా: జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ సతీష్‌కుమార్‌కు చుక్కెదురైంది. గురువారం జరిగిన రెండోరౌండ్‌లో సతీష్ 21-18, 18-21, 8-21తో కాంటాఫోన్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడాడు.

గుకేష్‌కు తప్పిన ఓటమి

సెయింట్ లూయిస్(యూఎస్): సింక్యూఫీల్డ్ కప్ చెస్ టోర్నీలో మూడో రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్ త్రుటిలో ప్రజ్ఞానంద చేతిలో ఓటమిని తప్పించుకొని డ్రాతో గట్టెక్కాడు. ఇతర గేముల్లో అబ్దుసత్తారోవ్‌పై కరువానా, అనీష్ గిరిపై నెపోమ్నియాచి గెలిచారు. అలీరెజా-లగ్రావ్, లిరెన్-వెస్లీతో గేమ్‌లు డ్రా అయ్యాయి.

బోల్ట్, ఫెల్ప్స్‌ను నిషేధించలేదే?

నటి తాప్సీ ఫైర్



న్యూఢిల్లీ: అల్జీరియాకు చెందిన వివాదాస్పద మహిళా బాక్సర్ ఇమానె ఖెలీఫ్‌కు బాలీవుడ్ నటి తాప్సీ పన్ను మద్దతు పలికింది. ఇటీవలి ఒలింపిక్స్‌లో తన లింగత్వంపై తీవ్ర విమర్శలు ఎదురైన విషయం తెలిసిందే. 'ఇమానెకు పుట్టుకతోనే టెస్టోస్టెరాన్ హార్మోన్లు అధిక స్థాయిలో ఉన్నాయి. ఇది ఆమె తప్పు కాదే! తనకు తానుగా సామర్థ్యం పెంచుకునేందుకు ఇంజెక్షన్ తీసుకోలేదు కదా? ఇదే సమస్యతో నిషేధానికి గురైన అథ్లెట్ (ద్యుతీచంద్) జీవితంపై నేను గతంలో సినిమా కూడా చేశాను. అయినా స్ప్రింటర్ ఉసేన్ బోల్ట్, స్విమ్మర్ మైకేల్ ఫెల్ప్స్‌లాంటి వారు ఇతరులతో పోలిస్తే శారీరకంగా కాస్త ప్రత్యేకంగా ఉంటారు. ఫెల్ప్స్‌కు ఇతరులకంటే పాదం పెద్దదిగా ఉంటుంది. మరి వారినెందుకు అప్పట్లో నిషేధించలేదు?' అని తాప్సీ ప్రశ్నించింది.

అదితి, నేహకు స్వర్ణాలు

అమ్మాన్: జోర్డాన్ రాజధాని అమ్మాన్‌లో జరుగుతున్న అండర్-17 వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ నాలుగు స్వర్ణాలతో సత్తా చాటింది. గురువారం జరిగిన మహిళల 43 కిలోల విభాగం ఫైనల్లో అదితి కుమారి 7-0తో మారియా లౌజియాని చిత్తు చేసి పసిడి పతకం సొంతం చేసుకోగా, 57 కిలోల తుది పోరులో నేహ 10-0తో సుట్సుయిపై విజయంతో స్వర్ణం అందుకుంది. 65 కిలోల ఫైనల్‌బౌట్‌లో పుల్కిత్ 6-3తో డారియాపై, 73 కిలోల్లో మాన్సి లాథర్ 5-0తో హనా పిర్స్‌కయాపై గెలిచి పసిడి పతకాలు దక్కించుకున్నారు. కాగా మరో ఇద్దరు భారత అమ్మాయిలు కాజల్ (69 కి), శ్రుతికా శివాజీపాటిల్ (46 కి) స్వర్ణం రేసులో నిలిచారు. వీరి ఫైనల్స్ శుక్రవారం జరగనున్నాయి.

చదువు కోసం ఆటకు వీడ్కోలు

టీటీ స్టార్ అర్చనా కామత్ నిర్ణయం



న్యూఢిల్లీ: భారత యువ టేబుల్ టెన్నిస్ ప్లేయర్ అర్చనా కామత్ సంచలన నిర్ణయం తీసుకుంది. కేవలం 24 ఏళ్ల వయస్సులోనే ఆటకు వీడ్కోలు పలుకుతున్నట్టు ప్రకటించింది. భారత మహిళల టేబుల్ టెన్నిస్ జట్టు పారిస్ ఒలింపిక్స్‌లో తొలిసారి క్వార్టర్స్‌కు చేరి చరిత్ర సృష్టించింది. ఆ టీమ్‌లో అర్చన కూడా సభ్యురాలే. జర్మనీతో జరిగిన పోరులో భారత్ 1-3తో ఓడగా.. ఆ ఒక్క గెలుపు కూడా అర్చనా కామత్ ద్వారానే రావడం విశేషం. అయితే మరో నాలుగేళ్ల తర్వాత లాస్‌ఏంజిల్స్‌లో జరిగే ఒలింపిక్స్‌లో పతకం సాధించే అవకాశం తక్కువగా ఉండడంతో ఆటను వదిలి విద్యపై దృష్టి సారించాలని భావిస్తోంది. త్వరలోనే యూనివర్సిటీ ఆఫ్ మిచిగాన్‌లో అర్చన పబ్లిక్ పాలసీపై మాస్టర్స్ చదివేందుకు యూఎస్ వెళ్లనుంది. వచ్చే గేమ్స్‌లో మెడల్ సాధించడం చాలా కష్టమేనని కోచ్ చెప్పడంతో..తన 15 ఏళ్ల కెరీర్‌కు వీడ్కోలు పలకడమే ఉత్తమమని కామత్ భావించింది.

స్వర్ణంపై నాగర్ నజర్

పారిస్ పారాలింపిక్స్



కృష్ణ నాగర్

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

భారత పారా షట్లర్ కృష్ణ నాగర్ జీవితం వడ్డించిన విస్తరి కాదు. చిన్ననాటినుంచి అతడి జీవితం సవాళ్ల మయం. ఆ సవాళ్ల నుంచి పాఠాలు నేర్చుకున్నాడు. తద్వారా కష్టాలకు ఎదురొడ్డి నిలవడం అలవాటు చేసుకున్నాడు. ఎత్తు తక్కువగా ఉన్నాడంటూ అతడిని అంతా హేళన చేసేవారు. ఆ అవహేళనలకు నాగర్ ఎప్పుడూ కుంగిపోలేదు. ఆ మరుగుజ్జుతనంతో సాధించిన విజయాలతో వారి నోళ్లు మూయించాడు. తొలి నాళ్లలో నాగర్ ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అయితే అవి అతడిలోని క్రీడా జిజ్ఞాసకు అడ్డుకాలేదు. క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, లాంగ్‌జంప్‌తోపాటు స్ప్రింట్‌లో ఈవెంట్లలో నాగర్‌కు ప్రవేశం ఉంది. బ్యాడ్మింటన్‌తో అతడి పయనం 2017లో జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో ఆరంభమైంది. అనతి కాలంలోనే అది పారా ఒలింపిక్స్‌కు దూసుకు పోయింది. 2021 అరంగేట్ర టోక్యో ఒలింపిక్స్‌ను కృష్ణ నాగర్ చిరస్మరణీయం చేసుకున్నాడు. ప్రమోద్ భగత్ తర్వాత పారా లింపిక్స్‌లో పసిడి పతకం సొంతం చేసుకున్న రెండో భారత షట్లర్‌గా చరిత్ర సృష్టించాడు. ప్రస్తుతం ఎస్‌హెచ్6 విభాగంలో తన స్వర్ణాన్ని నిలబెట్టుకోవడమే ధ్యేయంగా పారిస్ పారాలింపిక్స్‌లో అతడు బరిలో దిగుతున్నాడు. 'ఇవి నాకు రెండో పారా విశ్వక్రీడలు. మెగా ఈవెంట్ కావడంతో ఒకింత ఉత్కంఠగానూ ఉంది' అని 25 ఏళ్ల నాగర్ చెప్పాడు. ఎస్‌హెచ్6 అంటే పొట్టిగా ఉన్నవారు తలపడే విభాగం. 'ప్రతిష్ఠాత్మక క్రీడల్లో రెండోసారి పాల్గొనడం నిజంగా అద్భుతం...అదృష్టం. మరోసారి పసిడి పతకాన్ని సాధించి నాపై అంచనాలను నిలబెట్టుకోవడం ప్రథమ కర్తవ్యం' అని వివరించాడు. నాలుగు అడుగుల ఆరు అంగుళాల నాగర్ ..పారిస్‌లో తలపడుతున్న 13 మంది పారా షట్లర్లలో ఒకడు.

టోక్యో అపూర్వ విజయం అనంతరం అతడి జీవితం సాఫీగా సాగలేదు. గాయం నాగర్ బ్యాడ్మింటన్ కెరీర్ పురోగతికి అడ్డుపడితే.. తల్లి మరణం రూపంలో అతడికి మరో ఊహించని పరిణామం ఎదురైంది. అయితే మనోధైర్యానికి మారుపేరైన నాగర్ ఆ రెండు షాక్‌లనుంచి త్వరగానే కోలుకున్నాడు. 'టోక్యో క్రీడల తర్వాత పాదానికి గాయం అయ్యింది. అలాగే కొన్ని ఇతర సమస్యలూ వెంటాడాయి. ఇప్పుడు అన్నీ సర్దుకున్నాయి. ఆట గాడిలో పడింది. భిన్న పరిస్థితుల్లో, విభిన్న ప్రత్యర్థులకు దీటుగా ఎలా బదులివ్వాలనే అంశాలపై దృష్టి సారించా. వేగంగా లేదా మందకొడిగా ఉన్న కోర్టుల్లో పాజిటివ్ దృక్పథంతో ఆడుతూ సురక్షితంగా స్మాష్‌లు కొట్టాల్సి ఉంటుంది' అని నాగర్ తెలిపాడు. జైపూర్‌లో యదువేంద్ర సింగ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న నాగర్..గత ఫిబ్రవరిలో థాయ్‌లాండ్‌లో జరిగిన పారా వరల్డ్ బ్యాడ్మింటన్‌చాంపియన్‌షిప్స్‌లో టైటిల్ దక్కించుకున్నాడు. ఇక..డోపింగ్ నిబంధనలు ఉల్లంఘించడంతో స్టార్ షట్లర్ ప్రమోద్ భగత్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఫలితంగా పారిస్ క్రీడలకు అతడు దూరమయ్యాడు. దాంతో భారత్‌నుంచి టైటిల్ నిలబెట్టుకొనే ఏకైక షట్లర్‌గా నాగర్ నిలిచాడు.

వచ్చే జూన్ 20 నుంచి ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది భారత్‌తో జరిగే ఐదు టెస్టుల సిరీస్ షెడ్యూల్‌ను ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) గురువారం విడుదల చేసింది. దీనికోసం ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనున్న టీమిండియా 2025, జూన్ 20 నుంచి ఆగస్టు 4 వరకు ఈ సిరీస్ ఆడనుంది. ఇరు జట్ల మధ్య చివరిసారి 2021లో జరిగిన ఐదు టెస్టుల సిరీస్ 2-2తో డ్రాగా ముగిసింది. తాజా సిరీస్‌లో తొలి టెస్టుకు లీడ్స్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఆ తర్వాత జూలై 2-6న రెండో టెస్టు బర్మింగ్‌హామ్, జూలై 10-14న మూడో టెస్టు లార్డ్స్‌లో, నాలుగో టెస్టు జూలై 23-27న మాంచెస్టర్‌లో, ఆఖరి టెస్టు జూలై 31-ఆగస్టు 4న ది ఓవల్‌లో జరుగుతాయి.

మహిళల జట్ల మధ్య పరిమిత ఓవర్ల సిరీస్ షెడ్యూల్ విడుదల

హర్మన్‌ప్రీత్ సేనతో..: భారత పురుషుల జట్టు టెస్టు సిరీస్ ఆడతున్న సమయానే హర్మన్‌ప్రీత్ సేనతో ఇంగ్లండ్ మహిళల జట్టు 8 పరిమిత ఓవర్ల మ్యాచ్‌లు ఆడనుంది. ఇందులో భాగంగా జూన్ 28 నుంచి జూలై 12 వరకు ఐదు టీ20ల సిరీస్.. జూలై 16 నుంచి జూలై 22 వరకు మూడు వన్డేల సిరీస్ జరుగనున్నాయి. ఇదిలావుండగా.. 2026లో ప్రఖ్యాత లార్డ్స్ మైదానం తొలిసారిగా మహిళల టెస్టు క్రికెట్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య ఏకైక టెస్టు సిరీస్ ఇక్కడ జరుగనుంది.

ఎల్బ్రస్‌పై తెలుగు మహిళ



ఆంధ్రజ్యోతి (గల్ఫ్ ప్రతినిధి): ఐరోపా ఖండంలోని ఎత్తయిన పర్వత శిఖరం మౌంట్ ఎల్బ్రస్‌ను తాడేపల్లికి చెందిన బండారు అన్నపూర్ణ విజయవంతంగా అధిరోహించింది. ప్రస్తుతం సౌదీ అరేబియాలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న అన్నపూర్ణ నాలుగురోజుల కిందట ఈ ఘనత సాధించింది. 5,642 మీటర్ల పొడవైన ఈ శిఖరం ప్రపంచంలోని 10వ ఎత్తయిన పర్వతం. అన్నపూర్ణ గతేడాది టాంజానియాలోని కిలిమంజారో పర్వతాన్ని, అంతకుముందు 2020లో ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని కేదారకంఠ పర్వతాన్ని అధిరోహించింది.

రిజ్వాన్, షకీల్ శతకాలు

పాక్ 448/6 డిక్లేర్



రావల్పిండి: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో మహమ్మద్ రిజ్వాన్ (171 నాటౌట్), సౌద్ షకీల్ (141) శతకాలతో అదరగొట్టారు. ఓవర్‌నైట్ స్కోరు 158/4తో రెండోరోజైన గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన పాక్.. 6 వికెట్లకు 448 పరుగుల భారీస్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఐదో వికెట్‌కు రిజ్వాన్-షకీల్ జోడీ 240 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. షోరిఫుల్, హసన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత బంగ్లా ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 12 ఓవర్లలో 27 పరుగులు చేసింది. బంగ్లా మరో 421 పరుగులు వెనుకబడి ఉండగా, క్రీజులో షాద్‌మన్ (12 బ్యాటింగ్), జకీర్ హసన్ (11 బ్యాటింగ్) ఉన్నారు. మరోవైపు టెస్టు కెరీర్ తొలి 20 ఇన్నింగ్స్‌లోనే అత్యధిక పరుగులు (1108) సాధించిన తొలి ఆసియా బ్యాటర్‌గా షకీల్ రికార్డు నెలకొల్పాడు. గతంలో వినోద్ కాంబ్లీ (1056) పేరిట ఈ రికార్డు ఉండేది. అలాగే పాక్ తరపున వేగంగా వెయ్యి పరుగులు పూర్తిచేసిన బ్యాటర్‌గా సయీద్ అహ్మద్‌తో సమంగా నిలిచాడు.

ఆధిక్యంలో ఇంగ్లండ్

తొలి ఇన్నింగ్స్ 259/6

మాంచెస్టర్: శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ జట్టు స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతోంది. గురువారం రెండో రోజు వెలుతురులేమితో ఆట ముగిసే సమయానికి ఆతిథ్య జట్టు ఆరు వికెట్ల నష్టానికి 259 పరుగులు సాధించింది. జేమీ స్మిత్ (72 బ్యాటింగ్), హ్యారీ బ్రూక్ (56) అర్ధసెంచరీలతో రాణించారు. ప్రస్తుతం జట్టు 23 పరుగుల ఆధిక్యంతో ఉంది. అసిత ఫెర్నాండోకు మూడు, ప్రబాత్‌కు రెండు వికెట్లు దక్కాయి. శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 236 పరుగులు చేసింది. ఇక మిలన్ రత్నాయకె (72) టెస్టు అరంగేట్రంలోనే ఎక్కువ పరుగులు చేసిన తొమ్మిదో నెంబర్ బ్యాటర్‌గా రికార్డులకెక్కాడు.

జహీర్‌తో 'ఎల్ఎస్‌జీ' చర్చలు



న్యూఢిల్లీ: మాజీ పేసర్ జహీర్ ఖాన్‌ను మెంటర్‌గా తీసుకునేందుకు ఐపీఎల్ జట్టు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) అతడితో చర్చలు జరుపుతోంది. ఆటగాడిగా 100కి పైగా మ్యాచ్‌లాడిన జహీర్ విశేష అనుభవాన్ని ఉపయోగించుకోవాలని ఎల్ఎస్‌జీ ప్రయత్నిస్తోంది. జహీర్ ప్రస్తుతం ముంబై ఇండియన్స్ గ్లోబల్ డెవలప్‌మెంట్ హెడ్‌గా ఉన్నాడు.

బిజినెస్

27 నుంచి ప్రీమియర్ ఎనర్జీస్ ఐపీఓ

ఇష్యూ ధరల శ్రేణి రూ.427-450

రూ.2,830 కోట్ల సమీకరణ లక్ష్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన సోలార్ సెల్స్, మాడ్యూళ్ల తయారీ సంస్థ ప్రీమియర్ ఎనర్జీస్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈ నెల 27న ప్రారంభమై 29న ముగియనుంది. ఐపీఓ ద్వారా రూ.2,830 కోట్ల వరకు సమీకరించనున్న కంపెనీ.. ఇష్యూ ధరల శ్రేణిని రూ.427-450గా నిర్ణయించింది. ఈ ఐపీఓలో పెట్టుబడి పెట్టాలనుకునే రిటైల్ మదుపరులు కనీసం రూ.14,850 విలువ చేసే 33 షేర్ల కొనుగోలుకు బిడ్ వేయాల్సి ఉంటుంది. బిడ్ సైజును 33 షేర్ల చొప్పున పెంచుకునే వీలుంటుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.1,291.4 కోట్ల తాజా ఈక్విటీని జారీ చేయడంతో పాటు ప్రస్తుత ప్రమోటర్, వాటాదారులకు చెందిన రూ.1,539 కోట్ల విలువైన 3.42 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనున్నట్లు కంపెనీ ఎండీ చిరంజీవ్ సింగ్ సలూజా, చీఫ్ గ్రోత్ ఆఫీసర్ అడపా శ్రీనివాస్ తెలిపారు.

తాజా ఈక్విటీ జారీ ద్వారా సమకూరే నిధుల్లో రూ.968.6 కోట్లను కంపెనీ తన అనుబంధ విభాగమైన ప్రీమియర్ ఎనర్జీస్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ లో పెట్టుబడిగా పెట్టనుందని తెలిపారు. ఈ అనుబంధ విభాగం హైదరాబాద్‌లో నిర్మిస్తున్న 4 గిగావాట్ సోలార్ పీవీ టాప్‌కాన్ సెల్, 4 గిగావాట్ సోలార్ పీవీ టాప్‌కాన్ మాడ్యూల్ తయారీ ప్లాంట్ కోసం ఈ నిధులను వినియోగించుకోనుంది.

గత ఏడాది ఆదాయం రూ.3,143 కోట్లు

సెప్టెంబరు 3న కంపెనీ తన షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసే వీలుంది. లిస్టింగ్ అనంతరం కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.20,000 కోట్లకు పైగా ఉండే అవకాశం ఉంది. సోలార్ రంగంలో 29 ఏళ్ల అనుభవం కలిగిన ప్రీమియర్ ఎనర్జీస్.. 2 గిగావాట్ల సోలార్ సెల్స్, 4.13 గిగావాట్ల సోలార్ మాడ్యూళ్ల వార్షిక ఇన్‌స్టాలేషన్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. ప్రస్తుతం కంపెనీ ఐదు తయారీ యూనిట్లను కలిగి ఉంది. ఈ సంస్థ క్లయింట్ల జాబితాలో ఎన్‌టీపీసీ, టాటా పవర్ సోలార్ సిస్టమ్స్, పానాసోనిక్ లైఫ్ సొల్యూషన్స్, మాధవ్ ఇన్‌ఫ్రా తదితర కంపెనీలున్నాయి. తన ఉత్పత్తులను భారత్‌లో విక్రయించడంతో పాటు అమెరికా, చైనా, దక్షిణకొరియా, హాంకాంగ్, బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా, ఫ్రాన్స్, నేపాల్, మలేషియా దేశాలకు ఎగుమతి చేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో కంపెనీ రూ.3,143 కోట్ల ఆదాయంపై రూ.231 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.



24,800 ఎగువకు నిఫ్టీ

147 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

బీఎస్ఈ సెన్సెక్స్ వరుసగా మూడో రోజూ లాభపడింది. గురువారం ట్రేడింగ్‌లో సూచీ 147.89 పాయింట్లు పెరిగి 81,053.19 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 41.30 పాయింట్ల వృద్ధితో రెండు వారాల గరిష్ఠ స్థాయి 24,811.50 వద్ద స్థిరపడింది. సూచీ లాభపడటం వరుసగా ఇది ఆరో రోజు. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు కమోడిటీ, టెలికాం, కన్స్యూమర్ రంగ షేర్లలో కొనుగోళ్లు జరపడం నేటి ర్యాలీకి దోహదపడింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 17 లాభపడ్డాయి. ఎయిర్‌టెల్, టాటా స్టీల్, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్, ఏషియన్ పెయింట్స్ షేర్లు ఒక శాతానికి పైగా రాణించాయి. కాగా, బీఎస్ఈలోని మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు 0.67 శాతం వరకు పెరిగాయి. రంగాలవారీ సూచీల్లో టెలికాం, కమోడిటీస్ ఒక శాతానికి పైగా బలపడ్డాయి.

పవర్ మెక్ బోనస్ షేర్ల జారీ

వాటాదారులకు 1:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను జారీ చేయనున్నట్లు హైదరాబాద్‌కు చెందిన మౌలిక, నిర్మాణ రంగ కంపెనీ పవర్ మెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ గురువారం ప్రకటించింది. కంపెనీ షేర్‌హోల్డర్లు తాము కలిగి ఉన్న రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు బోనస్‌గా మరో షేరు లభించనుంది. అయితే, ఈ ప్రతిపాదనకు వచ్చే నెల 27న నిర్వహించనున్న కంపెనీ 25వ వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం)లో వాటాదారుల అనుమతి కోరనున్నట్లు పవర్ మెక్ వెల్లడించింది. బోనస్ షేర్ల జారీకి అర్హులైన షేర్‌హోల్డర్ల రికార్డు తేదీని కంపెనీ సెప్టెంబరు 28గా ఖరారు చేసింది.

ఐదేళ్లలో బంగారం రుణ మార్కెట్ రూ.14.19 లక్షల కోట్లకు

పీడబ్ల్యూసీ అంచనా



న్యూఢిల్లీ: దేశంలో బంగారం రుణాల సంఘటిత మార్కెట్ సైజు ఐదేళ్లలో రెట్టింపు కానుందని పీడబ్ల్యూసీ ఇండియా తాజా నివేదిక వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో సంఘటిత గోల్డ్ లోన్ మార్కెట్ గణనీయ వృద్ధితో రూ.7.1 లక్షల కోట్ల స్థాయికి చేరుకుందని నివేదిక వెల్లడించింది. తదుపరి ఐదేళ్లలో (2028-29 ఆర్థిక సంవత్సరం నాటికి) ఈ మార్కెట్ 14.85 శాతం సమ్మిళిత వార్షిక వృద్ధి (సీఏజీఆర్)తో రూ.14.19 లక్షల కోట్ల స్థాయికి చేరుకోవచ్చని అంచనా వేసింది. భారతీయులకు బంగారంపై మోజు ఎక్కువే. దేశీయ కుటుంబాలు దాదాపు రూ.126 లక్షల కోట్ల విలువ చేసే 25,000 టన్నుల బంగారాన్ని కలిగి ఉంటాయని పీడబ్ల్యూసీ తన నివేదికలో ప్రస్తావించింది. కాగా, లోన్ టు వాల్యూ (ఎల్‌టీవీ) నిష్పత్తి, తాకట్టులో ఉన్న బంగారం వేలం తదితర అంశాలకు సంబంధించి ఆర్‌బీఐ కఠిన నిబంధనల కారణంగా వచ్చే రేండేళ్లు గోల్డ్ లోన్ మార్కెట్ వృద్ధి అంతంత మాత్రంగానే ఉండవచ్చని అభిప్రాయపడింది. గోల్డ్ లోన్ మార్కెట్లో దక్షిణ భారతానిదే మెజారిటీ వాటా అని, మొత్తం పసిడి రుణ బకాయిల్లో 79.1 శాతం వాటా కలిగి ఉందని పీడబ్ల్యూసీ ఇండియా తెలిపింది.

పసిడి బాండ్లకు ప్రభుత్వం స్వస్తి!

మోదీ సర్కారు ఇకపై పసిడి బాండ్లను జారీ చేయకపోవచ్చని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మార్కెట్ నుంచి నిధుల సమీకరణ ప్రక్రియలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆఫర్ చేస్తున్న ఆర్థిక సాధనాల్లో పసిడి బాండ్లు ఒకటి. ఇన్వెస్టర్లకు భారీగా లాభాలు పంచుతున్నప్పటికీ, ప్రభుత్వానికి మాత్రం వీటి జారీ ద్వారా నిధుల సమీకరణ అత్యంత వ్యయంతో కూడిన ప్రక్రియగా మారింది. ఇందుకు తోడు పథకం సంక్లిష్టత కూడా ప్రభుత్వ విముఖతకు కారణమని తెలిసింది. దేశంలోకి పసిడి దిగుమతులను తగ్గించడంతో పాటు డిజిటల్ రూపంలో పసిడి కొనుగోళ్లను ప్రోత్సహించేందుకు 2015 నవంబరులో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రభుత్వం తరఫున భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఇప్పటివరకు 67 విడతల్లో గోల్డ్ బాండ్లను జారీ చేయగా.. ఇన్వెస్టర్లు వీటిల్లో మొత్తం రూ.72,274 కోట్ల పెట్టుబడులు పెట్టారు.

అదానీ పవర్ చేతికి లాంకో అమర్‌కంటక్ పవర్ ప్లాంట్

రూ.4,101 కోట్లకు కొనుగోలు

ఆమోదం తెలిపిన ఎన్‌సీఎల్‌టీ, హైదరాబాద్ బెంచ్

న్యూఢిల్లీ: లాంకో అమర్‌కంటక్ పవర్ లిమిటెడ్ (ఎల్ఏపీఎల్) కొనుగోలు కోసం అదానీ పవర్ సమర్పించిన ప్రణాళికకు జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), హైదరాబాద్ బెంచ్ ఆమోదం తెలిపింది. కార్పొరేట్ దివాలా రిజొల్యూషన్ ప్రక్రియ (సీఐఆర్‌పీ) ప్రక్రియలో భాగంగా లాంకో అమర్‌కంటక్ కొనుగోలుకు అదానీ పవర్ అప్‌ఫ్రంట్ రూపేణా రూ.4,101 కోట్లు చెల్లించనుంది. వంద శాతం నగదు రూపేణా ఈ మొత్తాన్ని చెల్లించటం ద్వారా ఎల్ఏపీఎల్‌లో మొత్తం వాటాను అదానీ పవర్ చేజిక్కించుకోనుంది. ఎన్‌సీఎల్‌టీ ఆదేశాలు జారీ చేసిన తేదీ నాటి నుంచి 60 రోజుల్లోపు అంటే అక్టోబరు 20 నాటి కల్లా ఈ కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుందని గురువారం నాడు అదానీ పవర్ తెలిపింది. ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా జిల్లా, పథాడీ గ్రామంలో ఒక్కోటి 300 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్లను లాంకో అమర్‌కంటక్ నిర్వహిస్తోంది. ఈ ప్లాంట్ తొలి దశలో ఉత్పత్తి అయిన విద్యుత్‌ను హరియాణా, మధ్యప్రదేశ్ డిస్కమ్స్‌కు విక్రయిస్తోంది. ఇందుకోసం ఆ రాష్ట్రాల డిస్కమ్స్‌తో దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను కూడా కుదుర్చుకుంది. అలాగే ఈ ప్లాంట్‌కు అవసరమైన బొగ్గు సరఫరాల కోసం కోల్ ఇండియా అనుబంధ సంస్థ సౌత్ ఈస్ట్రన్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎస్ఈసీఎల్)తో దీర్ఘకాలిక ఇంధన సరఫరా ఒప్పందాలను కుదుర్చుకుంది. కాగా రెండో దశలో ఒక్కోటి 660 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన అనుమతులను ఎల్ఏపీఎల్ ఇప్పటికే అందుకుంది.

మార్కెట్లోకి ఆడి సరికొత్త క్యూ8

ప్రారంభ ధర రూ.1.17 కోట్లు



ఆడి ఇండియా మార్కెట్లోకి సరికొత్త ఆడి క్యూ8 విడుదల చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.1,17,49,000 (ఎక్స్‌షోరూమ్). 3.0 లీటర్ టీఎఫ్ఎస్ఐ ఇంజన్‌తో కూడిన ఈ కారు కేవలం 5.6 సెకన్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. ఆర్21 గ్రాఫైట్ గ్రే అల్లాయ్ వీల్స్, 360 డిగ్రీ వ్యూ కెమెరా, 4-జోన్ క్లైమెట్ కంట్రోల్ సిస్టమ్‌తో కూడిన ఈ కారు నాలుగు రంగుల్లో అందుబాటులో ఉంటుంది. ఈ ఏడాది పండగ సీజన్‌లో కంపెనీ విక్రయాలు 50 వేల మార్కును అధిగమిస్తాయని అంచనా వేస్తున్నట్లు ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ థిల్లాన్ వెల్లడించారు.



● హీరో మోటోకార్ప్ మార్కెట్లోకి సరికొత్త హీరో గ్లామర్ 2024ను తీసుకువచ్చింది. ఆల్ న్యూ కలర్ ట్రిమ్, బ్లాక్ మెటాలిక్ సిల్వర్‌తో కూడిన ఈ బైక్‌ను కంపెనీ బ్రాండ్ అంబాసిడర్ రామ్ చరణ్, చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రంజివిజిత్ సింగ్ విడుదల చేశారు. రెండు వేరియంట్స్ డ్రమ్, డిస్క్‌తో అందుబాటులో ఉండనున్న ఈ బైక్ ధరలు వరుసగా రూ.83,598, రూ.87,598 (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి.



● టీవీఎస్ మోటార్ కంపెనీ.. ఆల్ న్యూ టీవీఎస్ జూపీటర్ 110 స్కూటర్‌ను విడుదల చేసింది. నెక్స్ట్ జెనరేషన్ లైట్‌వెయిట్ కాంపాక్ట్ ఫ్యూచరిస్టిక్ హై-పెర్ఫార్మెన్స్ ఇంజన్, ఐజీఓ అసిస్ట్, డబుల్ హెల్మెట్ స్పేస్‌తో ఈ స్కూటర్‌ను తీసుకువచ్చింది. 113.3 సీసీ, సింగిల్ సిలిండర్, 4 స్ట్రోక్ ఇంజన్ ఈ స్కూటర్ ప్రత్యేకతలు. డ్రమ్, డ్రమ్ అల్లాయ్, డ్రమ్ ఎస్ఎక్స్‌సీ, డిస్క్ ఎస్ఎక్స్‌సీ వేరియంట్లలో అందుబాటులో ఉండనున్న జూపీటర్ 110 ప్రారంభ ధర రూ.73,700.

హైదరాబాద్‌లో అహెడ్ కార్యాలయం

2025 చివరి నాటికి మరో 500 నియామకాలు

న్యూఢిల్లీ: క్లౌడ్, డేటా, ఇంజనీరింగ్ సొల్యూషన్స్ కంపెనీ అహెడ్.. హైదరాబాద్‌కు తన కార్యకలాపాలు విస్తరించింది. గత ఏడాది గురుగ్రామ్‌లో డెలివరీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసిన కంపెనీ తాజాగా హైదరాబాద్‌కు కార్యకలాపాలు విస్తరించిందని అహెడ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్, ఎండీ ప్రవీణ్ గ్రోవర్ తెలిపారు. ప్రధానంగా బడా క్లయింట్స్‌కు సేవలందించే ఉద్దేశంతో పాటు భారత్‌లో వ్యూహాత్మకంగా వృద్ధి అవకాశాలను చేజిక్కించుకునేందుకు ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కాగా వచ్చే ఏడాది చివరి నాటికల్లా మరో 500 మంది ఉద్యోగులను నియమించుకోనున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ సెంటర్‌లో 250 మంది ఉద్యోగులుండగా గురుగ్రామ్‌లో 400 మంది ఉద్యోగులు పనిచేస్తున్నట్లు గ్రోవర్ వెల్లడించారు.

జెన్ టెక్నాలజీస్ ట్రిగ్గర్ సెన్సింగ్ సిస్టమ్‌కు పేటెంట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రక్షణ రంగానికి అవసరమైన సిమ్యులేషన్ టెక్నాలజీ ఉత్పత్తులను అందిస్తున్న జెన్ టెక్నాలజీస్.. తన ఇన్నోవేటివ్ ఉత్పత్తి 'ట్రిగ్గర్ సెన్సింగ్ సిస్టమ్'కు పేటెంట్ లభించినట్లు ప్రకటించింది. 'టాక్సిమ్' శ్రేణిలోని ఉత్పత్తుల్లో ఇది కీలకమైన కాంపోనెంట్ అని, గురువారం దీనికి పేటెంట్ మంజూరైందని కంపెనీ వెల్లడించింది. ఈ క్యాలెండర్ సంవత్సరంలో కంపెనీ అందుకున్న 17వ పేటెంట్ ఇది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది ఏడో పేటెంట్ అని తెలిపింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,870 ▼	66,800 ▼	92,000 ▲
ముంబై	71,599 ▼	65,585 ▼	84,820 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

23వ తేదీ			
హైదరాబాద్	450	విజయవాడ	485
వరంగల్	452	గోదావరి	485
చిత్తూరు	508	విశాఖపట్నం	505
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	విజయవాడ	113
వరంగల్	107	గుంటూరు	110
కరీంనగర్	107	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	102
కర్నూలు	107	నెల్లూరు	102
విశాఖపట్నం	109	అనంతపురం	110
గోదావరి	113		



ఊపిరి తీసిన 'ఆవిరి'!

ఎసెన్షియాలో విస్ఫోటానికి అదే కారణం

(విశాఖపట్నం - ఆంధ్రజ్యోతి)

ఇంట్లో వంట గ్యాస్ లీక్ అయి గది నిండా ఆవరించినప్పుడు... కరెంటు స్విచ్ వేసినా భారీ పేలుడు సంభవిస్తుంది! పైకప్పు, గోడలను సైతం బద్దలు చేసేంత విధ్వంసం జరుగుతుంది. బుధవారం అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో జరిగిన విస్ఫోటం కూడా ఇలాంటిదే! ఇక్కడ ఈ విధ్వంసానికి కారణమైంది... మిథైల్ టెరిషరీ బ్యుటైల్ ఈథర్! ఈ ద్రవరూప రసాయనం లీకై ఎలక్ట్రిక్ కేబుళ్లపై పడటం... ఆ వేడికి ఆవిరి మేఘాలుగా మారడం... చిన్న 'స్పార్క్' కారణంగా భారీ విస్ఫోటం జరగడంతో 17 నిండు ప్రాణాలు బలైపోయాయి. ఫ్యాక్టరీలోని రియాక్టర్ పేలలేదని... ఆవిరి మేఘాల విస్ఫోటమే (వేపర్ క్లౌడ్ ఎక్స్‌ప్లోజన్) ఈ ఘోరానికి కారణమని తేలింది.

లీకేజీ ముందే గుర్తించినా...

ఎసెన్షియాలో అనుభవజ్ఞులు, నిపుణులైన సిబ్బంది ఉంటే... ఈ పేలుడు జరిగేదే కాదని తెలుస్తోంది. ఎందుకంటే... రెండో అంతస్థులోని రియాక్టర్ నుంచి గ్రౌండ్‌ఫ్లోర్‌కు పంప్ చేస్తున్న సాల్వెంట్... ఫ్లాంజ్ జాయింట్ వద్ద లీక వుతున్న విషయాన్ని సిబ్బంది గమనించారు. అది గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎలక్ట్రికల్ ప్యానల్స్‌పై పడుతున్నట్టు గుర్తించారు. దాని తీవ్రత, పరిణామాలు మాత్రం వారికి తెలియలేదు. అయినప్పటికీ లీకేజీని ఆపడానికి ప్రయత్నించారు. పైకి వెళ్లి సాల్వెంట్ పైపులైన్ వాల్వ్‌ను కట్టేశారు. అయితే... అప్పటికే రసాయన చర్య మొదలైంది. వేడిగా ఉన్న విద్యుత్ ప్యానెల్ బోర్డుపై... త్వరగా ఆవి రయ్యే స్వభావమున్న మిథైల్ టెరిషరీ బ్యుటైల్ ద్రావకం పడటంతో వెంటనే ఆవిరి మేఘాలు (వేపర్ క్లౌడ్స్) ఏర్పడ్డాయి. ఆ ఆవిరి బయటికి పోయే వీల్లేక... కేబుల్ డక్ట్ నుంచి గ్రౌండ్‌ఫ్లోర్ మొత్తం వ్యాపించింది. అంతలోనే స్పార్క్ వచ్చి పెద్ద పేలుడు సంభవించింది. ఆ ధాటికి గ్రౌండ్ ఫ్లోర్‌లోని సిమెంట్ స్తంభాలు విరిగిపోయాయి. గోడలన్నీ కూలిపోయాయి. వాటి కింద పడి కొందరు మృతిచెందారు. మంటలు వ్యాపించాయి. ఆవరణలో నిల్వ చేసిన రసాయనాలతో పాటు విద్యుత్ కేబుళ్లు కూడా అంటుకున్నాయి. దాంతో దట్టమైన పొగ అలుముకుంది. భయంతో పరుగులు తీసిన వారు శిథిలాలను ఢీకొట్టి గాయపడ్డారు. మరికొందరు మంటల్లో కాలిపోయారు. సిబ్బందిలో కొందరు ఫైర్ హైడ్రంట్ లైన్‌తో మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. కానీ... పంపింగ్ చేసినపుడు ఆగడం, మళ్లీ వెంటనే మంటలు చెలరేగడంతో నిస్సహాయులుగా మిగిలిపోయారు.

పైకి వెళ్లి ప్రాణాలు దక్కించుకున్న 13 మంది

ఎసెన్షియా కంపెనీ 250 మందిని నియమించుకోవడానికి ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుంది. అయితే, అక్కడ 380 మంది వరకు పని చేస్తున్నారు. బుధవారం విధుల్లో 40 మంది ఉన్నారు. మధ్యాహ్నం 2.18 గంటలకు పేలుడు సంభవించింది. అప్పుడే షిఫ్ట్ దిగిన ఒక బృందం బయటకు వస్తుండగా... రెండో షిఫ్ట్‌కు వచ్చిన వారు లోపలికి వెళ్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో పేలుడు సంభవించగానే 13 మంది పరుగులు తీస్తూ మెట్ల పైనుంచి పైఫ్లోర్‌కి వెళ్లిపోయారు. దాంతో వారి ప్రాణాలు దక్కాయి. పేలుడు ధాటికి పీడీ ల్యాబ్ విభాగాధిపతి అక్కడికక్కడే చనిపోయారు. కొందరు చెబుతున్నట్లుగా అక్కడ రియాక్టర్ పేలలేదని ఒక అధికారి తెలిపారు. 'వంట గదిలో ఎల్‌పీజీ గ్యాస్ లీకైనపుడు కరెంట్ స్విచ్ వేయగానే పేలుడు జరుగుతుంది. ఇక్కడ కూడా అదే విధంగా జరిగింది. ఆవిరి మేఘాలతో నిండిపోయిన హాలులో ఇగ్నిషన్ వల్ల పేలుడు సంభవించింది" అని వివరించారు. ఒక బ్లాక్‌లో గ్రౌండ్‌ఫ్లోర్ మొత్తం ధ్వంసం కావడం, కేబుల్ లైన్లన్నీ కాలిపోవడం వల్ల ఎసెన్షియాలో ఉత్పత్తిని తాత్కాలికంగా నిలిపి వేశారు. ఇతర బ్లాకుల్లో ఉత్పత్తి చేసినా సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని, కంపెనీని తాత్కాలికంగా మూసివేయాలని ఆదేశించినట్టు ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ నారాయణ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

డ్రోన్ కెమెరాతో పరిశీలన

ఈ ప్రమాదంపై అధికారులు ప్రాథమిక నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. పేలుడు సమయంలో కంపెనీ ఆవరణలో ఉన్న ఉద్యోగులతో మాట్లాడి, ఏం జరిగిందో తెలుసుకొని... దానిని సాంకేతికంగా విశ్లేషించి నివేదిక ఇచ్చారు. పరిశ్రమ నిర్వహణకు అనుమతులు ఇచ్చిన పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ, అగ్నిమాపక దళం అధికారులు కూడా ఫ్యాక్టరీ లోపలికి వెళ్లలేకపోయారు. భారీ పేలుడు, భవనంలో కొంత భాగం కూలిపోవడం, దట్టమైన రసాయన పొగల వల్ల లోపలికి వెళ్లలేదు. సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది మాత్రమే లోపలికి వెళ్లి గాయపడిన వారిని రక్షించారు. మృతదేహాలను బయటికి తెచ్చారు. లోపల ఇంకా మృతదేహాలున్నాయా? బాధితులున్నారా? అనే విషయాలు తెలుసుకోవడానికి డ్రోన్ కెమెరా పంపి క్షుణ్ణంగా పరిశీలించారు. సీఎం చంద్రబాబు గురువారం కారిడార్‌లో నిలబడే ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. లోపలికి వెళ్లడం మంచిది కాదని నిపుణులు సూచించడంతో బయటే ఆగిపోయారు.

అచ్యుతాపురం ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

▸▸ మృతుల కుటుంబాలకు 2 లక్షలు, క్షతగాత్రులకు 50 వేల సాయం

న్యూఢిల్లీ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'అనకాపల్లిలోని ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో భారీ మొత్తంలో ప్రాణనష్టం జరగడం బాధాకరం. ఆత్మీయులను కోల్పోయిన వారికి సానుభూతిని తెలియజేస్తున్నాను. ఈ దుర్ఘటనలో గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని కోరుకొంటున్నాను. మృతుల కుటుంబాలకు ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి (పీఎమ్ఎన్ఆర్ఎఫ్) నుంచి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు వంతున ఎక్స్‌గ్రేషియా అందజేస్తాం' అని మోదీ ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు.

ఖర్గే, ప్రియాంక ఆవేదన

న్యూఢిల్లీ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలోని ఫార్మా సెజ్‌లో జరిగిన భారీ పేలుడు ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఎక్స్ వేదికగా గురువారం ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం తక్షణమే బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఖర్గే ఆకాంక్షించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాద ఘటనపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు ప్రభుత్వం సత్వర చికిత్స అందించాలన్నారు. బాధిత కుటుంబాలకు తగిన పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఏడాది కిందటే హెచ్చరించినా!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఎసెన్షియా ఫార్మా కంపెనీలో అడుగడుగునా భద్రతా లోపాలే! ఇది ఇప్పుడు గుర్తించిన విషయం కాదు! ఏడాది కిందటే జరిగిన భద్రతా ఆడిట్‌లో ఈ విషయం స్పష్టమైంది. ప్రొడక్షన్ బ్లాక్‌లోని రియాక్టర్ నుంచి పీడీ ల్యాబ్ ద్వారా ట్యాంకులోని రసాయనాన్ని సరఫరా చేసే సమయంలో... పైప్‌లైన్ నుంచి ఆ మిశ్రమం లీక్ అయ్యి ఆవిరిగా మారింది. అది వాతావరణంలోని వాయువులతో కలిసి... రసాయన చర్య జరగడంతో భారీ పేలుడు సంభవించిందని ఫ్యాక్టరీస్ విభాగం డైరెక్టర్ చంద్రశేఖర్ వర్మ ప్రభుత్వానికి ఇచ్చిన ప్రాథమిక నివేదికలో తెలిపారు. ఈ భద్రతాపరమైన లోపాలన్నీ దాదాపు ఏడాది క్రితం నిర్వహించిన ఓఎస్ ఆడిట్‌లో వెలుగు చూశాయి. మరీ ముఖ్యంగా పైప్‌లైన్ల వ్యవస్థ సరిగా లేదని, సరిచేసుకోవాలని ఆడిట్ బృందం ఫ్యాక్టరీ యాజమాన్యానికి సూచించింది. అయినప్పటికీ పట్టించుకోకపోవడంవల్లే బుధవారం ఘోర ప్రమాదం సంభవించింది.

ఎసెన్షియాలో అనేక భద్రతా లోపాలు

సెక్యూరిటీ ఆడిట్‌లో వెల్లడైన డొల్లతనం

ఆడిట్‌లో గుర్తించిన లోపాలు ఇవే...

- అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫ్యాక్టరీలో విషపూరిత వాయువులు, మండే వాయువులు, రసాయనిక ద్రావకాలు, ఇతర ఔషధ పదార్థాలను పరిమాణానికి మించి నిల్వ చేస్తున్నారు.
- పైప్‌లైన్ లీకేజీ సమస్యలను పరిష్కరించేందుకు ఎలాంటి విధానాన్ని ఏర్పాటు చేయలేదు. పైప్‌లైన్ టెస్టింగ్ మెథడాలజీని కూడా అమలు చేయడం లేదు. ఈ ఫార్మా కంపెనీలో ప్రాసెస్ ఎక్విప్‌మెంట్‌కు సంబంధించిన పైప్‌లైన్లు, ట్రాన్స్‌ఫర్ పైప్‌లైన్లు కూడా సరిగ్గా లేవు. పైప్‌లైన్లు తుప్పు పట్టకుండా తగిన రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయలేదు.
- పైపులైన్ల నిర్వహణకు వీలుగా నడక మార్గం కూడా లేకుండా వాటిని ఇష్టానుసారంగా ఏర్పాటు చేసేశారు. భద్రతాపరమైన ఈ లోపాలన్నింటినీ సరిచేయడంతోపాటు పైప్‌లైన్లు అందరికీ కనిపించే ప్రదేశాలలో ఫ్లో డైరెక్షన్ మార్కింగ్స్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది.
- ఎసెన్షియా కంపెనీలోని ఫైర్ ఫైటింగ్ విభాగంలో పంప్‌హౌస్ ప్రవేశ ద్వారం వద్ద ఎంసీపీ పని చేయడం లేదు. కంపెనీలో ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినప్పుడు ఎమర్జెన్సీ సమయంలో సమర్థవంతంగా ప్రతిస్పందించేందుకు తగిన నైపుణ్యాలు కలిగిన స్కిల్ టీమ్స్ లేవు.
- ఈ కంపెనీ ల్యాబ్‌లో పనిచేస్తున్న క్వాలిటీ సెల్ బృందంతోపాటు ప్రాసెస్ విభాగంలోని బృందంతో మాట్లాడినప్పుడు... వారిలో కనీస నైపుణ్యాలు కూడా లేవని తేలింది. అగ్నిమాపక కార్యకలాపాలపై అవగాహన, మాక్‌డ్రిల్స్ ద్వారా నైపుణ్యాలను మెరుగుపరచాల్సిన అవసరముంది.
- హైడ్రెంట్ హౌస్ దగ్గర వాటర్ ట్యాంకులకు టో గార్డులను ఏర్పాటు చేయాలి. ఫైర్ హైడ్రెంట్ పంప్ హౌస్ వద్ద ప్రైమింగ్ ట్యాంక్ సామర్థ్యాన్ని తనిఖీ చేయడానికి, పంప్ సక్షన్ హెడర్‌కు సంబంధించి అవసరమైన వాల్యూమ్‌తో భర్తీ చేయాలి.

కలెక్టర్లదే బాధ్యత!

కార్మికులు, ప్రజల ప్రాణాలకు అత్యంత ప్రాధాన్యమివ్వాల్సిన పరిశ్రమల యాజమాన్యాలు భద్రతా చర్యలను గాలికొదిలేస్తున్నాయి. తాజాగా జరిగిన ఎసెన్షియా ప్రమాదమే దీనికి నిదర్శనం. ఏడాది కిందట భద్రతా ఆడిట్‌లో లేవనెత్తిన అంశాలపై దృష్టి సారించి ఉంటే ఇప్పుడు ఈ ప్రమాదం జరిగేది కాదని అధికారులు చెబుతున్నారు. పరిశ్రమల్లో తీసుకోవాల్సిన భద్రత చర్యలపై ప్రభుత్వం కొన్ని సాధారణ నియమాలను రూపొందించింది. రసాయనాలు, వేడి, భౌతిక ప్రభావాల వల్ల సంభవించే ప్రమాదాల నుంచి రక్షణ పొందడం కోసం కార్మికులు చేతులకు తొడుగులు, కళ్లకు గాగుల్స్, రెస్పిరేటర్లు వంటివి ధరించాలి. రాష్ట్రంలోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించాలి. భద్రతా వైఫల్యాలు లేకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత ప్రభుత్వ విభాగాలు, కలెక్టర్లపై ఉంది. జిల్లాల్లో కలెక్టర్లు చైర్మన్లుగా ఆయా శాఖల అధికారులతో నియమించిన కమిటీలు క్రియాశీలకంగా పనిచేస్తూ ప్రతి ఆరు నెలలకొకసారి అన్ని పరిశ్రమలను తనిఖీ చేసి, భద్రతా చర్యలను పరిశీలించాలి. జిల్లా స్థాయి కమిటీలు గుర్తించిన లోపాలు, తీసుకున్న చర్యలను స్టేట్ లెవెల్ మానిటరింగ్ కమిటీకి నివేదించాలి. ఈ మానిటరింగ్ ప్రక్రియ సక్రమంగా జరగకపోవడం వల్లే వరుస ప్రమాదాలు సంభవిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పేలుడు సంభవించిన ఎసెన్షియా కర్మాగారాన్ని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

విశాఖ మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న చంద్రబాబు



ఆదుకుంటాం!

ధైర్యంగా ఉండండి.. మేమున్నాం: సీఎం

అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా కర్మాగారంలో సంభవించిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, విశాఖపట్నం వెంకోజీపాలెం మెడికవర్ ఆస్పత్రి నాలుగో అంతస్థులోని ఐసీయూకు చేరుకున్న చంద్రబాబు ప్రతి బెడ్ వద్దకు వెళ్లి బాధితుల్లో ధైర్యం నింపారు. 'మీరు ధైర్యంగా ఉండండి.. ఏమీ కాదు.. మేమంతా ఉన్నాం.. పూర్తిగా నయమయ్యే వరకు ఖర్చుకు చూడకుండా చికిత్స అందిస్తాం' అని భరోసా ఇచ్చారు. కర్మాగారంలో అసలేం జరిగిందో వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం సంభవించిన తరువాత షాక్‌లో ఉన్న వ్యక్తి వద్దకు వెళ్లి ధైర్యం చెప్పారు. అనంతరం ఐసీయూ బయట ఉన్న హాల్లో క్షతగాత్రుల బంధువులతో మాట్లాడారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఖర్చుకు వెనుకాడవద్దని, పూర్తిగా నయమయ్యే వరకు చికిత్స అందిస్తామని భరోసా ఇచ్చారు.

(మొదటి పేజీ తరువాయి)

విశాఖ నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. అలాగే ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులను విశాఖ కేజీహెచ్‌లోని మార్చురీ వద్ద సీఎం పరామర్శించారు. ప్రతి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ ప్రమాదంలో 17మంది ప్రాణాలు కోల్పోగా, పదిమంది తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని, 36మందికి సాధారణ గాయాలు, 26మందికి స్వల్ప గాయాలు అయ్యాయని వివరించారు. మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇస్తున్నామని, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.25 లక్షలు పరిహారంగా అందిస్తామని సీఎం ప్రకటించారు. బాధిత కుటుంబాలకు ఎసెన్షియా కంపెనీయే పరిహారం చెల్లిస్తుందని వివరించారు. అనంతరం విశాఖ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 2.30 గంటలకు అచ్యుతాపురంలోని లారస్ ఫార్మా కంపెనీలో హెలీప్యాడ్‌కు సీఎం చేరుకున్నారు. ఎసెన్షియా కంపెనీలో ప్రమాదం జరిగిన బ్లాకు వద్దకు రోడ్డుమార్గంలో వెళ్లారు. కంపెనీలో ఉద్యోగులు, అధికారులతో మాట్లాడి ప్రమాదానికి కారణాలు తెలుసుకున్నారు. ఘటన జరిగిన ప్రదేశాన్ని మ్యాప్ ద్వారా కలెక్టర్ విజయకృష్ణన్, కంపెనీ ప్రతినిధులు ఆయనకు వివరించారు. అనంతరం సమీపంలోని లారస్ ఫార్మా కంపెనీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ఫార్మా కంపెనీల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకోవడం బాధాకరమని, రానున్న రోజుల్లో పరిశ్రమల ఏర్పాటుతో పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా ఉద్యోగుల భద్రతకు అవసరమైన కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఎసెన్షియా కంపెనీ రెడ్ కేటగిరీలో ఉందని అన్నారు. ఆరు నెలల గర్భిణి, వివాహమై రెండేళ్లు కూడా కాని యువతి భర్త చనిపోవడం తన మనసును కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాల పరిస్థితిని చూసి చలించిపోయానని చెప్పారు.

ఇదే చివరి ప్రమాదం కావాలి

ఎసెన్షియా కర్మాగారంలో జరిగిన ప్రమాదమే రాష్ట్రంలో చివరిది కావాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. కర్మాగారాల్లో ప్రమాదాలను జీరో స్థాయికి తీసుకువచ్చేలా శాశ్వత స్థాయిలో పటిష్ఠమైన భద్రతా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సెజ్‌లో జరిగింది అత్యంత దురదృష్టకరమైన ఘటనగా పేర్కొన్నారు. తమ ప్రభుత్వం కర్మాగారాల్లో అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని చెప్పారు. గత ప్రభుత్వం వ్యవస్థలను సర్వనాశనం చేసిందని ఆరోపించారు. ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నవారితో మాట్లాడామని, వారికి పూర్తిగా నయమయ్యేలా ఎన్ని రోజులైనా ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందని భరోసా ఇచ్చానని తెలిపారు. ఈ దుర్ఘటనలో సంస్థ యాజమాన్యం నిర్లక్ష్యం ఉంటే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అచ్యుతాపురం, పరవాడ సెజ్‌లలో ఉన్న కర్మాగారాలకు సమీపంలో బర్న్స్ ఆస్పత్రి ఏర్పాటు దిశగా యోచిస్తామని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు రావాల్సిన అవసరముందని, అయితే కంపెనీల్లో ఉన్నత ప్రమాణాలతో కూడిన భద్రతా చర్యలు చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. అచ్యుతాపురం సెజ్‌లోని 1,949 ఎకరాల్లో 95 ప్లాట్లు ఉన్నాయని, 66 ప్లాట్స్ ఇప్పటికే కంపెనీలకు కేటాయించగా 36 పరిశ్రమలు వచ్చాయని ఇందులో 26 పనిచేస్తున్నాయని వివరించారు. ప్రమాదం జరిగిన ఫార్మా కంపెనీలో పూర్తి స్థాయి భద్రతా చర్యలు చేపట్టలేదని తెలిపారు. గతంలో ఎల్‌జీ పాలిమర్స్‌లో ప్రమాదం జరిగినప్పుడు నాటి ప్రభుత్వం హైపవర్ కమిటీని వేసిందని, అయితే విచారణ పక్కాగా జరగకపోవడం వల్ల ఈరోజు ఇటువంటి ప్రమాదాలు తరచూ జరిగే పరిస్థితులు వచ్చాయని వ్యాఖ్యానించారు. ఎసెన్షియా కర్మాగారం ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులు, ఉద్యోగుల కుటుంబసభ్యులను విశాఖ కేజీహెచ్‌లోని మార్చురీ వద్ద సీఎం చంద్రబాబు గురువారం మధ్యాహ్నం పరామర్శించారు. ప్రతి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాల్లో డిగ్రీ అర్హత ఉన్న వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తానని సీఎం హామీ ఇచ్చినట్టు బాధిత కుటుంబసభ్యులు పేర్కొన్నారు. కాగా, ప్రమాద ఘటనపై విమర్శలు చేస్తున్న వైసీపీ నాయకులపై చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాను అధికారంలోకి వచ్చి 60 రోజులే అయిందని, ఐదేళ్ల చేతగాని, అసమర్థ వైసీపీ ప్రభుత్వ పాలన వల్ల వ్యవస్థలు కూలిపోయాయని అన్నారు.

హైలెవల్ కమిటీతో విచారణ

ఎసెన్షియా కంపెనీలో జరిగిన ప్రమాదంపై హైలెవల్ కమిటీని ఏర్పాటుచేసి, విచారణ జరిపిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. పారిశ్రామికవేత్తలకు ఇబ్బందులు లేకుండా విచారణ చేపడతామని తెలిపారు. ఎసెన్షియా కంపెనీలోని ఓ పెట్టుబడిదారుడికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నందున డెక్కన్ కెమికల్స్‌ను భాగస్వామిగా తీసుకొచ్చారని, తరువాత వారి మధ్య వివాదాలు తలెత్తాయని చెప్పారు. కాగా, కంపెనీలో ఇంతపెద్ద ఘటన జరిగాక కంపెనీ ప్రమోటర్లు రావాల్సి ఉండగా ఇంతవరకు వారి జాడ లేదని సీఎం అసహనం వ్యక్తం చేశారు. పారిశ్రామికవేత్తలను ప్రభుత్వం గౌరవిస్తుందని, కంపెనీ నిర్వాహకులు కూడా బాధ్యతగా ఉండాలన్నారు. విచారణ కమిటీ నివేదిక వచ్చాక ఎవరు తప్పు చేసినా శిక్ష తప్పదని, ఎంతటివారైనా వదిలేది లేదని చంద్రబాబు స్పష్టం చేశారు.

మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం

విశాఖపట్నం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం సెజ్ ప్రమాదంలో మృతిచెందిన 17మంది కుటుంబీకులకు ఎసెన్షియా కంపెనీ ఇవ్వనున్న పరిహారానికి సంబంధించి అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ 17మంది పేర్లతో గురువారం ప్రొసీడింగ్స్ జారీ చేశారు. దీని ప్రకారం ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు పరిహారం అందించనున్నారు. కాగా, ఈ ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు కౌన్సెలింగ్ నిర్వహించాకే రూ.కోటి చొప్పున నష్టపరిహారాన్ని పంపిణీ చేస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. బాధిత కుటుంబాలకు ముందుగా ప్రొసీడింగ్స్ కాపీలను అందించామని చెప్పారు. చెక్కులు కూడా సిద్ధం చేశామని, ఆయా కుటుంబాల్లో పరిహారం కోసం సభ్యులు వాదులాడుకుంటున్నారని తెలిపారు.

ఎసెన్షియా యాజమాన్యంపై కేసు నమోదు

ఎసెన్షియా ఫార్మా కంపెనీ యాజమాన్యంపై గురువారం కేసు నమోదు చేసినట్టు రాంబిల్లి సీఐ నరసింగరావు తెలిపారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగి ఉండవచ్చునని, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తహసీల్దార్ పి.భాగ్యవతి పేర్కొన్నారు.


తడి ఆరని కన్నులు..

ఎవరిని కదిలించినా ఆవేదనా స్వరాలు.. కన్నీటి గాథలు

విశాఖపట్నం, పార్వతీపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల క్రితమే వివాహమైన కొత్త పెళ్లికొడుకు ఒకరు..! ఉద్యోగంలో చేరాక ఒక్క జీతం కూడా తీసుకోకుండానే మృత్యుఒడికి చేరిన యువకుడు మరొకరు..! సొంతింటి కలను నిజం చేసుకునేందుకు పదేళ్లుగా ఉద్యోగం చేస్తున్న ఉద్యోగి.. ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించిన మూడు నెలల్లోనే అశువులు బాశాడు. ఇలా... అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులు, ఉద్యోగుల కుటుంబాలది ఒక్కొక్కరిదీ ఒక్కో దీన గాథ. కేజీహెచ్ మార్చురీ వద్ద ఎవరిని కదిలించినా ఆవేదనా స్వరాలే వినిపిస్తున్నాయి. కన్నీరు ధారలై కారుతోంది.

స్నేహితుడి కోసం డ్యూటీకి వెళ్లి...

పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం మండలం డోకిశిల పంచాయతీ చలమనాయుడువలస గ్రామానికి చెందిన జి.పార్థసారథి (21) ఐటీఐ పూర్తిచేసి 2022, సెప్టెంబరులో ఈ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. బుధవారం మధ్యాహ్నం.. ఆయనకు షిఫ్ట్ లేనప్పటికీ స్నేహితుడి కోసం విధుల్లోకి వెళ్లి ప్రాణాలు కోల్పోయాడు. ఇటీవల పార్థసారథికి పెళ్లి సంబంధం కుదిరింది. దీంతో బుధవారం సెలవు పెట్టి.. విశాఖపట్నంలో తన కుటుంబ సభ్యులతో కలిసి బంగారు ఆభరణాలు కొనుగోలు చేయాల్సి ఉంది. కానీ అనుకోని పరిస్థితుల్లో స్నేహితుడి కోసం విధులకు వెళ్లి విగతజీవిగా మారాడు. పెళ్లి ఏర్పాట్లలో ఉన్న తల్లిదండ్రులు కోటేశ్వరరావు, రమణమ్మ, సోదరుడు, సోదరి పార్థసారథి మృతి విషయం తెలిసి శోకసంద్రంలో మునిగిపోయారు.



పెళ్లైన నాలుగు నెలలకే..

అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం దార్లపూడికి చెందిన జవ్వాది చిరంజీవి మూడేళ్లుగా కంపెనీలో పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన లీలాదేవిని ప్రేమించి ఈ ఏడాది ఏప్రిల్ 20న పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం ఆమె మూడు నెలలు గర్భిణి. భర్త ఇక లేడన్న విషయం తెలిసి కేజీహెచ్‌లోని మార్చురీ వద్ద కన్నీరుమున్నీరుగా విలపించింది. జీవితాంతం తోడుగా ఉంటాడని ప్రమాణం చేసిన భర్త నాలుగు నెలలకే దూరమయ్యాడంటూ రోదించింది. తనకు పుట్టబోయే బిడ్డ.. 'నాన్న ఎక్కడున్నాడమ్మా..' అంటే ఏమి చెప్పాలో తెలియడం లేదంటూ కుమిలిపోయింది.

ఇల్లు కట్టాలన్నది కల..

ప్రమాదంలో మృతిచెందిన హంస ప్రశాంత్‌ది శ్రీకాకుళం జిల్లా పొందూరు. స్వగ్రామంలో సొంతిల్లు నిర్మించాలన్నది అతడి కల. ఆరేళ్ల కిందట జ్యోతితో వివాహమైంది. వారికి నాలుగేళ్ల పాప వాన్విక ఉంది. మూడు నెలల క్రితమే మరో బిడ్డ జన్మించింది. ఏడేళ్లుగా ఇదే సంస్థలో పనిచేస్తున్న ప్రశాంత్ మూడు నెలల క్రితం ఇంటి నిర్మాణ పని కూడా మొదలుపెట్టాడు. ఈ నెల 15న గుమ్మాలు పెట్టించాడు. ఆ తర్వాతి రోజు విధులకు హాజరై ప్రమాదంలో మృతి చెందాడు. ప్రశాంత్ మృతిచెందిన విషయం ఆయన భార్యకు తెలియపరచలేదని ప్రశాంత్ తల్లి సత్యవతి చెప్పింది. ఇల్లు కట్టుకోవాలన్న కొడుకు కోరిక తీరకుండానే చనిపోయాడని.. తన ఇద్దరు మనువరాళ్ల భవిష్యత్తు ఏమిటంటూ విలపించింది.





ఒక్క జీతమూ తీసుకోకుండానే...

శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన పైడి రాజశేఖర్ గత నెల 15న సంస్థలో చేరాడు. గత నెలలో 15 రోజులకు సంబంధించిన వేతనం సాంకేతిక కారణాలతో జమ కాలేదు. ఈ నెల, గత నెల జీతం వచ్చే నెల ఒకటో తేదీన పడుతుందని స్నేహితులకు చెప్పాడు. పార్టీ ఇస్తానని కూడా వారికి మాటిచ్చాడు. దురదృష్టవశాత్తు ప్రమాదంలో మృతి చెందాడని స్నేహితులు రోదిస్తున్నారు. చేతికి అందివచ్చిన వాడు మృతి చెందడంతో తనకు అంతా శూన్యంగా మారిందని రాజశేఖర్ తల్లి తులసమ్మ కుమిలిపోయింది.

నిత్యం కుమారుడి ఆలోచనే...



కాకినాడ జిల్లా బిక్కవోలుకు చెందిన కొప్పర్తి గణేష్ తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కొడుకు. ఐదేళ్ల కిందట అరుణతో వివాహమైంది. ఎసెన్షియాలో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న ఆయనకు నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. ఎప్పుడూ కొడుకు గురించే ఆలోచిస్తుంటాడని, బాగా చదివించి ప్రయోజకుడిని చేయాలనేని చెప్పేవాడని, ఇప్పుడు నాన్న లేడన్న విషయాన్ని ఆ చిన్నారికి ఎలా చెప్పాలని ఆయన భార్య అరుణ కన్నీటి పర్యంతమైంది. ఆమెను సీఎం చంద్రబాబు ఓదార్చారు. డిగ్రీ చేసి ఉండడంతో ఉద్యోగ అవకాశం కల్పిస్తామని చెప్పారు.



కుటుంబానికి దిక్కెవరు..?

నాలుగేళ్లుగా సంస్థలో పనిచేస్తున్న మహంతి నారాయణకు ఉద్యోగం తప్ప మరో వ్యాపకం లేదు. నాలుగేళ్ల కిందట వివాహం కాగా, మూడేళ్ల కుమారుడున్నాడు. అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న నారాయణ మృతితో మార్చురీ వద్దకు వచ్చిన తండ్రి సత్యం తన కుటుంబానికి దిక్కెవరంటూ బోరున విలపించాడు.

షాక్‌తో జ్ఞాపకశక్తి కోల్పోయి..

ఎసెన్షియా కంపెనీలో ఘటనలో తీవ్రంగా గాయపడిన మునగపాక మండలం మానేపల్లి గ్రామానికి చెందిన వై.మహేశ్ తీవ్ర షాక్‌కు గురై తాత్కాలికంగా జ్ఞాపకశక్తిని కోల్పోయాడు. మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అతడితో సీఎం చంద్రబాబు మాట్లాడేందుకు ప్రయత్నించగా.. తనకు ఏమీ గుర్తు లేదని, ఏం జరిగిందో మరిచిపోయానని వెల్లడించాడు.



అత్యవసర ఫోన్‌తో ముందే డ్యూటీకి..

కంపెనీకి మూడు కిలోమీటర్ల దూరంలోని మోటూరు ప్రాలెం గ్రామానికి చెందిన పూడి మోహన్ ప్రమాదంలో మృతిచెందిన తీరు తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. మంగళవారం నైట్ డ్యూటీ చేసిన మోహన్.. బుధవారం రాత్రి డ్యూటీకి వెళ్లాలి. కానీ.. విధి మరోలా తలిచింది. కంపెనీ నుంచి అత్యవసరం అంటూ ఫోన్ రావడంతో ఆయన మధ్యాహ్నమే డ్యూటీకి వెళ్లాడు. ఇదే కంపెనీలో పనిచేస్తున్న తన అన్నయ్య నాని ఉదయం షిఫ్ట్ ముగించుకుని ఇంటికి వస్తున్నాడు. మార్గమధ్యలోనే అన్నయ్య వద్ద బైక్ తీసుకున్న మోహన్ వేగంగా కంపెనీకి వెళ్లాడు. నాని ఇంటికొచ్చి అన్నం తినేందుకు సిద్ధమవుతున్న సమయంలో ప్రమాదం జరిగిందని, మోహన్ చనిపోయాడన్న వార్త తెలిసింది. మూడేళ్లుగా తానూ ఇదే కంపెనీలో పనిచేస్తున్నానని, తమ్ముడు ఖాళీగా ఉన్నాడని తొమ్మిది నెలల క్రితమే ఉద్యోగంలో చేర్పించానని నాని ఆవేదన వ్యక్తంచేశాడు.

చంద్రబాబుతో నాదిర్ గోద్రెజ్ భేటీ

▸ రాష్ట్రంలో 2,800 కోట్ల పెట్టుబడులపై చర్చ

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గోద్రెజ్ ఇండస్ట్రీస్ సీఎండీ నాదిర్ గోద్రెజ్, బృందం గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఈ భేటీ వివరాలను సీఎం ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'రాష్ట్రంలో కీలకమైన రంగాల్లో పెట్టుబడి పెట్టే విషయమై చర్చించాం. నేషనల్ విఽషన్ ఆన్ ఈడబుల్ ఆయిల్స్ - ఆయిల్ పామ్ (ఎన్ఎంఈఓ-ఓపీ), ఆయిల్ పామ్ సాగు, రొయ్యల మేతకు బేసిక్ కస్టమ్స్ డ్యూటీ తగ్గింపునకు ఉన్న అవకాశాలను చర్చించాం. అమరావతి, విశాఖపట్నంలో కీలక పెట్టుబడులతోపాటు పురుగు మందుల తయారీ రంగంలో దఫాలవారీగా రూ.2,800 కోట్లు పెట్టుబడి పెట్టే విషయంపైనా చర్చించాం. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను ఉద్దీపింప చేయడానికి అగ్రి, ఆక్వా, రియల్ ఎస్టేట్ రంగాల్లో ఉన్న అవకాశాలనూ పరిశీలించాం' అని చంద్రబాబు తెలిపారు.

రాష్ట్రంలో బయోసింథటిక్ ఉడ్ యూనిట్

▸ హైడ్రో ఫోయిల్ బోట్ల తయారీ కంపెనీ కూడా..



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసిన బయో సింథటిక్ ఉడ్ కంపెనీ ప్రతినిధులు

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బయో సింథటిక్ ఉడ్, హైడ్రో ఫోయిల్ బోట్ల తయారీ యూనిట్లను రూ.300 కోట్ల పెట్టుబడితో పెట్టేందుకు సింగపూర్, స్పెయిన్‌కు చెందిన ఏరియా, గ్లోబల్ కంపెనీలు సంసిద్ధత వ్యక్తం చేశాయి. ఈ కంపెనీల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంపత్ కుమార్ గురువారం వెలగపూడి సచివాలయంలో రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డితో సమావేశమయ్యారు. అధునాతన టెక్నాలజీతో హైడ్రో ఫోయిల్ బోట్లు తయారు చేస్తున్నామని కంపెనీ ప్రతినిధులు మంత్రికి వివరించారు. వాటిని ఇండియన్ నేవీకి సరఫరా చేసేందుకు చర్చలు విజయవంతమయ్యాయని, తెలిపారు. ఇవి సాధారణ బోట్ల కంటే వేగంగా, సురక్షితంగా ఉంటాయని పేర్కొన్నారు.

మన గ్రామాలను.. మనమే పాలించుకుందాం!



▸ నేడు 13,326 గ్రామాల్లో గ్రామ సభలు

▸ యువత, మహిళలు పాల్గొనాలి

▸ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): దేశంలోనే మొదటిసారి రాష్ట్రంలోని మొత్తం 13,326 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలను శుక్రవారం ఒకేసారి నిర్వహిస్తున్నామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. గురువారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఈ సభల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాలో చేయాల్సిన పనులపై చర్చిస్తాం. ఎన్నికల ప్రచార సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలకు పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పాలన అందిస్తామని మాటిచ్చాం. దాని ప్రకారమే పంచాయతీలు సుసంపన్నం కావాలనే సుదూర లక్ష్యంతో ప్రణాళిక ప్రకారం ముందడుగు వేస్తున్నాం. ఈ సభల్లో గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రజలంతా కలిసి తీర్మానాలు చేస్తారు. శుక్రవారం నిర్వహించే గ్రామ సభలను తూతూ మంత్రంగా కాకుండా పంచాయతీలోని వారంతా కలిసి కూర్చొని గ్రామాభివృద్ధిపై నిర్ణయాలు తీసుకునేలా నిర్వహిస్తాం. 'మన గ్రామాలను మనమే పరిపాలించుకుందాం' అనేలా వీటి నిర్వహణ ఉంటుంది' అని పవన్ అన్నారు.

నిధుల దుర్వినియోగం..

'ఉపాధి హామీ పథకంలో భాగంగా గత ప్రభుత్వంలో రూ.40,579 కోట్లు నిధులు వచ్చాయి. గ్రామీణాభివృద్ధి కోసం ఈ నిధులను సక్రమంగా వాడి ఉంటే దాని ఫలాలు కనిపించేవి. కానీ ఆ నిధులను ఇష్టానుసారం ఖర్చు చేశారు. గత ప్రభుత్వంలో పంచాయతీల ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది. 2014-19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీల ఆదాయం రూ.240కోట్లు ఉంటే 2019-23 సంవత్సరాల్లో కేవలం రూ.170 కోట్లే వచ్చింది. క్షేత్రస్థాయిలో పంచాయతీల ఆదాయం తగ్గిపోవడానికి గత ప్రభుత్వ విధానాలే కారణం. కూటమి ప్రభుత్వం పంచాయతీలకు సర్వ స్వతంత్రత తీసుకురావాలనే సంకల్పంతో పని చేస్తోంది. ఆయ గ్రామాల ప్రత్యేకతలను గ్రామ సభల్లో గుర్తించి, నిర్ణయించి వాటిని ప్రమోట్ చేయాలని భావిస్తున్నాం. తయారు చేసే విశిష్టమైన వస్తువులు, ఆహార పదార్థాలను ఎగుమతులు చేసి సంపద సృష్టించే మార్గాలను అన్వేషిస్తాం' అని పవన్ అన్నారు. 'పంచాయతీల్లో చాలా భూమి నిరుపయోగంగా ఉంటోంది. దాన్ని క్రమ పద్ధతిలో వినియోగించుకోవాలి. స్వచ్ఛ భారత్‌ను మరో మెట్టు ఎక్కించేలా గ్రామ పంచాయతీల్లో ఓ ప్రణాళిక ప్రకారం ఎక్కడా చెత్త లేకుండా క్లీన్, గ్రీన్ గ్రామాలుగా తయారు చేసేలా దృష్టి పెడుతున్నాం. పంచాయతీలకు సంబంధించి వృథాగా ఉన్న స్థలంలో కలప మొక్కలను పెంచాలని భావిస్తున్నాం. గ్రామాల్లో ఎకో టూరిజం అభివృద్ధి చేసే ఆలోచన చేస్తున్నాం. వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులను పర్యవేక్షించాల్సిన, నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాల్సిన సామాజిక తనిఖీ విభాగం సక్రమంగా పని చేయలేదు. ఆ విభాగానికి కూడా పోలీస్ అధికారిని హెడ్‌గా పెట్టాలని ఆలోచిస్తున్నాం. పంచాయతీల్లో పెండింగ్‌లో ఉండిపోయిన రూ.2వేల కోట్ల నిధులను కూటమి ప్రభుత్వంలో విడుదల చేశాం. మెటీరియల్ కాంపోనెంట్ గ్రాంట్‌ను త్వరలోనే ఇస్తాం.'

అచ్యుతాపురం ఘటన దురదృష్టకరం

అచ్యుతాపురం ఘటనపై పవన్ స్పందిస్తూ... 'ఎసెన్షియా సంస్థలో జరిగిన ప్రమాదం దురదృష్టకరం. వరుసగా పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎసెన్షియా ఫ్యాక్టరీలో రక్షణ చర్యలు చేపట్టకపోవడంలో పరిశ్రమకు చెందిన ఇద్దరు యాజమానులు మధ్య ఉన్న వ్యక్తిగత గొడవలు కూడా ఓ కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. ఫ్యాక్టరీలో సేఫ్టీ ఆడిట్ చేయడంపై దృష్టి పెడతాం. సేఫ్టీ ఆడిట్ అంటే పారిశ్రామికవేత్తలు భయపడే పరిస్థితి ఉంది. వారితో ఒకసారి కూర్చొని మాట్లాడి, తీసుకుంటున్న రక్షణ చర్యలను వివరించాలని కోరతాం. పరిశ్రమల్లో రక్షణపై ప్రత్యేకంగా దృష్టిపెడతా. ఈ నెల చివర్లో విశాఖలో ప్రత్యేకంగా దీనిపై సమావేశం ఏర్పాటు చేస్తాను. పరిశ్రమల కాలుష్యం మీద నిరంతర నిఘా ఉండేలా, ప్రమాదాలను పూర్తిగా ఆరికట్టేలా శాశ్వత పరిష్కారం చూడాలి' అని డిప్యూటీ సీఎం పవన్ అన్నారు.

నేడు కోనసీమ జిల్లాకు సీఎం

▸ గ్రామ సభలో పాల్గొననున్న చంద్రబాబు

సీఎం చంద్రబాబు శుక్రవారం అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించనున్నారు. పంచాయతీ గ్రామ సభలో పాల్గొనే నిమిత్తం ఆయన అక్కడకు వెళ్తున్నారు. జిల్లాలోని కొత్తపేట మండలం వానపల్లి పంచాయతీలో జరిగే గ్రామసభలో సీఎం పాల్గొననున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో ఆయన వివిధ అంశాలపై మాట్లాడతారు.

గ్రామ సభల్ని విజయవంతం చేయాలి: పల్లా

రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం జరిగే గ్రామ సభల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్ కోరారు. 'పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించడం ద్వారా ప్రజలకు పలు అంశాలపై ప్రభుత్వం అవగాహన కల్పించనుంది. గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. గ్రామ సభల ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంది. గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి' అని పల్లా సూచించారు.

పంచాయతీలకు జవసత్వాలు

(మొదటి పేజీ తరువాయి)

జరిగితే ప్రజల మనోభావాలను పంచుకునే అవకాశముంటుంది. కేంద్రం కూడా గ్రామ సభలను బలోపేతం చేసేందుకు నిర్ణయ్ అనే పోర్టల్‌ను ఏర్పాటుచేసింది. ప్రజల భాగస్వామ్యం కల్పించడం, పారదర్శకత, జవాబుదారీతనం పెరిగేలా గ్రామ సభలు నిర్వహించేందుకు పోర్టల్‌ను అభివృద్ధి చేసింది. ఈ నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి పంచాయతీరాజ్ శాఖను అధ్యయనం చేశారు. కేరళలో గ్రామ పంచాయతీలు బలోపేతమవ్వడం వెనుక మూలాలను పరిశీలించారు. అక్కడ పనిచేసి వచ్చిన పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ కృష్ణతేజ అనుభవ సహకారంతో వ్యవస్థను బలోపేతం చేయాలని భావించారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు గ్రామసభలు నిర్వహించాలని, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమంగా దానిని చేపట్టాలని నిర్ణయించారు. తద్వారా గ్రామ సభల ప్రాధాన్యాన్ని స్పష్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో పంచాయతీ వ్యవస్థలను బలోపేతం చేయడంలో భాగంగా ఇటీవల సీఎం చంద్రబాబు పలు సూచనలు చేశారు. స్వర్ణ గ్రామ పంచాయతీ పేరుతో గ్రామాల్లో నాలుగు రకాల సౌకర్యాలు సమకూర్చాలన్నారు. కుటుంబాలకు కనీస అవసరాలైన విద్యుత్, తాగునీటి కనెక్షన్లు, మరుగుదొడ్లు, ఎల్‌పీజీ కనెక్షన్లకు ప్రాధాన్యమివ్వాలన్నారు. గ్రామాలకు ఉమ్మడి సౌకర్యాలైన తాగునీటి సరఫరా పథకం, డ్రైనేజీ, ద్రవ వ్యర్థాల నిర్వహణ, వీధిలైట్లు, సీసీ రోడ్లు, ఘన వ్యర్థాల నిర్వహణ, అన్ని గ్రామాలకు, గ్రామాల నుంచి మార్కెట్లకు, సమీప నగరాలకు రహదారి సౌకర్యం కల్పించాలి. గ్రామ పంచాయతీ రోడ్లు, అంతర్గత రోడ్లు, లింక్‌రోడ్లు ఏర్పాటు చేయాలి. గ్రామాల్లో మౌలిక వసతులైన కందకాలు, ఫారంపాండ్స్ ఏర్పాటు చేయాలి. నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి. ఉద్యానవనం, సెరికల్చర్‌కు అవసరమైన మౌలిక వసతులు, పశువుల కొట్టాలు, పశువులకు సంబంధించిన వసతులు ఏర్పాటు చేయాలి. వీటన్నింటినీ సాధించడం ద్వారా స్వర్ణ గ్రామ పంచాయతీలను సాధించుకోవచ్చని సీఎం పేర్కొన్నారు. పైన పేర్కొన్న అంశాలన్నింటినీ శుక్రవారం నిర్వహించే గ్రామ సభల్లో చేర్చాలని సూచించారు.

ప్రతిష్ఠాత్మకంగా గ్రామ సభలు

శుక్రవారం నిర్వహించే పంచాయతీల గ్రామ సభలను ఒక పండుగలా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి సమీక్ష అనంతరం దానిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు గ్రామ సభ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. గ్రామ సభ ఏర్పాటు చేసేందుకు ప్రతి పంచాయతీకి ప్రత్యేకాధికారులను నియమించాలని ఇప్పటికే కలెక్టర్లను ఆదేశించారు. అన్నీ గ్రామాల్లో ప్రతి ఓటరు ఈ గ్రామ సభలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో పాటు ఎన్నికైన ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులను కూడా ఆహ్వానించాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కృష్ణతేజ గురువారం నుంచి శనివారం వరకూ ప్రాంతీయ సమావేశాలు నిర్వహించేందుకు సమాయత్తమయ్యారు.

ప్రతి ఓటరూ పాల్గొనాలి

'మన పంచాయతీ... మన సాధికారత' నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా 13,326 గ్రామ పంచాయతీల్లో నేడు గ్రామసభలు నిర్వహించనున్నారు. ఊరు బాగు కోసం ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో గ్రామీణ మౌలిక సదుపాయాలు, నీటి సంరక్షణ కోసం 49 రకాల పనులు, వ్యవసాయ అనుబంధ పనులు 38 రకాలు చేపట్టేందుకు ఈ సభల్లో తీర్మానాలు చేస్తారు. మొత్తం 87 రకాల పనులు, వేతనాలకు రూ.4,500 కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. 9 కోట్ల పనిదినాలు, 87 రకాల పనులతో 54 లక్షల కుటుంబాలకు ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పథకం ఉపయోగపడుతుంది.

గ్రామాల్లో సిటిజన్ నాలెడ్జి బోర్డులు ఏర్పాటు

గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించడంతో పాటు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఆయా గ్రామాల్లో అందుతున్న సౌకర్యాలు తెలుపుతూ నాలెడ్జి బోర్డులు ఏర్పాటు చేయనున్నారు.

బినామీ వాసు

▸ అనతికాలంలో రూ.కోట్లకు అధిపతి


▸ వాసు కోసం రెండు జిల్లాల పోలీసుల వేట

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

నల్లూరు వాసు... కొంతమంది అతడిని నెల్లూరు వాసు అని పిలుస్తారు. ఇప్పుడీ పేరు విజయవాడ, గుంటూరులో ప్రముఖంగా వినిపిస్తోంది. అసలు ఈ వాసు ఎవరని ఆరా తీస్తే భారీగా బినామీ బాగోతం బయటకు వస్తోంది. ఈ బాగోతం పోలీసులకు అంతు చిక్కడం లేదు. వాసుపై నమోదైన కేసులు ఒకకోణంలో ఉంటే, అతడు చేసిన వ్యవహారాలు మరో కోణంలో కనిపిస్తున్నాయి. చిట్టీల వ్యాపారిగా పరిచయాలు పెంచుకుని కోట్లాది రూపాయలకు టోకరా వేసిన వాసు అతి తక్కువ కాలంలో బిగ్‌షాట్‌గా మారిపోయారు. పలుకుబడి, డబ్బు, రాజకీయ, అధికార బలం ఉన్న ఓ ముగ్గురితో మొదట పరిచయం పెంచుకున్నారు. వారిని ఉపయోగించుకుని మరో ముగ్గురితో పరిచయాలు పదిలం చేసుకున్నారు. వాసు విద్యార్హత పదో తరగతి. అతడి పరిచయాలు మాత్రం ఐఏఎస్, ఐపీఎస్, రాజకీయ నేతలు, ధనవంతులతో ఉంటాయి. విజయవాడలోని పటమట తోటవారి వీధిలో కుటుంబంతో వాసు నివాసం ఉంటున్నారు. వ్యవహారాలను చక్కబెట్టుకోవడానికి నగరంలో రెండు, మూడు విల్లాలను ఏర్పాటు చేసుకున్నారు. అతితక్కువ కాలంలో కోట్లాది రూపాయలకు అధిపతిగా మారారు. అతడికి అప్పులు ఇచ్చిన వారూ కోట్లాది రూపాయలు చేతుల్లో పెట్టారు. ఈ అంశం దర్యాప్తు అధికారులకు అంతుచిక్కడం లేదు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ద్వారా పరిచయాలు పెంచుకోవడం మొదలుపెట్టిన వాసు రూ.35కోట్ల వరకు వసూలు చేశారు. విజయవాడలో పబ్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పి ఈ డబ్బు వసూలు చేసినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. విజయవాడ, హైదరాబాద్‌తో పాటు గుంటూరు జిల్లాలో పలువురి నుంచి రూ.కోట్లు వసూలు చేశారు. చిట్టీల వ్యాపారంలో పరిచయమైన ప్రతి ఒక్కరి నుంచి ఎంతోకొంత అప్పుగా పిండేశారు. ఆ తర్వాత వాసు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. టీడీపీ రాష్ట్ర కార్యాలయం ఎదురుగా ఉన్న మంజీర అపార్టుమెంట్‌లో అత్యంత ఖరీదైన ఐదు ఫ్లాట్లలోనే వాసు వ్యవహారాలన్నీ చక్కబెట్టేవారు. వాసు బినామీగా ఉన్నవారి జాబితాలో అన్ని పార్టీల నాయకులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఉన్నారు. ఓ మాజీ ఐపీఎస్ అధికారి వాసు చేతిలో కోట్లాది రూపాయలు పెట్టినట్టు వినికిడి. వైసీపీ ఐదేళ్ల పాలనలో అవినీతి సొమ్మును వెనుకేసుకున్న వారికి వాసు బినామీగా మారారు. కొంతమంది రాజకీయ నేతలు, అధికారులు మంజీర అపార్టుమెంట్‌కు వెళ్లినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం వాసు పరారీలో ఉన్నారు. అతడి బావమరిది కోనేరు మధుబాబు, వాసు భార్య గీతను గుంటూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వాసుపైనా కేసు నమోదు చేశారు. వాసును అరెస్ట్ చేయడానికి ఇటు విజయవాడ పోలీసులు, అటు గుంటూరు పోలీసులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. వాసు చిక్కితే తమ బాగోతం బయటకి వస్తుందన్న ఆందోళన అతడితో చేతులు కలిపిన వారిలో కనిపిస్తోంది.

టాప్-5లో చంద్రబాబు

▸ ఉత్తమ సీఎంపై 'ఇండియా టుడే' సర్వే



అమరావతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు దేశంలో అత్యంత జనాదరణ కలిగిన టాప్-5 సీఎంల జాబితాలో నిలిచారు. 'ఇండియా టుడే- సీ ఓటర్ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. 'మూడ్ ఆఫ్ ది నేషన్' పేరుతో అనేక అంశాలపై దేశ వ్యాప్తంగా నిర్వహించిన సర్వే ఫలితాలను గురువారం 'ఇండియా టుడే' వెల్లడించింది. ఇందులో... అత్యధిక జనాదరణ కలిగిన ముఖ్యమంత్రులకు సంబంధించి తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, ఏపీ సీఎం చంద్రబాబు ఇద్దరూ నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నిలిచారు. తర్వాతి స్థానాల్లో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఉన్నారు. ఆ తర్వాతి స్థానంలో... స్టాలిన్, చంద్రబాబు నిలిచారు. ముఖ్యమంత్రి పీఠం అధిష్ఠించిన రెండు నెలల్లోనే చంద్రబాబు టాప్-5 ముఖ్యమంత్రుల జాబితాలోకి రావడం విశేషం. "అభివృద్ధి రాజకీయాలకు దేశంలో చంద్రబాబు చిరునామాగా ఉన్నారు. గతంలో హైదరాబాద్‌ను బాగా అభివృద్ధి చేసిన రికార్డు ఆయన సొంతం" అని దీనిపై జరిగిన చర్చలో పాల్గొన్న వక్తలు పేర్కొన్నారు.

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం

▸ పోలీసులే ఎదురు కేసులు పెడుతున్నారు: మాజీ సీఎం జగన్

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి. దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి. సీఎం చంద్రబాబు ప్రోద్బలంతోనే దాడులు జరుగుతున్నాయి' అని మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. తాడేపల్లి జగన్ నివాస ప్రాంగణంలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం వైసీపీ లీగల్ సెల్ ప్రతినిధులతో ఆయన సమావేశంఅయ్యారు. 'రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది. ఒక పద్ధతి ప్రకారం ప్రజల్లో భయాందోళనలను కలిగిస్తున్నారు. రాష్ట్రంలో పై స్థాయి నుంచి కింది వరకూ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది. ఎవరిని తొక్కాలో, ఎవరిని నాశనం చేయాలో, ఎవరి ఆస్తులు ధ్వంసం చేయాలి? అన్న అంశాల మీద పై నుంచి కింద స్థాయి దాకా రెడ్‌బుక్ తయారయింది. పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేసేందుకు వెళితే బాధితులపైనే పోలీసులు ఎదురు కేసులు పెడతున్నారు. తాడిపత్రిలో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటికి వెళ్తే కేసులు పెడుతున్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని లక్ష్యంగా చేసుకున్నారు. వైసీపీ కార్యకర్తలకు అండగా ఉండేందుకు వైసీపీ లీగల్ సెల్ ఎప్పటికప్పుడు న్యాయస్థానాల్లో కేసులు వేయాలి' అని జగన్ పిలుపు ఇచ్చారు.

వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడపై వేటు

శ్రీకాకుళం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన వివాదాస్పద ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై ఎట్టకేలకు ఆ పార్టీ అధిష్ఠానం వేటు వేసింది. టెక్కలి నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి శ్రీనును తొలగించింది. ఆ స్థానంలో శ్రీకాకుళం లోక్‌సభ స్థానం నుంచి వైసీపీ తరఫున పోటీచేసి ఓటమి చెందిన పేరాడ తిలక్‌కు బాధ్యతలు అప్పగించింది.

'రుషికొండ' ఫిర్యాదుపై ఏం చేశారో చెప్పండి

▸ పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పర్యావరణ అనుమతులు లేకుండా విశాఖలోని రుషికొండపై భవనాలు నిర్మించిన అప్పటి ముఖ్యమంత్రి జగన్, అప్పటి సీఎస్ జవహర్‌రెడ్డి, మరికొందరు అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, వారిపై కేసు నమోదు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ సమాచార హక్కు సంఘం జాతీయ అధ్యక్షుడు టి.గంగాధర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అనుమతులు లేకుండా భవనాలు నిర్మించి రూ.420 కోట్లు దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు. దీనిపై మంగళగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. కేసు నమోదు చేయాలని కోరుతూ ఎస్పీకి వినతి సమర్పించామన్నారు. ఈ వ్యాజ్యం గురువారం హైకోర్టు న్యాయమూర్తి బీవీఎల్ఎన్ చక్రవర్తి వద్ద విచారణకు వచ్చింది. ఈ వ్యవహారానికి సంబంధించిన వివరాలు సమర్పించేందుకు ప్రభుత్వ న్యాయవాది సమయం కోరడంతో వ్యాజ్యంపై తదుపరి విచారణను న్యాయమూర్తి రెండు వారాలకు వాయిదా వేశారు. ఫిర్యాదుపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని పోలీసులను ఆదేశించారు.

జోగిని ప్రశ్నిస్తుంటే.. పొన్నవోలు సమాధానం ఇస్తున్నారు!

▸ రమేష్ దర్యాప్తునకు సహకరించడం లేదు

▸ తక్షణం మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేయండి

▸ హైకోర్టులో సీనియర్ న్యాయవాది వాదనలు..

విచారణ నేటికి వాయిదా



అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంపై మూకదాడి ఘటనలో నమోదైన కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ దర్యాప్తునకు సహకరించడం లేదని పోలీసుల తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా హైకోర్టుకు నివేదించారు. తొందరపాటు చర్యలు వద్దని ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను జోగి దుర్వినియోగం చేస్తున్నారని, తక్షణం వాటిని ఎత్తివేయాలని కోరారు. దర్యాప్తు అధికారి నిందితుడిని ప్రశ్నిస్తుంటే.. ఆయనతోపాటు విచారణకు హాజరైన సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి సమాధానం చెబుతున్నారని వివరించారు. అందుకు సంబంధించి వీడియోను కోర్టు ముందు ఉంచామన్నారు. విచారణకు హాజరు కావాలని పిటిషనర్‌కు దర్యాప్తు అధికారి ఇప్పటివరకు మూడు సార్లు నోటీసులు ఇచ్చారన్నారు. మూడో నోటీసు తరువాత సీనియర్ న్యాయవాదితో కలిసి జోగి రమేష్ విచారణకు హాజరయ్యారన్నారు. చంద్రబాబు ఇంటిపై దాడికి వెళ్లిన సమయంలో వినియోగించిన ఫోను, సిమ్ కార్డు, ఈఎంఈఐ నెంబర్, ఫోను బిల్లు వివరాలు చెప్పాలని దర్యాప్తు అధికారి కోరగా, ఫోను మార్చానని సమాధానం ఇచ్చారన్నారు. మెజార్టీ ప్రశ్నలకు లేదు, తెలియదు, గుర్తులేదని బదులిచ్చారన్నారు. ప్రస్తుతం వినియోగిస్తున్న ఫోను ఇవ్వడానికి కూడా నిరాకరించారన్నారు. చంద్రబాబు ఇంట్లోకి చొచ్చుకువెళ్లి, ధ్వంసం చేసేందుకు ప్రయత్నించిన రోజు పిటిషనర్, అతని అనుచరులను పోలీసులు అరెస్ట్ చేసి వారిపై నామమాత్రపు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారన్నారు. ఆ కేసు వివరాలు చెప్పకుండా పిటిషనర్ కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. పోలీసులను ప్రభావితం చేసి బాధితుల పైనే పిటిషనర్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించారన్నారు. ఘటన జరిగిన రోజు సంబంధిత పోలీస్‌స్టేషన్ కేసు డైరీ వివరాలను కోర్టుముందు ఉంచారు. అప్పుడు అధికారాన్ని దుర్వినియోగం చేశారని.. ఇప్పుడు కోర్టు మధ్యంతర ఉత్తర్వులను దుర్వినియోగం చేస్తున్నారన్నారు. పిటిషనర్‌తో పాటు దాడిలో పాల్గొన్న ఇతర నిందితులు ముందస్తు బెయిల్ పొందేందుకు అనర్హులని తెలిపారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది ఉద్దేశపూర్వకంగా వాదనలు వినిపించేందుకు జాప్యం చేస్తున్నారన్నారు. తక్షణం మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరారు. పిటిషనర్ తరపున న్యాయవాది శశిభూషణరావు స్పందిస్తూ.. వ్యక్తిగత కారణాలతో సీనియర్ న్యాయవాది విచారణకు హాజరుకాలేకపోయారని తెలిపారు. శుక్రవారం వాదనలు వినిపిస్తారన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వీఆర్‌కె కృపాసాగర్ జోగిరమేష్ తరపు సీనియర్ న్యాయవాది వాదనల కోసం విచారణను శుక్రవారానికి (నేటికి) వాయిదా వేశారు. పిటిషనర్‌పై తొందరపాటు చర్యలు వద్దంటూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను నేటి వరకు పొడిగించారు. చంద్రబాబు నివాసంపై మూకదాడి వ్యవహారంలో తాడేపల్లి పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైసీపీ మాజీ మంత్రి జోగి రమేష్ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే.

ఇంటర్ ప్రక్షాళన

(మొదటి పేజీ తరువాయి)

పాఠ్యాంశాలపై, వారే నిర్ణయించుకున్న తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో పబ్లిక్ పరీక్షల ఫలితాలు వచ్చేవరకూ ఏ విద్యార్థి సామర్థ్యం ఏంటి? ఎంతమంది మెరుగ్గా ఉన్నారు? ఎంతమంది చదువులో వెనకబడ్డారు? అనే అంచనా లేదు. పాఠశాల విద్యా శాఖలో అకడమిక్ క్యాలెండర్ విధానం అమల్లో ఉంది. ఏ నెలలో ఏ పాఠాలు చెప్పాలి? ఏ పరీక్షలు ఎప్పుడు నిర్వహించాలనే దానిపై ఏటా ఆ శాఖ క్యాలెండర్ విడుదల చేస్తుంది. ఇంటర్‌లోనూ సంక్షిప్తంగా అకడమిక్ క్యాలెండర్‌ను తయారు చేస్తున్నారు. అయితే అందులో పరీక్షల తేదీలు తప్ప సిలబస్‌పై స్పష్టత లేదు. దీంతో కాలేజీలన్నీ వేర్వేరుగా పరీక్షలు నిర్వహించుకుంటున్నాయి. ఇకపై అంతర్గత పరీక్షలు కామన్‌గా నిర్వహించాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. ఇప్పటికే దీనిపై ఇంటర్ విద్యామండలి అధికారులు టైమ్ టేబుల్‌ను రూపొందించారు. శుక్రవారం దీనిని విడుదల చేయనున్నారు.

ప్రస్తుత విధానం ఇదీ

రాష్ట్రంలో 476 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉన్నాయి. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ లాంటి గ్రూపులతో పాటు కొన్ని వృత్తి విద్యా కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. వాటిలో సుమారు 2.10 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల విద్య తరహాలోనే ఏటా అకడమిక్ క్యాలెండర్ ఇంటర్‌లోనూ తయారు చేస్తున్నారు.

కొత్త విధానంలో ఇలా...

ఇంటర్ విద్యామండలి రూపొందించిన కొత్త టైమ్ టేబుల్‌లో తేదీలతో పాటు ఏ నెలలో ఏ పాఠాలు చెప్పాలనే వివరాలు కూడా పొందుపరిచింది. ఫైనల్ పరీక్షలు కాకుండా సంవత్సరంలో నాలుగు యూనిట్ పరీక్షలు, క్వార్టర్లీ, హాఫ్ ఇయర్లీ, ప్రీ ఫైనల్ పరీక్షలు జరుగుతాయి. ఈ ఏడాది ఇప్పటికే యూనిట్-1 పరీక్షలు పూర్తయ్యాయి. యూనిట్-2 నుంచి అన్ని కాలేజీలు ఒకే సిలబస్ ఫాలో అయ్యేలా నూతన విధానం అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకూ ఈ పరీక్షలకు కాలేజీలే ప్రశ్నపత్రాలు తయారు చేసుకున్నాయి. ఇకపై ఇంటర్ బోర్డే అన్ని పరీక్షలకు ప్రశ్నపత్రాలు పంపుతుంది. పరీక్షలు జరిగే రోజు ఉదయం కాలేజీల ప్రిన్సిపాళ్లకు పేపర్లు పంపుతారు. లెక్చరర్లు పరీక్షల మూల్యాంకనం అనంతరం విద్యార్థుల మార్కులను ఇంటర్ విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆ ఫలితాల ఆధారంగా విద్యార్థులు ఎవరెవరు ఏయే స్థాయిల్లో ఉన్నారో అంచనా వేస్తారు. విద్యార్థులు వెనుకబడిన సబ్జెక్టుల్లో సంబంధిత లెక్చరర్ల ద్వారా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి సామర్థ్యాల పెంపునకు చర్యలు తీసుకుంటారు. ఫైనల్ పరీక్షల నాటికి వారు బలహీనంగా ఉన్న సబ్జెక్టుల్లో మెరుగయ్యేలా చూస్తారు.

ఫైనల్ పరీక్షలపైనా కసరత్తు

అంతర్గత పరీక్షలతో పాటు ఫైనల్ పరీక్షలపైనా ఇంటర్ విద్యామండలి కసరత్తు చేస్తోంది. ఇంటర్‌లో మార్కులకు బదులుగా గ్రేడింగ్ విధానం అమలుపై అధ్యయనం చేయాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ఇందులో ప్రతికూలతలను ఎలా అధిగమించాలనే దానిపై అధ్యయనం చేస్తున్నారు. జేఈఈ, నీట్‌లో ఇంటర్ మార్కులు ప్రామాణికంగా తీసుకుంటారు. సీబీఎస్ఈలో గ్రేడింగ్ ఉన్నప్పటికీ మార్కులూ ఇస్తున్నారు. ఆ మార్కుల ఆధారంగా ఉన్నత విద్యకు పోటీ పరీక్షలు రాస్తున్నారు. ఇక్కడా అదే అమలు చేయాలా? లేక పూర్తిగా గ్రేడింగ్ అమలు చేయాలా? అనేదానిపై అధికారులు అధ్యయనం చేస్తున్నారు. అంతిమంగా విద్యార్థులకు నష్టం జరగకుండా సంస్కరణలు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పిన్నెల్లి అనుచరుల భూ కబ్జా

▸ మంత్రి సవితకు బాధితురాలి ఫిర్యాదు

▸ టీడీపీ కార్యాలయంలో వినతుల స్వీకరణ

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అనుచరులు తన భూమిని కబ్జా చేశారని మాచర్ల మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన సంకుల వెంకట రావమ్మ బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితకు ఫిర్యాదు చేశారు. గురువారం ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మితో కలిసి మంత్రి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. తన భూమిని పిన్నెల్లి అనుచరుడు దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి కుమారుడి పేరు మీద వారసత్వ భూమిగా ఎక్కించారని, వైసీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు ఎందూరి కృష్ణారెడ్డి, మాచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం కూడా ఈ కబ్జాలో భాగస్వాములని వెంకట రావమ్మ పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, తన భూమిని ఇప్పించాలని కోరారు. గుంటూరు లాలాపేటలోని పెద్ద మసీదుకు రెడ్డిపాలెంలో ఉన్న 187 ఎకరాల్లో 12ఎకరాలను ముతవలీ కబ్జా చేశారని, అక్కడ ఎకరం రూ.10 కోట్లు ఉంటుందని కరీం అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరపాలని కోరారు. బంటుమిల్లి సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసరావు లాండ్ మాఫియాతో చేతులు కలిపి ఫేక్ డాక్యుమెంట్లతో అక్రమ రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారని బంటుమిల్లికి చెందిన ఏలూరి రంగబాబు, పవన్ కుమార్, శేషుబాబు ఫిర్యాదు చేశారు. తమ వద్ద ఉన్న అసలు పాస్ పుస్తకాలు చూపించినా పట్టించుకోకుండా లాండ్ మాఫియా నుంచి రూ.30 లక్షలు తీసుకొని తమ భూములను అన్యాక్రాంతం చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ సానుభూతిపరురాలైన తన అక్కకు వైసీపీ నేతలు దివ్యాంగురాలి పింఛనును తీసివేయించారని, దీంతో తన అక్క ఆత్మహత్య చేసుకున్నారని అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గం నక్కన దొడ్డి గ్రామానికి చెందిన శంకర్ నాయక్ వాపోయారు. ఆ పింఛను పైనే తన తల్లి ఆధారపడి ఉన్నారని, తాము వలసలు పోతున్నందువల్ల తమ తల్లికి పింఛను మంజూరు చేయించాలని ఆయన విన్నవించారు. కాపు కార్పొరేషన్ కింద విద్యా దీవెన పథకానికి ఎంపికైన 1,100 మందికి ప్రభుత్వం బకాయి పడిందని బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఏపీ శాట్-ఆర్‌డీ సంస్థలో డీఆర్‌పీలుగా పనిచేస్తున్న తమను ఉద్యోగాల నుంచి తొలగించడంపై కోర్టుకు వెళ్తే తిరిగి తీసుకోవాలని హైకోర్టు చెప్పినా డైరెక్టర్ జగదీశ్ తీసుకోవడం లేదని కొందరు ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. అదేమంటే తన బావ అరుణ్ కుమార్ వైసీపీ ఎమ్మెల్సీ అని డైరెక్టర్ బెదిరిస్తున్నారని వాపోయారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు గతంలో పీజీ సీట్లలో 30 శాతం రిజర్వేషన్ ఉండేదని, గత ప్రభుత్వం దానిని 15 శాతానికి తగ్గించిందని కొందరు వైద్యులు ఫిర్యాదు చేశారు. తమకు పెద్దగా జీతాలు లేకపోయినా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్నామని, తమకు గతంలో ఉన్న రిజర్వేషన్ కొనసాగేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. కనక దుర్గమ్మ వారధి కింద భూమి కోల్పోయిన తమకు పరిహారం ఇప్పించాలని ఝాన్సీరాణి అనే మహిళ వినతిపత్రం ఇచ్చారు.

టీడీపీ ఆఫీసుపై దాడి కేసు దర్యాప్తు ముమ్మరం

గుంటూరు, మంగళగిరి, ఆగస్టు 22: మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ మూకలు దాడి చేసిన కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా దాడిలో పాల్గొన్న నిందితుల్లో కొంత మందిని ఇప్పటికే అరెస్టు చేయగా, మిగతా వారికి నోటీసులు జారీ చేస్తున్నారు. ఇప్పటివరకు మొత్తం 106 మంది ప్రమేయం వున్నట్టు గుర్తించి, 21 మందిని అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. మిగతా 85 మందికి మంగళగిరి రూరల్ పోలీసులు ఈ నెల 19 నుంచి నోటీసులు జారీ చేశారు. వీరిలో ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డితోపాటు, వైసీపీ నేత దేవినేని అవినాశ్, ఆరవ సత్యం వంటి ముఖ్య నేతలతోపాటు ఓ న్యూస్ చానల్ రిపోర్టర్ కూడా ఉన్నాడు. అందుబాటులో లేని వాళ్ల ఇళ్లకు నోటీసులు అతికిస్తున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా దాడి జరిగిన రోజు సీసీ ఫుటేజీ సమర్పించాలని తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయానికి కూడా నోటీసులు అతికించారు. ఇదిలావుంటే, ఆనాడు టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడికి పాల్పడిన కొందరు వైసీపీ నేతలు ఎన్నికల ముందు, తరువాత టీడీపీలో చేరారు. వారిని ఉపేక్షించవద్దని చంద్రబాబు, లోకేశ్‌కు టీడీపీ కార్యకర్తలు పలు మార్లు ఫిర్యాదులు కూడా చేశారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనకు సంబంధించి ఆ రోజు వైసీపీ కార్యాలయంలోని సీసీ కెమెరాల ఫుటేజ్ ఇవ్వాలని కోరుతూ ఈనెల 13న సీఆర్‌పీసీ 160 ప్రకారం వైసీపీ కార్యాలయ సిబ్బందికి మంగళగిరి రూరల్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 16న మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో విచారణాధికారి ఎదుట సీసీ ఫుటేజ్‌తో హాజరు కావాలని నోటీసులో కోరారు. నోటీసును కార్యాలయం గోడకు అంటించారు. అయితే 16న వైసీపీ కార్యాలయ ప్రతినిధులు ఎవరూ హాజరు కాకపోవడంతో మరో సారి నోటీసు జారీ చేసేందుకు సిద్ధమయ్యారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

తోడుకున్నోళ్లకు తోడుకున్నంత..!

ముఠాలుగా ఏర్పడి కృష్ణానదిలో ఇసుకను తోడేస్తున్న అక్రమార్కులు



- పుష్కర ఘాట్ల వద్ద పొంచి ఉన్న ప్రమాదం
- నది మొత్తం గుంతలు, గుంతలుగా మార్చేస్తున్న వైనం
- వానొచ్చినా, వరదొచ్చినా పడవలపై వెళ్లి ఇసుక అక్రమ రవాణా
- చోద్యం చూస్తున్న ఇరిగేషన్, పోలీసు అధికారులు

కృష్ణలంక, ఆగస్టు 22: కృష్ణానదిలో పద్మావతి ఘాట్ నుంచి రామలింగేశ్వర నగర్ వరకు నదిలోని ఇసుకను ఎవరిష్టం వచ్చినట్లు వారు ముఠాలుగా ఏర్పడి తోడేస్తున్నారు. వర్షం వచ్చినా, వరదలొచ్చినా ఇసుకను తోడేయడం వీరికెంతో సులువు. నదిమధ్యలోకి పడవలపై వెళ్లి, ఎక్కడ ఇసుక మేటలుంటే అక్కడ పడవను ఆపి ఇసుకను కొల్లగొట్టి విక్రయిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వీరు ఆడిందే ఆట పాడిందే పాటలా ఉంది. ప్రస్తుతం ఇసుక దొరకడం కష్టమైపోవడంతో ముఠాలుగా ఏర్పడి నదిని తవ్వేసుకొంటూ పోతున్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుకను సులభతరం చేసినప్పటికీ వీరు మాత్రం సంచులతో ఇసుకను తీసుకెళ్లి యథేచ్ఛగా విక్రయించేస్తున్నారు. ఒక్కో ఇసుక మూట రూ.50 నుంచి 100 వరకు విక్రయిస్తుంటారు. బిల్డింగ్ నిర్మాణం చేసేవారికి ఈ రేటు, బిల్డింగ్ మెటీరియల్ అమ్మే వ్యాపారులకు సైతం వీరు ఇసుక మూటలను విక్రయిస్తుండటంతో వారు దానికి మరో రూ.50 ఎక్కువేసి అమ్మేస్తున్నారు. దీంతో బిల్డింగ్ యజమానులు బిత్తరపోతున్నారు. స్వర్గపురి వద్ద ఘాట్ మెట్లపై వీరు తెచ్చిన ఇసుక మూటలను పేర్చుకొని అక్కడ నుంచి తోపుడు బండ్లపై కావాల్సిన వారికి, లేదా వ్యాపారులకు మూటల ద్వారా ఇసుకను అమ్మేస్తున్నారు. ఇక్కడ ఓ వ్యక్తి ముఠా ఏర్పాటు చేసి నది నుంచి ఇసుకను తెప్పించి కావాల్సిన వారికి విక్రయిస్తుంటాడు. మెట్లబజారు చివర ఉన్న కోదండ రామాలయం ఘాట్ వద్ద మరో వ్యక్తి ముఠా ఏర్పాటు చేసుకుని నది నుంచి ఇసుకను తెప్పించి ఘాట్ మెట్లపై పేరుస్తుంటాడు. ఒకవేళ నదిలో నీరుంటే పడవను సైతం అక్కడే సిద్ధం చేసుకొని నది మధ్యలోకి వెళ్లి ఇసుక మేటలున్న చోట ఇసుకను తోడి విక్రయిస్తున్నారు. మొన్న వరద వచ్చిన 10 రోజుల పాటు ఇసుక మూట ఒక్కింటికి రూ.150 నుంచి రూ.200 వరకు అమ్మారంటే అతిశయోక్తి కాదు. రాణిగారితోటలో వారధి వద్ద ఇలాగే ఎవరిష్టం వచ్చినట్లు వారు నదిలోని ఇసుకను తోడి విక్రయిస్తుండటంతో నది ఒడ్డున గుంతలు గుంతలుగా ఏర్పడింది.



రాణిగారితోటలో వారధి వద్ద ఆటోలో ఇసుక మూటలను తరలిస్తున్న అక్రమార్కులు



స్వర్గపురి వద్ద ఘాట్ మెట్లపై పేర్చిన నదిలో తోడిన ఇసుక సంచులు

కొరవడిన నిఘా

కృష్ణానదిలో నుంచి ఇసుకను తోడేస్తున్న ముఠాలపై ఇరిగేషన్ సిబ్బంది, పోలీసు శాఖ నిఘా కొరవడిందనే చెప్పవచ్చు. దీంతో తమనెవరూ అడ్డగించరనే ధీమాతో వారు తెల్లారుజామున 3నుంచి ఉదయం 10గంటల వరకు, సాయంత్రం 3 గంటల నుంచి చీకటి పడే వరకు ఇసుకను తోడేస్తున్నారు. కృష్ణలంకలో చాలా ప్రాంతాల్లో ఇసుకను లారీల ద్వారా, ట్రాక్టర్ల ద్వారా వేయించుకోవాలంటే బిల్డింగ్ యజమానులకు తీవ్ర ఇబ్బందిగా ఉంటోంది. చిన్న రోడ్లు కావడం, రోడ్డుపై ఇసుక వేస్తే రోడ్డు బ్లాక్ అవుతుంది. దీంతో వీరు ఇసుక మూటలపై ఆధారపడి నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో ఈ ముఠాలు తమ దందాను పెంచేసుకుంటున్నారు. అమావాస్యకో, పౌర్ణమికోకసారి కేసుల కోసం పోలీసులు ఇసుక బళ్లను సీజ్‌చేసి వారికి ఫైన్‌లు వేయించి చేతులు దులుపుకొంటున్నారు. ఈ గుంతల విషయం తెలియని అమాయక ప్రజలు, యువత నదిలోకి స్నానాల కోసం దిగి గోతుల్లో పడి ప్రాణాలు పోగొట్టుకొంటున్నారు. ఇసుక అక్రమ రవాణాపై ఇరిగేషన్ అధికారులు గత నెలలో పోలీసులకు రాత పూర్వక ఫిర్యాదు ఇవ్వడంతో కొన్నిరోజులు పోలీసు పికెట్ పెట్టి అక్రమ ఇసుక రవాణాను నియంత్రించారు. ఇవి తాత్కాలికం కావడంతో మళ్లీ అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఇప్పటికైనా ఇరిగేషన్ సిబ్బంది, పోలీసు సిబ్బంది గట్టి నిఘా పెట్టి ఇసుకను తోడకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



హిందీ కళాశాలల పునరుద్ధరణకు వినతి



భారతీనగర్, ఆగస్టు 22: రాష్ట్రంలోని హిందీ పండిత శిక్షణ కళాశాలలను పునరుద్ధరించాలని హిందీ ప్రచార సభ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు నర్సీపట్నంలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ సీహెచ్.అయ్యన్న పాత్రుడికి గురువారం వినతిపత్రం ఇచ్చారు. 1935లో స్థాపించబడిన హిందీ ప్రచారసభ హిందీ భాష అభివృద్ధికి హిందీ భాష ప్రచారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో ఎనలేని కృషి చేస్తుందని సంఘం ప్రతినిధులు తెలిపారు. సంస్థ ద్వారా అందిస్తున్న కోర్సుల వివరాలను వివరించారు. అనంతరం స్పీకర్‌ను సత్కరించారు. హైదరాబాద్ జనరల్ సెక్రటరీ ఎస్.గైబువల్లి, ఉపాధ్యక్షుడు మంచిపల్లి శ్రీరాములు, ఏపీ అధ్యక్షుడు సీఎల్.నాయుడు, ప్రచార సంచాలకుడు కోనే శ్రీధర్, ఉపాధ్యక్షుడు ఎం.పార్థసారథి పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

- మంత్రిని కలిసిన 108 ఉద్యోగులు



ప్రభుత్వాసుపత్రి, ఆగస్టు 22: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 108 సర్వీసెస్ కాంట్రాక్టు ఉద్యోగులు గురువారం మంత్రి వైసత్యకుమార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. వినతిపత్రంలో సమస్యలు పరిశీలించిన మంత్రి త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు 108 సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ప్రతినిధి వర్గం తెలిపారు. ఏవీ నాగేశ్వరరావు, బీ కిరణ్‌కుమార్, ఎన్.మహేష్, కేవీ నరసింహారావు, ఆర్.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించండి

మంత్రి డోలా బాల వీరాంజనేయులుకు వినతి

వన్‌టౌన్, ఆగస్టు 22: గ్రామ సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి డోలా బాలవీరాంజనేయులుకు ఆయన చాంబర్‌లో గురువారం గ్రామ సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడితోపాటు ముఖ్యకార్యదర్శి సుధాకర్ వినతిపత్రం ఇచ్చారు. సమస్యలను విన్న మంత్రి స్పందిస్తూ తన పరిధిలోని సమస్యలలో సానుకూలంగా ఉన్నవాటిని పరిష్కరిస్తానని, మిగతావాటిని నివేదికల ఆధారంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

దుర్గగుడిలో గణపతి హోమం



వన్‌టౌన్, ఆగస్టు 22: దుర్గగుడిలో చవితి తిథి సందర్భంగా అర్చకులు సర్వవిఘ్నాలు వైదొలగాలని, సంకల్పిత సర్వ విశేష, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా సాగాలని కోరుతూ గురువారం గణపతి హోమాన్ని నిర్వహించారు. అనంతర పూర్ణాహుతి సమర్పించి తర్పణ చేశారు. మరోవైపు గణపతికి అభిషేకాదులు నిర్వహించి షోడశోపచార పూజ, గరికతో అర్చన నిర్వహించారు. మంత్రపుష్పం, హారతి సమర్పించారు.

దక్షిణామూర్తికి అర్చన

మల్లేశ్వరాలయంలోని దక్షిణామూర్తి స్వామికి గురువారం సందర్భంగా అర్చకులు భక్తి శ్రద్ధలతో అభిషేకం, అర్చనలు నిర్వహించారు. దక్షిణామూర్తి అనుగ్రహాన్ని కోరుతూ మంత్రపుష్పం, హారతి సమర్పించారు.

అన్నవితరణకు విరాళం

దుర్గగుడిలో నిత్యాన్నదానానికి గాంధీనగర్‌కు చెందిన రాయప్రోలు బేబీ సరోజిని గురువారం ఈవో రామారావును కలిసి రూ.1,00,011ను చెక్కురూపంలో విరాళం అందజేశారు. కొత్తపల్లి వెంకటకృష్ణ పేరుతో అన్నవితరణ చేసేలా విరాళాన్ని అందజేశారు. కనకదుర్గమ్మదర్శనానంతరం దాతకు శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం, ఆశీస్సులు అందజేశారు.

దుర్గగుడి హుండీ లెక్కింపులో చోరీ

- నిందితులకు జైలు

విజయవాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో నిర్వహించే హుండీల లెక్కింపులో చోరీ చేసిన నిందితులకు న్యాయస్థానం గురువారం జైలుశిక్ష విధించింది. మల్లికార్జునపేటకు చెందిన చుక్కాకుల సింహాచలం, అతడి భార్య దుర్గ, చీపల్లి రమణ, వించిపేటకు చెందిన తుపాకుల దుర్గారావు 2019 జూన్ 4న జరిగిన హుండీ లెక్కింపులో పాల్గొన్నారు. సింహాచలం.. దేవస్థానంలో హుండీల్లో ఉన్న కానుకలను గోనెసంచుల్లో మార్చే సిబ్బందిలో ఒకడు. హుండీల లెక్కింపునకు భార్య దుర్గ, మరదలు రమణను తీసుకెళ్లాడు. హుండీల నుంచి కానుకలను తీస్తున్నప్పుడు నగదును కాజేసి దుర్గకు ఇచ్చాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఎస్పీఎఫ్ సిబ్బంది అతడిని పట్టుకుని అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారుల ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సింహాచలం, దుర్గ, దుర్గారావు, రమణ పాత్రపై విచారణ చేసిన పోలీసులు చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. సింహాచలం, దుర్గకు మూడేళ్ల జైలు, రూ.2వేల జరిమానా విధించారు. దుర్గారావు, రమణకు రెండేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయాధికారి రాజశేఖర్ తీర్పును ఇచ్చారు.

కాంట్రాక్ట్ ఉపాధ్యాయురాలిపై దాడి



విజయవాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కొత్తపేటలోని అన్నపూర్ణాదేవి మున్సిపల్ పాఠశాలలో అవుట్ సోర్సింగ్‌లో క్రాఫ్ట్ టీచర్‌గా పనిచేస్తున్న బండి అరుణపై గురువారం దాడి జరిగింది. ఆమె పాఠశాల ముగిశాక ఇంటికి వెళుతుండగా కొంతమంది యువకులు మద్యం మత్తులో ఆయుధాలతో దాడి చేశారని, తన తోటి ఉపాధ్యాయులకు ఫోన్ చేసి తెలిపింది. వాళ్లంతా గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌కు చెందిన వారని వాళ్లపై లోగడ ఫిర్యాదు చేశానని తెలిపింది. ప్రస్తుతం ఆమె ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. దీనిపై పోలీసులను సంప్రదించగా అరుణ తనంతట తానే దాడి చేసుకుందని చెప్పారు. సాయంత్రం ఇంటి వద్ద చెత్త విషయంలో ఎదురుగా ఉండే బస్వరాజు అనే వ్యక్తితో వివాదం జరిగిందని, కత్తితో అతడిపై అరుణ దాడి చేసిందని తెలిపారు. తర్వాత తానే గోడకు తలను కొట్టుకుందని రక్తపు గాయాలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చిందని చెబుతున్నారు. సిబ్బంది ఆస్పత్రికి తీసుకెళుతుండగా బైక్‌పై నుంచి దూకి భవానీపురం పారిపోయిందన్నారు. ఈ ఘటనలో పోలీసులు చెబుతున్న కథనానికి బాధితురాలి ఆరోపణలకు భిన్న వైరుధ్యాలు కనిపిస్తున్నాయి.

నగరంలో మంత్రి నారాయణ ఆకస్మిక పర్యటన

చిట్టినగర్: నగరంలో పలు ప్రాంతాల్లో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ గురువారం రాత్రి ఆకస్మికంగా పర్యటించారు. రోడ్లపై భారీగా వర్షపు నీరు నిలిచిపోయిన ప్రాంతాలను పరిశీలించి వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్రతో మాట్లాడారు. ప్రజల రాకపోకలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సాయంత్రం కురిసిన వర్షానికి నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల వెంబడి పలు వీధుల్లో వర్షపు నీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడటం గమనించిన మంత్రి వెంటనే చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. వర్షాకాలం ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నగరంలో వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. అలాగే దీనిపై శుక్రవారం మున్సిపల్ శాఖ, నగరపాలక సంస్థ ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్టు మంత్రి నారాయణ పేర్కొన్నారు.

ఐదుగురు ఎస్ఐల బదిలీ

విజయవాడ: కమిషనరేట్‌లో ఐదుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ సీపీ రాజశేఖరబాబు ఉత్తర్వులిచ్చారు. కొత్తపేటలో పనిచేస్తున్న కేవీజీవీ సత్యనారాయణను తిరువూరుకు బదిలీ చేశారు. పటమటలోని వై.విశ్వశాతకర్ణినిని నందిగామకు బదిలీ చేయగా, వీఆర్‌లోని కె.సుధాకర్‌కు మైలవరంలో పోస్టింగ్ ఇచ్చారు. నున్నలో క్రైమ్ ఎస్ఐగా ఉన్న షరీఫ్ మెహబూబ్‌ను, మైలవరంలోని ఎస్.హరిప్రసాద్‌ను వీఆర్‌కు పంపారు.

షీటర్‌పై షీటర్ల దాడి.. ఒకరికి కత్తిపోట్లు

విజయవాడ: అంతా పక్కపక్కనే ఉంటారు. ఒకేకోవకు చెందినవారు. చిన్నపిల్లల విషయంలో రేగిన వివాదంలో కత్తులతో దాడులు చేసుకునేవరకు వెళ్లింది. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. గుణదలలోని బెత్లేహం నగర్‌లో మద్దాల విద్యాధర్ అలియాస్ జోజి, సుంకర చందు, తంటేపూడి అరుణ్, కాసల గణేష్ అలియాస్ గని నివాసం ఉంటున్నారు. జోజీ ఆటోడ్రైవర్‌గా, చందు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. అరుణ్ జులయిగా తిరుగుతున్నాడు. వీరందరిపై మాచవరం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. అన్నదమ్ములైన ముదిరి అరుణ్‌కుమార్ అలియాస్ పెద్దరాజు, చిన్నరాజుకు జోజికి మధ్య వివాదాలుండడంతో పోలీసులు వారిని వేరేచోటకు పంపేశారు. పెద్దరాజు, చిన్నరాజు ప్రస్తుతం గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఉంటున్నారు. వారి తల్లి బెత్లేహం నగరంలో ఉంటోంది. తల్లిని చూడడానికి వచ్చిన చిన్నరాజు అక్కడే ఆడుకుంటున్న జోజి కుమారుడితో సరదాగా మాట్లాడాడు. ఆ బాలుడు ఈ విషయాన్ని తండ్రికి చెప్పాడు. దీనితో జోజి, చిన్నరాజు మధ్య వివాదం జరిగింది. కాసేపటికి వివాదం సర్దుమణిగింది. తర్వాత పెద్దరాజు తల్లి వద్దకు వచ్చాడు. బుధవారం రాత్రి వాళ్లంతా మళ్లీ గొడవ పడ్డారు. దీనితో జోజి, చందు, అరుణ్, గని కలిసి కత్తితో పెద్దరాజును ఛాతీపై పొడిచారు. మెడపై గాయాలు చేశారు. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. దీనిపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. సమాచారం తెలిసిన వెంటనే సీపీ రాజశేఖరబాబు ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, నలుగురు ఎస్ఐలతో ప్రత్యేకబృందాలను ఏర్పాటు చేశారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. దాడి చేసిన నిందితులను పోలీసులు లూర్దునగర్ సమాధుల వద్ద అరెస్టు చేశారు. వారి నుంచి దాడికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

'అచ్యుతాపురం' ఘటన దురదృష్టకరం

లబ్బీపేట: అచ్యుతాపురం ఎస్సెన్షియా ఫార్మా ఘటన దురదృష్టకరమని ఫార్మా అసోసియేషన్ ఆఫ్ ఏపీ అధ్యక్షుడు లుక్కా నరేష్ అన్నారు. ఫార్మా ఇండస్ట్రీల్లో గత ప్రభుత్వంలో అనేక భారీ అగ్ని ప్రమాదాలు జరిగాయని, అదే పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సేఫ్టీ ఆడిట్ నిర్వహించి ఫార్మా కంపెనీ ప్రమాణాలను పెంచేలా కృషి చేయాలని, మృతి చెందిన కుటుంబాలకు కోటి, తీవ్రంగా గాయపడిన వారికి రూ.50లక్షలు, పాక్షికంగా గాయపడిన వారికి రూ.25లక్షలు ప్రకటించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఇప్పటికైన ఫార్మా సెజ్‌లో ఉన్నత ప్రమాణాలున్న ఫార్మాకంపెనీలను మాత్రమే ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కోరుకుంటున్నామని, ఫార్మా సెజ్‌లోని కంపెనీలపై ఫార్మా సెజ్ సేఫ్ కమిటీలు వేసి నిరంతరం కంపెనీల పనితీరుపై చర్చించాలని కోరారు.

నగరంలో ప్రతిపక్షం లేకుండా చేస్తా !

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

విద్యాధరపురం, ఆగస్టు 22: నగరంలో ప్రతిపక్షమనేది లేకుండా చేస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు అబ్దుల్ అర్షద్ (54వ డివిజన్), మైలవరపు రత్నకుమారి (44వ డివిజన్), మైలవరపు మధూరి లావణ్య (45వ డివిజన్) వైఎస్ఆర్‌సీపీని వీడి టీడీపీలో చేరారు. ఎంపీ, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, నాగుల్ మీరా వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం శివనాథ్ మీడియాతో మాట్లాడారు. పార్టీలోని సీనియర్ల సలహాలతో నగరాన్ని టీడీపీ కంచుకోటగా మారుస్తానన్నారు. నగరంలో విపక్షమనేది లేకుండా చేసేందుకు నేతలంతా కలిసికట్టుగా ఒక ప్రణాళిక మేరకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తామన్నారు. వైసీపీ కార్యకర్తలు, నేతలు కూడా టీడీపీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. అయితే నగరాభివృద్ధి కోరుకుంటూ, స్వచ్ఛందంగా వచ్చేవారిని, ప్రజల్లో మంచిపేరున్నవారిని మాత్రమే ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. టీడీపీలో చేరిన కార్పొరేటర్లను అభినందించారు. బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామమోహన్, సుజనా చౌదరి, నాగుల్ మీరాతో కలిసి నగరాన్ని అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. 2014 నుంచి 2019 వరకు జరిగిన అభివృద్ధి తరహాలోనే సాగుతుందన్నారు. బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ సెంట్రల్ నుంచి కూడా టీడీపీలోకి చేరికలుంటాయన్నారు. నగరాభివృద్ధిని కాంక్షించేవారంతా టీడీపీలోకి వస్తారన్నారు. రాజకీయ విభేదాలు తప్ప వ్యక్తిగత విభేదాలు ఉండవన్నారు. జగన్ పాలనలో నగరం కళ తప్పిందన్నారు. వైసీపీ కార్పొరేటర్లకు నిధులివ్వలేదని, గ్రూపు తగాదాలతో నష్టపోయారన్నారు. కేశినేని శివనాథ్ నాయకత్వంలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్‌మీరా మాట్లాడుతూ పశ్చిమ నుంచి ముగ్గురు వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరడాన్ని సాదరంగా స్వాగతిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, డూండీ రాకేష్, మహమ్మద్ ఫతావుల్లా ఎంఎస్ బేగ్, బొమ్మసాని సుబ్బారావు, మాదిగాని గురునాథం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

4 కిలోల గంజాయి స్వాధీనం

- బెంగుళూరుకు చెందిన గోపీకృష్ణ అరెస్టు

వన్‌టౌన్, ఆగస్టు 22: గంజాయి అక్రమ రవాణా కేసులో బెంగుళూరు బసవిశంకరి ప్రాంతానికి చెందిన గోపీకృష్ణ (40)ను అరెస్టు చేసి, అతడి నుంచి 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు గవర్నరుపేట సీఐ ఎం సత్యనారాయణ తెలిపారు. గురువారం పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితుడిని ప్రవేశపెట్టారు. నిందితుడు గతంలో బెంగుళూరులో ఉంటూ కార్‌డ్రైవింగ్ చేసుకుంటూ జీవించేవాడు. గతంలో కొవిడ్ కారణంగా భార్య మృతి చెందింది. సంతానం కలగలేదు. దీంతో ఉపాధి నిమిత్తం నాలుగేళ్ల క్రితం నిందితుడు నగరానికి వచ్చి తొలినాళ్లలో ఒక మెస్‌లో సప్లయర్‌గా పనిచేశాడు. కాలుకు ఇన్‌స్పెక్షన్ రావడంతో గుంటూరు వెళ్లాడు. అక్కడ కారుడ్రైవర్‌గా పనిచేశాడు. కాలు చికిత్స కోసం 2 నెలలు హైదరాబాద్‌లో ఉండి మళ్లీ తిరిగి నగరానికి వచ్చాడు. కూలీ, పెయింటింగ్ పనులు చేసుకుంటూ రైల్వే స్టేషన్ వెయిటింగ్ హాలు వద్ద ఉంటున్న సమయంలో ఒడిశాకు చెందిన సంతోష్, తరువాత ఇర్ఫాన్.. గోపీకృష్ణకు పరిచయమయ్యారు. ఈ క్రమంలో గోపీకృష్ణకు బుధవారం సంతోష్ ఒక నల్లబ్యాగు ఇచ్చి ఇందులో గంజాయి ఉందని, హైదరాబాద్ నుంచి ఇర్ఫాన్ వస్తాడని, అతడికి బ్యాగ్ ఇచ్చి రూ.5వేలు తీసుకోవాలని చెప్పాడు. ఒక బార్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న గోపీకృష్ణను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ పీ నారాయణమ్మ కేసు నమోదు చేశారు. గంజాయి, మత్తు మందులు వంటి విక్రయాలు, అక్రమ రవాణా జరుగుతున్నట్టయితే తమకు సమాచారం ఇవ్వాలని సీఐ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు

భవన నిర్మాణ కార్మికులకు నైపుణ్య కల్పన

- స్పాతో బిల్డర్స్ అసోసియేషన్ ఒప్పందం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ప్రతినిధులు


వన్‌టౌన్, ఆగస్టు 22: భవన నిర్మాణ కార్మికులకు నైపుణ్యం కల్పించేందుకు స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ స్కూల్ (స్పా)తో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఏపీ శాఖ గురువారం ఒప్పందం చేసుకుంది. నగరంలోని ఓ హోటల్‌లో అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధుల సమావేశం నిర్వహించారు వివిధ చాప్టర్ల నుంచి వందమంది ప్రతినిధులు హాజరైన ఈ సమావేశంలో రాష్ట్రంలో భవన నిర్మాణరంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఇసుక సమస్య, కార్మికలల్లో నైపుణ్యతలేమి, ఐదేళ్లుగా పడిన ఇబ్బందులు, కాంట్రాక్టర్ల ఇబ్బందులు, రోడ్లు, భవనాల నిర్మాణాలకు సంబంధించి బకాయిల గురించి చర్చించారు. వీటన్నిటికి పరిష్కారంగా ఓ కమిటీని నియమించి, ఆ కమిటీ ద్వారా ప్రభుత్వానికి సమస్యలను విన్నవించి పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. భవన నిర్మాణ కార్మికులకు నైపుణ్యంలో శిక్షణ, సాంకేతికాంశాల్లో అవగాహన కల్పించేందుకు స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా)తో అసోసియేషన్ ఎంవోయూ కుదుర్చుకున్నారు. రాష్ట్ర శాఖ అధ్యక్షుడు అత్తలూరి నాగమల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. స్పా డైరెక్టర్ సిరికొండ రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చెరువు రామకోటయ్య, వల్లభనేని వెంకటేశ్వరరావు, పీ రాజబాబు, కే రాఘవరావు, కేవీఎస్ బుచ్చిరాయుడు, రాష్ట్రకార్యదర్శి పీ శేషగిరిరావు, కోశాధికారి ఎన్ నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఏ కాశీ విశ్వేశ్వరరావుతో పాటు స్పా అధ్యాపకులు పాల్గొన్నారు.

మేఘం కరిగెను









చినుకే చిందెను..



సాయంత్రం వేళ.. ఒక్కసారిగా నల్లటి మేఘాలు ఆకాశమంతా పరుచుకుని అప్పుడే రాత్రయిపోయిందా అన్నట్లు వాతావరణం మారిపోయింది. ఇంతలో చిన్నగా చినుకు మొదలై నిమిషాల్లోనే భారీ వర్షంగా మారింది. ఇటీవల మధ్యాహ్నం వేళ భానుడు చూపిస్తున్న ప్రతాపానికి ఈ వర్షం నగర వాసులకు కొంత ఉపశమనం కలిగించినా వాహనదారులకు మాత్రం నరకం కనిపించింది. ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. లోతట్టు ప్రాంతాల్లోని రహదారులు నీటమునిగి పాదచారులు నడిచేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.



కర్నూలు వైసీపీ కార్యాలయం కూల్చివేత ఉత్తర్వులు రద్దు

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కర్నూలు వైసీపీ కార్యాలయం కూల్చివేతకు మున్సిపల్ అధికారులు ఇచ్చిన తుది ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. భవన నిర్మాణ అనుమతులు, అధికారులు కోరిన ఇతర వివరాలను జత చేస్తూ మున్సిపల్ అధికారులకు వివరణ ఇచ్చేందుకు పిటిషనర్‌కు వెసులుబాటు కల్పించింది. వాటిని పరిశీలించి చట్ట నిబంధనల మేరకు 8వారాల్లో నిర్ణయం వెల్లడించాలని అధికారులకు స్పష్టం చేసింది. అప్పటివరకు పార్టీ కార్యాలయం విషయంలో ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవాద్దని ఆదేశించింది. ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని పిటిషనర్‌కు స్పష్టం చేస్తూ.. వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణ మోహన్ గురువారం ఉత్తర్వులు ఇచ్చారు.

ప్రకృతి విధ్వంసాలతోనే వాతావరణంలో మార్పులు

▸▸ వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రాజశేఖర్

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాబోయే మూడేళ్లలో 40% మంది రైతులు ప్రకృతి వ్యవసాయం పరిధిలోకి వస్తారని వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ చెప్పారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాల్సి ఉందన్నారు. గురువారం తాడేపల్లిలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ... ప్రకృతి విధ్వంసాల వల్ల వాతావరణంలో వస్తున్న మార్పులతో భవిష్యత్‌కు భద్రత లేకుండా పోతోందన్నారు.

బైక్ స్పేర్స్ చోరీ చేసిన హెడ్‌కానిస్టేబుల్

▸▸ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న బాధితుడు

అగళి, ఆగస్టు 22: శ్రీసత్యసాయి జిల్లా అగళి పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రామాంజినేయులు, భూ తగాదా కేసులో సీజ్ చేసిన వాహనం స్పేర్‌పార్ట్స్‌ను తస్కరిస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికాడు. మూడు నెలల క్రితం సీజ్ చేసిన ఓ బైక్‌ను పోలీస్ స్టేషన్ అవరణలో ఉంచారు. దాన్ని గురువారం స్థానికంగా ఉన్న ఓ మెకానిక్ షెడ్‌కు తీసుకువెళ్లిన హెచ్‌సీ.. స్పేర్ పార్ట్ విప్పించి.. తన వాహనానికి అమర్చుకోబోయాడు. అదే సమయంలో ద్విచక్ర వాహనదారు దినేష్ నేరుగా మెకానిక్ షెడ్‌కు వెళ్లి హెడ్ కానిస్టేబుల్‌ను నిలదీశాడు. దీంతో హెడ్ కానిస్టేబుల్ అక్కడి నుంచి జారుకున్నాడు.

విదేశీ విద్య బకాయిలు చెల్లించండి

▸▸ మంత్రి డోలాకు విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విదేశీ విద్య బకాయిలు చెల్లించాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామిని కోరారు. గత టీడీపీ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకొచ్చిన విదేశీ విద్య పథకం ద్వారా విదేశాలకు వెళ్లిన విద్యార్థులకు వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫీజులు చెల్లించకుండా నిలిపేసిందని, దీంతో అప్పులు చేసి కోర్సు పూర్తి చేసుకున్నామని తెలిపారు. గురువారం సచివాలయంలో వారంతా మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు.

వివేకా హత్య కేసులో ఉదయ్‌కుమార్ విడుదల

సైదాబాద్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాబాయ్, మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితుడిగా చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న గజ్జల ఉదయ్ కుమార్‌రెడ్డి(ఏ-6) గురువారం సాయంత్రం బెయిల్‌పై విడుదలయ్యారు. బుధవారం ఉదయ్‌కుమార్ రెడ్డికి హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. కోర్టులో ష్యూరిటీలు సమర్పించిన అనంతరం బెయిల్ పత్రాలు జైలు అధికారులకు అందడంతో ఆయన కారాగారం నుంచి బయటకు వచ్చారు.

సీప్లేన్ సేవలతో పర్యాటకానికి ఊతం: రామ్మోహన్

న్యూఢిల్లీ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నూతన సీప్లేన్ విధానంతో ప్రజారవాణా మరింత సులభతరం కానుందని, సీప్లేన్ సేవలతో దేశంలో పర్యాటకం పెరుగుతుందని పౌరవిమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు స్పష్టం చేశారు. సీప్లేన్ కార్యకలాపాలకు సంబంధించి సమగ్ర సరళీకృత మార్గదర్శకాలను పౌరవిమానయాన శాఖ గురువారం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర సహా మరికొన్ని రాష్ట్రాలు ఈ సీప్లేన్ కార్యకలాపాల నిర్వహణకు ఆసక్తి చూపుతున్నాయని మంత్రి తెలిపారు. అక్టోబరులో విజయవాడలో సీప్లేన్ డెమో నిర్వహిస్తామని వెల్లడించారు.

తమ్మినేనిపై ఎమ్మెల్యే రవికుమార్ ఫిర్యాదు

ఆమదాలవలస, ఆగస్టు 22: మాజీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంపై శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. గురువారం సచివాలయంలో నీరబ్ కుమార్‌ను కలసి నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంపై సీఐడీ దర్యాప్తు చేయించాలని కోరారు.

'డయల్ యువర్ సీఈవో'

▸▸ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టులో ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక విభాగం

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టులో అవినీతిని నిర్మూలించడానికి ట్రస్టు సీఈవో లక్ష్మీశా ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ట్రస్ట్ పేరుతో నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రైవేటు వ్యక్తులు ఫోన్లు చేస్తున్నారు. కొంత మంది ట్రస్ట్ ఉద్యోగులు కూడా ఇందులో భాగస్వాములవుతున్నారు. దీనిని అరికట్టేందుకు 'డయల్ యువర్ సీఈవో' పేరుతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు పూర్తిగా దారి తప్పింది. ట్రస్టులో ప్రతిస్థాయిలోనూ అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయి. ట్రస్టు బయట కూడా ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తులు ఆస్పత్రుల నుంచి భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారు. దీనిపై ట్రస్టుకు ప్రతి రోజూ ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రస్తుతానికి ఫిర్యాదులు స్వీకరించేందుకు ట్రస్టులో ఒక విభాగం ఉన్నప్పటికీ, అన్ని ఫిర్యాదులూ ఆయన దృష్టికి రావడం లేదు. దీంతో ప్రతి సోమవారం ఉదయం ట్రస్టు సీఈవోనే ఆ విభాగంలో కూర్చొని ఫిర్యాదులను స్వీకరిస్తారు.

సీజ్ చేసిన పంచదార పంపిణీకి ఏర్పాట్లు

అమరావతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఎంఎల్ఎస్ పాయింట్లలో సీజ్ చేసిన పంచదారను రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఎంఎల్ఎస్ పాయింట్లలో పంచదార స్టాక్‌లను కచ్చితమైన తూకాలతో రేషన్ షాపులకు విడుదల చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల సివిల్ సప్లయిస్ మేనేజర్లను ఆదేశిస్తూ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.వీరపాండియన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

టీచర్లకు పదోన్నతులు ఇవ్వాలి: టీఎన్‌యూఎస్

ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఆ సంఘం ప్రతినిధులు మన్నం శ్రీనివాస్, రేపూడి శ్రీనివాస్ గురువారం మంగళగిరిలోని కార్యాలయంలో విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను సర్దుబాటు ప్రక్రియ తీర్చలేదన్నారు. 117, 8 జీవోలను రద్దు చేయాలని కోరారు. డీఈవో పూల్‌లో ఉన్న భాషా పండితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేయగా కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

ప్రత్యేక సెజ్ చట్టాల్ని రద్దుచేయాలి: న్యూడెమోక్రసీ

అమరావతి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అత్యంత ప్రమాదకరంగా మారిన సెజ్ చట్టాలను రద్దుచేయాలని సీపీఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ డిమాండ్ చేసింది. పారిశ్రామిక ప్రమాదాలకు కారణమైన యాజమాన్యాలపై హత్యానేరంతోపాటు క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆ పార్టీ అధికార ప్రతినిధి వై.సాంబశివరావు డిమాండ్ చేశారు.

విమానంలో ప్రసవించిన మహిళ

చెన్నై, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సింగపూర్ నుంచి గురువారం తెల్లవారుజామున చెన్నైకు వస్తున్న విమానంలో ఓ మహిళ ప్రసవించింది. బుధవారం అర్ధరాత్రి సింగపూర్ నుంచి 179 మంది ప్రయాణికులతో ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం చెన్నై బయల్దేరింది. మార్గమధ్యలో విజయవాడకు చెందిన దీప్తి (28) అనే నిండు గర్భిణీకి హఠాత్తుగా ప్రసవ నొప్పులు రావడంతో, ఈ విషయాన్ని కుటుంబసభ్యులు ఎయిర్ హోస్టెస్‌కు తెలిపారు. ఈ సమాచారాన్ని విమాన పైలెట్ చెన్నై విమానాశ్రయంలోని కంట్రోల్ రూమ్‌కు తెలియజేసి, విమానాన్ని కుదుపులు లేకుండా జాగ్రత్తగా నడిపారు. విమానంలో ఉన్న ఓ మహిళా డాక్టర్.. దీప్తికి ప్రసవం చేయగా మగబిడ్డ జన్మించాడు. ఆ విమానం తెల్లవారుజామున 4.30 గంటలకు చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకోగానే సిద్ధంగా ఉన్న వైద్య సిబ్బంది అంబులెన్స్ ద్వారా తల్లీ బిడ్డను థౌజండ్ లైట్స్‌లో ఉన్న అపోలో ఆసుపత్రికి తరలించారు.

వైసీపీ నేతల 'చెత్త' పనులు

▸▸ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ముసుగులో రూ.కోట్లు కొట్టేసేందుకు స్కెచ్

▸▸ 10 శాతం పనులకు 90 శాతం చేశారంటూ అధికారుల వత్తాసు

▸▸ 55 వేల టన్నుల చెత్త శుద్ధి పూర్తయిందంటూ బిల్లుల తయారు

▸▸ 5.25 కోట్లు నొక్కేసేందుకు సిద్ధం

▸▸ నంద్యాలలో వెలుగులోకి అక్రమం


కొండలా పేరుకుపోయిన చెత్త

(నంద్యాల-ఆంధ్రజ్యోతి)

జగన్ హయాంలో రాష్ట్రంలో చేపట్టిన చెత్తశుద్ధి కార్యక్రమం వైసీపీ నేతల అక్రమాలకు నిలయంగా మారింది. నంద్యాల జిల్లాలో రెండేళ్ల కిందటే చెత్తశుద్ధి పనులు మొదలుపెట్టినా వైసీపీ హయాంలో ఏమాత్రం ముందుకు సాగలేదు. జరిగిన కాస్త పని ద్వారా వచ్చిన మట్టి, ప్లాస్టిక్‌ను వైసీపీ నాయకులు అమ్ముకున్నారు. అయితే, అధికారులు మాత్రం 90 శాతం పనులు పూర్తయ్యాయంటూ బిల్లులు సిద్ధం చేశారు. 'స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్' సదరు బిల్లులను ఆమోదించటమే తరువాయి కోట్ల రూపాయల బిల్లులు మంజూరు కానున్నాయి. ఇప్పటికే కొంతమేరకు బిల్లులు మంజూరైనట్లు తెలిసింది. వీటిని కొట్టేసేందుకు నంద్యాల మున్సిపల్ అధికారులు, అప్పటి వైసీపీ నేతలు తెరవెనుక తతంగం నడిపిస్తున్నారు. ఈ విషయంపై కూటమి ప్రభుత్వం లోతుగా ఆరా తీస్తే మరిన్ని విషయాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

ఉమ్మడిగా ఊడ్చేసేందుకు

నంద్యాల పట్టణ శివారులో ఉన్న కుందూ నది అవతల 13 ఎకరాల్లో డంపింగ్ యార్డు ఉంది. పట్టణం నుంచి రోజూ సేకరించిన 120 టన్నుల చెత్తను ఎప్పటికప్పుడు ఈ యార్డుకు తరలిస్తారు. దీనిని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కింద శుద్ధి చేయాల్సి ఉంది. కానీ, కొన్నేళ్లుగా చెత్త శుద్ధి జరగకపోవటంతో యార్డు పూర్తిగా నిండిపోయింది. దీనిని శుద్ధి చేస్తేగానీ రోజూవారీగా పట్టణం నుంచి సేకరించే చెత్తను యార్డులో వేసేందుకు వీలు లేదు. దీంతో గత వైసీపీ ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో 66 వేల మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ధి చేసే కాంట్రాక్టును ముంబైకి చెందిన సాగర్ మోటార్స్‌కు అప్పగించింది. తడి చెత్త ద్వారా రైతులకు ఉపయోగపడేలా వర్మీ కంపోస్టు తయారీ, అలాగే పొడి చెత్త నుంచి మట్టి, ఆర్‌డీఎఫ్(ప్లాస్టిక్, వస్త్రాలు, గాజు) వంటివి వేరు చేయాలి. ఇలా వేరు చేసిన ఆర్‌డీఎఫ్‌ను స్థానిక జిందాల్ ఫ్యాక్టరీకి తరలించాలి. ఒక టన్ను చెత్త శుద్ధి చేసినందుకు కాంట్రాక్టు సంస్థకు దాదాపు రూ.750 వరకు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. ఇలా మొత్తం శుద్ధి ప్రక్రియను రూ.5.25 కోట్లకు వైసీపీ ప్రభుత్వం అప్పగించింది. అయితే, పనులు మొదలుపెట్టి రెండేళ్లవుతున్నా చెత్త శుద్ధి ప్రక్రియ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో డంపింగ్ యార్డులో చెత్త కొండలా పేరుకుపోయింది. అయితే, సంబంధిత కంపెనీ చెత్త శుద్ధి చేపడుతున్నట్లు ఎప్పటికప్పుడు వివరాలను లాగ్‌బుక్‌లో నమోదు చేసింది. వాస్తవానికి అలా జరగలేదు. దీనిని పర్యవేక్షించాల్సిన అధికారులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ వచ్చారు. దీని వెనుక అప్పటి వైసీపీ నాయకుల ప్రోద్బలం ఉన్నట్లు ఆరోపణలు వినిపించాయి. జరిగిన కొద్ది మేర శుద్ధిలో వేరు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను, మట్టిని వైసీపీ చోటా మోటా నాయకులు అమ్మేసుకున్నారన్న ఆరోపణలు అప్పట్లోనే బలంగా వినిపించాయి. ఇక ఆ తర్వాత శుద్ధి ప్రక్రియ పూర్తిగా మూలన పడింది. ఈలోపు ఎన్నికలు రావటంతో ప్రభుత్వం మారిపోయింది. ఇక, ఎప్పటి నుంచో తమ ఆధ్వర్యంలోనే ఈ శుద్ధి కార్యక్రమం నడవటం, మున్సిపాలిటీలో కూడా తమ బలమే ఉండటంతో వైసీపీ నాయకులు, అధికారులతో కుమ్మక్కయి దీనికి సంబంధించిన బిల్లులను సిద్ధం చేశారు. వాటిని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు కూడా పంపించారు. అక్కడి నుంచి ఆమోద ముద్ర రాగానే నిధులు విడుదలకానున్నాయి. ఇలా వచ్చిన సొమ్మును అధికారులు, వైసీపీ నేతలు పంచుకునేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలుస్తోంది.

గతేడాది జనవరిలో చెత్తశుద్ధి కార్యక్రమాన్ని అప్పటి వైసీపీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి ప్రారంభించారు. కాంట్రాక్టు ప్రకారం 3 నెలల్లో పనులు పూర్తయ్యేలా చూడాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రోజుకు 10 వేల టన్నుల చెత్తను శుద్ధి చేసినా 66 రోజుల్లో, అంటే రెండు నెలల్లోనే శుద్ధి ప్రక్రియను పూర్తి చేయవచ్చు. గతేడాది ఏప్రిల్‌లో పూర్తి కావాల్సిన శుద్ధి ప్రక్రియ సాంకేతిక కారణాలతో ఆగిపోయింది.

కనిపించని చెత్త'శుద్ధి'

డంపింగ్ యార్డులోని 66 వేల మెట్రిక్ టన్నుల చెత్త శుద్ధి ప్రక్రియను చేపట్టిన కంపెనీ ఇప్పటికే 55 వేల మెట్రిక్ టన్నులను శుద్ధి చేసిందని అధికారులు చెబుతున్నారు. తద్వారా వచ్చిన మట్టి, ఆర్‌డీఎఫ్‌ను 32 వేల టన్నుల మేర డంపింగ్ యార్డు నుంచి బయటకు పంపించామని, మరో 23 వేల టన్నులను బయటకు పంపించాల్సి ఉందని తెలిపారు. కానీ, డంపింగ్ యార్డులో శుద్ధి చేసిన వ్యర్థాలు ఏమాత్రం కనిపించవు. అసలు అక్కడి జేసీబీలు, శుద్ధి చేసే యంత్రాలు పని చేయక కొన్ని నెలలు అవుతోంది. ఇక మట్టి, ఆర్‌డీఎఫ్ వంటివి బయటకు పోయిందే లేదని చూసిన వారెవరికైనా అర్థమవుతుంది. దీంతో చెత్త శుద్ధి పనులకు సంబంధించి రూ.5.25 కోట్లు కొట్టేసేందుకు రంగం సిద్ధమైందని తెలుస్తోంది. ఇందులో ఓ ఇంజనీరింగ్ అధికారి ప్రమేయం కూడా ఉందని, విచారణ చేస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయని స్థానికులు చెబుతున్నారు.

డిస్టిలరీలతో మంత్రి కొల్లు సమావేశం

▸▸ వాసుదేవరెడ్డి వసూళ్లలో వారికీ పాత్ర

▸▸ ఇప్పుడు కొత్త ప్రభుత్వం చుట్టూ ప్రదక్షిణలు

▸▸ తాజా సమావేశంపై విమర్శలు

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వానికి కొమ్ముకాసిన కొన్ని డిస్టిలరీల ప్రతినిధులతో ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర గురువారం అమరావతి సచివాలయంలో సమావేశమయ్యారు. డిస్టిలరీలు, మద్యం బ్రాండ్ల కంపెనీలతో వేర్వేరుగా ఆయన సమావేశాలు నిర్వహించారు. గత ప్రభుత్వంలో బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా ఉన్న వాసుదేవరెడ్డిపై తీవ్ర ఆరోపణలున్నాయి. మద్యం తయారీకి వినియోగించే ముడిసరుకు ఈఎన్ఏను పక్క రాష్ట్రాలకు ఎగుమతి చేసి అందులో కమీషన్లు పొందినట్లు కొత్త ప్రభుత్వం గుర్తించింది. ప్రతినెలా కోట్ల లీటర్ల ఈఎన్ఏ పక్క రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. అలా ఎగుమతి చేసిన రాష్ట్రానికి చెందిన డిస్టిలరీల నుంచి లీటరుకు రూ.2 చొప్పున వసూలు చేశారు. కొన్ని డిస్టిలరీల ప్రతినిధులు మధ్యవర్తులుగా ఉండి వసూళ్లు చేసి, వాసుదేవరెడ్డికి ఇచ్చారని డిస్టిలరీ వర్గాల్లో బహిరంగ చర్చ సాగుతోంది. అందులో కొంతమేర వారి జేబుల్లోకి కూడా వెళ్లాయి. ప్రభుత్వం మారాక వాటి నుంచి తప్పించుకునేందుకు ఆ డిస్టిలరీల యాజమాన్యాలు ఓ సంఘంగా ఏర్పడి తరచూ అధికారులు, మంత్రిని కలిసే ప్రయత్నం చేస్తున్నారు. ఇలాంటి ఆరోపణలున్న డిస్టిలరీల ప్రతినిధులతో మంత్రి సమావేశం కావడం విమర్శలకు దారి తీస్తోంది. అలాగే కాన్ఫెడరేషన్ ఇండియన్ ఆల్కహాలిక్ బేవరేజెస్ కంపెనీస్(సీఐఏబీసీ) ప్రతినిధులతోనూ మంత్రి సమావేశమయ్యారు. అక్టోబరు 1నుంచి నూతన మద్యం పాలసీని తీసుకొస్తున్నామని మంత్రి తెలిపారు. ఎంఎన్‌సీలకు చెందిన పాపులర్ బ్రాండ్లను అందుబాటులో ఉంచుతామన్నారు.

ఓబులమ్మకు పక్కా ఇల్లు

▸▸ మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు


ఓబులమ్మ(ఆకుపచ్చ చీర)కు ఇంటి మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర రూరల్, ఆగస్టు 22: సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం గుండుమలకు చెందిన ఓబులమ్మకు పక్కా ఇల్లు మంజూరైంది. ఈ నెల 1న గ్రామంలో ఓబులమ్మ, రామప్ప అనే ఇద్దరికి సీఎం చంద్రబాబు పింఛన్లు పంపిణీ చేశారు. ఆ సమయంలో తనకు సొంత ఇల్లు లేదని ఓబులమ్మ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. చంద్రబాబు సానుకూలంగా స్పందించి, మాట నిలబెట్టుకున్నారు. గురువారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు గుండుమల వెళ్లి ఓబులమ్మకు ఇంటి మంజూరు పత్రాన్ని అందజేశారు. అనంతరం గృహ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఓబులమ్మ ఇంటి నిర్మాణానికి రూ.3.50 లక్షలు మంజూరైందని ఎమ్మెల్యే తెలిపారు. మొదటి విడతగా రూ.50 వేలు ఇస్తామన్నారు. త్వరితగతిన ఇంటిని నిర్మించి ఇవ్వాలని హౌసింగ్ అధికారులకు సూచించారు.

భరణం భర్తకు శిక్షగా మారకూడదు!

▸▸ నెలకు రూ.6 లక్షలు అవసరమా?.. మహిళపై కర్ణాటక హైకోర్టు ఆగ్రహం

బెంగళూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మాజీ భర్త నుంచి నెలకు రూ.6 లక్షలు భరణం చెల్లించాలని ఓ మహిళ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం విచారించిన కర్ణాటక హైకోర్టు ధర్మాసనం.. ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేసింది. భరణం ఎట్టి పరిస్థితుల్లోనూ భర్తకు శిక్ష కారాదని స్పష్టం చేసింది. విలాసవంతమైన జీవనం సాగించాలంటే సంపాదించుకోవాలని, మాజీ భర్తను వేధించవద్దని సూచించింది. మహిళ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. మాజీ భర్త నుంచి నెలకు రూ.6,16,300 భరణం ఇప్పించాలని ప్రతిపాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. నెలకు ఎవరైనా అంత ఖర్చు చేస్తారా..? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెకు అంతగా అవసరం ఉంటే సంపాదించుకోవచ్చని, మాజీ భర్తపై ఎందుకు ఆధారపడాలని ప్రశ్నించారు. సొంత ఖర్చులకే ఇంత భారీ సొమ్ము కోరుతారా..? ఇది అసమంజసమని న్యాయమూర్తి పేర్కొన్నారు.

నటుడు విజయ్ పార్టీ పతాకావిష్కరణ

▸▸ రాష్ట్ర ప్రజల కోసం పాటుపడదామంటూ పిలుపు



చెన్నై, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తమిళ సినీనటుడు విజయ్ తను స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం' పార్టీ పతాకాన్ని, గీతాన్ని గురువారం చెన్నైలో లాంఛనంగా ఆవిష్కరించారు. పైనా-కింద ఎరుపు, మధ్యలో పసుపు రంగు.. పసుపురంగు మధ్య భాగంలో రెండు ఏనుగులు ఘీంకరిస్తుండగా, వాటి నడుమ వాగైపుష్పం (దోరిసేన పుష్పం).. చుట్టూ 23 నక్షత్రాలతో పతాకం రూపొందింది. విజయ్ ఆవిష్కరించిన తమిళగ వెట్రి కళగం పార్టీ గీతం ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది. ఇప్పటి వరకూ మన కోసం మనం కష్టపడ్డామని, ఇకపై రాష్ట్ర ప్రజల కోసం కూడా పాటుపడదామని విజయ్ పిలుపునిచ్చారు.

మహిళా సమస్యల పరిష్కారానికి సహకరించండి

▸▸ మంత్రి సత్యకుమార్‌కు యూకే మహిళ వినతి

▸▸ 'వారధి'కి వినతుల వెల్లువ.. పలువురికి సీఎంఆర్ఎఫ్


బీజేపీ-వారధి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి సత్యకుమార్

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): 'మహిళల్ని నెలసరి సమస్యలు చాలా ఎక్కువగా పీడిస్తున్నాయి. కడుపు నొప్పి నుంచి గర్భాశయ కేన్సర్ వరకూ ఎన్నో బాధలు పడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 19 కోట్లమంది మహిళలకు ఉపశమనం కలిగించేందుకు పని చేస్తున్న మాకు ప్రభుత్వ సహకారం కావాలి' అంటూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను యూకేకి చెందిన స్టార్టప్ సీఈవో నటాలీ కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహిస్తోన్న 'వారధి' కార్యక్రమానికి గురువారం పెద్దసంఖ్యలో ప్రజలు వినతులతో వచ్చారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు మంత్రికి వినతిపత్రాలు ఇచ్చారు. రెండేళ్లుగా కేన్సర్‌తో బాధపడుతూ రూ.14 లక్షలు ఖర్చు చేశామని, ఇక వైద్యానికి డబ్బుల్లేవని కర్నూలు రైతు కొత్తకాపు హేమసుందర్ రెడ్డి వేడుకోవడంతో తక్షణమే సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారు. మొత్తం 100 అర్జీలు రాగా ఆరోగ్య సమస్యలున్న 15 మందికి సీఎంఆర్ఎఫ్ నిధులు ఇప్పించారు. భూ ఆక్రమణల సమస్యలు, వ్యక్తిగత ఇబ్బందులపైనా వినతులు వచ్చాయి. వాటిని సంబంధిత శాఖలకు పంపి పరిష్కరించాల్సిందిగా మంత్రి ఆదేశించారు. అనంతరం సత్యకుమార్ మీడియాతో మాట్లాడుతూ... ప్రజాప్రతినిధులుగా ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేయడమే లక్ష్యమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల రూపురేఖలు మార్చబోతున్నామని, వైద్య పరికరాలు ఇతర సదుపాయాలపై ఆడిట్ చేస్తున్నట్లు చెప్పారు. అచ్యుతాపురం ప్రమాదంపై మంత్రి సత్యకుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.


కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులతో మాట్లాడుతున్న చంద్రబాబు

అస్వస్థతకు గురైన చిన్నారులకు సీఎం పరామర్శ

▸▸ కోలుకునే వరకూ వైద్య సేవలు... డిశ్చార్జ్ సమయంలో 50 వేలు సాయం

విశాఖపట్నం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కైలాసపట్నం ఆశ్రమంలో కలుషిత ఆహారం తిని తీవ్ర అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులను సీఎం చంద్రబాబు గురువారం పరామర్శించారు. ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కుటుంబసభ్యులను పరామర్శించేందుకు కేజీహెచ్ మార్చురీ వద్దకు వచ్చిన ఆయన.. అనంతరం ఆస్పత్రిలోని పీడియాట్రిక్ విభాగంలో చికిత్స పొందుతున్న చిన్నారుల వద్దకు వెళ్లారు. ప్రతి చిన్నారినీ పలకరించారు. వారి తల్లిదండ్రులతోనూ మాట్లాడిన సీఎం వైద్య సేవలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ... 'అందరూ కోలుకునే వరకు వైద్య సేవలు అందిస్తాం. భయపడాల్సిన పనిలేదు. అవసరమైతే ప్రైవేటు ఆస్పత్రులకు తరలించాలని సూచించాం. పిల్లలను డిశ్చార్జ్ చేసే సమయంలో రూ.50 వేలు చొప్పున అందించి పంపించాలని జిల్లా అధికారులను ఆదేశించాం' అని తెలిపారు. సీఎంతో పాటు ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యేలు ఉన్నారు.

24 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీ

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుమారు 24 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. గ్రేటర్ విశాఖలో సెక్రటరీగా ఉన్న పి.నల్లనయ్యను విజయనగరం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఎం.మల్లయ్యనాయుడును సీడీఎంఏకు రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. మున్సిపల్ డైరెక్టరేట్‌లో పనిచేస్తున్న గ్రేడ్-1 కమిషనర్ కేవీవీఆర్ రాజును అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆదోని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డిని భీమవరం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న డీఎల్‌డీఓ శ్యామలను ఆమె సొంతశాఖ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు రీపాట్రియేట్ చేశారు. నరసాపురం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావును ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌కు కమిషనర్‌గా నియమించారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ జోనల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణను తాడిపత్రి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు.

పిన్నెల్లి బెయిల్ పిటిషన్లపై ముగిసిన వాదనలు

▸▸ నేడు నిర్ణయం వెల్లడించనున్న హైకోర్టు

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బెయిల్ పిటిషన్లపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈవీఎం, వీవీప్యాట్‌ల ధ్వంసం, అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంట్ శేషగిరిరావుపై దాడి, నాగశిరోమణి అనే మహిళను బూతులు తిట్టిన వ్యవహారంతోపాటు పోలింగ్ తర్వాతి రోజు కారంపూడి సీఐ నారాయణ స్వామిపై దాడి చేసి గాయపరిచిన ఘటనలకు సంబంధించి నమోదైన కేసుల్లో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పిన్నెల్లి వేర్వేరుగా హైకోర్టులో రెండు పిటిషన్లు దాఖలు చేశారు. వాటిపై ఇరువైపుల వాదనలు ముగియడంతో శుక్రవారం తీర్పు వెల్లడిస్తామని న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు గురువారం ప్రకటించారు. పిన్నెల్లి తరపు సీనియర్ న్యాయవాది ఒ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ గత 60 రోజులుగా జైల్లో ఉన్నారని, దర్యాప్తు తుది దశకు చేరుకుందని చెప్పారు. దర్యాప్తునకు సహకరిస్తామని, షరతులేవైనా అభ్యంతరం లేద, అవసరమైతే కొంత కాలంపాటు పిటిషనర్ రాష్ట్రంలో అడుగుపెట్టరని, బెయిల్ మంజూరు చేయాలని కోరారు. పోలీసుల తరపు ప్రత్యేక న్యాయవాది ఎస్.అశ్వనీకుమార్ ... మరికొంతమంది సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేయాల్సి ఉందని, ఈ సమయంలో నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తునకు ఆటంకం కలిగించే ప్రమాదం ఉందని తెలిపారు.


కలకత్తా వైద్య విద్యార్థినిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ హైకోర్టు వద్ద ఆందోళన చేస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల మౌనప్రదర్శన

▸▸ కోల్‌కతాలో డాక్టర్‌పై హత్యాచార ఘటనకు ఖండన

అమరావతి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో డాక్టర్‌పై హత్యాచారం ఘటనను ఖండిస్తూ ఏపీ హైకోర్టు వద్ద న్యాయవాదులు నిరసన తెలియజేశారు. గురువారం భోజన విరామ సమయంలో హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో మౌనప్రదర్శన చేశారు. మహిళలపై అత్యాచారాలు ఆపాలని, వారి రక్షణకోసం చర్యలు తీసుకోవాలని ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, ఉపాధ్యక్షుడు రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీహరి కోరారు.

బెజవాడ, గుంటూరుల్లో భారీ వర్షం

▸▸ పొంగి ప్రవహించిన డ్రైనేజీలు

▸▸ ఎక్కడికక్కడ స్తంభించిపోయిన ట్రాఫిక్

▸▸ పలు కాలనీల్లో నిలిచిన విద్యుత్ సరఫరా


గుంటూరులోని విద్యానగర్‌లో వర్షం నీటిలో వాహనదారుల ఇబ్బందులు


విజయవాడలోని పటమట ప్రాంతంలో బందరు రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

గుంటూరు, విజయవాడ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి బెజవాడ, గుంటూరు నగరాల్లో రోడ్లు జలమయమయ్యాయి. ఎక్కడికక్కడ ట్రాఫిక్ స్తంభించిపోయింది. విజయవాడ నగరంలోనూ, గుంటూరు జిల్లాలోని పలు మండలాల్లో గురువారం రాత్రి సుమారు గంటపాటు భారీ వర్షం కురిసింది. గుంటూరు జిల్లాలోని లోతట్టు ప్రాంతాలతో పాటు గుంటూరు నగరంలోని పలు ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. ఫిరంగిపురంలో అత్యధికంగా 93.25 మిల్లీమీటర్లు, తుళ్లూరులో 4.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సైడు కాలువలు పొంగి రోడ్ల పైకి ప్రవహించడంతో పలు అపార్టుమెంట్ల సెల్లార్లలోకి నీరు చేరింది. ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు ముగించుకొని ఇళ్లకు బయలుదేరిన ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. గుంటూరు నగరంలో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో జనావాసాలు అంధకారంగా మారాయి. విద్యుత్ సరఫరాను ఎప్పటికి పునరుద్ధరిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. రైల్వే అండర్ బ్రిడ్జిల్లో భారీగా నీరు చేరడంతో వాహనాలు ముందుకు కదల్లేదు. విజయవాడలోనూ పలురోడ్లు జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగి రోడ్లపై మురుగు ప్రవహించడంతో వాహనదారులు, పాదచారులు అనేక ఇబ్బందులు పడ్డారు. బెంజి సర్కిల్, పటమట, ప్రభుత్వాస్పత్రి, హెచ్‌బీ కాలనీ, వన్ టౌన్‌లోని పలు ప్రాంతాలలో నివాసాలు, షాపుల ముంగిట మురుగు నిలిచింది. వర్షం వల్ల ట్రాఫిక్ జామ్‌లు ఎక్కువై వాహనదారులు నరకం చూశారు.



నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎంహెచ్ఎం

హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)- 'మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండున్నరేళ్లు. ఇందులో ఆర్నెల్ల కంపల్సరీ ఇంటర్న్‌షిప్ కూడా ఉంది. ఇది ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. తెలంగాణ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. 'నిమ్ సెట్-ఎంహెచ్ఎం 2024'లో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. కోర్సు సమయంలో ఇతర డిగ్రీ/డిప్లొమా ప్రవేశాలకు, ప్రైవేట్ ప్రాక్టీస్/కన్సల్టేషన్‌లకు అనుమతించరు. ప్రోగ్రామ్‌ను గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తి చేయాలి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మెడికల్/నాన్ మెడికల్ విభాగాల్లో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. దివ్యాంగులకు అయిదేళ్లు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు వర్తిస్తుంది.

నిమ్‌సెట్-ఎంహెచ్ఎం వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. హెల్త్ సైన్సెస్‌కు సంబంధించి 40, అడ్మినిస్ట్రేషన్ అంశాలనుంచి 10, కంప్యూటర్ సైన్సెస్ అంశాల నుంచి 10, జనరల్ నాలెడ్జ్ నుంచి 15, టెస్టింగ్ ఆఫ్ ఐక్యూకు సంబంధించి 15, ఇంగ్లీష్ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలను ఆంగ్ల మాధ్యమంలో ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 40 శాతం; ఎస్సీ, ఎస్టీలకు 30 శాతం మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 2
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 5
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** అక్టోబరు 3 నుంచి
- **నిమ్‌సెట్-ఎంహెచ్ఎం 2024 తేదీ:** అక్టోబరు 9న
- **ఫలితాలు విడుదల:** అక్టోబరు 10
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్ విడుదల:** అక్టోబరు 15
- **కౌన్సెలింగ్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** అక్టోబరు 17
- **ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్:** అక్టోబరు 26
- **తరగతులు ప్రారంభం:** నవంబరు 4 నుంచి
- **చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, పంజాగుట్ట, హైదరాబాద్-500082
- **వెబ్‌సైట్:** nims.edu.in

సంతూర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్

గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థినులకు ఆర్థిక సహకారం అందిస్తూ వారు చదువులో రాణించేలా ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'సంతూర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్' నోటిఫికేషన్ వెలువడింది. విప్రో కన్జూమర్ కేర్, విప్రో కేర్స్ ఉమ్మడిగా ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నాయి. ఇంటర్ పూర్తిచేసిన బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల నుంచి ఏడాదికి 1,900 మందికి ఈ ప్రోత్సాహకాలు అందుతున్నాయి. ఆసక్తిగల విద్యార్థినులు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తు ఫారాన్ని నింపి కింది చిరునామాకు పంపాలి.

అర్హత: విద్యార్థినులు స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి పూర్తిచేసి ఉండాలి. 2023-24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ కళాశాల నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024-25 విద్యా సంవత్సరంలో ఫుల్ టైమ్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్ పొంది ఉండాలి. ప్రొఫెషనల్ కోర్సులు, సైన్సెస్, లిబరల్ ఆర్ట్స్, హ్యూమానిటీస్ విభాగాల్లో చేరినవారందరూ దరఖాస్తు చేసుకోవచ్చు. మారుమూల జిల్లాలకు చెందిన విద్యార్థినులకు ప్రాధాన్యం ఇస్తారు.

స్కాలర్‌షిప్: ఎంపికైన విద్యార్థినులకు డిగ్రీ కోర్సు పూర్తయ్యే వరకు ఏటా రూ.24,000లు చొప్పున స్కాలర్‌షిప్ అందిస్తారు. నగదు నేరుగా విద్యార్థినుల బ్యాంక్ అకౌంట్‌లో జమ అవుతుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు లేదు.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 20
- **చిరునామా:** విప్రో కేర్స్-సంతూర్ స్కాలర్‌షిప్, దొడ్డకన్నెల్లి, సర్జాపూర్ రోడ్, బెంగళూరు, కర్ణాటక.
- **వెబ్‌సైట్:** https://www.santoorscholarships.com/

నిట్ వరంగల్‌లో బీఎస్సీ-బీఈడీ

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్)- నాలుగేళ్ల వ్యవధి గల ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ-బీఈడీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇందులో మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ మేజర్ సబ్జెక్టులుగా; కంప్యూటర్ సైన్స్, మేథమెటిక్స్ మైనర్ సబ్జెక్టులుగా ఉంటాయి. ఇది సెకండరీ స్థాయి ప్రోగ్రామ్. మొత్తం 50 సీట్లు ఉన్నాయి. నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఎన్‌సీఈటీ) 2024 స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ప్రథమశ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2022/2023/2024 సంవత్సరాల్లో ఇంటర్ స్థాయి పరీక్ష ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ఎన్‌సీఈటీ 2024 అర్హత తప్పనిసరి.



- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.800
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఆగస్టు 27
- **ఎంపికైన అభ్యర్థుల మొదటి జాబితా విడుదల:** సెప్టెంబరు 2
- **అభ్యర్థుల రెండో జాబితా విడుదల:** సెప్టెంబరు 6
- **స్పెషల్ స్పాట్ రౌండ్ ద్వారా ఎన్నికైన అభ్యర్థుల జాబితా విడుదల:** సెప్టెంబరు 11
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 17 నుంచి
- **వెబ్‌సైట్:** www.nitw.ac.in

కర్నూలు ఐఐఐటీడీఎంలో పీహెచ్‌డీ

కర్నూలులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్(ఐఐఐటీడీఎం)- విశ్వేశ్వరాయ ఫెలోషిప్ స్కీమ్ కింద ఫుల్ టైమ్ పీహెచ్‌డీలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ఇంజనీరింగ్ విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ), మెకానికల్ ఇంజనీరింగ్(ఎంఈ)

సైన్స్ విభాగాలు: ఫిజిక్స్, మేథమెటిక్స్

అర్హత: ఇంజనీరింగ్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో సంబంధిత మాస్టర్స్ డిగ్రీతో పాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; కనీసం 7 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతో పాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు; ఏదేని ఇంజనీరింగ్ కళాశాల నుంచి 75 శాతం మార్కులతో డిగ్రీ పూర్తిచేసి గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- సైన్స్ విభాగాలకు సంబంధిత మాస్టర్స్ డిగ్రీతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్/సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్/యూజీసీ జేఆర్ఎఫ్/నెట్/ఎన్‌బీహెచ్ఎం స్కోర్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులు; ఐఐటీల నుంచి 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ఫైనాన్షియల్ అసిస్టెన్స్: ఎంపికైన అభ్యర్థులకు విశ్వేశ్వరాయ ఫెలోషిప్ కింద మొదటి రెండేళ్లు నెలకు రూ.38,750; చివరి రెండేళ్లు నెలకు రూ.43,750 అందిస్తారు.

- కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1,20,000 ఇస్తారు.
- ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లకు అటెండ్ అయ్యేవారికి రూ.లక్షన్నర ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 8
- **వెబ్‌సైట్:** https://iiitk.ac.in/

జాబ్ కార్నర్

పీజీసీఐఎల్‌లో అప్రెంటిస్‌లు

ఖాళీలు 1031

న్యూఢిల్లీలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పీజీసీఐఎల్)... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

పీజీసీఐఎల్ కేంద్రం/ప్రాజెక్ట్/రీజియన్: కార్పొరేట్ సెంటర్(గురుగ్రామ్), నార్తెర్న్ రీజియన్-1(ఫరీదాబాద్), నార్తెర్న్ రీజియన్-2(జమ్మూ), నార్తెర్న్ రీజియన్-3(లఖ్‌నవూ), ఈస్టర్న్ రీజియన్-1(పట్నా), ఈస్టర్న్ రీజియన్-2(కోల్‌కతా), నార్త్ ఈస్టర్న్ రీజియన్(షిల్లాంగ్), ఒడిశా ప్రాజెక్ట్(భువనేశ్వర్), వెస్టర్న్ రీజియన్-1(నాగ్‌పూర్), వెస్టర్న్ రీజియన్-2(వడోదర), సదరన్ రీజియన్-1(హైదరాబాద్), సదరన్ రీజియన్-2(బెంగళూరు).



ట్రేడులు: రాజభాష అసిస్టెంట్, సీఎస్ఆర్ ఎగ్జిక్యూటివ్, ఎగ్జిక్యూటివ్ లా, హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్, పీఆర్ అసిస్టెంట్, గ్రాడ్యుయేట్(సివిల్), గ్రాడ్యుయేట్(కంప్యూటర్ సైన్స్), గ్రాడ్యుయేట్(ఎలక్ట్రికల్), గ్రాడ్యుయేట్(ఎలక్ట్రానిక్స్/టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్), లైబ్రరీ ప్రొఫెషనల్ అసిస్టెంట్

అర్హత: ఖాళీని అనుసరించి ఐటీఐ, డిప్లొమా, బీఈ, బీటెక్, బీఎస్సీ(ఇంజనీరింగ్), ఎంబీఏ, పీజీ డిప్లొమా, ఎల్ఎల్‌బీ, బీఏ ఉత్తీర్ణులై ఉండాలి.

అప్రెంటిస్ కాలం: ఒక సంవత్సరం

నెలవారీ స్టయిపెండ్: ఐటీఐ ట్రేడ్ రూ.13,500, డిప్లొమా ట్రేడ్ రూ.15000; గ్రాడ్యుయేట్ ట్రేడ్/హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్/సీఎస్ఆర్ ఎగ్జిక్యూటివ్/లా ఎగ్జిక్యూటివ్/రాజ్‌భాష అసిస్టెంట్ రూ.17,500.

ఎంపిక ప్రక్రియ: విద్యార్హత మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా

వెబ్‌సైట్: careers.powergrid.in/

ఎల్‌పీఎస్‌సీలో టెక్నికల్ అసిస్టెంట్స్

ఖాళీలు 30

తిరువనంతపురంలోని ఇస్రోకు చెందిన ప్రొపల్షన్ సిస్టమ్స్ సెంటర్(ఎల్‌పీఎస్‌సీ)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. టెక్నికల్ అసిస్టెంట్
2. టెక్నీషియన్-బి
3. హెవీ వెహికల్ డ్రైవర్(ఎ)
4. లైట్ వెహికల్ డ్రైవర్(ఎ)
5. కుక్

విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, వెల్డర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, టర్నర్, మెకానిక్ ఆటో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఫిట్టర్, మెషినిస్ట్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. డ్రైవర్ పోస్టుకు హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్/లైట్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్, పబ్లిక్ సర్వీస్ బ్యాడ్జి తప్పనిసరి.

వయోపరిమితి: 35 ఏళ్లు మించకూడదు

వేతనం: నెలకు టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు రూ.44,900 - రూ.1,42,400, టెక్నీషియన్-బి పోస్టులకు రూ.21,700 - రూ.69,100; ఇతర పోస్టులకు రూ.19,900 - రూ.63,200.

పని ప్రదేశాలు: బెంగళూరు, వలియామల

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు ఫీజు: రూ.750. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/ఎక్స్ సర్వీస్‌మన్/మహిళా అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 10

వెబ్‌సైట్: https://www.lpsc.gov.in/

ఇండియా ఆప్టెల్ లిమిటెడ్‌లో ప్రాజెక్ట్ ఇంజనీర్లు

ఖాళీలు 13

డెహ్రాడూన్‌లోని ఇండియా ఆప్టెల్ లిమిటెడ్(ఐఓఎల్)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీర్(ఎలక్ట్రో ఆప్టిక్స్ డిజైన్): 3 పోస్టులు
2. సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీర్(రోబోటిక్స్ హార్డ్‌వేర్ అండ్ కంట్రోల్): 2
3. డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్(ఫైనాన్స్ అండ్ అకౌంట్స్): 8

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో సీఏ, డిగ్రీ, బీఈ/బీటెక్(ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెకట్రానిక్స్, కంప్యూటర్స్), పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 40 ఏళ్లు మించకూడదు.

జీతం: నెలకు డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ పోస్టుకు రూ.85,000, మిగతా పోస్టులకు రూ.1,00,000.



దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను సీనియర్ మేనేజర్/హెచ్ఆర్, ఇండియా ఆప్టెల్ లిమిటెడ్ కార్పొరేట్ హెచ్‌క్యూ(ఓఎఫ్ఐఎల్ క్యాంపస్), రాయ్‌పూర్, డెహ్రాడూన్ చిరునామాకు పంపాలి.

ఎంపిక ప్రక్రియ: ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 6

వెబ్‌సైట్: https://www.indiaoptel.in/

ఎన్ఎంఆర్ఐలో యంగ్ ప్రొఫెషనల్స్

చెంగిచర్ల(హైదరాబాద్)లోని ఐసీఏఆర్- నేషనల్ మీట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(ఎన్ఎంఆర్ఐ).... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

ఖాళీలు: 8

పోస్టుల వివరాలు

1. యంగ్ ప్రొఫెషనల్-2
2. జూనియర్ రీసెర్చ్ ఫెలో
3. ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్-3
4. ప్రాజెక్ట్ అసోసియేట్-1

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, బీఫార్మసీ, ఎంవీఎస్సీ(పబ్లిక్ హెల్త్/యానిమల్ న్యూట్రిషన్/మైక్రో బయాలజీ), బీకాం/బీబీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: నెలకు యంగ్ ప్రొఫెషనల్-2 పోస్టుకు రూ.42,000; జేఆర్ఎఫ్ పోస్టుకు రూ.37,000; ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్‌కు రూ.28,000; ఇతర పోస్టులకు రూ.31,000

వయోపరిమితి: యంగ్ ప్రొఫెషనల్ పోస్టుకు 45 ఏళ్లు, మిగతా పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.

ఇంటర్వ్యూ తేదీ: ఆగస్టు 27

వేదిక: ఐసీఏఆర్ - నేషనల్ మీట్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, చెంగిచర్ల, హైదరాబాద్.

వెబ్‌సైట్: https://nrcmeat.icar.gov.in/




తగిన శాస్తి

రామాపురంలో క్రిష్ణయ్య అనే యువకుడు ఉండేవాడు. అతను ఎంతో తెలివైనవాడు ఇంకా సాహసవంతుడు కానీ చాలా దురాశా పరుడు ఒక రోజు ఆ ఊరిలో రామనాథం అనే వ్యాపారి ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగింది. ప్రాణ నష్టం ఏమీ లేకున్నా, ఇంటిలోపలి విలువైన వస్తువులు కాలి, బూడిదవు తున్నాయి. ఇంతలో అక్కడికి వచ్చిన రామనాథం 'వ్యాపారానికి కావలసిన డబ్బు నాలుగు లక్షలు లోపల పెట్టాను అది కూడా బూడిద ఐతే ఎలా' అని పెద్దపెట్టున ఏడవసాగాడు. ఇంతలో అక్కడికి వచ్చిన క్రిష్ణయ్య 'రామనాథం గారూ మీ డబ్బు లోపలినుండి నేను క్షేమంగా తెచ్చి ఇస్తాను. కానీ తెచ్చిన డబ్బులో నాకు ఇష్టమైనది మీకు ఇచ్చి మిగతాది నేను తీసుకుంటాను. సరేనా? అన్నాడు. దానికి సరే అన్నాడు రామనాథం. అపుడు క్రిష్ణయ్య ఎంతో ధైర్యంగా లోపలికి వెళ్లి, డబ్బుమూట బయటకు తెచ్చాడు కానీ, తెచ్చిన సొమ్ములో వంద రూపాయలు మాత్రం రామనాథానికి ఇచ్చి, మిగతా డబ్బు మొత్తం తన సంచీలోవేసుకుని, వెళ్లబోయాడు. ఇది అన్యాయం అనిక్రిష్ణయ్యను ఆపాడు రామనాథం. 'నేను చెప్పినట్లే కదా చేశాను ఇంకేం అన్యాయం' అన్నాడు క్రిష్ణయ్య. విషయం పంచాయితీ దాకా వెళ్లింది, పంచాయితీ పెద్ద కేశవరావు జరిగినదంతా విని, క్రిష్ణయ్యతో ఇలా అన్నాడు.' క్రిష్ణయ్యా ఆ డబ్బుమూట మరియు వంద రూపాయలు చెరోవైపున పెట్టు' అన్నాడు. అలాగే చేశాడు క్రిష్ణయ్య. ఇపుడు చెప్పు క్రిష్ణయ్యా ఈ రెండిటిలో నీకు ఇష్టమైనది ఆ పెద్ద డబ్బు మూటనే కదా అని అడిగాడు. అవును అని జవాబుచెప్పాడు క్రిష్ణయ్య. 'నువ్వు నీకు ఇష్టమైనది రామనాథానికి ఇస్తాను అని కదా అన్నావు?

కాబట్టి మారు మాట్లాడకుండా ఆడబ్బు మూట అతనికి ఇచ్చేసి, అతను సంతోషంగా ఎంత ఇస్తే అంత పుచ్చుకో' అన్నాడు కేశవరావు దానికి క్రిష్ణయ్య నా ఉద్దేశం అది కాదు నాకు ఇష్టమైనది అంటే నాకు నచ్చినంత అని అర్థం' అన్నాడు దానికి కేశవరావు 'నీ ఉద్దేశం మంచిదైతే ఈ గొడవే లేదు కదా. నువ్వు తెలివైనవాడివి.. కానీ ఈ దురాశ మంచిది కాదు మానుకో అని హితవు చెప్పి, అతన్ని అక్కడి నుండి పంపేశాడు పంచాయితీ పెద్ద. అతని దురాశకు తగిన శాస్తి జరిగిందని అందరూ అనుకున్నారు.




7 తేడాలు గుర్తించండి




ఏ జంతువులు ఎన్ని ఉన్నాయి?

సరైన నీడ ఏది



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 391

		6	2		4			
2		7		6		3		
						8		
6	7		1	3				4
		8				9		
9				8	7		6	3
		4						
		1		5		4		8
			4		1	7		

సుడోకు - 390 సమాధానం

3	8	6	2	9	4	5	7	1
2	1	7	8	6	5	3	4	9
4	5	9	7	1	3	8	2	6
6	7	5	1	3	9	2	8	4
1	3	8	6	4	2	9	5	7
9	4	2	5	8	7	1	6	3
5	9	4	3	7	8	6	1	2
7	2	1	9	5	6	4	3	8
8	6	3	4	2	1	7	9	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.